



సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 149

సోమవారం 19-8-2024





**రియల్టీలో 'సిప్' చేద్దామా!**
రూ.140 ఉన్నా పెట్టుబడికి వీలు.. ఇందుకు వీలు కల్పించేవే రీట్‌లు
- 15లో



**దీప్తి సిక్సర్... లండన్ విన్నర్**
మహిళల 'హండ్రెడ్' టోర్నీ ఫైనల్లో మెరిసిన భారత ఆల్‌రౌండర్.
- 14లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



## న్యూస్‌రీల్

### దారుణంగా అవమానించారు



ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సొంత పార్టీ నేతలే తనను దారుణంగా అవమానించారని, దాంతో ప్రత్యామ్నాయం చూసుకోవాల్సి వచ్చిందని జార్ఖండ్ మాజీ సీఎం, జేఎంఎం సీనియర్ నాయకుడు చంపయ్ సోరెన్ అన్నారు. బీజేపీలో చేరుతున్నారనే ప్రచారం నేపథ్యంలో చంపయ్ ఆదివారం ఢిల్లీకి చేరుకున్నారు.

- వివరాలు 6లో

### భిన్న ధ్రువాలు.. విభిన్న వైఖరులు





నవంబర్‌లో జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీపడుతున్న డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్, రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తాము గెలిస్తే ఎలాంటి పాలన అందిస్తారన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

- వివరాలు 6లో





# మాఫీ మంటలు

## రాజకీయ పార్టీల విమర్శలు, సవాళ్లు.. రైతుల ఆందోళనలతో ప్రకంపనలు

- గడపగడపకు వెళ్లి రుణమాఫీ బండారం బయటపెడతామన్న బీఆర్‌ఎస్
- రుణమాఫీ బోగస్ అంటూ రాహుల్‌గాంధీ, ఖర్గేలకు కేటీఆర్ లేఖలు
- వంద శాతం రుణమాఫీ ఎక్కడ జరిగిందంటూ బీజేపీ ఫైర్
- 23న రైతుదీక్ష చేపడతానని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రకటన
- తమకు మాఫీ కాలేదంటూ రైతుల నుంచి పోటెత్తుతున్న ఫిర్యాదులు
- వాటిపై ఎలాంటి నిర్ణయం తీసుకోని వ్యవసాయ శాఖ యంత్రాంగం
- రూ.2 లక్షలకుపైగా ఉన్న రుణాల మాఫీకి కొర్రీ ఎందుకంటున్న అన్నదాతలు
- అదనపు సొమ్ము చెల్లించేందుకు ప్రైవేటు అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన



కామారెడ్డి జిల్లా వజ్జపల్లి తండాలో రుణమాఫీ కాలేదంటూ రైతుల నిరసన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతుల రుణమాఫీ వ్యవహారం రోజురోజుకు మరింత రచ్చరేపుతోంది. ఓవైపు రాజకీయ పార్టీల మధ్య రగడకు.. మరోవైపు రైతుల ఆందోళనలు, ఆవేదనకు వేదికగా మారుతోంది. 'రుణం తీరలే' శీర్షికన 'సాక్షి' రాసిన కథనంతో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. బీఆర్‌ఎస్ నాయకులు కేటీఆర్, హరీశ్‌రావు, బీజేపీ నేతలు కేంద్ర మంత్రి బండి సంజయ్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తదితరులు రుణమాఫీ డొల్లతనాన్ని ఎత్తిచూపుతూ విమర్శలు గుప్పిస్తున్నారు. రాష్ట్రంలో గడపగడపకు వెళ్లి రుణమాఫీ బండారాన్ని బయటపెడతామని బీఆర్‌ఎస్ ప్రకటించింది. మరోవైపు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీలకు రుణమాఫీ బోగస్ అంటూ లేఖలు రాశారు. ఇక రుణమాఫీ కోసం 23న రైతు దీక్ష చేపట్టనున్నట్టు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రకటించారు. తమకు రుణమాఫీ కాలేదంటూ పెద్ద సంఖ్యలో రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. రుణమాఫీ కాని అర్హులకు న్యాయం చేస్తామని, ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తామని ప్రభుత్వం తరపున వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తంగా రుణమాఫీ వ్యవహారం ముున్ముందు మరిన్ని ప్రకంపనలు సృష్టించే పరిస్థితి కనిపిస్తోందని

మిగతా 2వ పేజీలో ▶

### తనిఖీ చేసేదెప్పుడు.. మాఫీ అయ్యేదెప్పుడు?

అర్హత ఉండీ రుణమాఫీ కాని రైతుల విషయంలో తాము బాధ్యత తీసుకొని మాఫీ చేస్తామని వ్యవసాయ మంత్రి తుమ్మల చెప్తున్నారు. కానీ తొలి విడత నుంచే ఎందరో రైతులు ఫిర్యాదు చేసినా మాఫీ చేయలేదని రైతు సంఘాల నేతలు గుర్తు చేస్తున్నారు. అధికారులు ఇంటింటికీ తిరిగి కుటుంబాలను తేల్చి, అర్హులను గుర్తించి రుణమాఫీ చేస్తామని అంటున్నారని.. అదంతా ఇప్పటికిప్పుడు సాధ్యమా అని నిలదీస్తున్నారు. లక్షలాది మంది రైతుల ఇళ్లకు వెళ్లడం, వారి డేటాను తనిఖీ చేయడం, కచ్చితత్వాన్ని నిర్ధేశించుకోవడానికి చాలా సమయం పడుతుందని స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే తమ వద్ద పూర్తి సమాచారం ఉందని ప్రభుత్వం చెప్పిందని.. ఇంటింటికీ తిరిగి సర్వే చేయడం ఏమిటో అంతుబట్టట్లేదని అంటున్నారు. మాఫీ వ్యవహారాన్ని, విమర్శలను కొన్నాళ్లపాటు పక్కదారి పట్టించేందుకే ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్నారు.

# 'ఫ్యూచర్ సిటీ'లో పెట్టుబడులు పెట్టండి

## క్షత్రియ సమితి ఆత్మీయ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు

- అభివృద్ధిలో రాజులంతా భాగస్వాములు కండి
- రాజులు ఆరంభించిన నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తాం
- హైదరాబాద్‌లో క్షత్రియ భవన్‌కు స్థలం కేటాయిస్తాం
- క్షత్రియులకు మొదట పార్టీ పదవులు.. తర్వాత టికెట్లు ఇస్తామని హామీ

5 లో



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

### కోల్‌కతా డాక్టర్ హత్యోదంతం..

# సుమోటోగా స్వీకరించిన సుప్రీం

విచారణ చేపట్టనున్న చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ధర్మాసనం 6లో



ఆదివారం కోల్‌కతాలో వైద్యుల నిరసన ర్యాలీ

### మమతా బెనర్జీది ద్వంద్వ వైఖరి

6లో

జూనియర్ డాక్టర్ తల్లిదండ్రుల ఆగ్రహం

### బాలికపై బస్సులో సామూహిక అత్యాచారం

ఉత్తరాఖండ్‌లో ఘటన.. డ్రైవర్ సహా ఐదుగురి అరెస్టు

6 లో

# గంజాయిపై శాటి'లైట్'..!

గంజాయి పంట గుర్తింపునకు ఉపగ్రహ చిత్రాలు.. ఎన్సీబీ రూట్‌లో ఏఎన్‌బీ



- 'నిషా ముక్త్ తెలంగాణ' కోసం వ్యూహాత్మక అడుగులు
- ఎడ్రిన్ సంస్థ నుంచి సమాచారం.. మ్యాప్ డ్రగ్ యాప్‌నూ యాక్సెస్ చేసుకునే అవకాశం
- నలుగురు సిబ్బందికి శిక్షణ ఇప్పించిన సందీప్ శాండిల్య

16 లో

# డీఎంకే బాటలో బీఆర్‌ఎస్!

పార్టీ బలోపేతంపై నాయకత్వం దృష్టి..



- డీఎంకే, బీఆర్‌ఎస్‌ల ప్రస్థానంలో పోలికలున్నాయనే భావన
- ఇటీవల 'అన్నా అరివాలయం'ను సందర్శించిన బాల్క సుమన్ బృందం.. పార్టీ విభాగాల కార్యకలాపాలపై ఆరా
- త్వరలో చెన్నైకి కేటీఆర్ బృందం..

12లో

# అందరికీ రుణమాఫీ కోసం 23న రైతుదీక్ష

60 లక్షల రైతులుంటే.. 22 లక్షల మందికే మాఫీనా?: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



నిర్మల్: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. అలా చేయనిపక్షంలో ఈనెల 23న రైతులతో భారీ రైతుదీక్ష చేపడతామని ప్రకటించారు. ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసాకు ఇవ్వాల్సిన నిధులనే రుణమాఫీకి మళ్లించిందని.. ఇప్పటి కే రెండు పంటలకు రైతు భరోసా సాయం ఇవ్వకుండా ఎగ్గొట్టారని ఆరోపించారు. రాష్ట్రంలో 60 లక్షల మంది అర్హులైన రైతులు ఉండగా.. కేవలం 22 లక్షల మందికే రుణమాఫీ చేయడమేంటని ప్రశ్నించారు. రూ.49 వేల కోట్ల రుణాలకుగాను.. రూ.17 వేల కోట్లే ఇ చ్చారని మండిపడ్డారు. రుణమాఫీ కాని రైతు లను మళ్లీ మోసం చేసేందుకే.. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెబుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు దమ్ముంటే.. గ్రామాలకు వెళ్లి పూర్తిస్థాయిలో రైతులకు రుణాలు మాఫీ అయ్యాయో లేదో ఆరా తీయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రైతుల రుణాలను త్వరలో మాఫీ చేయాలని.. రైతుభరోసా ఖరీఫ్ సీజన్ డబ్బులను ఈ నెలాఖరులోగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## రుణమాఫీపై మీవాళ్లే చెబుతారు

మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: సాక్షాత్తు కాంగ్రెస్ పార్టీ నేతలే రైతు రుణమాఫీ సంపూర్ణంగా జరగలేదంటున్నారని, తాను అదే మాట చెపితే సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు రంకెలు వేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. సంపూర్ణంగా రుణమాఫీ జరగనందున ఎవరు ఏట్లో దూకి చావాలో, ఎవరికి చీము నెత్తురు లేదో, అమరుల స్తూపం వద్ద ఎవరు ముక్కు నేలకు రాయాలో, ఎవరు రాజీనామా చేయాలో కాంగ్రెస్ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ సంపూర్ణంగా జరగలేదని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నేత కోదండరెడ్డి చేసిన ప్రకటనలను ఆదివారం ఒక ప్రకటనలో హరీశ్ ఉటంకించారు. రుణమాఫీ పూర్తిగా జరిగితే రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎందుకు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేస్తున్నారని హరీశ్ ప్రశ్నించారు.

ఇదండీ సంగతి



# ఘోరీ.. ఘోరాలెన్నో!

## దాదాపు 26 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్న ఉగ్రవాది

**ఐసిస్ రిజ్వాన్ అలీ కేసుతో మరోసారి తెరపైకి**

- ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్నట్టు ఆధారాలు
- దేశ వ్యాప్తంగా అనేక పేలుళ్లకు కుట్రలు
- 'ఉగ్ర ఫైనాన్స్' వ్యవహారంలోనూ కీలకం

సాక్షి, హైదరాబాద్: ఆరు నెలల పాటు హైదరాబాద్‌లో దాక్కుని.. ఇటీవల ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులకు చిక్కిన మోస్ట్ వాంటెడ్ ఐసిస్ ఉగ్రవాది రిజ్వాన్ అలీ అరెస్టు ఘటనతో కరుడుగట్టిన టెర్రరిస్ట్ మహ్మద్ ఫర్హతుల్లా ఘోరీ పేరు మరోసారి తెరపైకి వచ్చింది. హైదరాబాద్‌కే చెందిన ఘోరీ కోసం రాష్ట్ర పోలీసు విభాగంతో పాటు వివిధ నిఘా ఏజెన్సీలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. దాదాపు 26 ఏళ్లుగా విదేశాల్లో తలదాచుకుంటున్న అతడిపై ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయగా, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) వాంటెడ్ లిస్టులోనూ ఉన్నాడు.

### అజ్ఞాతంలోకి వెళ్లాకే విషయం బయటికి..



ఘోరీ

హైదరాబాద్‌లోని మాదన్నపేట సమీపంలో ఉన్న కుర్మగూడకు చెందిన ఫర్హతుల్లా ఘోరీ అలియాస్ అబు సూఫియాన్.. 1998లోనే ఉగ్రవాదం వైపు మళ్లి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అది జరిగిన నాలుగేళ్ల తర్వాతగానీ అతడి పేరు పోలీసు రికార్డుల్లోకి ఎక్కలేదు. 2002లో గుజరాత్‌లోని అక్షర్‌ధామ్ ఆలయంపై జరిగిన దాడి కేసుతో ఘోరీ వ్యవహారాలు బహిర్గతం అయ్యాయి. 2004లో హైదరాబాద్ కేంద్రంగా బీజేపీ నేత ఇంద్రసేనారెడ్డి హత్యకు కుట్ర జరిగింది. అప్పట్లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ జైషేమహ్మద్‌కు (జేఈఎం) సానుభూతిపరుడిగా ఉన్న ఘోరీ.. ఆ హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. 2005లో నగర కమిషనర్ టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై జరిగిన మానవబాంబు దాడి కేసులో.. 2012 నాటి బెంగళూరు 'హుజీ కుట్ర' కేసులోనూ ఘోరీ వాంటెడ్‌గా ఉన్నాడు. 2022 దసరా సమయంలో విధ్వంసాలకు కుట్రపన్ని హ్యాండ్ గ్రెనేడ్స్‌తో పట్టుబడిన ముగ్గురు ఉగ్రవాదుల్లో ఒకరైన జాహెద్‌తో ఘోరీ సంప్రదింపులు జరిపాడు. దీనితోపాటు మరికొన్ని ఉగ్రవాద కేసుల్లోనూ ఘోరీ వాంటెడ్‌గా ఉన్నాడు.

### రిక్రూట్‌మెంట్‌తో పాటు ఫైనాన్సింగ్

ఘోరీ ప్రస్తుతం పాకిస్తాన్‌లోని రావల్పిండిలో తలదాచుకున్నట్లు నిఘా వర్గాలు కొన్ని ఆధారాలు సేకరించాయి. దీనికి ముందు దుబాయ్ కేంద్రంగా ఉండి హైదరాబాద్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు తెరవెనుక సాయం చేయడంతో కీలకంగా పనిచేశాడు. గత 26 ఏళ్లుగా అనేక ఉగ్రవాద సంస్థలతో కలసి పని చేశాడు. లష్కరేతొయిబా (ఎల్ఈటీ), హర్కతుల్ జిహాదే ఇస్లామీ (హుజీ), ఇప్పుడు ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్)లలో కీలకపాత్ర పోషిస్తున్నాడు. హైదరాబాద్ సిటీలో 2007 ఆగస్టు, 2013 ఫిబ్రవరిలో జరిగిన జంట పేలుళ్లకు సూత్రధారి, ఇండియన్ ముజాహిదీన్ (ఐఎం) స్థాపనలో కీలకంగా వ్యవహరించిన అమీర్ రజాఖాన్‌కు ఘోరీ సన్నిహితుడిగా ఉన్నాడని నిఘా వర్గాలు గుర్తించాయి. కేంద్ర హోంశాఖ విదేశాల్లో ఉంటూ దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలు ప్రోత్సహిస్తున్న, సహకరిస్తున్న 18 మంది ఉగ్రవాదుల పేర్లతో 2020లో మోస్ట్ వాంటెడ్ జాబితా విడుదల చేసింది. అందులో ఐఎం వ్యవస్థాపకుడు, సహ-వ్యవస్థాపకుడు రియాజ్ భత్కల్, ఇక్బాల్ భత్కల్‌తోపాటు ఘోరీ సైతం ఉన్నాడు.

### ఇన్నాళ్లూ ఫొటో కూడా దొరకని రీతిలో..

ఘోరీపై రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసిన ఇంటర్‌పోల్ దాంతోపాటు దాదాపు 35 ఏళ్ల క్రితం నాటి అస్పష్టమైన ఫొటోను విడుదల చేసింది. అతడి స్పష్టమైన ఫొటో సుదీర్ఘకాలం ఏ ఏజెన్సీ వద్ద కూడా లేకపోవడమే అందుకు కారణం. 2008 ఏప్రిల్‌లో అతడి మేనల్లుడు ఫయాఖ్‌ను దుబాయ్ నుంచి డీపోర్ట్ (బలవంతంగా తిప్పిపంపడం) చేయగా హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. అప్పట్లో ఫయాఖ్ చెప్పిన రూపురేఖల ఆధారంగా ఘోరీకి సంబంధించి 20 ఊహాచిత్రాలను రాష్ట్ర నిఘా వర్గాలు రూపొందించాయి. అక్షర్‌ధామ్ కేసులో ఘోరీ సోదరుడు షౌకతుల్లాను 2009 ఏడాది జూలైలో అరెస్టు చేసినప్పుడు.. ఆ ఊహాచిత్రాలను చూపగా వాటిలో ఒకదానిని అతను నిర్ధారించాడు. అప్పటి నుంచి అదే ఆధారమైంది. తాజాగా రిజ్వాన్ అరెస్టుతో ఘోరీ కొత్త ఫొటో ఏజెన్సీలకు లభించింది.



రాష్ట్ర పోలీసులు గతంలో రూపొందించిన ఘోరీ ఊహాచిత్రం

# మాఫీ మంటలు

▶ మొదటి పేజీ తరువాయి

పరిశీలకులు పేర్కొంటున్నారు.

**చెప్పిందొకటి.. చేసిందొకటి!**

రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బీసీ) గణాంకాల ప్రకారం.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మార్చి 31 నాటికి రైతులకు ఇచ్చిన మొత్తం పంట రుణాలు రూ.64,940 కోట్లు. అందులో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన డిసెంబర్ నాటికి ఇచ్చిన రుణాలు రూ.49,500 కోట్లు. మొదట్లో రూ.2 లక్షల రుణమాఫీ కోసం రూ.40 వేల కోట్ల వరకు అవసరమని కాంగ్రెస్ సర్కారు ప్రాథమిక అంచనా వేసింది. అనంతరం రూ.31 వేల కోట్లు అవుతాయని కేబినెట్ సమావేశంలో తేల్చారు. ఈ మేరకు సీఎం, మంత్రులు స్వయంగా ప్రకటనలు చేశారు. కానీ బడ్జెట్‌లో మాత్రం రుణమాఫీకి రూ.26 వేల కోట్లే కేటాయించారు. చివరికి మూడు విడతల్లో కలిపి రుణమాఫీకి ఇచ్చింది రూ.17,933 కోట్లు మాత్రమే. దీనితో లక్షలాది మంది రైతులకు రుణమాఫీ అందలేదన్న విమర్శలు వస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రూ.లక్ష మాఫీ కోసం 36.68 లక్షల మంది రైతుల లెక్కతేలితే.. ప్రస్తుతం రూ.2 లక్షల మాఫీ కేవలం 22.37 లక్షల మంది రైతులకే అందడం విస్మయం కలిగించింది. రైతుల సంఖ్య పెరగాల్సిందిపోయి తగ్గడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది.

**రోడ్డెక్కుతున్న అన్నదాతలు**

రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో రైతులు తమకు రుణమాఫీ జరగలేదంటూ ఆందోళనలు చేపడుతున్నారు. వ్యవసాయ కార్యాలయాల చుట్టూ, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. పీఎం కిసాన్ నిబంధనలు, ఇతర షరతులు తమకు వర్తించకపోయినా రుణమాఫీ జరగకపోవడానికి కారణాలేమిటో అర్థం కావడం లేదని ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌కు భారీగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఆదివారం మధ్యాహ్నం వరకు అందిన వివరాల మేరకు.. 58 వేల మందికిపైగా రైతుల నుంచి ఫిర్యాదులు అందాయని వ్యవసాయశాఖ ఉన్నతస్థాయి వర్గాలు వెల్లడించాయి. అన్ని జిల్లాల నుంచి ఫిర్యాదుల వివరాలను తెప్పించుకున్నామని.. వాటిని సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపాయి. ఇందుకు సంబంధించి హైదరాబాద్‌లోని వ్యవసాయ కమిషనరేట్‌లో ప్రత్యేకంగా ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నాయి.

**తలపట్టుకుంటున్న వ్యవసాయ శాఖ అధికారులు**

ఇప్పటివరకు 58వేల ఫిర్యాదులు అందాయని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నా.. ఈ సంఖ్య లక్షల్లో ఉంటుందని రైతు సంఘాల నేతలు, నిపుణులు చెప్తున్నారు. లక్షలాది మంది రైతులు బ్యాంకుల చుట్టూ, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారని.. చాలా మంది లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇవ్వలేదని అంటున్నారు. చాలా మండలాల్లో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఏదో ఒకటి చెప్పి వెనక్కి పంపిస్తున్నారని.. లిఖితపూర్వక ఫిర్యాదులు తీసుకోవడానికి అంగీకరించడం లేదని చెప్తున్నారు. అయితే ప్రభుత్వ నిర్ణయాలు ఒకవైపు, రైతుల నుంచి వస్తున్న ఒత్తిడి మరోవైపు.. ఏం చేయాలో అర్థంగాక తల పట్టుకుంటున్నామని వ్యవసాయ అధికారులు వాపోతున్నారు. లక్షలాది మంది రైతులకు రుణమాఫీ జరగకపోవటానికి కారణమేంటో, ఏ ప్రాతిపదికన అర్హులను నిర్ధారించారో, ఏ కొలమానాలతో అనర్హులను తేల్చారో తమకు కూడా అంతు పట్టడం లేదని అంటున్నారు.

**అదనపు మొత్తం కట్టేదెలా?**

ప్రస్తుతం రూ.2 లక్షల వరకు రుణమున్న రైతులకే రుణమాఫీ వర్తింపజేశామని.. రూ.2 లక్షలపైన రుణాలున్న వారు అదనంగా ఉన్న సొమ్మును చెల్లించాకే మాఫీ అవుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉదాహరణకు ఒక రైతు బ్యాంకులో రూ.3 లక్షల రుణం తీసుకుంటే.. రైతు ముందుగానే రూ.లక్ష బ్యాంకులో జమ చేయాలి, ఆ తర్వాతే మిగతా రూ.2 లక్షల మాఫీని ప్రభుత్వం వర్తింపజేస్తుంది. దీనిపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి నిబంధన పెట్టాల్సిన అవసరమేమిటని నిలదీస్తున్నారు. ఆ అదనపు రుణసొమ్మును చెల్లించడానికి ప్రైవేటు అప్పులు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. ప్రభుత్వం నేరుగా మాఫీ వర్తింపజేస్తే.. మిగతా రుణాన్ని కొంతకాలం తర్వాతైనా తీర్చుకునే వెసులుబాటు వస్తుందని, ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించాలని కోరుతున్నారు.

**మాఫీగాక.. కొత్తరుణాలు రాక..**

బ్యాంకులు ఇప్పటివరకు రుణమాఫీ జరిగిన రైతులకు.. వానాకాలం పంటల కోసం రుణాలు ఇస్తున్నాయి. కానీ మాఫీ జరగని రైతులకు రుణాలు ఇవ్వడం లేదు. దీంతో వ్యవసాయ సీజన్‌లో రుణాలు దొరక్క ప్రైవేట్ అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని అన్నదాతలు వాపోతున్నారు.

### అర్హులైతే మాఫీ చేస్తాం: తుమ్మల



బ్యాంకుల నుంచి తమకు వివరాలు అందిన ప్రతి రైతుకు అర్హతను బట్టి మాఫీ చేసే బాధ్యత తమదేనని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన జారీచేశారు. రూ.2 లక్షల వరకు కుటుంబ నిర్ధారణ జరిగిన రైతులందరికీ మాఫీ చేశామని.. కుటుంబ నిర్ధారణకాని వారికి ఆ ప్రక్రియ పూర్తి చేసి మాఫీ సొమ్ము జమ చేస్తామని తెలిపారు. రూ.2 లక్షలకుపైన రుణాలున్న వారికి మాత్రం.. అదనంగా ఉన్న మొత్తాన్ని చెల్లించేస్తే, అర్హతను బట్టి వారికి మాఫీ చేస్తామన్నారు. బ్యాంకర్ల నుంచి డేటా తప్పుగా వచ్చిన రైతుల వివరాలనూ సేకరిస్తున్నామని వివరించారు. రుణమాఫీ పొందిన రైతులకు తిరిగి కొత్త రుణాలు మంజూరు చేయాల్సిందిగా బ్యాంకర్లను కోరామన్నారు. ''రూ.లక్ష మాఫీ చేయడానికే ఆపసోపాలు పడి, సగం మందికి కూడా చేయని ఒకరు.. అధికారంలో ఉన్న ఏ ఇతర రాష్ట్రాల్లోనూ రుణమాఫీ ఆలోచనే చేయని మరొకరు.. రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి, ఇంకా ఆ ప్రక్రియ కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారు. వారు ఇకనైనా హుందాగా ప్రవర్తించి ప్రజల్లో స్థాయిని కాపాడుకుంటారని ఆశిస్తున్నా..'' అని తుమ్మల పేర్కొన్నారు.

### మళ్లీ అప్పు చేసి కట్టాలా?

ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గానికి చెందిన రామకృష్ణ అనే యువ రైతు రూ.4.50 లక్షల రుణం తీసుకున్నాడు. ఆయనకు రూ.2 లక్షల రుణమాఫీ జరగాలంటే.. అదనంగా ఉన్న రూ.రెండున్నర లక్షలు ముందే చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పుడంత సొమ్ము ఎక్కడి నుంచి తెచ్చి బ్యాంకుకు కట్టాలని ఆయన ఆందోళన చెందుతున్నాడు. ప్రభుత్వం నేరుగా రూ.2 లక్షలు మాఫీ చేస్తే తనకు ఉపశమనంగా ఉంటుందని కోరుతున్నారు. ఒక వేళ తాను అదనపు మొత్తం కట్టలేకుంటే.. రుణమాఫీ జరగక మొత్తం రుణం అలాగే ఉండిపోతుందేమోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అలాగే కొత్త రుణం కూడా పొందే అవకాశం లేకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అర్హులందరికీ రుణమాఫీ చేయాల్సిందే

కామారెడ్డి జిల్లా వజ్జపల్లిలో రైతుల ఆందోళన

సదాశివనగర్ (ఎల్లారెడ్డి): అర్హులందరికీ పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం వజ్జపల్లి తండాకు చెందిన రైతులు రోడ్డెక్కారు. సీఎం దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో 125 మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారని.. అందరికీ రూ.2 లక్షలలోపే పంట రుణాలున్నా.. 25 మందికి మాత్రమే మాఫీ అయిందని వాపోయారు. మిగతా వారికి వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సదాశివనగర్ మండలంలోని మోడేగాం గ్రామంలోనూ రుణమాఫీ కాని రైతులు ఆందోళన చేశారు. మోడేగాం స్టేజీ వద్ద రాస్తారోకో చేసి ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు.

### 'రుణమాఫీ'పై ర్యాలీ చేసిన 11 మంది అరెస్టు

తలమడుగు: ఆదిలాబాద్ జిల్లా రుయ్యాడి గ్రామంలో రుణమాఫీ కాలేదంటూ.. సీఎం దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి, ఆందోళన చేసిన 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై డీఎస్పీ జీవన్‌రెడ్డి స్పందిస్తూ.. జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని, అనుమతి లేకుండా ర్యాలీలు, ప్రదర్శనలు చేయడం నిషేధమని చెప్పారు. సీఎంను కించపరిచేలా దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించిన ఒక పార్టీకి చెందినవారిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేశామని వెల్లడించారు. రుణమాఫీ కాని వారు ఎవరైనా ఉంటే సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదిస్తే.. న్యాయం జరిగేలా చూస్తారన్నారు.

# ఏమైంది మీ వరంగల్ డిక్లరేషన్?

**మీరిచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ హామీకి రేవంత్ సర్కార్ తూట్లు పొడిచింది**

- ఆ హామీని నిలబెట్టుకోకపోతే ఆందోళన చేస్తాం
- ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు కేటీఆర్ లేఖ



సాక్షి, హైదరాబాద్: వరంగల్ రైతు డిక్లరేషన్ పేరిట రైతులకిచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ హామీని రేవంత్‌రెడ్డి సర్కార్ నీరుగార్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రుణమాఫీకి అనేక షరతులు పెట్టి 40 శాతం మందికి మాత్రమే పరిమితం చేసిందని ధ్వజమెత్తారు. రూ.40 వేల కోట్ల రుణమాఫీ అని చెప్పి కేవలం రూ.17 వేల కోట్ల మాఫీతో రైతులను నట్టేట ముంచిందంటూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఆదివారం ఆయన సుదీర్ఘ లేఖ రాశారు. వరంగల్ డిక్లరేషన్‌లో మీరిచ్చిన హామీని నిలబెట్టుకుని రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులు రాష్ట్రవ్యాప్తంగా రోడ్లపై ఆందోళనలు చేస్తున్నారని, రైతులందరికీ రుణమాఫీ చేయకుంటే వారి తరఫున కాంగ్రెస్ పార్టీపై పోరాడతామని హెచ్చరించారు.

**47 లక్షల మందికి గాను 22 లక్షల మందికేనా?**


'అబద్ధాలు, అభూతకల్పనలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి రైతులను నిలువునా మోసం చేస్తున్నారు. అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిన రేవంత్.. 8 నెలలుగా ఊరించి ఊరించి చివరికి రైతులను ఉసూరుమనిపించారు. 47 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి 22 లక్షల మందికి మాత్రమే మాఫీ చేశారు. 'రూ. రెండు లక్షల రుణమాఫీకి రూ.49,500 కోట్లు కావాలని ఎస్ఎల్‌బీసీ అంచనా వేయగా, రూ.40వేల కోట్లు అవుతాయని ముఖ్యమంత్రి చెప్పారు. కేబినెట్ భేటీకి వచ్చేసరికి దాన్ని రూ.31 వేల కోట్లకు కుదించారు. తీరా మూడు విడతల మాఫీ తతంగాన్ని రూ.17,933 కోట్లతో మమ అనిపించారు' అని లేఖలో పేర్కొన్నారు. రుణమాఫీ కాని అన్నదాతల ఆందోళనలతో యావత్ తెలంగాణ అట్టుడుకుతోందని, రుణమాఫీకి సంబంధించి తమ పార్టీ ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్‌కు వారం రోజుల్లోనే 1,20,000కు పైగా ఫిర్యాదులు వచ్చాయని కేటీఆర్ పేర్కొన్నారు.

**ఈ చావుకు కారకులెవరు?**

మూడు నెలలుగా ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడంతో ఆర్థిక సమస్యలతో సూర్యాపేట జిల్లా దవాఖానలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వసీం ఆత్మహత్య చేసుకోవడంపై కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. జీతం రాక కుటుంబం గడవక, భార్యా పిల్లల్ని ఎలా పోషించాలో తెలియక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్‌లో రాసుకున్నాడని, ఈ ఘటన విషాదకరమని పేర్కొన్నారు. ప్రతీనెలా ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలిస్తున్నట్లు ప్రభుత్వం పెద్ద ఎత్తు న ప్రచారం చేసుకోవడమే తప్ప అందులో వాస్తవం లేదని విమర్శించారు. కాగా తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రతీకగా నిలిచారని, సబ్బండ వర్గాలకు రాజకీయ, సామాజిక సమానత్వానికి పాపన్న చేసిన కృషి చరిత్రలో సువర్ణాక్షరాలతో ఎప్పటికీ నిలిచి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

### 'రుణమాఫీ'ని పక్కదోవ పట్టించేందుకే విలీన డ్రామాలు

- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్రమంత్రి బండి సంజయ్ ధ్వజం
- రుణమాఫీ కాక రైతులు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ పార్టీకే అవసరం ఉంది



వైఎంఐఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్

సాక్షి, హైదరాబాద్ / సుల్తాన్‌బజార్: రుణమాఫీ సహా ఆరు గ్యారంటీల అమలు అంశాన్ని పక్కదోవ పట్టించడానికే కాంగ్రెస్ ప్రభుత్వం విలీన డ్రామాలు మొదలు పెట్టిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ పార్టీకే అవసరం ఉంది తప్ప బీజేపీకి కాదని అన్నారు. అవుట్ డేటెడ్, అవినీతి పార్టీ అయిన బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోవలసిన ఖర్మ బీజేపీకి లేదని స్పష్టం చేశారు. ఆదివారం కోఠిలోని ది యంగ్‌మ్యాన్స్ ఇంప్రూవ్‌మెంట్ సొసైటీ భవనాన్ని ఆయన బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌తో కలసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 'విలీనం, పొత్తులు గంగలో కలవనీయండి.. వాటితో ప్రజలకేం సంబంధం?'అని అన్నారు. కేసీఆర్, కేటీఆర్ పేరెత్తితేనే జనం రాళ్లతో కొట్టే పరిస్థితి ఉందన్నారు. రుణమాఫీ కాక రైతులు కాంగ్రెస్ దిష్టిబొమ్మలు కాల్చేస్తున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని, 64 లక్షల మంది రుణాలు తీసుకుంటే 22 లక్షల మందికే మాఫీ చేస్తారా? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో రైతులందరికీ రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి బడ్జెట్‌లో కేవలం రూ. 26 వేల కోట్లు కేటాయించారని, చివరకు రూ.17 వేల కోట్లతో రుణమాఫీ ఎలా చేస్తారని సంజయ్ నిలదీశారు. కాగా, ప్రపంచంలో అనేక దేశాలు భారతదేశంపై కుట్రలు చేస్తున్నాయని వాటిని ప్రధాని మోదీ సమర్థంగా ఎదుర్కొంటున్నారని చెప్పారు.

**గురుకుల ఉద్యోగాల్లో మెరిట్ అభ్యర్థులకు న్యాయం చేయండి**

తెలంగాణ రెసిడెన్షియల్ విద్యా సంస్థల రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ ఉద్యోగాల కోసం నిర్వహించిన పరీక్షల్లో మెరిట్ అభ్యర్థులకు న్యాయం చేయాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

# రాజ్యసభ అభ్యర్థిగా నేడు సింఘ్వి నామినేషన్

**హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి**

- సీఎల్పీ సమావేశంలో సింఘ్విని పరిచయం చేసిన సీఎం





సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో భట్టి విక్రమార్క, అభిషేక్ మను సింఘ్వి

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేల కోటా రాజ్యసభ అభ్యర్థిగా కాంగ్రెస్ తరఫున సీనియర్ నాయకుడు అభిషేక్ మను సింఘ్వి సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు ఆయన అసెంబ్లీ ప్రాంగణంలో తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేస్తారని, ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. కాగా ఆదివారం సాయంత్రం నానక్‌రామ్‌గూడలోని షెరటాన్ హోటల్‌లో జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్షం (సీఎల్పీ) సమావేశంలో రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు సింఘ్విని రేవంత్ పరిచయం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు డి.శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొన్నారు. సింఘ్విని తెలంగాణ నుంచి రాజ్యసభకు ఎంపిక చేసినందుకు కాంగ్రెస్ అధిష్టానానికి ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానాన్ని ఆమోదించారు.

**సింఘ్వి వాదనలతో రాష్ట్రానికి ప్రయోజనం: సీఎం**

సీఎల్పీ సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజ్యసభ అభ్యర్థిగా సింఘ్విని ప్రతిపాదించిన వెంటనే ఆమోదించినందుకు పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర పునర్విభజన చట్టం అమలులో అనేక రాజ్యాంగ, న్యాయ చిక్కులు, అవాంతరాలు ఉత్పన్నమయ్యాయని, ఈ చట్టంలోని అంశాలపై చట్టసభలతో పాటు సుప్రీంకోర్టులో బలంగా వాదనలు వినిపించాల్సిన అవసరం ఉందని అన్నారు. అపరిష్కృత అంశాలపై వాదించేందుకు వీలుగా న్యాయ కోవిదుడు సింఘ్విని తెలంగాణ నుంచి రాజ్యసభకు పంపాలని కోరామని చెప్పారు. తన రాజ్యసభ సభ్యత్వానికి పెద్ద మనసుతో రాజీనామా చేసిన కేకే క్రమశిక్షణ గల కాంగ్రెస్ కార్యకర్తగా వ్యవహరించారని ప్రశంసించారు.

**త్వరలోనే రైతు కృతజ్ఞత సభ**

త్వరలోనే రైతు కృతజ్ఞత సభ ఉంటుందని సీఎం చెప్పారు. సీఎల్పీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 20న రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించాలని అనుకున్నా వీలు కాలేదని చెప్పారు. రైతు కృతజ్ఞత సభ,రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణ కార్యక్రమంపై త్వరలో ఢిల్లీ పెద్దలతో మాట్లాడి తేదీలు వెల్లడిస్తామని అన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ..దేశంలోని ప్రముఖ న్యాయవాదుల్లో సింఘ్వి ఒకరని, ఆయన రాష్ట్రం నుంచి రాజ్యసభకు పోటీ చేయడం సంతోషంగా ఉందన్నారు.

**తెలంగాణ హక్కులపై మాట్లాడుతూనే ఉంటా: సింఘ్వి**

సింఘ్వి మాట్లాడుతూ తనను తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా ప్రకటించినందుకు ఏఐసీసీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర హక్కుల విషయంలో తాను మాట్లాడుతూనే ఉంటానని స్పష్టం చేశారు.

**శంషాబాద్‌లో ఘన స్వాగతం**

సింఘ్వి ఆదివారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. సింఘ్వి అక్కడి నుంచి నేరుగా మాజీ ఎంపీ కె.కేశవరావు నివాసానికి వెళ్లారు. అక్కడ కొద్దిసేపు ఉన్న సింఘ్వి ఆ తర్వాత సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ సింఘ్విని కలిసి కర్మన్‌ఘాట్ హనుమాన్ ప్రసాదాన్ని అందజేశారు. తర్వాత సింఘ్వి ప్రజాభవన్‌కు వచ్చారు. సింఘ్వి దంపతులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్వాగతం పలికారు. అక్కడి నుంచి జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసానికి వెళ్లిన సింఘ్వి ఆయనతో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు.

### మహిళా సాధికారతే లక్ష్యం: సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మహిళలందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మహిళల సాధికారతతో పాటు వారిని కోటీశ్వరులను చేసే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందని చెప్పారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా తెలంగాణ మహిళలకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఛాసీలు ఇలా.. బస్సులు మరెలా?





## ఆర్టీసీ పార్కింగ్ యార్డులో నెలలుగా మగ్గుతున్న కొత్త బస్సుల ఛాసీలు

- వాటి మధ్యలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు
- 34 ప్రైవేట్ వర్క్‌షాపులకు బాడీలు కట్టే ఆర్డర్
- సొంతూళ్లకు వెళ్లిన ఒడిశా, యూపీ కార్మికులు..పనుల్లో తీవ్ర జాప్యం
- ముంబై, జైపూర్‌లోని బడా వర్క్‌షాపులకు ఆర్డర్ ఇవ్వాలని ఆర్టీసీ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ పెద్దసంఖ్యలో బస్సు ఛాసీలను కొనుగోలు చేసింది. అయితే నగరంలో ఉన్నవి చిన్న వర్క్‌షాప్‌లు కావడం, అందులో పనిచేసే కార్మికులు సొంతూళ్లకు వెళ్లడంతో కొత్త బస్సులకు బాడీలు కట్టేవారు కరువయ్యారు. దీంతో నెలల తరబడి ఆ ఛాసీలు పార్కింగ్ యార్డులో ఎదురుచూడాల్సి వస్తోంది. వర్షాలు కురుస్తుండటంతో ఆ ఛాసీల్లోంచి గడ్డి, పిచ్చిమొక్కలు ఏపుగా పెరగ్గా, తీగజాతి మొక్కలు వాటిని అల్లుకుపోతున్నాయి. కొన్ని ఛాసీలైతే సరిగ్గా కనిపించనంతగా వాటిని చుట్టేశాయి.

**చాలా ఏళ్ల తర్వాత కొత్త బస్సులు**

ఆర్టీసీ చాలాఏళ్ల తర్వాత 1,200 కొత్త బస్సులను సమకూర్చుకుంటోంది. ఈ తరుణంలో ఇటీవల పెద్ద సంఖ్యలో బస్సుల ఛాసీలు ఆర్టీసీ పార్కింగ్ యార్డుకు చేరుకున్నాయి. గతంలో మియాపూర్‌లోని బస్‌బాడీ వర్క్‌షాప్‌లో సొంతంగా ఛాసీలకు బాడీలు నిర్మించుకునేది. ప్రస్తుతం ఆ వర్క్‌షాపు నీరసించిపోయింది. అక్కడ నెలకు 25 ఛాసీలకు మాత్రమే బాడీలు నిర్మిస్తోంది. త్వరలో నెలకు 15 బస్సులకు బాడీలు నిర్మించేలా కొత్త లైను ఏర్పాటు చేస్తున్నారు. అయితే బాడీలు కట్టే పనులను త్వరగా పూర్తి చేసేందుకు ఆర్టీసీ 34 ప్రైవేట్ వర్క్‌షాపులకు ఆర్డర్ ఇచ్చింది. కానీ వాటి సామర్థ్యం చాలా తక్కు వ. ఒక్కో వర్క్‌షాపు నెలకు మూడు నుంచి ఐదు ఛాసీలకు మాత్రమే బాడీలు నిర్మించేంత చిన్నవి. అందులోనూ ఒడిశా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వారే కార్మికులుగా పనిచేస్తున్నారు. వారు ఏడాదిలో రెండు మూడు పర్యాయాలు సెలవుల్లో వెళతారు. ఇటీవల వేసవి సెలవుల కోసం వెళ్లినవారు గత నెలలోనే తిరిగొచ్చారు. దీంతో రెండు నెలల పాటు వాటి ల్లో పనులు సరిగ్గా జరగలేదు. ఫలితంగా ఛాసీలన్నీ పేరుకుపోయాయి. వానాకాలం ముంచుకు రావటంతో గడ్డిలో కూరుకుపోయాయి. ఇక ఏపీ ఆర్టీసీ బస్సులతోపాటు, ప్రైవేట్ బ స్సులకు కూడా ఆ వర్క్‌షాపులే దిక్కవుతుండటంతో పనుల్లో మరింత జాప్యం జరుగుతోంది. అయితే రెండుమూడు నెలలపాటు వానకు తడిసినా, గడ్డి మధ్య కూరుకుపోయినా ఛాసీలు పాడు కావని మరోవైపు అధికారులు చెబుతున్నారు.

**బడా కంపెనీలతో సంప్రదింపులు**

తాను కొంటున్న బస్సు ఛాసీలకు స్థానికంగానే బాడీ కట్టిస్తున్న ఆర్టీసీ ఇకపై ముంబయి, జైపూర్‌లలో ఉన్న బడా కంపెనీలకు ఆర్డరివ్వాలని భావిస్తోంది. ఉత్తర, మధ్య భారత్ ప్రాంతాల్లోని బడా కంపెనీలకు తరలించి బాడీ నిర్మించి హైదరాబాద్‌కు తీసుకురావాలని అనుకుంటోంది. ఈ మేరకు ఆయా నగరాల్లో ఉన్న బడా బస్‌బాడీ నిర్మాణ కంపెనీలతో ఆర్టీసీ సంప్రదిస్తోంది. ఒక బస్సు ఛాసీకి బాడీ నిర్మించాలంటే రూ.11 లక్షల వరకు ఖర్చవుతుండగా, దూర ప్రాంతాల్లోని బడా కంపెనీలకు ఆర్డరిస్తే ఈ ఖర్చు మరికాస్త పెరిగే అవకాశముంది. అయితే వేగంగా బస్సు సిద్ధమై రోడ్డెక్కితే వెంటనే ఆదాయం పెరిగే వీలున్నందున, లాభమే ఉంటుందన్నది ఆర్టీసీ ఆలోచన.

# భూ పరిహారానికీ పైసల్లేవ్

- మనోహరాబాద్–కొత్తపల్లి ప్రాజెక్టులో నిలిచిపోయిన పరిహారం చెల్లింపు
- రూ.130 కోట్ల స్వల్ప మొత్తాన్ని పెండింగులో పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- తంగళ్లపల్లి వరకు మాత్రమే భూమి స్వాధీనం అవటంతో అక్కడి వరకే టెండర్లు పిలిచిన రైల్వే
- కీలక తరుణంలో పనుల్లో జాప్యం



సాక్షి, హైదరాబాద్: కీలక రైల్వే ప్రాజెక్టు పనులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం నిధులు అందించలేకపోతోంది. తక్కువ మొత్తమే అవసరమున్నా నిధుల విడుదలలో తీవ్ర జాప్యం చేస్తోంది. ఫలితంగా ప్రాజెక్టు పనులు నిలిచిపోయే దుస్థితి నెలకొంది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత తొలి గ్రీన్‌ఫీల్డ్ రైల్వే మార్గంగా పనులు ప్రారంభించుకున్న మనోహరాబాద్–కొత్తపల్లి ప్రాజెక్టు పనులు ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తీరుతో వేగం మందగించింది. రాజధాని నగరంతో సిద్దిపేట, సిరిసిల్ల, కరీంనగర్‌లాంటి కీలక పట్టణాలను నేరుగా అనుసంధానించే కీలక ప్రాజెక్టు అయినప్పటికీ, భూసేకరణ నిధులు విడుదల చేయకపోవటంతో ఆ ప్రాజెక్టు పనులు పడకేస్తున్నాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా సిద్దిపేట వరకు 2023లో రైలు సర్వీసు ప్రారంభించారు. ప్రస్తుతం సిద్దిపేట–సిరిసిల్ల మధ్య పనులు జరుగుతున్నాయి. వచ్చే మార్చి నాటికి సిరిసిల్ల వరకు రైలు సర్వీసు ప్రారంభించేలా పనులు పూర్తి చేయాల్సి ఉంది. సిరిసిల్ల స్టేషన్‌కు చేరువలో ఉన్న మానేరు నదిని దాటి తదుపరి కరీంనగర్ వరకు పనులు చేపట్టాల్సి ఉంది. సిరిసిల్ల వరకు ట్రాక్ (రెయిల్స్ పరవటం) ఏర్పాటు పనులు జరుపుతూనే, కరీంనగర్ వరకు నేలను లెవల్ చేసే పనిని సమాంతరంగా నిర్వహించాల్సి ఉంది. ఇప్పుడు ఇక్కడే చిక్కు వచ్చి పడింది. సిద్దిపేట–సిరిసిల్ల మధ్య పనుల కోసం టెండర్లు పిలిచి పనులు నిర్వహిస్తున్న రైల్వే, ఆపై కరీంనగర్ వరకు కూడా తదుపరి టెండర్ పిలవాల్సి ఉంది. కానీ, సిరిసిల్ల జిల్లా పరిధిలోని తంగళ్లపల్లి వరకు భూసేకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పరిహారాన్ని అందజేసింది. దీంతో అక్కడి వరకు భూమి రైల్వేకు స్వాధీనం కావటంతో.. తంగళ్లపల్లి వరకు పనుల కోసం టెండర్లు పిలిచింది. ఇప్పుడు అక్కడే పనులు జరుగుతున్నాయి. తంగళ్లపల్లి తర్వాత 15 హెక్టార్ల అటవీ భూములున్నాయి. దానికి సంబంధించి అనుమతి రావాల్సి ఉంది. ఆ తర్వాత సిరిసిల్ల వరకు భూపరిహారాన్ని ప్రభుత్వం విడుదల చేయలేదు. నిజానికి కొత్తపల్లి వరకు భూసేకరణ ప్రక్రియ అంతా పూర్తయింది. రైతులకు పరిహారాన్ని అందించటమే మిగిలిఉంది. పరిహారం అందిస్తేనే ఆ భూములు రైల్వేకు స్వాధీనం చేసే పరిస్థితి ఉంటుంది. తన వంతు వాటాగా తాజా బడ్జెట్‌లో రైల్వే శాఖ ఈ ప్రాజెక్టుకు రూ.350 కోట్ల భారీ మొత్తాన్ని కేటాయించింది. గతేడాది బడ్జెట్ నిధుల (రూ.185 కోట్లు) కంటే ఇది దాదాపు రెట్టింపు కావటం విశేషం.

### రూ.130 కోట్లు మాత్రమే..

తంగళ్లపల్లి నుంచి సిరిసిల్ల మధ్యలో పరిహారం మొత్తం రూ.68 కోట్లుగా ఉంది. ఆ తర్వాత కొత్తపల్లి (చివరి స్టేషన్) వరకు మరో రూ.62 కోట్లు చెల్లించాల్సి ఉంది. భూసేకరణకు సంబంధించి సాంకేతిక అంశాలన్నీ పూర్తయి కేవలం పరిహారం చెల్లింపు మాత్రమే మిగిలి ఉంది. ఈ ప్రాజెక్టులో భూసేకరణ బాధ్యత పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానిదే. కానీ ప్రక్రియనే ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. ఇతర అవసరాలకు నిధులు మళ్లించటంతో భూపరిహారానికి డబ్బులు కేటాయించలేకపోతోందంటూ కొందరు రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే రైల్వే శాఖ పలుదఫాలుగా విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. కానీ నిధులు మాత్రం విడుదల కావటం లేదు. భూ పరిహారం చెల్లింపు పూర్తయితే తప్ప ఆ పనులు చేపట్టే వీలు లేదు. రైల్వే శాఖ ఆయా పనులకు టెండర్లు పిలవాలంటే కనీసం 90 శాతం భూమి తన స్వాధీనం అయి ఉండాలి. పరిహారం డబ్బులు చెల్లించనందున స్వాధీన ప్రక్రియకు వీలు లేదు. దీంతో కొత్తపల్లి వరకు రైలును నడిపేందుకు మరో మూడేళ్ల పాటు నిరీక్షించక తప్పని పరిస్థితి ఉందని తెలుస్తోంది.

## సర్వాయి పాపన్నకు నివాళి



సాక్షి, హైదరాబాద్: బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంటరీ పార్టీ సభ్యుడు, ఎంపీ కె.లక్ష్మణ్, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## మీ పాలనలో దాడుల సమాచారం కావాలా?

### కేటీఆర్‌ను ప్రశ్నించిన మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 2014–23 వరకు మహిళలపై జరిగిన అత్యాచారా లు, దాడులకు సంబంధించిన సమా చారం పూర్తిగా తన వద్ద ఉందని.. మాజీ మంత్రి కేటీఆర్‌కు కావా లంటే ఇస్తానని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన దాడులపై కూడా ఆయన మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తే బాగుంటుందని వ్యాఖ్యానించారు. సీఎల్పీ సమావేశం జరిగిన హోటల్ వద్ద ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కేంద్రహోం మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదికలోనే తెలంగాణలో ఏటా నేరాలు పెరిగినట్టు లెక్కలు చెబుతు న్నాయన్నారు. 2014లో 14,417, 2015లో 15425, 2016లో 15,374, 2017లో 17,521, 2018లో 16,027, 2019లో 18,394, 2020లో 17,791, 2021లో 20,865, 2022లో 22,066 కేసులు నమోదయ్యాయని ఈ గణాంకాలు చెబుతున్నాయన్నారు. తాము కూడా మహిళా కమిషన్‌ను కలిసి బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన నేరాలను నివేదిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదికను మీడియాకు విడుదల చేశారు.

## హజ్ యాత్ర షెడ్యూల్ విడుదల

### నేటినుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం 2025 హజ్ యాత్ర షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీంతో ఈ నెల 19వ తేదీ నుంచి హజ్ యాత్రకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుంది. ఈ ఏడాది హజ్ సువిధ యాప్‌ను యాత్రికుల సౌకర్యార్థం పరిచయం చేసింది. ఈ యాప్‌లో దరఖాస్తుల స్వీకరణ నుంచి యాత్రకు సంబంధించిన సమాచారం పొందుపరిచింది. యాత్రికులు దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి వారి ఎంపిక, కవర్ నంబర్, యాత్రకు ఎంపికైతే ఎంత చెల్లించాలి, యాత్ర షెడ్యూల్‌తో పాటు యాత్రకు వెళ్లేవారి పూర్తి సమాచారం యాప్‌లో ఉంటుందని అధికారులు తెలిపారు. మక్కా, మదీనా నగరాల్లో హజ్ సేవకులుగా వెళ్లిన వారి వివరాలు కూడా యాప్‌లో ఉంటాయని వెల్లడించారు. గతంలో ఏటా 70 ఏళ్లు పైబడిన వారిని హజ్ యాత్రకు నేరుగా ఎంపిక చేసేవారు. ఈ ఏడాది నుంచి వయోపరిమితిని 65 ఏళ్లకు తగ్గించారు. దీంతో ఇకనుంచి 65 ఏళ్లు మించినవారికి డ్రా నుంచి మినహాయింపు ఉంటుంది. వారు నేరుగా యాత్రకు ఎంపికవుతారని అధికారులు తెలిపారు. హజ్ యాత్రికుల సౌకర్యార్థం నాంపల్లి హజ్ హౌస్‌లోని రాష్ట్ర హజ్ కమిటీ కార్యాలయంలో సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# గురుకులాల్లో చేరేదెందరు?

**8,304 మందికి ఇటీవల పోస్టింగ్ ఇచ్చిన గురుకుల సొసైటీలు**

- వారికి సెప్టెంబర్ నెలాఖరు వరకు చేరే వెసులుబాటు
- మిగిలే పోస్టుల లెక్కలు తేలేది ఆ తర్వాతే
- అలా మిగిలిన పోస్టులు వచ్చే జాబ్ కేలండర్‌లోకి ...



సాక్షి, హైదరాబాద్: గురుకుల సొసైటీల్లో కొత్తగా కొలువులు సాధించినవారిలో ఎంతమంది విధుల్లో చేరుతారనేది దానిపై సెప్టెంబర్ నెలాఖరు వరకు ఒక స్పష్టత రానుంది. ఒకట్రెండు కేటగిరీల్లో 500 పోస్టులు మినహా మిగిలిన కేటగిరీల్లో ఉద్యోగాలకు ఎంపికై నవారికి ఆయా సొసైటీలు పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేశాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్ గురుకుల సొసైటీలు గత నెలాఖరులో 8,304 పోస్టులకుగాను ఎంపికై న అభ్యర్థులకు పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇవి అందుకున్న నాటినుంచి 60 రోజుల్లో వారికి నిర్దేశించిన చోట విధుల్లో చేరాలనేది నిబంధన. ఈ క్రమంలో కొత్తగా ఉద్యోగం సాధించిన వారంతా సెప్టెంబర్ నెలాఖరు కల్లా తప్పనిసరిగా విధుల్లో చేరాలి. లేకుంటే వారి నియామకం రద్దవుతుందని సొసైటీలు ఉత్తర్వుల్లో స్పష్టం చేశాయి.

**ఖాళీల లెక్క తేలేది వచ్చే నెలలోనే...**


గురుకుల కొలువుల్లో రెండు, మూడు ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు కూడా పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. రెండు, అంతకంటే ఎక్కువ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు కూడా అన్ని కొలువులకు సంబంధించిన పోస్టింగ్ ఉత్తర్వులు అందుకున్నారు. అయితే తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు(టీఆర్‌ఈఐఆర్‌బీ) అధికారుల అంచనా ప్రకారం 1,550 ఉద్యోగాలు మిగిలిపోయే అవకాశమున్నట్టు అభిప్రాయపడుతున్నారు. అక్టోబర్ మొదటివారం నాటికి ఈ లెక్కలు తేలే అవకాశం ఉంది. ఇలా మిగిలిపోయిన ఖాళీలను వచ్చే ఏడాది రూపొందించే జాబ్ కేలండర్‌లో చేర్చుతారనే అభిప్రాయం కూడా అధికారులు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జాబ్ కేలండర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో గురుకుల విద్యాసంస్థల్లో ఉ ద్యోగాల భర్తీకి సంబంధించి ఎలాంటి ప్రకటన లేదు. ఖాళీల ఆధారంగా వచ్చే జాబ్ కేలండర్‌లో ప్రకటన ఇవ్వొచ్చని అధికారవర్గాలు చెబుతున్నాయి.

**గురుకులాల్లో కేటగిరీల వారీగా భర్తీ చేసిన పోస్టులు**

| కేటగిరీ | పోస్టుల సంఖ్య |
|---|---|
| డిగ్రీ కాలేజీ | 740 |
| జూనియర్ కాలేజీ | 1,898 |
| పాఠశాలలు | 5,666 |

## న్యూస్ ఫొటో కాంపిటీషన్‌లో ఉత్తమ చిత్రాల ఎంపిక

### జాబితాలో ముగ్గురు సాక్షి ఫొటోగ్రాఫర్లు


వి.భాస్కరాచారి


పి.మోహనాచారి


బి.శివప్రసాద్

కాచిగూడ (హైదరాబాద్): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఫొటో జర్నలిస్టుల సంఘం నిర్వహించిన రాష్ట్రస్థాయి న్యూస్ ఫొటో కాంపిటీషన్–2024లో 31 జిల్లాల నుంచి 100 ఎంట్రీలు వచ్చాయని సంఘం అధ్యక్షుడు అనుమళ్ల గంగాధర్, కార్యదర్శి కేఎస్ హరి చెప్పారు. సీనియర్ జర్నలిస్ట్, ముఖ్యమంత్రి సీపీఆర్‌ఓ బి.అయోధ్య రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ సీహెచ్ సుశీల్ రావు, సీనియర్ ఫొటో జర్నలిస్టు హెచ్.సతీష్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి వివిధ కేటగిరీల్లో ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. సాక్షి ఫొటోగ్రాఫర్లు పి.మోహనాచారి (హైదరాబాద్), బి.శివప్రసాద్ (సంగారెడ్డి), వి.భాస్కరాచారి (మహబూబ్‌నగర్) తీసిన చిత్రాలు కన్సొలేషన్ విభాగంలో విజేతలుగా నిలిచాయన్నారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఈ ఛాయా చిత్ర ప్రదర్శనను సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభిస్తారని, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి హాజరవుతారని చెప్పారు.



నేను మూర్ఖుడిని అని తెలుసుకునేంత తెలివి నాకు ఉంది.
- రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్



సాక్షి
సోమవారం, 19 ఆగస్టు 2024

# దేవుణ్ణి చూసిన వాడు

'వానలో కలిసిన చీకటి ఆకాశం నుంచి నల్లటి విషంలా కారుతోంది' అని మొదలవుతుంది తిలక్ 'దేవుణ్ణి చూసిన వాడు' కథ. ఆ రాత్రి వానలో ఉలిక్కిపడి లేచిన గవరయ్యకు పెరటి వసారాలో ఏదో మూలుగు. ఏమిటది? లాంతరు తీసుకుని బయటకి వచ్చాడు. హోరుగాలి... భీకర వర్షం... మూలుగుతూ పడి ఉన్న ప్రాణి. లాంతరు ఎత్తి చూసి దిమ్మెరపోయాడు. భార్య. తనను వదిలిపెట్టి వెళ్లిన భార్య. 'గవరయ్య భార్య లేచిపోయిందట' అని ఊరంతా గేలి చేయడానికి కారణమైన స్త్రీ. మోసపోయి, నిండు గర్భంతో, నొప్పులు పడుతూ, మొహం చెల్లక వసారాలో పడి ఉంది. దూరంగా మెరుపు మెరిసింది. చెవులు చిల్లులుపడేలా పిడుగు. కాన్పు జరిగిపోయింది. కేర్‌మని– చేతుల్లోకి తీసుకోగానే సముదాయింపు పొందిన ఆ పసికూన గవరయ్యతో బంధమేసింది. క్షణం ఆలోచించలేదు అతడు. ఆమెను, ఆమె కన్న తనది కాని బిడ్డను లోపలికి తీసుకెళ్లాడు. మరుసటి రోజు ఊరిపెద్దలు 'లేచిపోయిందాన్ని ఏలుకుంటావా' అని వస్తే గవరయ్య ఏం చేశాడు? కత్తి పట్టుకు వచ్చి 'అడ్డు పడినవాళ్లను అడ్డంగా నరుకుతాను' అన్నాడు. అతడు మనిషి. దేవుడు. మానవత్వంలో దేవుడిని చూసినవాడు.

మధురాంతకం రాజారాం 'కొండారెడ్డి కూతురు' అనే కథ రాశారు. ఫ్యాక్షనిస్టు కొండారెడ్డి కూతురు ప్రేమ వివాహం చేసుకుంది. పారిపోయి బతుకుతోంది. చాన్నాళ్ల తర్వాత ఊరి మనుషులు చూడటానికి వచ్చారు. తన మనుషులు. తన తండ్రి దగ్గర పని చేసే మనుషులు. కొండారెడ్డి కూతురు ఎంతో సంతోషపడింది. మర్యాదలు చేసింది. వారి చేసంచుల్లో చాటుగా ఉన్న ఆయుధాలు చూసి అంతలోనే నిశ్చేష్టురాలైంది. తనను, భర్తను చంపుతారన్నమాట. తండ్రి పంపించాడన్న మాట. కాని ఇంటికి వచ్చిన అతిథులను అవమానించవచ్చా? వారి కోసం ఏమిటేమిటో వండింది. కొసరి కొసరి వడ్డించింది. ఊరి ముచ్చట్లు అడిగి చెప్పించుకుంది. ఆ రాత్రి తనకు ఆఖరు రాత్రి. హాలులో కుర్చీ వేసుకుని భర్త గదికి కాపలా కూర్చుంది. వాళ్లు వస్తారు. తనని చంపుతారు. కొండారెడ్డికి పుట్టినందుకు తాను చస్తుంది. కాని భర్తను చంపడానికి వీల్లేదంటుంది. వాళ్లు వచ్చారు. నీడల్లా నిలబడ్డారు. చంపుతారనుకుంటే కాళ్ల మీద పడ్డారు. 'అమ్మా మేమెందుకొచ్చామో తెలిసీ అన్నం పెట్టావు. చెడ్డ పనులు చేసే రోజు మీ అమ్మ ముఖం చూడకుండా తప్పుకునేవాళ్లం. చూస్తే చేయలేమని. ఇవాళ నీ ముఖం చూస్తూ నిన్నెలా చంపుతామమ్మా'... ఏడుస్తూ కాళ్లు కడుగుతున్నారు. ఆమె మనిషే. దేవత కాకపోవచ్చు. కాని మానవీయత ఉన్న మనిషి వదనంలో దైవత్వం ఉంటుంది.

'మనందరం దేవుళ్లమే' అంటాడు 'సత్యమే శివం'లో కమలహాసన్. 'సృష్టి విలయం రెండూ మన చేతుల్లోనే' అంటాడు 'సెపియెన్స్' పుస్తక రచయిత హరారి. 'నేటి మనిషి రెండు విషయాల వల్ల మనిషి గుణాన్ని కోల్పోయే ప్రమాదంలో పడ్డాడు. ఒకటి ప్రకృతి విధ్వంసం– రెండు సాంకేతికతను పెంచి తాను మరుగుజ్జుగా మారడం' అంటాడు హరారి. ప్రకృతికి ఎడంగా జరిగే కొద్ది, పరిసరాల్లో సిమెంటు పెరిగే కొద్ది, నాలుగు గోడల నుంచి నాలుగు గోడలకు అతని దినచర్య మారేకొద్ది సహజమైన మానవ స్పందనలు మొద్దుబారక తప్పదు. పెట్ డాగ్స్ సమక్షంలో అతడు పొందగలుగుతున్నది కొద్దిగా ఓదార్పే. పల్లెలో ప్రకృతిలో ఉన్నప్పుడు గొడ్డూ గోదా, మేకా ఉడుతా, కాకీ పిచుకా అన్నీ అతని స్పందనలను సజీవంగా ఉంచేవి. 'ఎలా ఉన్నావు?' నుంచి 'ఎంత సంపాదిస్తున్నావు?'ను దాటి 'ఏం కొన్నావు?'కు వచ్చేసరికి అతనిలో మొదలైంది పతనం.

'లాభం' అనే మాట కనిపించని దారాలతో ఆడించే మాయావి. మనిషిని ఎంత ఓడిస్తే లాభం అంత గెలుస్తుంది. అంతేకాదు 'మనిషి మీద నమ్మకం పోయింది' అనే మాటను పుట్టించడం లాభాపేక్ష గల పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రాథమిక అవసరం. మనిషి మీద నమ్మకం పోయేలా... వాణ్ణి అది వస్తుగత, స్వార్థపరమైన, సంపద లాలసలో కూరుకుపోయేలా చేస్తుంది. లాభపడాలంటే, సుఖపడాలంటే చేయవలసింది మానవత్వాన్ని త్యాగం చేయడమే. అది పోగానే వాడు కుటుంబంతో, స్నేహితులతో, సమాజంతో, ప్రకృతితో, మానవాళితో ఎంత దారుణంగా అయినా వ్యవహరించవచ్చు. 'మనిషి మీద నమ్మకం పోయేలా' చేస్తే పెట్టుబడిదారీ వ్యవస్థకు మరో లాభం ఏమిటంటే... ఏ మనిషీ మరో మనిషితో కలవడు. సమూహంగా మారడు. తిరుగుబాటు చేయడు. నలుగురు బాగుపడి కోట్ల మంది మలమలమాడే వ్యవస్థకు ఢోకా రానివ్వడు. అందుకే పెట్టుబడిదారీ వ్యవస్థ 'యుద్ధం' అనే ముద్దుబిడ్డను పదేపదే కంటూ ఉంటుంది. యుద్ధం మానవత్వానికి అతి పెద్ద విరుగుడు.

అయితే మనిషి ఇలాగే ఉంటాడా? ఏ రచయితో అన్నట్టు 'రగిలిస్తే రాజుకునే మహాఅగ్ని మానవత్వం'. కోల్‌కతా నిరసనల్లో ఇవాళ అదే చూస్తున్నాం. యుగాలుగా... చితి పెట్టిన ప్రతిసారీ బూడిద నుంచి మానవత్వం తిరిగి జనిస్తూనే ఉంది. కాకుంటే అందుకు కావల్సిన రెక్కలు సాహిత్యమే ఇస్తుందని గ్రహించాలి. తల్లిదండ్రులూ..! మీ పిల్లల్ని ఇంజనీర్లు, డాక్టర్లు, కలెక్టర్లు తప్పకుండా చేయండి. కాని నాలుగు మంచి పుస్తకాలు చదివించి మొదట మనిషిని చేయండి. ఏ విటమిన్ లేమికి ఏం తినాలి సరే... మానవత్వ లేమి ఉందేమో కనిపెట్టి విరుగుడుగా ఒక పుస్తకం చేతిలో పెట్టండి. ఎక్కడ పుస్తకాలు ఉంటాయో అక్కడ మానవత్వపు ఆవరణం ఏర్పడుతుంది. అదే దేవుడు తిరుగాడే తావు. ప్రపంచ మానవత్వ దినోత్సవ శుభాకాంక్షలు.

# విభజన రేఖను చెరిపిన విజేతలు

కామెంట్



కరణ్ థాపర్

**దేశ విభజనానంతరం ఎన్నో పరిణామాలు సంభవించాయి. గత నలభై ఏళ్లలో – విభజనకు ముందు తరం రాలిపోయింది. రాజకీయాల్లో అనేక మార్పులు వచ్చాయి. బాలీవుడ్ సినిమాలు మునుపటిలా లేవు. అయినప్పటికీ భారత్, పాక్ మనుషులు ఒకేలా ఉన్నారు. ఒకే ఆహారం తీసుకుంటున్నారు. ఒకే ఒక చోట వేరుపడింది ఎక్కడంటే మతంలో! బ్రిటిష్ వాళ్లు గీసిన మ్యాపులో! దాన్ని దాటగలిగేందుకు 'పంజాబీయత'కు తగినంత బలమే ఉంది. ఆ బలమే... నీరజ్–అర్షద్ ఒకరితో ఒకరు చక్కగా కలిసిపోవటానికి కారణం అయింది. వారి క్రీడ మాత్రమే కాదు, వారి సంస్కృతి కూడా ఆ దగ్గరితనాన్ని నిర్ణయించింది. బరిలో ప్రత్యర్థులైనా పరస్పరం సానుకూలంగా మాట్లాడటం, బాంధవ్యాన్ని పంచుకోవటం అసహజత్వానికి దూరంగా ఉన్నాయి.**

పంజాబీలు పాకిస్తాన్‌ను ఎలా చూస్తారనే దాని గురించి మీరు ఎప్పుడైనా ఆలోచించారా? అది దేశంలోని మిగతా ప్రాంతాలకు భిన్నంగా ఉంటుంది. నిజానికి, బెంగాలీలు బంగ్లాదేశ్‌ను ఎలా చూస్తారనే దానిని అందుకు చాలా దగ్గరి సమాంతరంగా నేను ఊహించుకుంటాను. రెండు రాష్ట్రాలు కూడా విభజన వల్ల తమ దేశాలతో వేరైపోయినప్పటికీ, కోల్పోయిన తమ రెండో సగంతో ఉన్న ఆత్మీయతలు, ఆనాటి అమ్మ ఒడి జ్ఞాపకాలు కొడిగట్టిపోలేదు. కాకపోతే అవి తరాల నుండి తరాలకు సంక్రమిస్తున్నట్లుగా ఉంది.

బహుశా అందుకే నీరజ్ చోప్రా–అర్షద్ నదీమ్‌ల కథ దేశంలోని ఇతర ప్రాంతాలకు ప్రాధాన్యత గల వార్త అయితే, పంజాబీలకు అది – ఇందులో వింతేముందన్నంతగా – ఒక మామూలు సంగతి అయింది. నేను మరికాస్త ముందుకు వెళ్లబోయే ముందు, హరియాణా 1966 వరకు కూడా కొన్ని శతాబ్దాలపాటు అవిభక్త పంజాబ్‌లో ఒక ముఖ్యమైన భాగంగా ఉందన్న సంగతిని మీకు గుర్తు చేయనివ్వండి. లాహోర్, లూథియానా మాదిరిగానే అంబాలా, రోహ్‌తక్ పంజాబీ ప్రాంతాలు.

కాబట్టి, నీరజ్–అర్షద్ ఒకరితో ఒకరు చక్కగా కలిసిపోవటంలో ఆశ్చర్యం లేదు. వారి క్రీడ మాత్రమే కాదు, వారి సంస్కృతి కూడా ఆ దగ్గరితనాన్ని నిర్ణయించింది. ఒకరితో ఒకరికి తమ గ్రెనడా, ఐరోపా, అమెరికా సహ–అథ్లెట్‌ల కంటే ఎక్కువగా ఉమ్మడితనం ఉంది. ఆలింగనం, నవ్వు, ఒకరి గురించి ఒకరు సానుకూలంగా మాట్లాడటం, ఒక బాంధవ్యాన్ని పంచుకోవటం ఇద్దరి మధ్య ఎంతో స్పష్టంగా, అసహజత్వానికి దూరంగా ఉన్నాయి. ఇలా కాకపోతేనే ఆశ్చర్యం.

వారి తల్లుల విషయంలో కూడా ఇది వాస్తవం. వారు తమ కొడుకుతో తలపడిన వారిని ప్రత్యర్థిగా చూడకపోవటానికి కారణం వారు తమ 'పంజాబీయత'ను అనుభూతి చెందటమే. నిస్సందేహంగా ఇది, వారు మాట్లాడే విధానంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న సారూప్యాన్ని వివరిస్తోంది. ''నేను నీరజ్ కోసం కూడా ప్రార్థిస్తున్నాను'' అని అర్షద్ తల్లి రజియా పర్వీన్ చెప్పారు. అదే విధంగా నీరజ్ తల్లి సరోజ్ దేవి కూడా ''అతను కూడా నా కుమారుడి లాంటి వాడే'' అని చెప్పారు. ''బంగారం గెలుచుకున్న అబ్బాయీ మా బిడ్డే, వెండి గెలుచుకున్న అబ్బాయీ మా బిడ్డే'' అని ఆమె అన్నారు.



ఒలింపిక్స్‌లో పతకాలు గెలుచుకున్న భారత్–పాక్ అథ్లెట్లు నీరజ్ చోప్రా, అర్షద్ నదీమ్

నేనంటున్న పంజాబీ బాంధవ్యం అనే దాని గురించి మొదట నాకు 1980లో తెలిసింది. నేనప్పుడు లాహోర్‌లో ఉన్నాను. దేశ సరిహద్దుల ఆవలి ఆ తొలి పర్యటనలో నేను అటువైపు చేరుకునే వరకు కూడా పాకిస్తాన్‌ను నేను ఒక పరాయి దేశంగానే చూశాను. నిజంగా పరాయి దేశమే. కానీ అక్కడి ప్రజలైతే కచ్చితంగా పరాయి వారు కాదు. అలాగే వారికి నేను అపరిచితుడినీ కాదు, గ్రహాంతరవాసినీ కాదు.

ఒక సాయంత్రం నేను పాత 'వాప్డా'(వాటర్ అండ్ పవర్ డెవలప్‌మెంట్ అథారిటీ, పాకిస్తాన్) భవనంలోని సల్లూస్ రెస్టారెంట్‌లో కూర్చున్నాక, ఆ రెస్టారెంట్‌లో నేను తప్ప మరొకరు లేకపోవటం గమనించాను. ఒంటరిగానే డిన్నర్ చేసి, త్వరగా బయటికి వెళ్లిపోవటానికి సిద్ధం అయ్యాను. ఎంత పొరపాటు! నేను ఇండియా నుంచి వచ్చిన పంజాబీనని కనిపెట్టిన కొద్ది నిమిషాలకే రెస్టారెంట్ సిబ్బంది నా దగ్గరికి నడుచుకుంటూ వచ్చి మీతో మాట్లాడవచ్చా అని అడిగారు. నేను అంగీకరించగానే నాతో కలిసి కూర్చున్నారు. ఎంపిక చేసిన ఆహారాన్ని నా కోసం తెప్పించారు. లాహోర్‌లో నేను తప్పక చూడవలసిన ప్రదేశాలు ఏమిటో చెప్పారు. వెచ్చగా ఉన్న రోటీలను బలవంతంగా పక్కన పెట్టించి, తాజాగా చేయించిన పొగలు కక్కే రోటీలను నా ప్లేటులో ఒక దాని పైన ఒకటిగా వెడ్డింగ్ కేక్‌ను తలపించేలా ఇంత ఎత్తున సర్వ్ చేయిస్తూనే ఉన్నారు.

అయితే నేను ఎప్పటికీ మరచిపోలేనివి మాత్రం వారు నన్ను అడిగిన ప్రశ్నలు. ''మీరెప్పుడైనా జలంధర్‌లోని గల్లీ నంబర్ టెన్‌కి వెళ్లారా? అది మా తల్లితండ్రులు నివసించిన ప్రదేశం'' అని ఒక ప్రశ్న. ''మీరెప్పుడైనా అమితాబ్ బచ్చన్‌ని, రేఖను కలిశారా? నేను వారిని కలవటానికి ఎంతో ఆసక్తిగా ఉన్నాను'' అని ఇంకో ప్రశ్న. ''ఇందిరా గాంధీ గురించి చెప్పండి. ఆమె గురించి ప్రతిదీ తెలుసుకోవాలని ఉంది నాకు'' అని అత్యంత ఆశ్చర్యకరమైన మరొక ప్రశ్న.

తమ తల్లితండ్రులు జీవితాన్ని గడిపిన ప్రదేశం గురించి ఆ ప్రదేశం తమది కూడా అన్నంత ఉద్విగ్నంగా, ఉత్సాహంగా వారు ఉన్నారు. భారతదేశం అన్నది వారికి వేరే దేశం అయుండొచ్చు కానీ, వారి తల్లితండ్రులు జన్మించిన ప్రదేశం ఇప్పటికీ తమ 'ఇల్లే'. అందువల్ల నేను వారు కోల్పోయిన దేశం నుంచి వెళ్లిన వ్యక్తినే అయినప్పటికీ, వారు మర్చిపోలేని వ్యక్తిని. 'సల్లూస్' ద్వారా వారు కనుగొన్న ఒక బాంధవ్య అనుసంధానాన్ని నేను.

ఇప్పుడు, 1980 అంటే... నలభై సంవత్సరాలకు పైమాటే. నాటి నుంచి ఎన్నో పరిణామాలు సంభవించాయి. దేశ విభజనకు ముందు తరం రాలిపోయింది. రాజకీయాల్లో మార్పులు వచ్చాయి. అవి మనల్ని ఆకర్షించటం లేదు. బాలీవుడ్ సినిమాలు మునుపటిలా లేవు. అయినప్పటికీ మనం ఒకేలా ఉన్నాం. ఒకే భాష మాట్లాడుతున్నాం. ఒకే ఆహారం తీసుకుంటున్నాం. ఆఖరికి ఒకేలా శాపగ్రస్తులమై ఉన్నాం. ఒకే ఒక చోట వేరుపడింది ఎక్కడంటే మతంలో, బ్రిటిష్ వాళ్లు గీసిన మ్యాపులో! దాన్ని దాటగలిగేందుకు పంజాబీయతకు తగినంత బలమే ఉంది.

నీరజ్–అర్షద్‌లు ఒకరికొకరు దగ్గరయ్యేలా చేసింది ఇదే. విదేశాలలో భారతీయులు, పాకిస్తానీలు ఒకరికొకరు – వాళ్లు పంజాబీలు అయినా కాకున్నా – కలివిడిగా ఉండేందుకు కూడా కారణం ఇదే. వారు ఒకరి సమక్షంలో ఒకరు సౌకర్యవంతంగా ఉంటారు. తమ గురించి తాము వివరించాల్సిన అవసరం వారికి లేదు. తమను అర్థం చేసుకుంటారని వారికి తెలుసు. ఉమ్మడి సంస్కృతి విభజన రాజకీయాల కంటే కూడా శక్తిమంతమైనది. ఇది మన రాజకీయ నాయకులకు అర్థమైతే బాగుండు!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### అసలైన భావన



సామ్యవాద భావనను పూర్తిగా తప్పుగా అర్థం చేసుకున్నారు. దాని అర్థం ఒక సైకో నడిపే పొలిట్‌బ్యూరో ఏదో మనల్ని తొక్కుకుంటూ వెళ్లగలదని కాదు. కొన్ని అందరికీ చెందుతాయని మనం అంగీకరిస్తున్నామని అర్థం. మనం ఒకరిని ఒకరం ప్రేమించుకున్నా, ప్రేమించుకోకపోయినా ఒకరికి న్యాయం జరగడాన్ని నిరాకరించం.

– సుధీర్ మిశ్రా, దర్శకుడు

### హంతకులెవరు?



బంగ్లాదేశ్‌లో జరిగిన భారీ విద్యార్థుల నిరసనోద్యమంలో వందల మంది విద్యార్థులు పోలీసుల చేతిలో చనిపోలేదు. ఎందుకంటే విద్యార్థుల శరీరాల్లో కన్పించిన బుల్లెట్లు 7.62 కాలిబర్ రైఫిల్స్ నుంచి కాల్చినవి. ఆ నిషేధిత రైఫిల్స్‌ను ఆర్మీ గానీ, పోలీసులు గానీ వాడటం లేదు. అంటే విద్యార్థులను పౌరులే చంపారని ఇది రుజువు చేస్తోంది. ఎవరు వారు? జిహాదీలు?

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

### యథా రాజా...



యావత్తు పోలీస్ వ్యవస్థ ఒక దారుణమైన నవ్వులాటగా మారిపోయింది; ఎందుకంటే బెంగాల్‌లోని మతిభ్రష్ట ప్రభుత్వ పాలనలో వాళ్లు పనిచేస్తున్నారు కాబట్టి. దారుణం!

– నూపుర్ జె. శర్మ, సంపాదకురాలు

### రహస్యం



జీవిత పాఠం: సంతోషంగా ఉండటానికి రహస్యం... స్వేచ్ఛ! ఆ స్వేచ్ఛను పొందే రహస్యం... ధైర్యం.

– అసీమ్ మల్హోత్రా, కార్డియాలజిస్ట్

### అమ్మ దీవెన



నేను ఒక 35 ఏళ్ల మహిళను, ఇద్దరు పిల్లలకు తల్లిని, ప్రొఫెసర్‌గా పనిచేస్తాను. అయినా ఇప్పటికీ మా అమ్మే నా లంచ్ ప్యాక్ చేస్తుంటుంది. ఇలాంటి దీవెనలు ఉండాలంటే, ఎంత అదృష్టం ఉండాలి! అమ్మకు ఎప్పటికీ కృతజ్ఞురాలిని.

– అంబికా భాగీ దామోదరన్, కెమిస్ట్

### దద్దరిల్లే రుచి



'అచార్' (ఊరగాయ, తొక్కు) అనేది 'పికిల్' కాదు. ఇంగ్లిష్‌లో ఊరగాయ అనేదానికి సరిపోయే మాట లేదు. అచార్ అంటే మహా గొప్పగా పరిమళాలతో కూడిన రుచులు దద్దరిల్లడం; పికిల్ అంటే వినిగర్‌లో నీరసపు దోసకాయ మునిగిపోవడం. రెండూ ఒకటి కాదు.

– నవీన్ కాబరా, ఆంట్రప్రెన్యూర్

### మాట్లాడొద్దా?



మధ్య ప్రాచ్యంలో జరుగుతున్న ఘోరాల పట్ల మౌనంగా ఉండటం అంటే, మన చేతులకు రక్తం అంటించుకోవడంతో సమానమే. ఇంత దారుణమైన అన్యాయం పట్ల మౌనంగా ఎలా ఉండగలం?

– హెంద్ ఫైజల్ అల్ ఖసీమీ, యూఏఈ ఆంట్రప్రెన్యూర్

# గతాన్ని కళ్ల ముందుంచే జ్ఞాపకం!

అభిప్రాయం



డా॥ తారకేశ్వరరావు ఇప్పిలి

గత స్మృతులను జ్ఞాపకంగా నిలిపే ఒక అద్భుతమైన కానుక ఫోటో.

వెయ్యి మాటలు చెప్పలేని భావాన్ని ఒక్క ఫోటో చెబుతుంది. మాటల్లో చెప్పలేని ఎన్నో ఉద్వేగాల్నీ ఒక్క చిత్రంలో వర్ణించవచ్చు. ఫోటోలు కేవలం సంఘటనల్ని మాత్రమే కాకుండా, వాటి వెనుక ఉన్న కథలను కూడా చెబుతాయి.

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని 1910 ఆగస్టు 19న మొదటిసారి జరిపారు. ఇండియా ఇంటర్నేషనల్ ఫోటోగ్రాఫిక్ కౌన్సిల్ 1991 నుంచి ప్రతి ఏటా ఆగస్టు 19న ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని జరపడం ప్రారంభించింది. భారతదేశంలో 1840లోనే ఫోటోగ్రఫీ ఆనవాళ్లు ఉన్నాయి. మొట్టమొదటి కేలోటైప్ ఫోటో స్టూడియో కోల్‌కతాలో స్థాపించారు. మొదట్లో దీనిని బ్రిటిష్ రాజు, జమీందార్లు, సిపాయిలు మాత్రమే ఉపయోగించారు. ఆ తరువాత 1877 నుంచి ఫోటోగ్రఫీ సామాన్యులకు అందుబాటులోకి వచ్చింది. మొట్టమొదటి కలర్ ఫోటో 1861లో తీశారు. భారత్‌లో మొట్టమొదటిగా లాలా దీన్‌దయాళ్ ఈ రంగంలో విశేష కృషి చేశారు.

ఈ రోజుల్లో 4కె వీడియోలు సర్వసాధారణమైనా, ఫోటోగ్రఫీకి ఉండే క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. ఎందుకంటే... ఫోటోగ్రఫీ ఒక ఆర్ట్. అద్భుతమైన ఫోటోలు తీయడం ఒక కళ. ప్రపంచవ్యాప్తంగా అరుదైన, అద్భుతమైన ఫోటోలు తీసే క్రియేటివ్ ఫోటోగ్రాఫర్లు, వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రాఫర్లు ఉన్నారు. అందుకే వరల్డ్ ఫోటోగ్రఫీ డేకి ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రస్తుతం ఫోటోగ్రఫీకి మరింత డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఫోటోగ్రఫీ వృత్తి చేపట్టిన వారి భవిష్యత్తుకి ఏమీ ఢోకా లేదు. స్మార్ట్‌ఫోన్లు వచ్చాక ఫోటోగ్రఫీ మరింత సులభం అయింది. ఇక సెల్ఫీ ఫోటోగ్రఫీ కొత్త పుంతలు తొక్కుతోంది. ఏది ఏమైనా, ఫోటోగ్రఫీ చాలామందికి వృత్తిగానే కాదు ప్రవృత్తిగానూ మారిపోయింది.

మొదట ఫోటోగ్రఫీ కెమెరాలు చాలా పెద్దగా ఉండేవి. కాలక్రమంలో ఎయిమ్ అండ్ షూట్ కెమెరాలు, ఫీల్డ్ కెమెరాలు, డొనాల్ కెమెరాలు, డిజిటల్ సింగిల్ లెన్స్ రిఫ్లెక్ట్, ఫ్లై కెమెరాలు అందుబాటులోకి వచ్చాయి. ఒకప్పుడు రీల్స్‌తో ఫోటోలు తీసే స్థాయి నుంచి చిన్న మెమొరీ కార్డుతో ఫోటోలు తీసే స్థాయికి ఫోటోగ్రఫీ చేరుకుంది. అయితే ఇంతటి పరిజ్ఞానం వెనుక ఎందరో శాస్త్రవేత్తల అధ్యయనాలు, పరిశోధనల నిరంతర కృషి దాగివుంది. అటువంటి మహనీయులను ఒక్కసారి గుర్తు చేసుకోవడమే ఫోటోగ్రఫీ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం.



అన్నా లీబోవిట్జ్, స్టీవ్ మెక్‌కరీ, సెబాస్టియో సల్గాడో, డోరోథియా లాంగే ఫోటోగ్రఫీ రంగంలో అద్భుతమైన కృషి చేశారు. వీరు తమ ఫోటోల ద్వారా విభిన్న సంస్కృతులను ప్రపంచానికి చూపించి, అద్భుతమైన జ్ఞాపకాలను మిగిల్చారు. మనిషి జీవితంలోని పోరాటం, మానవత్వం వంటి అంశాలను వాళ్ళ ఫోటోలలో ప్రదర్శించారు. కళాకారులు కొత్త సాంకేతికతలను ఉపయోగిస్తూ కొత్త తరాల ఫోటోగ్రాఫర్‌ల అభివృద్ధికి దోహదపడుతున్నారు. వారి పోట్రెయిట్లు, ల్యాండ్‌స్కేప్ ఫోటోలు, ఇతర సేకరణలు మనలో ఆలోచన, ఉత్సాహం, భావోద్వేగాలను రేకెత్తిస్తాయి. ఈ ఫోటోగ్రాఫర్‌లు గతంలో జరిగిన ముఖ్యమైన సంఘటనలను రికార్డ్ చేసి, మనకు చరిత్రను అందించారు. మెక్‌కరీ, లీబోవిట్జ్, సల్గాడో, లాంగే వంటి ఫోటోగ్రాఫర్ల కృషి ద్వారా ఫోటోగ్రఫీ నిరంతరం మారుతూ, కొత్త స్థాయికి చేరుకుంటూనే చెరగని ముద్రను లిఖిస్తోంది.

వ్యాసకర్త ఆంధ్ర ప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగంలో సహాయాచార్యులు

(నేడు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం)

# తెలుగు సాహిత్యమూ... తాజా పాఠమూ...

'మా కన్నడ దేశంలో చాయ్ కోసం ఏ నలుగురు కుర్రాళ్లు కలిసినా కువెంపు గురించో, పూర్ణచంద్ర తేజస్వి గురించో, మరో సాహిత్యకారుని గురించో మాట్లాడుకుంటారు. సినిమాల మాట ఎత్తరు' అన్నాడు కన్నడ రచయిత వసుధేంద్ర. 'నా కథలు తెలుగులో అనువాదమై పుస్తకంగా వెలువడటం సంతోషంగా ఉంది. నా రచనలకు తమిళనాడులో, యూరప్‌లో, అమెరికాలో పాఠకుల క్లబ్‌లున్నాయి. వాటిని మొదలెట్టి నిర్వహిస్తున్నది ఒక తెలుగువాడు' అన్నాడు తమిళ రచయిత జయమోహన్.

ఆగస్టు రెండోవారంలో బెంగళూరులో జరిగిన నాలుగు దక్షిణాది భాషల 'బుక్ బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్'లో ఈ రచయితలిద్దరూ మాట్లాడిన మాటలు తెలుగు సమాజ స్వభావాన్ని పరోక్షంగా నిరూపిస్తున్నాయి. ఏమంటే మన దగ్గర ఏ నలుగురు కుర్రాళ్లు కలిసినా సినిమాలు మాట్లాడుకుంటారు. మన దగ్గర ఏ నలుగురు పాఠకులు కలిసినా పరభాషా ఆరాధనను వ్యక్తపరుస్తారు. కేరళీయులు చెప్పింది ఎందుకు వదిలిపెట్టాలి? 'కరోనాలో ప్రభుత్వం అన్నీ బంద్ పెట్టి కేవలం మెడికల్ షాపులే తెరవడానికి అనుమతి ఇచ్చినా... 'అయ్యా సి.ఎం. గారూ! భౌతిక ఆరోగ్యం సరే... మానసిక ఆరోగ్యం కోసం పుస్తకాలు అక్కర్లేదా?' అని విన్నవిస్తే, ముఖ్యమంత్రి విజయన్ గారు వెంటనే స్పందించి వారంలో రెండు రోజులు వాటిని తెరవనిచ్చారు. అంతేనా? ఆ రోజుల్లో మేము స్విగ్గీలో కూడా పుస్తకాలు అమ్మాం' అని ఫెస్టివల్‌కు హాజరైన కేరళ ప్రచురణకర్త చెప్తే ఆశ్చర్యపోవడం తెలుగు ప్రతినిధుల పనైంది. ఏమంటే కరోనాలో మలయాళీలు పుస్తకాలు చదువుతుంటే మనం ఓటీటీలలో మలయాళ సినిమాలన్నీ చూస్తూ గడిపాం.

మనం ఏంటనేది మనం మాత్రమే ఉన్నప్పుడు తెలియదు. దాటి వెళ్లినప్పుడే తెలుస్తుంది. గతంలో లేనట్టుగా దక్షిణాదికే ప్రాధాన్యం ఇస్తూ మొదటిసారి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ సాహిత్యకారులు 'బుక్ బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్'లో కలిసినప్పుడు రెండు రోజుల ఆ వేడుకలో తమిళ, కన్నడ, మలయాళం నుంచి 'స్థాయి'తో తిరిగినవారు ఎందరు... తెలుగు నుంచి అలాంటి 'స్థాయి' కలిగినవారుగా నిలబడింది ఎందరు? ప్రారంభ వేడుకలో ఓల్గాకు స్థానం దక్కడం సంతోషమే అయినా పెరుమాళ్ మురుగన్, జయమోహన్, వివేక్ శానుబాగ్ తదితర రచయితలు కనిపిస్తే తెలుగువారు ఆరాధనగా వెళ్లి పలకరించినట్టుగా తెలుగు రచయితలను ఆ భాషల పాఠకులు అంతే పలకరించారా? ఏం తక్కువ మనకు?





వేదికపై దక్షిణాది రచయితలు జయకాంతన్, శివప్రకాశ్, సచ్చిదానందన్, ఓల్గా, వివేక్ శానుబాగ్

అక్కడకు హాజరైన వాడ్రేవు చినవీరభద్రుడు, మృణాళిని, చూపు కాత్యాయని ఉద్దండులు. ఆధునిక ఆవరణలోని స్త్రీవాద కథను ప్రతిబింబించిన కుప్పిలి పద్మ వంటి రచయిత ఇతర భాషల్లో ఎక్కడ? మహిళా రచయితలకు వేదిక కల్పించి రచన, కార్యాచరణ నిర్వహిస్తున్న కె.ఎన్. మల్లీశ్వరి వంటి రచయిత్రులు ఎందరు? సాక్షాత్తూ 'గార్డియన్' పత్రిక రివ్యూ రాసేంతటి గొప్ప కథలు రాసిన గోగు శ్యామల అక్కడే ఉన్నారే! వీరంతా గౌరవం పొందలేదని కాదు. పొందారు. సరిపోదు! కేవలం మనల్ని మనం పెంచుకోకపోవడం వల్ల, ఎదుటివారి కృషిని గౌరవించలేకపోవడం వల్ల, పరాయి భాషల్లో అనువాదమయ్యి ఘనత చాటుకోవడం రాకపోవడం వల్ల, ముఖ్యం – ఒకరు ఎదుగుతుంటే కిందకు పట్టిలాగే పీతల స్వభావం వల్ల బెంగళూరులో తెలుగు వారు నలుగురిలో ఒకరిలా... ఇతర భాషల వారు నలుగురికి ఒకరిలా కనిపించారు.

నిజానికి 'బుక్ బ్రహ్మ'కు హాజరైన తెలుగు టీమ్ తెలుగు సాహిత్యం ఎంత వికాసవంతంగా ఉందో చూపింది. భిన్న సాహిత్యధోరణుల, వాదాల, శ్రేణుల ప్రతినిధులు ఉన్నారు. చిన్న వయసులో యువ సాహిత్య అకాడెమీ పురస్కారం పొందిన రమేష్ కార్తీక్ వంటి మన ఆదివాసీ రచయితా ఉన్నారు. ఇలాంటి టీమ్ ఇతర భాషల నుంచి హాజరు కాలేదు. గత యాభై ఏళ్ల తమిళ, మలయాళ, కన్నడ భాషల సాహిత్యంతో మన సాహిత్యాన్ని పోల్చినప్పుడు పురోగామి మెలకువను ప్రదర్శించడంలో మనల్ని మించినవారు లేరు. విప్లవ సాహిత్యంతో మొదలు మైనార్టీ సాహిత్యం వరకు జాజ్వల్యమైన కృషి సాగింది. గత పాతికేళ్లుగా సాగుతున్న 'రైటర్స్ మీట్' వంటి కృషి ఇతర భాషల్లో జరిగి ఉంటే ఎన్ని నోళ్లతో ఊదరగొట్టుకుని ఉండేవారో. ఇంత చేసినా తెలుగు వారు తెల్లముఖం వేయకతప్పడం లేదు. కాత్యాయనీ విద్మహే అన్నట్టు వైరుధ్యాల చైతన్యంలో మన ముందంజ వాటి మధ్య అంగీకారం సాధించడంలో లేదు. వైరుధ్యం శత్రుత్వం కాదని గ్రహించని మొండితనం తెలుగు సాహిత్యానికి చేటుగా మారింది. అహం, అక్కసు ఏ మేరకు నష్టం చేస్తున్నాయో ఎవరికి వారు పరిశీలించుకోవాలి. 'పిలిస్తే బాగుణ్ను' నుంచి 'పిలిస్తే వస్తారో రారో' అనుకునే ఎదుగుదలకు సరిపడా కృషే కదా 'స్థాయి' అంటే!

సాహిత్యం లోపల ఇలా ఉంటే సాహిత్యానికి బయటి సమాజం మరోలా ఉంది. రాజకీయ వేత్తలు, వ్యాపారవేత్తలు, అధికారులు, డాక్టర్లు, లాయర్లు... వీరిలో తెలుగు పుస్తకాలు చదివేవారు ఎందరు? తెలుగు టీచర్లు, లెక్చరర్లు తెలుగు సాహిత్య సభలతో తమకు సంబంధమే లేనట్టుగా ఉండటం మనకే చెల్లింది. ఘనత వహించిన ఈ పౌరసమాజం నేడు గుర్తు పడుతున్నది! పట్టగలుగుతున్నది ప్రవచనకారులను, ఒకటీ అరా అవధాన పండితులను తప్ప ఆధునిక సాహిత్యకారులను కాదు... కనుక – అటు సాహిత్య సమాజం, ఇటు పౌర సమాజం పరస్పరం ఒక గీతకు చేరనంత వరకు తెలుగు సాహిత్యం ఏ గీతకూ చేరదు.

'బుక్ బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్' తెలుగు సాహిత్యానికి నేర్పిన పాఠం ఇదే!

– మహమ్మద్ ఖదీర్‌బాబు

**గ్రహం అనుగ్రహం**

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** పౌర్ణమి రా.12.43 వరకు, తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** శ్రవణం ఉ.9.01 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** ప.12.50 నుండి 2.18 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.30 నుండి 1.18 వరకు, తదుపరి ప.3.01 నుండి 3.49 వరకు, **అమృతఘడియలు:** రా.10.01 నుండి 11.32 వరకు, శ్రావణపూర్ణిమ, రాఖీ పండుగ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.46, **సూర్యాస్తమయం:** 6.21.

# కోర్ గ్రూపులకు కష్టకాలం

- సివిల్, మెకానికల్, ఈఈఈ కోర్సుల్లో తగ్గుతున్న సీట్లు... ఈ ఏడాది తగ్గినవి 6 వేలపైనే
- ఉన్న సీట్లలో చేరేవారు అరకొరే... జిల్లాల్లో ఇంజనీరింగ్ కాలేజీలకు గండం
- హైదరాబాద్ కాలేజీలకే డిమాండ్.. కంప్యూటర్ కోర్సుల్లో 76 శాతానికి పెరిగిన సీట్లు
- చదువుతూ పార్ట్ టైం ఉద్యోగానికి చాన్స్




సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్‌లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ బ్రాంచీలకు ఆదరణ కరువవుతోంది. గత నాలుగేళ్లలో ఈ గ్రూపుల్లో 10 వేల సీట్లు తగ్గిపోగా, ఈ ఏడాది (2024–25) మరో 6 వేల సీట్లు కనుమరుగయ్యాయి. డిమాండ్ లేని బ్రాంచీల్లో సీట్లు తగ్గించి, ఆదరణ ఉన్న బ్రాంచీల్లో పెంచుకునేందుకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి అనుమతించడంతో అన్ని కాలేజీలూ ఇదే బాట పడుతున్నాయి. కోర్ గ్రూపుల్లో సీట్లు తగ్గించుకుని కంప్యూటర్ కోర్సుల్లో పెంచుకుంటున్నాయి. కేవలం నాలుగేళ్లలోనే కంప్యూటర్ కోర్సుల్లో 11 వేల సీట్లు పెరిగాయి. ఈ పరిస్థితి జిల్లాల్లోని ఇంజనీరింగ్ కాలేజీల మనుగడను ప్రశ్నార్థకం చేస్తోంది. కంప్యూటర్ కోర్సుల నిర్వహణ ఆ కాలేజీలకు కష్టమవుతోంది. మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన ఫ్యాకల్టీ సమకూర్చుకోవడం కత్తిమీద సాములా మారింది. దీంతో పలు జిల్లాల్లో 2014–24 మధ్య 90కిపైగా కాలేజీలు మూతపడ్డాయి. ఒక్క వరంగల్ జిల్లాలోనే నాలుగేళ్లలో 8 కాలేజీలు కనుమరుగయ్యాయి. ఆదిలాబాద్‌లో మూడు కాలేజీలుంటే ఇప్పుడు ఒక్కటీ లేదు. నిజామాబాద్‌లో గతంలో ఆరు ఉంటే ఇప్పుడు నాలుగున్నాయి. ఎక్కువ మంది విద్యార్థులు ఇంజనీ రింగ్ విద్య కోసం రాజధానినే ఎంచుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 175 ఇంజనీరింగ్ కాలేజీలుంటే, 109 కాలేజీలు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోనే ఉన్నాయి. ఇంకా చెప్పాలంటే మేడ్చల్‌లో 45, రంగారెడ్డిలో 44, హైదరాబాద్‌లో 20 కాలేజీలున్నాయి.


### మార్చేస్తున్న పోటీ

ఇంజనీరింగ్ తర్వాత కన్పించేవన్నీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలే. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ కోర్సులు చేసినా ఉపాధి కోసం వెతుక్కోవాల్సింది ఐటీ సెక్టార్‌లోనే. దీనివల్లే విద్యార్థులు కంప్యూటర్ కోర్సుల్లో చేరేందుకే ఇష్టపడుతున్నారు. రాష్ట్రంలో ఏటా లక్ష మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు తయారవుతుండగా, 70 శాతం కంప్యూటర్ సైన్స్ నేపథ్యంతోనే వస్తున్నారు. వీరిలో కేవలం 10 శాతం మందికి కూడా స్కిల్స్ ఉద్యోగాలు దొరకట్లేదు. గ్రామీణ ప్రాంతాల్లో సీఎస్ఈ చేసినా బేసిక్ నాలెడ్జ్ కూడా ఉండటం లేదని పారిశ్రామిక వేత్తలు అంటున్నారు. ఇంజనీరింగ్‌తోపాటు ఏదో ఒక కొత్త కోర్సు నేర్చుకోవాల్సిన పరిస్థితి. మరోవైపు ఆర్థిక పరిస్థితుల కారణంగా చదువుతూనే పార్ట్‌టైం ఉద్యోగం చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఈ అవకాశాలన్నీ హైదరాబాద్‌లో ఉంటేనే సాధ్యమని విద్యార్థులు భావిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు లేకపోవడంతో ఇంటర్న్‌షిప్, ప్రాజెక్టు వర్క్ లాంటివీ సాధ్యం కావట్లేదు.

### ఆ కోర్సుల జాడెక్కడ?

గత ఐదేళ్లల్లో సివిల్, మెకానికల్, ఈఈఈ వంటి కోర్ గ్రూపుల్లో ప్రవేశాలు భారీగా తగ్గాయి. ఈ బ్రాంచీల్లో సీట్లను కాలేజీలు తగ్గిస్తున్నాయి. 2020 సంవత్సరంలో ఈ గ్రూపుల్లో కన్వీనర్ కోటా కింద 40,355 సీట్లుంటే, 2024 నాటికి ఇవి 30,900కు పడిపోయాయి. ఉన్న సీట్లలోనూ ప్రవేశాలు 50 శాతం మించడం లేదు. కానీ సీఎస్ఈ, ఐటీ సహా కంప్యూటర్ బ్రాంచీల్లో చేరేందుకు విద్యార్థులు పోటీ పడుతున్నారు. కాలేజీలు కూడా ఈ గ్రూపుల్లో సీట్లు పెంచుకునేందుకు బారులు తీరుతున్నాయి. 2020లో కంప్యూటర్ బ్రాంచీల్లో 58,633 సీట్లుంటే, 2024 నాటికి 67,248 సీట్లయ్యాయి. 65.13 శాతం నుంచి 76.46 శాతం సీట్లు ఈ గ్రూపుల్లో పెరిగాయి. ఇతర కోర్ గ్రూపుల్లో మాత్రం 2020–24 మధ్య 37.87 శాతం ఉన్న సీట్లు 23.54 శాతానికి పడిపోయాయి.

కోర్, ఎమర్జింగ్ గ్రూపుల్లో కన్వీనర్ కోటా సీట్లు.. చేరిన విద్యార్థులు




(గమనిక: కోర్ బ్రాంచీలంటే సివిల్, మెకానికల్, ఈఈఈ ఇతర నాన్-కంప్యూటర్ కోర్సులు. ఎమర్జింగ్ అంటే సీఎస్‌సీ, ఐటీ ఇతర అనుబంధ కంప్యూటర్ కోర్సులు. 2024-25లో విద్యార్థుల చేరికలు ఇంకా పూర్తిస్థాయిలో కాలేదు.)

---

## పాలకాయతిప్ప బీచ్‌లో ఆరుగురు గల్లంతు

- ఒకరు మృతి, మరొకరి కోసం గాలింపు
- నలుగురిని కాపాడిన మెరైన్ పోలీసులు, పర్యాటకులు

కోడూరు(అవనిగడ్డ): కుటుంబసభ్యులతో కలిసి సరదాగా గడిపేందుకు బీచ్ వద్దకు వచ్చిన ఓ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. అలల ఉధృతికి ఆరుగురు సముద్రంలోకి కొట్టుకుపోయారు. నలుగురిని స్థానికులు రక్షించగా.. ఒకరు మృతి చెంది ఒడ్డుకు కొట్టుకొచ్చారు. మరొక వ్యక్తి కోసం గాలిస్తున్నారు. వివరాల్లోకి వెళితే... కృష్ణాజిల్లా గుడివాడకు చెందిన 16 మంది ముస్లిం కుటుంబసభ్యులు విహార యాత్రగా ఆదివారం కృష్ణాజిల్లా పాలకాయతిప్ప బీచ్ వద్దకు వచ్చారు. వారిలో 12 మంది స్నానాలు చేసేందుకు సముద్రంలో దిగగా, మిలిగిన వారు ఒడ్డున సరదాగా ఫొటోలు దిగుతూ సందడి చేస్తున్నారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో రెండు పెద్ద అలలు ఒకేసారి రావడంతో షేక్ అసినా కౌసర్, షేక్ అఫ్రిన్, షేక్ కరీం, అబ్దుర్ కరీం, షేక్ ఫజలా(26), ముషారఫ్(18) సముద్రంలోకి కొట్టుకుపో యారు. షేక్ అసినా కౌసర్, షేక్ అఫ్రిన్, షేక్ కరీం, అబ్దుర్ కరీంను అక్కడే ఉన్న పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు, తోటి పర్యాటకులు కాపాడి ఒడ్డుకు చేర్చారు. సముద్రంలో కొట్టుకుపోయిన షేక్ ఫజలా(26) సముద్రం నీరు తాగి పైకి తేలడంతో ఒడ్డుకు చేర్చారు. అనంతరం అవనిగడ్డ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ముషారఫ్(18) మాత్రం సముద్రంలో గల్లంతయ్యాడు. ఘటనాస్థలాన్ని అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ పరిశీలించారు. గల్లంతైన యువకుడు ముషారఫ్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ప్రాణాలతో బయటపడిన నలుగురు అవనిగడ్డ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొంది డిశ్చార్జి అయ్యారు.

## ఎరువులు చల్లుతుండగా అస్వస్థత

- ఆస్పత్రిలో చేరిన 9 మంది కూలీలు



కూలీలకు కల్లూరు ఆస్పత్రిలో చికిత్స చేస్తున్న వైద్యులు

తల్లాడ: ఓ రైతు పొలంలో రసాయనిక ఎరువులు చల్లుతూ తొమ్మిది మంది కూలీలు అస్వస్థతకు గురయ్యారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం నూతనకల్‌లో ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. నూతనకల్‌కు చెందిన కూలీలు అన్నారుగూడెం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు వరి పొలంలో మందు చల్లేందుకు వెళ్లారు. గుళికలు, డీఏపీ, యూరి యా కలిపి చల్లుతుండగా కొన్ని గంటల్లోనే అస్వస్థులయ్యారు. కూలీలు కాంపాటి పాపా రావు, కిన్నెర కృష్ణ, కర్లకంటి శ్రీను, కొమ్మన బోయిన భద్రయ్య, పెద్ద బోయిన పవన్ కల్యా ణ్, తేళ్లపుట్ల లక్ష్మణ్, పమ్మి గోపాలకృష్ణ, గడగొ ట్టి భద్రాజీ, కె.వేణుగోపాల్‌కు ఒక్కసారిగా వాంతులు, కళ్లు తిరగడం, మెడ, ఒళ్లు నొప్పు లతో అస్వస్థులయ్యారు. వెంటనే 108 వాహ నంలో కొందరిని, ఆటోలో మరికొందరిని కల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలియగానే సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి వైద్యులకు ఫోన్ చేసి ఆరా తీశారు. ప్రస్తుతం కూలీలకు ఎలాంటి ప్రాణా పాయం లేదని వైద్యులు రమేశ్, శ్రీ విద్య, శ్రీ జన్య, గోపి తెలిపారు.

# ‘ఫ్యూచర్ సిటీ’లో పెట్టుబడులు పెట్టండి

**అభివృద్ధిలో రాజులంతా భాగస్వాములు కండి**

- క్షత్రియ సమితి ఆత్మీయ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- రాజులు ఆరంభించిన నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తాం
- హైదరాబాద్‌లో క్షత్రియ భవన్‌కు స్థలం కేటాయిస్తాం
- క్షత్రియులకు మొదట పార్టీ పదవులు.. తర్వాత టికెట్లు ఇస్తామని హామీ



సీఎం రేవంత్‌రెడ్డిని సత్కరిస్తున్న క్షత్రియ సేవా సమితి ప్రతినిధులు. చిత్రంలో కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, కర్ణాటక మంత్రి బోసురాజు

గచ్చిబౌలి: తెలంగాణ అభివృద్ధిలో క్షత్రియులు భాగస్వామ్యం కావాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించే ‘ఫ్యూచర్‌సిటీ’లో పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ మూడు నగరాలుగా ఉందని.. కొత్తగా అత్యాధునిక మౌలిక వసతులతో ఫ్యూచర్‌సిటీ నిర్మించనున్నామని తెలిపారు. ఆదివారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో క్షత్రియ సేవాసమితి (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) ఆత్మీయ సమావేశం జరిగింది. ఇందులో రేవంత్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్ శివార్లలో 1960లోనే చిన్న గ్రామంగా ఉండే కొంపల్లి ప్రాంతానికి క్షత్రియులు వలస వచ్చి, పెట్టుబడులు పెట్టి ఎన్నో వ్యాపారాలు చేస్తున్నారని సీఎం పేర్కొన్నారు. ఫార్మా, వైద్య, విద్య, మీడియా రంగాల్లో రాజులు పెట్టుబడులు పెట్టి విజయం సాధించారన్నారు. సినీ రంగంలో కృష్ణంరాజు పేరు ప్రస్తావించకుండా ఉండలేమని, బాహుబలి ప్రభాస్ కఠోర శ్రమ, పట్టుదలతో ఎంతో గర్వించే స్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. అదేవిధంగా రాంగోపాల్‌వర్మ ఎంతో ఎదిగారని చెప్పారు.

### నిజాం షుగర్ ఫ్యాక్టరీకి జీవం పోస్తాం

తెలుగు రాష్ట్రాలలో ఎంతో పేరున్న నిజాం షుగర్ ఫ్యాక్టరీని రాజులే ప్రారంభించారని సీఎం గుర్తు చేశారు. ఆ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత, విద్యార్థులకు ఉన్నత విద్య, నైపుణ్య శిక్షణ ఇవ్వడానికే ‘యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ’ ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ నూతన విధానానికి అన్ని వర్గాల నుంచి సంపూర్ణ మద్దతు వస్తోందన్నారు.

### క్షత్రియ భవన్‌కు స్థలం ఇస్తాం

హైదరాబాద్‌లో క్షత్రియ భవన్ నిర్మాణం కోసం అవసరమైన స్థలాన్ని కేటాయిస్తామని సీఎం రేవంత్ ప్రకటించారు. అందులో రాజుల దర్పం కనిపించేలా దివ్యమైన భవన నిర్మాణ బాధ్యత క్షత్రియ సమితి తీసుకోవాలన్నారు. క్షత్రియులకు అండగా ఉంటామని, రాజకీయంగా ఎదిగేలా ముందు పార్టీ లో పదవులు ఇచ్చి, అనంతరం పార్టీ టికెట్లు ఇస్తామని చెప్పా రు. పార్టీలో చేరితే నాలుగేళ్లలో నాయకులుగా మార్చి, తర్వా త ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యేలా ప్రోత్సహిస్తామన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బోసురాజు క్రియాశీల పాత్ర పోషించారని ప్రశంసించారు.

**తెలంగాణ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి: శ్రీనివాస వర్మ**

రాష్ట్ర విభజన సమయంలో తన్ని తరిమేస్తామన్నా ఎక్కడికీ వెళ్లబోమని క్షత్రియులు చెప్పారని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. గోదావరి, వైజా గ్, చిత్తూరు జిల్లాల క్షత్రియులు అక్కడి పొలాలను అమ్ము కుని వచ్చి.. ఇక్కడ భూములు కొన్నారని, పరిశ్రమలు నెలకొల్పారని గుర్తు చేశారు. కష్టాన్ని నమ్ముకున్న క్షత్రియులు తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. హైదరాబాద్ క్షత్రియుల కర్మ భూమి అని.. ఇక్కడికి వచ్చిన క్షత్రియులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగారని కర్ణాటక మంత్రి నడింపల్లి బోసురాజు చెప్పారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి అభివృద్ధిలో సహకారం అందించాలని క్షత్రియులకు పిలుపునిచ్చారు. కాగా.. క్షత్రియులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని, క్షత్రియభవన్‌కు స్థలం ఇవ్వాలని, పేద క్షత్రియులకు రేషన్‌కార్డులు, పెన్షన్లు ఇవ్వాలని సీఎం రేవంత్‌ను క్షత్రియ సేవా సమితి అధ్యక్షుడు పెరిచెర్ల నాగరాజు విజ్ఞప్తి చేశారు.

## గురుకుల అభ్యర్థుల వినూత్న నిరసన


- మెరిట్ ఆధారంగా నియామకాలు చేపట్టాలని సీఎం ఇంటి వద్ద ఫ్లెక్సీల ప్రదర్శన




సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి వద్ద ఫ్లెక్సీతో గురుకుల అభ్యర్థులు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటి దగ్గర గురుకుల అభ్యర్థులు వినూత్నరీతిలో నిరసన తెలిపారు. రాఖీ పండుగ సందర్భంగా రేవంతన్నకు శుభాకాంక్షలు అంటూ ఫ్లెక్సీలు ప్రదర్శించారు. మెరిట్ ఆధారంగా నియామకాలు జరపాలని విన్నవించారు. గురుకుల నియామకాల్లో పోస్టులు మిగిలిపోకుండా నెక్స్ట్ మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేసేలా ఉండాలన్నారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించి తమకు న్యాయం చేయాలని కోరారు. మూడు నెలలుగా గురుకుల అభ్యర్థులు ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. ఆదివారం గురుకుల నెక్స్ట్ మెరిట్ అభ్యర్థులు జి.నాగలక్ష్మి, బి.లలిత, కె.పరమేశ్వరి, శైలజ, రమణి తదితరులు మాట్లాడుతూ.. గురుకుల బోర్డు చేపట్టిన నియామకాల్లో (9,210 పోస్టులు) డిసెండింగ్ ఆర్డర్ పాటించకపోవడం వల్ల, వివిధ నోటిఫికేషన్లకు సంబంధించి పోస్టుల కేడర్ వేరైనప్పటికీ కొన్ని పేపర్లు ఉమ్మడిగా నిర్వహించడం వల్ల చాలా మంది అభ్యర్థులకు ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలు వచ్చాయన్నారు. ప్రస్తుతం ఒక ఉద్యోగం కంటే ఎక్కువ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు వాళ్లకు నచ్చినటువంటి ఒక ఉద్యోగంలోనే చేరారన్నారు. వారు వదిలేసిన లేదా చేరకపోవడం వల్ల సుమారు 2,500 పోస్టులు భర్తీ కాకుండా మిగిలిపోయే పరిస్థితి ఏర్పడిందని వివరించారు. ఇలా భర్తీ కాకుండా మిగిలిపోతున్న పోస్టులను తదుపరి మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## సాగర్ రెండు గేట్ల ద్వారా కృష్ణమ్మ పరుగులు



నాగార్జునసాగర్: సాగర్ వద్ద కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా దిగువ కృష్ణానదిలోకి 24,920 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రధాన విద్యుదుత్పత్తి కేంద్రం ద్వారా మరో 29,110 క్యూసెక్కులు కలిపి నదిలోకి మొత్తం 54,030 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఇందులో కుడికాల్వకు 8,067 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 6,791 క్యూసెక్కులు, ఏఎమ్మార్పీకి 1,800, వరద కాల్వకు 600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

## సుంకిశాలను పరిశీలించిన విజిలెన్స్ బృందం



ఇన్‌టేక్‌వెల్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న విజిలెన్స్ బృందం

పెద్దవూర: నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం పాల్తీతండా సమీపంలోని సుంకిశాల గుట్ట వద్ద నిర్మిస్తున్న భారీ ఇన్‌టేక్ వెల్ పంపింగ్ స్టేషన్ (సుంకిశాల పథకం) ప్రాజెక్టు రిటైనింగ్ వాల్ కూలిన ప్రదేశాన్ని ఆదివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం పరిశీలించింది. నాగార్జునసాగర్ జలాశయంలోకి ఒక్కసారిగా నీరు పోటెత్తడం, పంప్‌హౌజ్ రెండో సొరంగ మార్గం నుంచి ప్రవాహం ఉధృతంగా రావడంతో సొరంగం ముందు భాగంలో నిర్మాణంలో ఉన్న గేటుతో పాటు నీరు రాకుండా రక్షణగా నిర్మించిన కాంక్రీట్ రిటైనింగ్ వాల్ ఈ నెల 2వ తేదీన ఒక్కసారిగా కుప్పకూలిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో విజిలెన్స్ బృందం ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీతోపాటు ప్రాజెక్టును నిర్మిస్తున్న హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ ఇంజనీర్లతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను ఈ బృందం అధికారులు తెలుసుకున్నారు. సుమారు గంటన్నరకుపైగా ఇన్‌టేక్ వెల్ చుట్టూ తిరిగి క్షుణ్ణంగా పరిశీలించారు. రిటైనింగ్ వాల్‌కు అమర్చిన గేటు మందం ఎంత ఉందో టేపుతో కొలిచారు. ఈ సందర్భంగా అధికారులు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విచారణను చేపట్టామని తెలిపారు. ఘటన ఎలా జరిగిందన్న విషయంలో పూర్తి విచారణ అనంతరం నివేదికను రూపొందించి ప్రభుత్వానికి అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీలు డి.ఆనంద్‌కుమార్, జి.మధుసూదన్‌రావు, ఇంజనీరింగ్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ జి.ప్రసాద్, వాటర్‌బోర్డ్ ప్రాజెక్టు డైరెక్టర్ రవికుమార్, సీజీఎం శ్రీధర్, జీఎం మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## చిక్కిన 1,500 కిలోల టేకు చేప



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం పల్లిపాలెంలో వేటకు వెళ్లిన మత్స్యకారులకు 1,500 కిలోల టేకు చేప ఆదివారం చిక్కింది. పశ్చిమ గోదావరి జిల్లా వేములదీవికి చెందిన బి.వెంకటేశ్వర్లు బోటుపై వెళ్లిన కాకినాడ మత్స్యకారులు అంతర్వేది సముద్రతీరం నుంచి జేసీబీ సాయంతో ఫిషింగ్ హార్బర్‌కు తీసుకువచ్చారు. కాకినాడ కుంభాభిషేకం రేవులో విక్రయించేందుకు తీసుకెళ్లారు. –సఖినేటిపల్లి

## గొంతు కోసుకున్న మున్సిపల్ కౌన్సిలర్

- మంచిర్యాల ఏసీపీ కార్యాలయంలో ఘటన
- అట్రాసిటీ కేసులో విచారణకు పిలిచిన ఏసీపీ ప్రకాశ్
- ఏసీపీ, ఎస్సై వేధించారని బాధితుడి ఆరోపణ



ఆసుపత్రిలో సత్యనారాయణతో మాట్లాడుతున్న ఏసీపీ ప్రకాశ్

మంచిర్యాల క్రైం: మంచిర్యాల ఏసీపీ కార్యాలయంలో నస్పూర్ మున్సిపల్ కౌన్సిలర్ బేర సత్యనారాయణ ఆత్మహత్యాయత్నం చేశాడు. కేక్ కట్‌చేసే ప్లాస్టిక్ కత్తితో ఆయన గొంతు కోసుకున్నాడు. బాధితుడు, అతని కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నస్పూర్ మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీశ్ తనను సత్యనారాయణ కులం పేరుతో దూషించి విధులకు ఆటంకం కలిగించాడని సీసీసీ పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 16న ఫిర్యాదు చేశాడు. దీంతో సత్యనారాయణపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేశారు. విచారణ నిమిత్తం సత్యనారాయణను ఏసీపీ పలుమార్లు విచారణకు పిలిచినా.. ఆయన హాజరుకాలేదు. దీంతో సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా ట్రేస్ చేసి హైదరాబాద్‌లో ఉన్న సత్యనారాయణను ఆదివారం విచారణ నిమిత్తం ఏసీపీ కార్యాలయానికి తీసుకొచ్చారు. వాహనంలో వస్తుండగా ఎస్సై సుగుణాకర్ తనను దుర్భాషలాడి పిడిగుద్దులు కురిపించారని సత్యనారాయణ ఆరోపించారు. ఏసీపీ కార్యాలయానికి రాగానే అప్పటికే అక్కడ విలేకరులు ఉండటాన్ని గమనించిన సత్యనారాయణ తన కోసమే మీడియాను పిలిపించారనుకొని పక్క గదిలో కేక్ కట్ చేసే ప్లాస్టిక్ కత్తితో గొంతు కోసుకున్నాడు. వెంటనే పోలీసులు ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సలహా మేరకు హైదరాబాద్‌కు తరలించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

**కాలువ కబ్జా విషయమై...**

నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 14లో సత్యనారాయణ వెంచర్ ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో పక్కనే ఉన్న డ్రైనేజీని పూడ్చివేశాడు. దీంతో స్థానికులు మున్సిపల్ కమిషనర్ సతీశ్‌కు ఫిర్యాదు చేయగా, కమిషనర్ పరిశీలించి కాలువను పునరుద్ధరించారు. తర్వాత సత్యనారాయణ మళ్లీ పూడ్చివేయించాడు. దీంతో ఈనెల 16న పరిశీలన నిమిత్తం అక్కడికెళ్లిన కమిషనర్‌తో సత్యనారాయణ, బత్తుల శ్రీహరి, బత్తుల శ్రీనివాస్‌లు వాగ్వాదానికి దిగారు. దీంతో ఆ ముగ్గురు కులం పేరుతో తనను దూషించి విధులకు ఆటంకం కలిగించారని కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలాఉంటే.. సత్యనారాయణ ఆరోజు వెంచర్ వద్దకు వెళ్లలేదని అతని భార్య శైలజారెడ్డి, కూతురు మౌనిక తెలిపారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ప్రోద్బలంతో మున్సిపల్ కమిషనర్, ఏసీపీ, ఎస్సై కేసు నమోదుచేశారని ఆరోపించారు. కాగా, సత్యనారాయణ తనపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని ఏసీపీ ప్రకాశ్ తెలిపారు. సత్యనారాయణపై ఇప్పటికే 10 కేసులు ఉన్నాయన్నారు.

# హైదరాబాద్‌లో పాపన్న విగ్రహం ఏర్పాటు చేస్తాం

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- పర్యాటక కేంద్రంగా పాపన్న స్వగ్రామం అభివృద్ధి
- బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పాపన్న జయంతి వేడుకలు



పాపన్న జయంతి వేడుకలో భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, మహేశ్‌కుమార్ గౌడ్, జాజుల, నేరెళ్ల శారద తదితరులు

సాక్షి, హైదరాబాద్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జీవితం నేటి తరానికి స్ఫూర్తి దాయకంగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం రవీంద్ర భారతిలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన సర్దార్ పాపన్నగౌడ్ మహారాజ్ 374వ జయంతి వేడుకలలో భట్టి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పాపన్నగౌడ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు. సర్దార్ పాపన్న ఆనాడే సామాజికంగా వెనుకబడిన వారిని కలుపుకొని రాజ్యాధికారం కోసం అడుగులు ముందుకు వేశారన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు సమాజంలో సమానత్వం లభించేలా పోరాడారన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న స్వగ్రామం సర్వాయిపేటను అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని, అందుకోసం రూ.4.7 కోట్ల నిధులు మంజూరు చేశామని వెల్లడించారు. పాపన్న సేవలకు గుర్తుగా హైదరాబాద్ నడిబొడ్డులో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. అలాగే అయన జీవిత చరిత్రపై బుక్‌లెట్‌ను ప్రచురించనున్నట్లు భట్టి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, హస్తకళా కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ గౌడ్, బీసీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, బీసీనేత జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### సర్వాయి పాపన్న జీవితం నేటి తరానికి ఆదర్శం

రాజ్యాధికారం కోసం బడుగులను ఐక్యం చేసి, ప్రత్యేక సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని గోల్కొండ కోటను జయించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం పాపన్న గౌడ్ 374వ జయంతి వేడుకలు టీపీసీసీ కల్లుగీత విభాగం ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో ఘనంగా జరిగాయి. మంత్రి పొన్నంతో పాటు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, కల్లుగీత విభాగం అధ్యక్షుడు నాగరాజు గౌడ్ తదితరులు పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ పాపన్నగౌడ్ జీవితం గురించి నేటి తరాలు తెలుసుకోవాలని, ఆయన బాటలో నడవాలని కోరారు. పాపన్న స్వగ్రామానికి నిధులు మంజూరు చేయడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. నిధుల విడుదలకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావులకు ఆదివారం ఆయన ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

## విస్మరిస్తే చంపెయ్యాలి: ధన్‌ఖడ్

జైపూర్: దేశం కంటే వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారిని చంపేయాలని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు. దేశ ప్రయోజనాలను పరమోన్నతంగా భావించని వారు వెల్లడించే అభిప్రాయం దేశ వ్యతిరేకంగానే ఉంటుందని పేర్కొన్నారు. దేశం ముందుకు సాగాలంటే ఇటువంటి వారిని అడ్డుకోవాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. అయినా వారు జాతి అభివృద్ధికి హానికరమైన తమ చర్యలను కొనసాగిస్తున్న పక్షంలో చంపేయాలని ప్రతి ఒక్కరినీ కోరుతున్నానన్నారు. విభిన్న అభిప్రాయాలను కలిగి ఉండటం ప్రజాస్వామ్యమనే పుష్పగుచ్ఛంలో పరిమళాలన్న ఉపరాష్ట్రపతి.. వ్యక్తిగత, రాజకీయ లాభం కంటే జాతి ప్రయోజనాలను మిన్నగా చూసుకునే వారికే ఇది వర్తిస్తుందన్నారు. మన గుర్తింపు భారతీయత, మన జాతీయ ప్రయోజనాలను కాపాడుకునే విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడరాదన్నారు. ఆదివారం జైపూర్‌లో అవయవదాతలతో ఏర్పాటైన సమావేశంలో ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ మాట్లాడారు.

## నేడు కర్ణాటకలో కాంగ్రెస్ నిరసనలు

బెంగళూరు: మైసూరులో భూకేటాయింపుల వివాదంలో కర్ణాటక కాంగ్రెస్ అగ్రనేత, ముఖ్యమంత్రి సిద్దరామయ్యను విచారించేందుకు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోత్ అనుమతించడాన్ని నిరసిస్తూ నేడు రాష్ట్ర కాంగ్రెస్ ఆందోళన చేపట్టనుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో భారీ ఎత్తున పార్టీ కార్యకర్తలు నిరసన ర్యాలీలు నిర్వహిస్తారని రాష్ట్ర కాంగ్రెస్ నేత, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆదివారం ప్రకటించారు. '' ఏం లేకున్నా గవర్నర్ దీన్నొక కేసులా మార్చారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. ఈ ఉదంతంపై కాంగ్రెస్ నిరసన బాటలో పయనిస్తుంది. తాలూకా, జిల్లా స్థాయి ప్రభుత్వ కార్యాలయాలకు కార్యకర్తలు పాదయాత్రగా వెళ్లి గవర్నర్ నిర్ణయాన్ని తప్పుబడుతూ రాష్ట్రపతిని ఉద్దేశిస్తూ మెమొరాండం అందజేస్తారు'' అని నిరసన కార్యక్రమ వివరాలను డీకే వివరించారు.

**22న సీఎల్పీ భేటీ**

గవర్నర్ నిర్ణయాన్ని ఐకమత్యంతో తీవ్రంగా ప్రతిఘటిస్తున్నామని చాటేందుకు 22వ తేదీన సీఎల్పీ భేటీని నిర్వహించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ఐటీ, బయోటెక్నాలజీ మంత్రి ప్రియాంక్ ఖర్గే చెప్పారు. '' ముడా భూకేటాయింపుల అంశంపై ఈ భేటీలో చర్చిస్తారు. చట్టబద్ధంగా ఈ కేసును ఎలా ఎదుర్కోబోతున్నామో ఆయన వివరిస్తారు'' అని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

**వాదించనున్న సింఘ్వీ, సిబల్ !**

మైసూరు భూకేటాయింపుల కేసులో ప్రజా ప్రతినిధుల కోర్టులో సీఎం సిద్దరామయ్య తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, కపిల్ సిబల్ వాదించే అవకాశముంది. ఈ మేరకు వీరిద్దరూ నేడు బెంగళూరుకు వస్తున్నట్లు సీఎం కార్యాలయం తెలిపింది.

# భిన్న ధ్రువాలు.. విభిన్న వైఖరులు





**అగ్రరాజ్యం. అమెరికా ప్రపంచ పెద్దన్నగా కొనసాగాలంటే అధ్యక్షపీఠంపై ఆసీనులై పరిపాలించే నేత తీసుకునే నిర్ణయాలు తిరుగులేనివై ఉండాలి. దేశ అంతర్గత భద్రత, ప్రజా సంక్షేమం, అభివృద్ధి, ధరలుసహా యుద్ధాలు, వాతావరణ మార్పు వంటి అంతర్జాతీయ అంశాలపై పట్టుండాలి. అంతర్యుద్ధాలు, సంక్షోభాలు, అంతర్జాతీయ సమస్యలపై మిత్ర దేశాలతోపాటు శత్రుదేశాలనూ ఒప్పించగల నేర్పు తప్పనిసరి. నవంబర్‌లో జరగబోయే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీపడుతున్న డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్, రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌లు తాము గెలిస్తే ఎలాంటి పాలన అందిస్తారన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. గత నాలుగేళ్లుగా జో బైడెన్ అమలుచేసిన అభివృద్ధి పథకాలను కొనసాగిస్తానని హారిస్ చెబుతుండగా అక్రమ వలసలను నిలువరించి బహిష్కరణ పర్వానికి తెరలేపుతానని, విప్లవాత్మక విధానాలను అమలుచేస్తానని ట్రంప్ భీష్మ ప్రతిజ్ఞచేశారు. "అధ్యక్షురాలిగా గెలవగానే శ్రామిక కుటుంబాల కోసం పాటుపడతా. కనీస వేతనాన్ని పెంచుతా. సేవలు, ఆతిథ్యరంగంలోని సిబ్బందికి అందే టిప్పులపై వసూలుచేస్తున్న పన్నులను రద్దుచేస్తా' అని హారిస్ అన్నారు. జూన్‌లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ సైతం ఇదే హామీ ఇవ్వడం విశేషం. ఈ నేపథ్యంలో పలు కీలక అంశాలపై ఇప్పటికే ట్రంప్, హారిస్ వెల్లడించిన అభిప్రాయాలు వారి పాలనాపంథాపై స్పష్టత తీసుకొస్తున్నాయి. వాటిని ఒకసారి తరచి చూస్తే..**

### అబార్షన్

హారిస్: సురక్షితమైన, చట్టబద్ధమైన అబార్షన్‌కు కమలా హారిస్ మద్దతు పలుకుతున్నారు. రిపబ్లిక్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అబార్షన్లపై నిషేధం విధించడాన్ని ఆమె ఇప్పటికే పలుమార్లు తప్పుబట్టారు. తాము అధికారంలోకి వస్తే చట్టబద్ధ అబార్షన్‌కు అనుమతిస్తూ పార్లమెంట్‌లో చట్టం తెచ్చేందుకు కృషిచేస్తానని చెప్పారు.

ట్రంప్: కొన్ని రాష్ట్రాల్లో అబార్షన్‌పై నిషేధం అమలవుతుండగా కొన్ని రాష్ట్రాల్లో షరతుల మేరకు అనుమతిస్తున్నారు. దీంతో అబార్షన్‌పై ఎప్పుడు ప్రశ్నించినా ట్రంప్ సమాధానం దాటవేశారు. అబార్షన్‌పై జాతీయస్థాయి విధానాన్ని ప్రకటించలేదు. రాష్ట్రాలకే ఆ నిర్ణయం వదిలేస్తే మంచిది అన్నట్లు గతంలో వ్యాఖ్యానించారు.

### వాతావరణ మార్పులు/ఇంధనం

హారిస్: అమెరికాలో కర్బన ఉద్గారాల విడుదల తగ్గిస్తానని ఉపాధ్యక్షురాలి హోదాలో హారిస్ గతంలో చెప్పారు. హరిత ఇంధనానికి జై కొట్టారు. సముద్రగర్భంలో చమురు వెలికితీతను వ్యతిరేకించారు. విద్యుత్ వినియోగం ఆదాతోపాటు పర్యావరణ అనుకూల పథకాలను ప్రోత్సహించారు.

ట్రంప్: వాతావరణ మార్పుల అంశాన్ని గాలి కొదిలేశారు. పారిస్ ఒప్పందం నుంచి వైదొలిగారు. ప్రభుత్వ భూముల్లో విచ్చలవిడిగా చమురు తవ్వకాలకు పచ్చజెండా ఊపారు. బైడెన్ ప్రభుత్వం వచ్చాక పారిస్ ఒప్పందంలో అమెరికా చేరింది. అయితే ఈసారి తాను గెలిస్తే పారిస్ ఒప్పందానికి మళ్లీ కటీఫ్ చేప్తానని ట్రంప్ అన్నారు.

### ప్రభుత్వపాలన

హారిస్: ప్రభుత్వ ఉద్యోగులను హఠాత్తుగా తొలగించే వివాదాస్పద 'ప్రాజెక్ట్ 2025' సిద్ధాంతాన్ని హారిస్ పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులను సులభంగా తీసేసేందుకు వీలు కల్పించేలా 2020లో ట్రంప్ ఇచ్చిన షెడ్యూల్-ఎఫ్ ఉత్తర్వును హారిస్ వ్యతిరేస్తున్నారు. సిబ్బంది ఉద్యోగ భద్రతకు పాటుపడతానని ఆమె మాటిచ్చారు. అక్రమ వలసలను తగ్గిస్తానని చెప్పారు. ఆహార ఉత్పత్తుల ధరను తగ్గిస్తానని హామీ ఇచ్చారు. కార్మికుల టిప్‌లపై పన్నును తొలగిస్తానన్నారు. కార్మికుల కనీస వేతనం పెంచుతానని, పౌరులు కొనే అధునాతన ఆయుధాలపై నిషేధం విధిస్తానని చెప్పారు.

ట్రంప్: తన హయాంలో అమలు చేయాలని ప్రయత్నించిన 'ప్రాజెక్ట్ 2025' సిద్ధాంతం గురించి ట్రంప్ ఎక్కడా మాట్లాడట్లేదు. అయితే అధ్యక్ష కేంద్రంగా కేంద్రీకృత ప్రభుత్వానికి బాటలువేసే ఈ సిద్ధాంతాన్ని తాను గెలిస్తే అమలుచేయాలని ట్రంప్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. తనపై పలు కేసులకు కారకులైన న్యాయశాఖ సిబ్బందిపై వేటు వేయడానికి ట్రంప్ సిద్ధంగా ఉన్నాడని వార్తలొచ్చాయి. విద్యాశాఖను రద్దుచేస్తానని, ఫెడరల్ కమ్యూనికేషన్స్ కమిషన్ వంటి సంస్థలను ప్రక్షాళిస్తానని చెప్పారు.

### చట్టాల అమలు/ప్రజాస్వామ్యం

హారిస్: హారిస్ గెలిస్తే ట్రంప్‌పై కేసులపై దృష్టిపెట్టే అవకాశముంది. గత అధ్యక్ష ఫలితాలను తప్పుబడుతూ, పార్లమెంట్ భవంతి మీదకు రిపబ్లికన్ పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులను ట్రంప్ ఉసిగొల్పడం, నీలితారకు అనైతిక నగదు చెల్లింపులు, ఆస్తిగా ఎక్కువగా చూపు రుణాల పొందటం వంటి కేసుల్లో తీర్పులు త్వరగా వచ్చేలా హారిస్ ఒత్తిడి తేవచ్చు. ప్రజాస్వామ్యయుత పాలనకు కట్టుబడతానని హారిస్ గతంలో అన్నారు.

ట్రంప్: బైడెన్ చేతిలో ఓడినపుడు అధ్యక్ష ఫలితాలను ట్రంప్ అంగీకరించలేదు. ఈసారి కూడా ఓడిపోతే ఓటమిని ట్రంప్ ఒప్పుకోకపోవచ్చు. నాటి పార్లమెంట్‌పై దాడి, అక్కడి పోలీసులను గాయపరిచిన నిందితులకు క్షమాభిక్ష పెడతానని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఎఫ్‌బీఐను ప్రక్షాళిస్తానని చెప్పారు. బైడెన్ పాలనలో అవినీతిపై ప్రత్యేక ప్రాసిక్యూటర్‌తో విచారణ జరిపిస్తానని హామీ ఇచ్చారు.

### ఇజ్రాయెల్/ ఉక్రెయిన్ యుద్ధాలు

హారిస్: గాజా స్ట్రిప్‌లో హమాస్‌పై ఇజ్రాయెల్ దాడులను సమర్థిస్తూనే పాలస్తీనియన్ల ప్రాణాలూ ముఖ్యమేనని హారిస్ చెప్పారు. త్వరగా యుద్ధాన్ని ముగించాలని ఇటీవల ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూను కోరారు. కాల్పుల విరమణ ఒప్పందానికి, సంధికి మొగ్గుచూపారు. ఈజిప్ట్, ఖతార్‌లతో కలసి మధ్యవర్తిత్వానికి ఓటేశారు. ఈమె గెలిస్తే గాజా యుద్ధం త్వరగా ముగిసే వీలుంది. ఉక్రెయిన్ యుద్ధంపై ఆమె ఇంకా ఎలాంటి స్పష్టమైన విధానాలు ప్రకటించలేదు.

ట్రంప్: హమాస్ అంతమయ్యేదాకా ఇజ్రాయెల్‌కు మద్దతు పలుకుతానని ట్రంప్ గతంలో అన్నారు. అయితే మరింత మారణహోమం జరక్కుండా త్వరగా యుద్ధం ముగించి గాజాలో శాంతి నెలకొల్పాలని ఆయన కోరుతున్నారు. జనావాసాలపై ఇజ్రాయెల్ దాడులనూ ట్రంప్ సైతం ఖండించారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని త్వరగా ముగించే సత్తా తనకుందని ట్రంప్ గతంలో అన్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

## కమలా హారిస్ కంటే నేను అందంగా కనిపిస్తా

**ప్రత్యర్థిపై వ్యక్తిగత దాడులకు దిగిన ట్రంప్**

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల పోరు నానాటికీ రసవత్తరంగా మారుతోంది. వాచాలత్వానికి మారుపేరైన రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ మరోసారి నోరుపారేసుకున్నారు. తన ప్రత్యర్థి, డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌పై వ్యక్తిగత దాడికి దిగారు. ఆమె కంటే తానే చాలా అందంగా కనిపిస్తానని చెప్పారు. కమలా హారిస్ వికారంగా ఉంటారని పరోక్షంగా విమర్శలు గుప్పించారు. శనివారం పెన్సిల్వేనియాలో రిపబ్లికన్ పార్టీ ప్రచార ర్యాలీలో ట్రంప్ ప్రసంగించారు. ఇటీవల ప్రఖ్యాత టైమ్ మేగజైన్ కవర్‌పేజీపై కమలా హారిస్ చిత్రాన్ని ముద్రించడాన్ని ప్రస్తావించారు. ఆ చిత్రాన్ని రూపొందించిన కళాకారుడు చాలా ఉదారంగా వ్యవహరించాడని అన్నారు. అంటే కమల అందంగా లేకపోయినా అందంగా ఉన్నట్లు చిత్రీకరించాడని తేల్చేశారు. నిజానికి ఆమె కంటే తానే చాలా అందంగా ఉంటానని స్పష్టంచేశారు. టైమ్ మేగజైన్ వద్ద ఉన్న కమల ఫొటోలు అంతగా ఆకట్టుకొనేలా లేకపోవడంతో నమ్మశక్యం కాని ఒక అద్భుతమైన చిత్రకారుడిని తీసుకొచ్చి ఆ చిత్రం గీయించారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ప్రత్యర్థుల భౌతికపరమైన రూపురేఖలపై ట్రంప్ విపరీత వ్యాఖ్యలు చేయడం ఇదే మొదటిసారి కాదు. గతంలోనూ నోరుజారిన ఉదంతాలు ఉన్నాయి. కమల హారిస్ ఆర్థిక విధానాలను పెన్సిల్వేనియా ర్యాలీలో ట్రంప్ తప్పుపట్టారు. అవి పనికొచ్చేలా లేవని అన్నారు. అధ్యక్ష ఎన్నికల పోటీ నుంచి తప్పుకున్న జో బైడెన్‌పై ట్రంప్ విరుచుకుపడ్డారు. తాను బైడెన్‌పై పోటీ చేసి ఓడించాలని నిర్ణయించుకున్నానని, ఆయన తప్పుకోవడంతో ఇంకెవరితోనే పోటీ చేయాల్సి వస్తోందని చెప్పారు. అసలు ఎవరీ కమలా హారిస్? అని మండిపడ్డారు.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం.. ముగ్గురు భారతీయుల మృతి

హూస్టన్: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం లాంపసాస్ కౌంటీలో బుధవారం చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో భారతీయ అమెరికన్ కుటుంబానికి చెందిన దంపతులు, వారి కుమార్తె ప్రాణాలు కోల్పోయారు. లియాండర్‌కు చెందిన అర్విండ్ మణి దంపతులు తమ కుమార్తెను డాలస్‌లోని కాలేజీలో చేర్చేందుకు కారులో వెళ్తున్నారు. మార్గమధ్యంలో కారు వెనుక టైరు పేలి అదుపు తప్పి ఎదురుగా వేరే లేన్‌పై వస్తున్న మరో కారును ఢీకొట్టింది. ఘటనలో రెండు వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఘటన తీవ్రతకు అర్విండ్ మణి(45)తోపాటు ఆయన భార్య ప్రదీప, కుమార్తె అండ్రిల్(17)తో తోపాటు మరో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు కూడా తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. అర్విండ్ కుమారుడు అదిర్యన్(14) 9వ గ్రేడ్‌లో చేరాడని, స్కూలు ప్రారంభం కావడంతో వారతడిని ఇంటి వద్దే వదిలేశారని ఆయన సోదరుడు తెలిపారు. దీంతో, అదిర్యన్ ప్రమాదం నుంచి తప్పించుకున్నాడన్నారు.

## అన్ని వ్యవస్థలను ధ్వంసం చేశారు

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వ చీఫ్ మహ్మద్ యూనుస్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎదురు లేకుండా అధికారంలో కొనసాగేందుకు దేశంలోని అన్ని వ్యవస్థలను హసీనా నాశనం చేశారన్నారు. 'న్యాయ వ్యవస్థ భ్రష్టు పట్టింది. దాదాపు 15 ఏళ్లపాటు సాగించిన దుర్మార్గపు పాలనలో ప్రజాస్వామిక హక్కులను ఆమె అణగదొక్కారు. ప్రభుత్వ ఖజానాను దోచుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు'అని ఆయన నిప్పులు చెరిగారు. హసీనా క్రూరమైన నియంతృత్వ విధానాల ఫలితంగా దేశంలో అన్నిరకాలుగా పూర్తి గందరగోళంలోకి నెట్టివేయబడిందని పేర్కొన్నారు. భద్రతా బలగాలు, మీడియాతోపాటు పౌర యంత్రాంగం, న్యాయ వ్యవస్థ, ఎన్నికల కమిషన్ వంటి కీలక విభాగాల్లో ముఖ్యమైన సంస్కరణలను తేవాలన్నది తమ ప్రధాన ఉద్దేశమన్నారు. జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయ సాధనకు చిత్తశుద్ధితో పనిచేస్తామని తెలిపారు. శాంతి నెలకొనే వరకు సాయుధ బలగాలు పౌర విభాగాలకు సాయంగా పనిచేస్తూనే ఉంటాయని స్పష్టం చేశారు. ప్రజలు, భద్రతా బలగాల సహకారంతో అతి తక్కువ సమయంలోనే సాధారణ పరిస్థితులను తీసుకువస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజలకు భద్రతను, రక్షణను కల్పించేందుకు ప్రభుత్వ కట్టుబడి ఉంటుందని ప్రకటించారు.

# సుమోటోగా స్వీకరించిన సుప్రీం

- కోల్‌కతా డాక్టర్ హత్యోదంతంపై రేపు విచారణ
- విచారణ చేపట్టనున్న చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం

న్యూఢిల్లీ: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ప్రభుత్వ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనను సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ నెల 20న ఈ కేసు విచారణ చేపట్టనుంది. ఈ మేరకు అత్యున్నత న్యాయస్థానం వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపర్చారు. దేశాన్ని కుదిపేస్తున్న వైద్యురాలి హత్య కేసులో సుప్రీంకోర్టు ధర్మాసనం ఎలాంటి ఆదేశాలు ఇస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ఘటనపై 14న సీబీఐ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు పలువురు న్యాయవాదులు సుప్రీంకోర్టు సీజేఐకు లేఖ రాశారు. డాక్టర్ హత్య ఘటనను సుమోటోగా విచారణకు స్వీకరించాలని కోరారు. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది.

**ప్రత్యేక చట్టం తీసుకురావాలి**

కోల్‌కతాలో వైద్యురాలి హత్యపై 70 మందికిపైగా పద్మ అవార్డుల గ్రహీతలైన డాక్టర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో పని చేస్తున్న వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందిపై హింసను అరికట్టడానికి, వారి తగిన భద్రత కల్పించడానికి, ఆసుపత్రుల్లో భద్రతా చర్యలను పటిష్టం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకు రావాలని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధాని మోదీకి లేఖ రాశారు. వైద్యులపై, సిబ్బందిపై దాడులకు పాల్పడేవారిని, మానసికంగా వేధించేవారిని శిక్షించడానికి ఆర్డినెన్స్ తేవాలని సూచించారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో వైద్యుల్లో భయాందోళనలు పెరిగిపోతున్నాయని, ప్రధాని మోదీ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తిచేశారు. బాధితురాలి కుటుంబానికి సంఘీభావం ప్రకటించారు. ఆ కుటుంబానికి న్యాయం చేకూర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రధాని మోదీకి లేఖ రాసినవారిలో ఐసీఎంఆర్ మాజీ డైరెక్టర్ జనరల్ బలరాం భార్గవ్, ఎయిమ్స్ రెసిడెంట్స్ డాక్టర్లు తదితరులు ఉన్నారు.

కోల్‌కతాలోని సాల్ట్‌లేక్ స్టేడియం వద్ద ఫుట్‌బాల్ అభిమానుల నిరసన



## మమతా బెనర్జీది ద్వంద్వ వైఖరి

### జూనియర్ డాక్టర్ తల్లిదండ్రుల ఆగ్రహం

కోల్‌కతా: అత్యాచారం, హత్యకు గురైన జూనియర్ డాక్టర్ తండ్రి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ న్యాయం చేయాల్సిన ముఖ్యమంత్రి ఆ పని చేయకుండా ప్రజల ఆగ్రహాన్ని చల్లార్చేందుకు నిరసన ర్యాలీల్లో పాల్గొంటున్నారని మండిపడ్డారు. తమ కుమార్తె హత్య పట్ల మమతా బెనర్జీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపించారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. మమతవైఖరిని బాధితురాలి తల్లి సైతం తప్పుపట్టారు. వైద్యుల ఉద్యమానికి కేంద్ర బిందువుగా మారిన కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ ప్రభుత్వ హాస్పిటల్ చుట్టూ పోలీసులు నిషేధాజ్ఞలు విధించారు. కాగా, హత్యకు గురైన వైద్యురాలి పేరు, గుర్తింపును బయటపెట్టడంతోపాటు ఈ ఘటనపై ప్రజల్లో వదంతులు వ్యాప్తి చేసినందుకు బీజేపీ మాజీ ఎంపీ లాకెట్ చటర్జీతోపాటు మరో ఇద్దరు డాక్టర్లు కునాల్ సర్కార్, సుబర్ణ గోస్వామికి కోల్‌కతా పోలీసులు సమన్లు జారీ చేశారు.

## బాలికపై బస్సులో సామూహిక అత్యాచారం

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో 15 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉత్తరాఖండ్ రోడ్‌వేస్‌కు చెందిన బస్సులో డెహ్రాడూన్‌లోని అంతర్రాష్ట్ర బస్ టెర్మినల్ (ఐఎస్‌బీటీ)లో ఇద్దరు డ్రైవర్లు, సహా మరో ముగ్గురు ఆగస్టు 12వ తేదీన బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. 13వ తేదీ తెల్లవారుజామున బస్ టెర్మినల్‌లోని ఓ దుకాణం వద్ద బాలికను గార్డు గుర్తించాడు. వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాడు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి ఉత్తరాఖండ్ రోడ్ వేస్ బస్సును గుర్తించారు. ఐదుగురిని అరెస్టు చేశారు. బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించారు. నేరం జరిగిన బస్సు, మరో బస్సును దర్యాప్తు కోసం ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీకి పంపించారు. మానసికంగా స్థిమితంగా లేని బాలిక సరైన సమాచారం ఇవ్వలేదు. తనది యూపీలోని మొరాదాబాద్ అని తెలిపింది. కుటుంబ సభ్యుల వివరాలను వెల్లడించింది. మొరాదాబాద్ నుంచి ఢిల్లీకి, ఢిల్లీలోని కశ్మీరీ గేట్ నుంచి బస్సులో డెహ్రాడూన్‌కు వచ్చానని, అక్కడ ఐదుగురు వ్యక్తులు తనపై ఒక్కొక్కరుగా అత్యాచారానికి పాల్పడ్డారని బాలిక చెప్పిందని డెహ్రాడూన్ ఎస్ఎస్పీ అజయ్ సింగ్ తెలిపారు. నిందితులందరినీ అరెస్టు చేసి, పోక్సో కేసు నమోదు చేశామని చెప్పారు.

## కోస్ట్ గార్డ్ డీజీ హఠాన్మరణం



సాక్షి, చెన్నై/న్యూఢిల్లీ: భారత తీర రక్షక దళం(ఐసీజీ) డైరెక్టర్ జనరల్ రాకేశ్ పాల్ హఠాన్మరణం చెందారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో జరిగిన ఐసీజీ కార్యక్రమంలో రాజ్‌నాథ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుండెపోటుకు గురైన రాకేశ్ పాల్‌ను వెంటనే చెన్నైలోని రాజీవ్ గాంధీ జనరల్ ఆస్పత్రికి తరలించారు. రాత్రి 7 గంటల సమయంలో ఆయన ఆస్పత్రిలో కన్నుమూశారని అధికార వర్గాలు తెలిపాయి. చెన్నైలోనే ఉన్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ఆస్పత్రికి వెళ్లి రాకేశ్ పాల్‌కు నివాళులర్పించారు. రాకేశ్ పాల్ పార్థివ దేహాన్ని ప్రత్యేక ఏర్పాట్లతో చెన్నై నుంచి అర్ధరాత్రి వేళ ఢిల్లీకి తరలించారు. రాకేశ్ పాల్ గతేడాది జూలై 19వ తేదీన ఐసీజీ 25వ డీజీగా బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ నావల్ ఎకాడమీ విద్యార్థి అయిన రాకేశ్ పాల్ 1989లో ఐసీజీ (ఇండియన్ కోస్ట్ గార్డ్)లో చేరి 34 ఏళ్లపాటు వివిధ హోదాల్లో పనిచేశారు.

## ఏసీ ఔట్‌డోర్ యూనిట్ మీదపడి ఒకరు మృతి

న్యూఢిల్లీ: ఏసీ ఔట్‌డోర్ యూనిట్ రెండో అంతస్తు నుంచి మీదపడటంతో ఒక యువకుడు చనిపోగా మరొకరు తీవ్రంగా గాయాలపాలయ్యారు. ఈ ఘటన సెంట్రల్ ఢిల్లీలోని దోరివలన్ ఏరియాలో శనివారం రాత్రి 7 గంటల సమయంలో చోటుచేసుకుంది. జితేశ్(18), ప్రాన్షు(17) అనే ఇద్దరు రోడ్డు పక్కన మాట్లాడుతుండగా రెండో అంతస్తు నుంచి ఏసీ ఔట్‌డోర్ యూనిట్ వారిపై పడింది. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ వెంటనే ఆస్పత్రికి తరలించారు. జితేశ్ అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రాన్షు చికిత్స పొందుతున్నాడు. అతడు ప్రస్తుతం వాంగ్మూలం ఇచ్చే పరిస్థితిలో లేడని దేశ్‌బంధు రోడ్ స్టేషన్ పోలీసులు తెలిపారు. సంఘటనాస్థలిని ఫోరెన్సిక్ బృందం పరిశీలించిందని, దర్యాప్తు చేపట్టామని చెప్పారు.

## షాజహాన్‌పూర్‌లో చెట్లకు రాఖీలు

**పర్యావరణ రక్షణకు నడుం కట్టిన మహిళలు**

షాజహాన్‌పూర్: వేడుక ఏదనేది కాదు.. ఎందుకు ఉపయోగించామన్నది ముఖ్యం. రక్షా బంధన్.. అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకని అందిరికీ తెలిసిందే. ఆ బంధాన్ని చెట్లతో ముడివేసుకుంటున్నారు షాజహాన్‌పూర్ మహిళలు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెట్లకు రాఖీ కడుతున్నారు. గత గురువారం నుంచి ఇప్పటివరకూ వెయ్యి చెట్లకు రాఖీలు కట్టారు. ముందుగా చెట్లకు కుంకుమ దిద్ది, రాఖీ కడతారు. తరువాత స్వీట్స్‌కు బదులుగా నీటిని, ఎరువులను వేస్తారు. స్థానికంగా ఉన్న వాట్సాప్ గ్రూప్ 'వీఏపీ' ఇలాంటి వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. అందులోని సభ్యులంతా వాటిని ఆచరిస్తున్నారు. పర్యావరణం పట్ల మన బాధ్యతను మరోసారి గుర్తు చేయడమే ఈ కార్యక్రమం ధ్యేయమని నిర్వాహకుల్లో ఒకరైన నీతూ గుప్తా చెబుతున్నారు. లక్ష చెట్లకు రాఖీలు కట్టడం తమ లక్ష్యమంటున్నారు. ఇదో సామాజిక ఉద్యమంగా మారితే బాగుంటుందని ఆకాంక్షిస్తున్నారు. కాగా, వీరి చొరవకు పలువురి ప్రశంసలు అందుతున్నాయి.

## కరుణానిధి స్మారక రూ.100 నాణెం విడుదల



సాక్షి, చెన్నై: డీఎంకే దివంగత నేత, తమిళనాడు మాజీ సీఎం కరుణానిధి శత జయంతి స్మారక రూ.100 నాణేన్ని ఆదివారం చెన్నైలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విడుదల చేశారు. మొదటి నాణేన్ని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ అందుకున్నారు. డీఎంకే ప్రభుత్వం ఏడాది పొడవునా కరుణానిధి శత జయంతి ఉత్సవాలను జరిపింది. ఆయన ముఖచిత్రంతో కూడిన రూ.100 నాణేన్ని కేంద్రం విడుదల చేసింది. ఆదివారం చెన్నై కలైవానర్ అరంగంలో జరిగిన వేడుకలో ఈ నాణేన్ని విడుదల చేశారు. కరుణ జీవిత ప్రస్థానంతో రూపొందించిన 7డీ టెక్నాలజీ లఘు చిత్రాన్ని ప్రదర్శించారు.

## దారుణంగా అవమానించారు

- జార్ఖండ్ మాజీ సీఎం చంపయ్ సోరెన్
- ఢిల్లీలో మకాం.. బీజేపీలో చేరే అవకాశం



రాంచీ: ముఖ్యమంత్రిగా ఉన్నపుడు సొంత పార్టీ నేతలే తనను దారుణంగా అవమానించారని, దాంతో ప్రత్యామ్నాయం చూసుకోవాల్సి వచ్చిందని జార్ఖండ్ మాజీ సీఎం, జేఎంఎం సీనియర్ నాయకుడు చంపయ్ సోరెన్ అన్నారు. బీజేపీలో చేరుతున్నారనే ప్రచారం నేపథ్యంలో చంపయ్ ఆదివారం ఢిల్లీకి చేరుకున్నారు. అనంతరం 'ఎక్స్'లో తన ఆవేదనను షేర్ చేశారు. 'జూలై మొదటివారంలో ముఖ్యమంత్రిగా నేను పాల్గొనాల్సిన అన్ని ప్రభుత్వ కార్యక్రమాలను నాకు మాటమాత్రమైనా చెప్పకుండా పార్టీ నాయకత్వం రద్దు చేసింది. ఎందుకని ఆరా తీయగా పార్టీ ఎమ్మెల్యేల సమావేశం ఉందని, అప్పటిదాకా ఏ ప్రభుత్వ కార్యక్రమానికి హాజరు కాకూడదని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఇంతకంటే అవమానం మరొకటి ఉంటుందా?. ఎమ్మెల్యేల సమావేశంలో నన్ను రాజీనామా చేయమన్నారు. నిర్ఘాంతపోయా. అధికారంపై నాకెలాంటి యావ లేదు కాబట్టి వెంటనే రాజీనామా చేశా. కానీ నా ఆత్మగౌరవం దెబ్బతింది' అని చెప్పుకొచ్చారు. జీవితాన్ని ధారపోసిన పార్టీలో నా ఉనికే ప్రశ్నార్థకమైంది. నా జీవితంలో కొత్త అధ్యాయం మొదలైందని ఆ రోజే ఎమ్మెల్యేల భేటీలో ప్రకటించా. నా ఈ ప్రయాణంలో అన్ని ప్రత్యామ్నాయాలు తెరిచే ఉంటాయని సోరెన్ అన్నారు. ఇది తన వ్యక్తిగత పోరాటమని, ఇతర జేఎంఎం నాయకులను ఇందులోకి లాగదలచుకోలేదని చెప్పారు. ఎంతో చెమటోడ్చి నిర్మించుకున్న పార్టీకి నష్టం కలిగించాలనే ఆలోచన తానెప్పుడూ చేయలేదని, కాని అలాంటి పరిస్థితులు కల్పించారని చంపయ్ అన్నారు.

### ఎమ్మెల్యేలకు ఎర వేస్తున్నారు: హేమంత్

బీజేపీ తమ పార్టీ ఎమ్మెల్యేలకు ఎర వేస్తోందని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఆరోపించారు. బీజేపీ గుజరాత్, అస్సాం, మహారాష్ట్ర నుంచి నాయకులను జార్ఖండ్‌కు తెచ్చి గిరిజనులు, దళితులు, వెనుకబడిన వర్గాలు, మైనారిటీల్లో విషం నింపుతోందని, ఒకరిపైకి మరొకరిని ఉసిగొల్పుతోందని అన్నారు. 'సమాజాన్ని విభజించడం మాట అటుంచితే.. వీళ్లు కుటుంబాలకు, పార్టీలను కూడా చీల్చుతారు. ఎమ్మెల్యేలకు ఎర వేస్తారు. డబ్బు నాయకులను పార్టీలు మారేలా చేస్తుంది' అని హేమంత్ పరోక్షంగా చంపయ్‌ను విమర్శించారు.

## నెల తర్వాత తెరుచుకున్న బంగ్లా బడులు

ఢాకా: బంగ్లాదేశ్‌లో నెల రోజులకు పైగా మూతబడిన విద్యాసంస్థలు ఆదివారం మళ్లీ తెరుచుకున్నాయి. రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలు హింసాత్మకంగా మారడం, ప్రధాని హసీనా గద్దె దిగడం వంటి పరిణామాల మధ్య దేశవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలు సహా అన్ని విద్యాసంస్థలు జూలై 17వ తేదీ నుంచి మూతబడ్డాయి. ప్రధాన సలహాదారు మహ్మద్ యూనుస్ సారథ్యంలో ఇటీవల తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైన విషయం తెల్సిందే. పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకోవడంతో..'ప్రధాన సలహాదారు యూనుస్ ఆదేశాల మేరకు ఆగస్ట్ 18వ తేదీ నుంచి అన్ని విద్యాసంస్థలను తిరిగి ప్రారంభించాలని సంబంధిత వర్గాలను కోరుతున్నాం'అంటూ 15వ తేదీన విద్యాశాఖ డిప్యూటీ కార్యదర్శి మొసమ్మత్ రహీమా అక్తర్ పేరిట ఒక నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు ఆదివారం ఉదయం యూనిఫాం ధరించిన స్కూలు విద్యార్థులు విద్యాసంస్థలకు చేరుకోవడం కనిపించింది. రాజధాని ఢాకాలోని చాలా ప్రాంతాల్లో ఒక్కసారిగా ట్రాఫిక్ పెరిగిపోయింది. బంగ్లాదేశ్‌లో పాఠశాలలు ఆదివారం నుంచి గురువారం వరకు పనిచేస్తాయి.

## కేంద్ర మంత్రి జుయల్ ఓరం భార్య మృతి

**డెంగ్యూతో మృతి చెందిన జింగియా ఓరం**

భువనేశ్వర్: కేంద్ర గిరిజన శాఖ మంత్రి జుయల్ ఓరం భార్య జింగియా ఓరం మృతి చెందారు. డెంగ్యూతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి విషమించడంతో శనివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. జుయల్ ఓరం సైతం డెంగ్యూ బారిన పడి అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జింగియా ఓరం మృతి పట్ల ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం రాత్రి ఆయన ఆస్పత్రిని సందర్శించారు. సీఎంతో పాటు ఒడిశా న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్, ఆరోగ్య శాఖ మంత్రి ముఖేష్ మహాలింగ్, స్పీకర్ సూరమా పాఢి, ఇతర బీజేపీ నేతలు కూడా జింగియా ఓరం భౌతికకాయానికి నివాళులు అర్పించారు.



**క్లిక్ క్లిక్ హుర్రే..**

సిటీ ఛాయాచిత్ర విశేషాలకు నిలయం.. అంతేకాదు అద్భుతమైన ఛాయాగ్రాహకులకు కూడా. నగరంలో విభిన్న రంగాల్లో స్థిరపడిన వారు.. హాబీగా కెమెరాలకు పని చెబుతున్నవారూ ఉన్నారు. - సిటీ ప్లస్‌లో



**మై డియర్ బ్రదర్..**

అక్కాతమ్ముళ్లు, అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షా బంధన్. తోబుట్టువుల మమతానురాగాలకు ప్రతిబింబం రాఖీ పండగ. సోదర సోదరీ బంధం ఎంతో ఉన్నతమైది. - సిటీ ప్లస్‌లో

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం
34.0/24.0

నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 34.. కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చు.





తెప్పోత్సవంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు



వలతో గంగపుత్రుల సందడి



బోనాలతో వస్తున్న మహిళలు

## తెప్పోత్సాహం

**ఖైరతాబాద్:** తెలంగాణ గంగ తెప్పోత్సవం ఘనంగా జరిగింది. ఆదివారం ఖైరతాబాద్ ఏడు గుడుల దేవాలయం నుంచి గంగ తెప్ప, బోనాల ఊరేగింపు హుస్సేన్ సాగర్ తీరంలోని గంగమ్మ ఆలయం వరకు కన్నుల పండువగా సాగింది. 521 బోనాలు, పోతరాజుల నృత్యాలు, గుస్సాడీ ఆటలు, ఒగ్గుడోలు, వల పందిరితో గంగపుత్రులు వేలాదిగా తరలివచ్చారు. అనంతరం నిర్వహించిన పూజా కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. గంగ తెప్పను సాగర తీరంలో వదిలిపెట్టారు. అంతకముందు ఏడుగుళ్ల దేవాలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమం, ఊరేగింపులో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ముఠా గోపాల్, ఎంపీ అనిల్ కుమార్, మాజీ ఎంపీ వీహెచ్, మత్స్య సహకార సంఘం చైర్మన్ మెట్టు సాయికుమార్, ఫిషరీష్ కోఆపరేటివ్ సొసైటీ చైర్‌పర్సన్ కొప్పు పద్మ, పారిశ్రామిక చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, కార్పొరేటర్లు విజయారెడ్డి, సంగీతా యాదవ్, మహాలక్ష్మి రామన్‌గౌడ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గంగ తెప్పోత్సవ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మల్కు మహేందర్‌బాబు మాట్లాడుతూ.. గంగ తెప్పోత్సవాన్ని రాష్ట్ర పండగగా గుర్తించాలని, గంగమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని, చెరువులపై గంగపుత్రులకే హక్కులుండాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షుడు మంగళపల్లి రాజు, ప్రధాన కార్యదర్శి పూస నర్సింహ, ఉపాధ్యక్షుడు గుండు జగదీష్ బాబు, అదనపు ప్రధాన కార్యదర్శి బైరు బాబురావు, కోశాధికారి కాపరనేని లింగం, సురేష్ కుమార్, ఖైరతాబాద్ అధ్యక్షుడు తుమ్మూరు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## సమానత్వం కోసం పోరాడిన సర్వాయి పాపన్న

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**సాక్షి, సిటీబ్యూరో:** పేద, బడుగు బలహీన వర్గాల సమానత్వం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సర్దార్ పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అనుదీప్ మాట్లాడుతూ.. బడుగుల ఐక్యతతో ప్రత్యేక సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని గోల్కొండ కోటను జయించిన సర్దార్ సర్వాయి పాపన్న నేటి తరానికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జి.ఆశన్న, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి పెరిక యాదయ్య, జిల్లా వికలాంగుల అభివృద్ధి అధికారి రాజేందర్, వయోజన విద్య ఉప సంచాలకులు జయశంకర్, నరసింహులు, సంజీవులు, నీరజా రెడ్డి, కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

## కిరాణా కొట్టులో గంజాయి చాక్లెట్లు

- విద్యార్థులు, యువతకు విక్రయం
- షాపు యజమాని అరెస్టు



గంజాయి చాక్లెట్లతో పట్టుబడిన ప్రివేష్

**సాక్షి, సిటీబ్యూరో:** కిరాణాకొట్టులో గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్న వ్యక్తిని సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్‌ఓటీ) పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. ఉత్తరప్రదేశ్‌లోని గోహ్నియా గ్రామానికి చెందిన పివేస్ అలియాస్ ప్రివేష్ బతుకుతెరువు కోసం కొన్నేళ్ల క్రితం ఐడీపీఎల్ బాలానగర్‌కు వలస వచ్చాడు. పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలోని సుభాష్‌నగర్‌లో కిరాణా కొట్టు పెట్టాడు. ఆశించిన మేర ఆదాయం లేకపోవడంతో గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. ఈక్రమంలో తన స్వస్థలమైన యూపీ నుంచి అక్రమంగా గంజాయి చాక్లెట్లను నగరానికి తీసుకొస్తున్నాడు. వీటిని స్కూల్, కాలేజీ విద్యార్థులు, యువత, దినసరి కూలీలకు విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న మేడ్చల్ ఎస్‌ఓటీ, పేట్ బషీరాబాద్ పోలీసులు కిరాణా కొట్టులో ఆకస్మిక తనిఖీలు చేయగా.. 5 ప్యాకెట్లలో 200 గంజాయి చాక్లెట్లు లభించాయి. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## చేనేత సింగారం.. లేలేత వయ్యారం



**సాక్షి, సిటీబ్యూరో:** మోడళ్లు మెరిశారు. చేనేత చీర కట్టుతో మురిశారు. లేలేత వయ్యారాలతో క్యాట్ వాక్ చేశారు. ఈ నెల 20 నుంచి బంజారాహిల్స్‌లోని కళింగ కల్చరల్ హాల్ వేదికగా 'హ్యాండ్ టు హ్యాండ్ చేనేత వస్త్ర ప్రదర్శన' నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం బేగంపేట కంట్రీ క్లబ్‌లో నిర్వహించిన హ్యాండ్లూం కలెక్షన్ థీమ్ ఫ్యాషన్ షోలో అందాల భామలు చేనేత చీరలు ధరించి హొయలు పోయారు.

## సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గంజాయి దందా

**గచ్చిబౌలి:** ఈజీ మనీ కోసం గంజాయి దందాకు పాల్పడిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కటకటాల పాలైన ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని గుంటూరు జిల్లా పొన్నూరు మండలం ఉప్పరపాలేనికి చెందిన సూరిశెట్టి మహేష్ ఐటీ కారిడార్‌లోని ఓ ప్రముఖ కంపెనీలో కంప్యూటర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. కొండాపూర్‌లోని శ్రీరాంనగర్‌లోని ఏవీఆర్ శ్రీలక్ష్మి బాలాజీ మెన్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. కొద్ది రోజులుగా గంజాయి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో గచ్చిబౌలి పోలీసులు, టీ న్యాబ్ అధికారులు హాస్టల్‌పై ఆదివారం మధ్యాహ్నం దాడి చేశారు. మహేష్ ఉండే గది నుంచి కిలోన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# చర్లపల్లికి చేరేదెలా!

త్వరలో ప్రారంభం కానున్న చర్లపల్లి టెర్మినల్

| 25 రైళ్లతో దక్షిణమధ్య రైల్వే సన్నాహాలు | స్టేషన్‌కు కొరవడిన రవాణా సదుపాయాలు | అందుబాటులో లేని ఎంఎంటీఎస్ సర్వీసులు | విస్తరణకు నోచుకోని రహదారులు | ప్రయాణికుల రాకపోకలకు తిప్పలు తప్పవా? |
|---|---|---|---|---|



**సాక్షి, సిటీబ్యూరో/కుషాయిగూడ:** చర్లపల్లి టెర్మినల్ సిద్ధమైంది. ఈ నెలాఖరుకు లేదా వచ్చే సెప్టెంబరు మొదటి వారంలో ప్రారంభించేందుకు దక్షిణమధ్య రైల్వే సన్నాహాలు చేపట్టింది. కానీ ఈ స్టేషన్‌కు ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ఇప్పటి వరకు రవాణా సదుపాయాలు మాత్రం అందుబాటులోకి రాలేదు. ఎంఎంటీఎస్ రెండో దశ పనులు పూర్తయినప్పటికీ వివిధ మార్గాల్లో చర్లపల్లికి చేరుకొనేందుకు ఎలాంటి సర్వీసులను ప్రారంభించలేదు. అలాగే.. ఆర్టీసీ సేవలు కూడా వినియోగంలోకి రాలేదు. చర్లపల్లి స్టేషన్‌కు చేరుకొనేందుకు రెండు మార్గాల్లో రోడ్ల విస్తరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆయా విభాగాల మధ్య సమన్వయలోపం కారణంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా రోడ్ల అభివృద్ధి, విస్తరణ పనులు నిలిచిపోయాయి. దీంతో నగరంలోనే నాలుగో టెర్మినల్‌గా వినియోగంలోకి రానున్న చర్లపల్లికి ప్రయాణికులు చేరుకోవడం ప్రశ్నార్థకంగా మారింది.

### అత్యాధునిక సదుపాయాలతో..

సుమారు రూ.430 కోట్లతో చర్లపల్లి టెర్మినల్‌ను అభివృద్ధి చేశారు. లిఫ్టులు, ఎస్కలేటర్లు, బుకింగ్ కేంద్రాలు, 9 ప్లాట్‌ఫాంలు తదితర అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన చర్లపల్లి టెర్మినల్ నుంచి నిత్యం సుమారు 50 రైళ్లు రాకపోకలు సాగించేందుకు అవకాశం ఉంది. కానీ మొదట 25 రైళ్లతో స్టేషన్‌ను వినియోగంలోకి తేనున్నారు. కృష్ణా ఎక్స్‌ప్రెస్, శబరి, శాతవాహన తదితర రైళ్లను చర్లపల్లి నుంచి నడపనున్నట్లు రైల్వేబోర్డు ఇప్పటికే స్పష్టం చేసింది. ఈ క్రమంలో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రయాణికులు చేరుకొనేందుకు ఎలాంటి సదుపాయాలు లేకపోవడం గమనార్హం.

### ఎంఎంటీఎస్ ఎప్పుడు?

ఎంఎంటీఎస్ రెండో దశ పనులు పూర్తయ్యాయి. మేడ్చల్ నుంచి బొల్లారం మీదుగా ఫలక్‌నుమా, ఉందానగర్ వరకు, లింగంపల్లి నుంచి తెల్లాపూర్ వరకు, సనత్‌నగర్ నుంచి మౌలాలీ మీదుగా చర్లపల్లి, ఘట్కేసర్ వరకు అన్ని మార్గాల్లో పనులు పూర్తి చేసినప్పటికీ ఎంఎంటీఎస్ సర్వీసులు మాత్రం అందుబాటులోకి రాలేదు. టెర్మినల్ ప్రారంభమైతే లింగంపల్లి చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు కూడా ఎంఎంటీఎస్‌లో నేరుగా చర్లపల్లికి చేరుకొని అక్కడి నుంచి ప్రధాన రైళ్లలో బయలుదేరేందుకు అవకాశం ఉంటుంది. ఇటు మేడ్చల్, మల్కాజిగిరి, అటు కాచిగూడ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు కూడా చర్లపల్లికి చేరేలా ఎంఎంటీఎస్ సేవలను విస్తరించాల్సి ఉంది. రెండో దశలో నిర్మించిన మార్గాల్లో ప్రస్తుతం మేడ్చల్- ఫలక్‌నుమా, లింగంపల్లి-తెల్లాపూర్, మేడ్చల్-లింగంపల్లి తదితర రూట్లలో ఉదయం, సాయంత్రం మాత్రమే పరిమితంగా రైళ్లు నడుస్తున్నాయి. గతంలో రోజుకు 121 సర్వీసులు నడిస్తే ఇప్పుడు వాటి సంఖ్య 78కి తగ్గింది. మరోవైపు సికింద్రాబాద్ - చర్లపల్లి, మేడ్చల్- మల్కాజిగిరి- చర్లపల్లి, కాచిగూడ-చర్లపల్లి తదితర మార్గాల్లో సర్వీసులను ప్రారంభించాలంటే మరిన్ని రైళ్లు అవసరం. కానీ ఈ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి ప్రణాళికలు లేవు.

### కొరవడిన సమన్వయం..

అప్రోచ్ రోడ్ల నిర్మాణం చేయకుండానే చర్లపల్లి టెర్మినల్ ప్రారంభమైతే పెద్ద ఎత్తున ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారు. సకాలంలో స్టేషన్‌కు చేరుకోవడం కూడా కష్టమే. వివిధ విభాగాల మధ్య సమన్వయం కొరవడడంతోనే రోడ్ల నిర్మాణం ముందుకు సాగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



### విస్తరణకు నోచుకోని రహదారులు..

నగరంలోని వివిధ మార్గాల్లో సుమారు 40 కిలోమీటర్ల పరిధి నుంచి ప్రయాణికులు చర్లపల్లికి చేరుకొనేందుకు రెండు ప్రధాన రహదారులు ఉన్నాయి. మహాలక్ష్మీనగర్ కాలనీ నుంచి చర్లపల్లి రైల్వేస్టేషన్ వరకు ఉన్న 40 ఫీట్ల పాత రోడ్డును 80 ఫీట్లకు విస్తరించాల్సి ఉంది. అలాగే.. చర్లపల్లి టెర్మినల్ ముఖద్వారం నుంచి ఐఓసీఎల్‌ను కలుపుతూ మరో 100 ఫీట్ల రోడ్డును విస్తరించాలని ప్రతిపాదించారు. ఈమేరకు జీహెచ్ఎంసీ అధికారులు సర్వేలు నిర్వహించారు. మహాలక్ష్మినగర్ రోడ్డును విస్తరించేందుకు 15 చోట్ల ఆస్తులను తొలగించాల్సి ఉంటుందని గుర్తించారు. ఆస్తులు కోల్పోయిన వారికి టీడీఆర్‌లు, పరిహారం చెల్లింపునకు కాప్రా మున్సిపల్ అధికారులు నోటీసులు కూడా జారీ చేశారు. స్థలాలు, ఆస్తులను ఇచ్చేందుకు కాలనీవాసులు సుముఖంగా లేకపోవడంతో రోడ్డు విస్తరణ పెండింగ్‌లో పడిపోయింది. ఈ మార్గంలో భూసేకరణపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. మరోవైపు చర్లపల్లి టెర్మినల్ ముఖద్వారం నుంచి ఐఓసీఎల్ రోడ్డును కలుపుతూ ప్రతిపాదించిన 100 ఫీట్ల రోడ్డు విస్తరణలో 80 శాతం భూములను అటవీశాఖ నుంచి, మరో 20 శాతం భూములను చర్లపల్లి ఐలా నుంచి సేకరించాల్సి ఉంది. గత మార్చి నెలలో రోడ్డు నిర్మాణానికి స్థలాలు ఇవ్వాలని కోరుతూ జీహెచ్ఎంసీ అధికారులు అటవీశాఖ అధికారులు, ఐలా అధికారులకు లేఖలు రాసినట్లు సమాచారం. కానీ ఇప్పటి వరకు ఎలాంటి సమాధానం రాకపోవడంతో ఈ రోడ్డు నిర్మాణ పనులు కూడా స్తంభించాయి.



**అనుమతుల కోసం నిరీక్షిస్తున్నాం..**

చర్లపల్లి రైల్వే టెర్మినల్ అప్రోచ్ రోడ్ల నిర్మాణ స్థల సేకరణకు చర్యలు తీసుకున్నాం. స్థల యజమానులకు నోటీసులు కూడా అందజేశాం. నివేదికలను భూసేకరణ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు, జీహెచ్ఎంసీకి పంపించాం. ప్రస్తుతం వారి పరిశీలనలో ఉంది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే రోడ్ల నిర్మాణం చేపడతాం.

– ముకుంద్‌రెడ్డి, కాప్రా డిప్యూటీ కమిషనర్

# ఆపరేషన్ గండిపేట

- ఖానాపూర్‌లో రెస్టారెంట్ కూల్చివేత
- చిలుకూరు, అప్పోజీగూడల్లో పలు భవనాలు నేలమట్టం
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఆక్రమణల తొలగింపు
- హైడ్రా అధికారుల పర్యవేక్షణలో కూల్చివేతలు

**మణికొండ/మొయినాబాద్:** గండిపేట చెరువు ఆక్రమణల చెర వీడుతోంది. ఈ చెరువుకు ఆనుకుని వెలసిన బడాబాబుల నిర్మాణాలను ఎట్టకేలకు తొలగించేందుకు హైడ్రా అధికారులు ఆదివారం శ్రీకారం చుట్టారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో వెలసిన నిర్మాణాల తొలగింపునకు చర్యలు చేపట్టారు. రెండు బృందాలుగా ఏర్పడిన హైడ్రా సిబ్బంది నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో వెలసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. వీటిలో ఒకటి ప్రముఖ న్యాయవాదికి చెందినది కాగా.. మరొకటి కేంద్ర మాజీ మంత్రి బంధువులకు సంబంధించింది కావడం గమనార్హం. అలాగే.. శంకర్‌పల్లి రోడ్డు సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ రెస్టారెంట్‌ను నేలమట్టం చేశారు. అదే రోడ్డులో ఖానాపూర్ దాటిన తర్వాత ఉన్న ఓరో స్పోర్ట్స్ విలేజ్‌లోని కొంత భాగాన్ని కూల్చివేశారు.



### భారీ బందోబస్తు మధ్య..

- నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో హైడ్రా ఆర్‌ఎఫ్‌ఓ పాపారావు ఆధ్వర్యంలో కూల్చివేతలు కొనసాగాయి. ఈ సందర్భంగా నార్సింగి ఏసీపీ రమణగౌడ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణమోహన్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్‌గౌడ్ పనులను పర్యవేక్షించారు.
- మొయినాబాద్ మండలంలోని అప్పోజీగూడ, చిలుకూరు గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న వెస్ట్‌సైడ్ వెంచర్‌లో గండిపేట చెరువు ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమించి చేపట్టిన భారీ నిర్మాణాలను హైడ్రా అధికారులు గుర్తించారు. మల్లికార్జున్, చరణ్, జలమండలి డీజీఎం నరహరి, జలమండలి విజిలెన్స్ అధికారి డీకే లక్ష్మిరెడ్డి, స్థానిక ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తుతో వెస్ట్‌సైడ్ వెంచర్‌లోని భవనాలను కూల్చివేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన క్రికెట్ మైదానాన్ని ధ్వంసం చేశారు. చెరువు చుట్టూ వందలాది అక్రమ నిర్మాణాలు ఉండటంతో అయిదు రోజుల పాటు కూల్చివేతలు చేపట్టనున్నట్లు సమాచారం.

### చెరువును పూడ్చి..

గండిపేట చెరువును ఆనుకుని ఎకరం, రెండెకరాల భూములు కొనుగోలు చేసిన బడాబాబులు మరింత స్థలాన్ని ఆక్రమించి ఫాంహౌస్‌లు నిర్మించారు. ఖానాపూర్, గండిపేట, మంచిరేవుల, హిమాయత్‌నగర్, చిలుకూరు, అప్పోజీగూడ, చందానగర్, చిన్నమంగళారం, జన్వాడ, మిర్జాగూడ, మియాఖాన్ గడ్డ తదితర గ్రామాల పరిధిలో వందల సంఖ్యలో ఆక్రమణలు జరిగాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. గండిపేట పరీవాహక ప్రాంతాల్లోని ఆక్రమణలను పూర్తిగా తొలగించాలని కోరుతున్నారు. ఇదే తరహాలో హిమాయత్ సాగర్ పరిసరాల పరిధిలో వెలసిన నిర్మాణాలపై సైతం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఎట్టకేలకు కదిలిన పీఠం

- పదవీ విరమణ పొందినా తొమ్మిదేళ్లుగా తిష్ట
- సుంకిశాల ఘటనలో సైతం నిర్లక్ష్యం
- అయినా కీలక శాఖకు బదిలీపై చర్చోపచర్చలు

**సాక్షి, సిటీబ్యూరో:** హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డులో పదిహేనేళ్లకు పైగా ఒకే పోస్టులో తిష్ట వేసిన ఉన్నతాధికారికి ఎట్టకేలకు స్థానచలనం కలిగింది. దీంతో బోర్డులో ఏళ్లతరబడి ఒకే అధికారి ఏకఛత్రాధిపత్యానికి ఫుల్‌స్టాప్ పడింది. సుంకిశాల ప్రాజెక్టు ఇన్‌టేక్ వెల్ రక్షణ గోడ కుప్పకూలిన వ్యవహారంలో నిర్లక్ష్యం వహించినట్లు ప్రాథమిక విచారణలో బహిర్గతమైనా.. సాక్షాత్తూ సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా భావించే కీలక శాఖ మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది. వాటర్ బోర్డులో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) సత్యనారాయణ 2016లోనే పదవీ విరమణ చేశారు. అంతకు ముందు కూడా అయిదారేళ్లు అదే పదవీలో కొనసాగుతూ వచ్చారు. వాస్తవంగా ఆ పోస్టులో ఐఏఎస్ అధికారి కొనసాగాలి. కానీ.. ఇంజినీరింగ్ –ఇన్–చీఫ్‌గా కొనసాగిస్తూ వచ్చారు. బోర్డు అవసరాల దృష్ట్యా ప్రాజెక్టు నిర్మాణాలలో ఈడీ సత్యనారాయణ సుదీర్ఘ అనుభవం, సేవలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం పదవీ కాలాన్ని పొడిగిస్తూ వచ్చింది. తాజాగా సైతం మరో ఏడాది పదవీ కాలం పొడిగించింది.





### వివాదానికి దారి తీసిన గోప్యత..

- సుంకిశాల ఘటనపై గోపత్య రాజకీయ వివాదానికి దారితీసింది. హైదరాబాద్ మహా నగరానికి నాగార్జున సాగర్ డెడ్ స్టోరేజీ నుంచి నీటి తరలింపునకు చేపట్టిన సుంకిశాల ఇన్‌టేక్ ప్రాజెక్టు నిర్మాణ పనులు ఇప్పటికే సగానికిపైగా పనులు పూర్తయ్యాయి. అయితే.. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన భారీ వరద నీరు ఇన్‌టేక్ వెల్‌లో చేరి టన్నెల్ గేటు ధ్వంసం కావడంతో పాటు రక్షణ గోడ ఈ నెల 2న కుప్పకూలాయి. వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే వరద నీటిని అంచనా వేసి ముందస్తు ఇన్‌టేక్ నిర్మాణ పనులు పూర్తి చేయకుండా ఆలస్యంగా చేపట్టడం, నిబంధనలు పాటించకపోవడం, సాంకేతికపరమైన కారణాలతో ఘటన జరిగినట్లు విచారణలో బయపడింది.
- వాస్తవంగా వాటర్‌బోర్డు ఈడీతో పాటు ప్రాజెక్టు డైరెక్టర్ ఎప్పటికప్పుడు పనులు పర్యవేక్షిస్తూ నిర్మాణ సంస్థకు ఆదేశాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఏదైనా ఘటన జరిగితే బోర్డు ఎండీ దృషికి తీసుకొని వచ్చి ప్రభుత్వానికి సమాచారం అందించాల్సి ఉంటుంది. కానీ.. నిర్మాణ పనులపై పర్యవేక్షణలో పూర్తిగా నిర్లక్ష్యం వహించడంతో పాటు ప్రాజెక్టు ఇన్‌టేక్ వెల్‌లో వరద నీరు చేరి రక్షణగోడ కూలినప్పటికి ప్రభుత్వానికి సమాచారం ఇవ్వడంలో గోప్యత పాటించడం వివాదాస్పదమైంది. వాస్తవంగా ఈడీ పదవీ కాలం పొడిగింపు ఉత్తర్వుకు ఆటంకం కలగకుండా ఉండేందుకు సుంకిశాల ఘటనపై గోప్యత పాటించినట్లు సర్వత్రా చర్చ సాగుతోంది. సుంకిశాల ఘటన గోప్యతపై ప్రతిపక్షాలు రాద్ధాంతం చేయడంపై ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి చర్యలకు ఉపక్రమించింది.

**వేటుకు బదులు కీలక శాఖకు బదిలీనా?**

సుంకిశాల ఘటనపై అంతర్గత విచారణ కూడా అనుమానాలకు తావిచ్చింది. ప్రాజెక్టు పనుల పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు ఉన్నతాధికారులను విచారణ కమిటీలో సభ్యులుగా వేయడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. విచారణ కమిటీ సుంకిశాలను సందర్శించి నివేదిక సమర్పించింది. బోర్డు కమిటీ నివేదికను ప్రభుత్వానికి సమర్పించడంతో ఉన్నత స్థాయి కమిటీ నివేదిక పరిశీలించి చర్యలకు ఉపక్రమించింది. ప్రాజెక్టు డైరెక్టర్‌ను నాన్ ఫోకల్ పోస్టుకు బదిలీ చేసి మరో నలుగురు క్షేత్రస్థాయి ఇంజినీరింగ్ అధికారులపై సస్పెన్షన్ వేటు వేసింది. అయితే.. ఈ ఘటనలో నిర్లక్ష్యం ఉన్నట్లు విచారణలో తేలడంతో ఈడీని నాన్ ఫోకల్ పోస్టుకు బదులు మూసీ సుందరీకరణ పనులు చేపట్టే కీలక శాఖకు బదిలీ చేసిన వైనం చర్చనీయాంశంగా మారింది.

## సాత్విక మృతికి కారణమైన డ్రైవర్‌కు రిమాండ్

లాలాపేట: హబ్సిగూడ చౌరస్తాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో టెన్త్ క్లాస్ విద్యార్థి సాత్విక మృతికి కారణమైన 18 చక్రాల భారీ లారీ(టస్కర్) డ్రైవర్ సూరజ్ సింగ్(22)పై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు ఓయూ పోలీసులు తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన సూరజ్ సింగ్ కోకాకోలా కంపెనీలో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం పటాచెరు నుంచి ఉప్పల్ వైపు కోకాకోలా బాటిళ్ల లోడుతో వెళ్తున్న టస్కర్ ఉదయం ఏడున్నర గంటలకు హబ్సిగూడ చౌరస్తాలోని సిగ్నల్ వద్ద ఆర్టీసీ బస్ వెనకాల ఆగిన ఉన్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో ఆర్టీసీ బస్ కిందికి దూసుకుపోయింది. ఈ ఘటనలో ఆటోలో స్కూల్‌కు వెళుతున్న సాత్విక, డ్రైవర్ ఎల్లయ్యకు తీవ్రగాయాలయ్యాయి. పరిస్థితి విషమించి సాత్విక విగతజీవిగా మారిన విషయం తెలిసిందే.

## చిన్నారి మృతదేహం లభ్యం


శామీర్‌పేట చెరువులో లభ్యమైన వేదాన్ష్ మృతదేహం

శామీర్‌పేట్: సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రానికి చెందిన భానుప్రియ కుటుంబ కలహాల నేపథ్యంలో ఇద్దరు పిల్లలుసహా తల్లి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో ఓ కొడుకు మృతదేహం లభించింది. శనివారం తల్లికూతురి మృతదేహాలు లభించిన సంగతి విదితమే. కొడుకు వేదాన్ష్(5) మృతదేహం ఆదివారం ఉదయం లభ్యమైంది. దీంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనాథ్ తెలిపారు.

## బెట్టింగ్‌లో చీటింగ్

**పోలీసుల అదుపులో నలుగురు నిందితులు**

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లోని హైదరాబాద్ రేస్ క్లబ్ ఆఫ్ కోర్స్ టోట్ సెంటర్‌లో నిబంధనలకు విరుద్ధంగా బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురిని ఖైరతాబాద్ పోలీసులు గేమింగ్ యాక్ట్ కింద అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం....ఖైరతాబాద్‌లోని రేస్ క్లబ్‌లో బెట్టింగ్ చేయాలంటే టికెట్ తీసుకొని నిబంధనల ప్రకారం నడుచుకోవాలి. కానీ, కాచిగూడకు చెందిన మహేష్ (69), మల్లేపల్లికి చెందిన హసద్ అహ్మద్(36) నిబంధనలకు విరుద్ధంగా గ్యాంగ్‌గా ఏర్పడి బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారని సెక్యూరిటీ సూపర్‌వైజర్ షా నవాజ్ గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా మహేష్, హసద్‌తోపాటు బెట్టింగ్ ముఠాలోని సాయిలు (36), షేక్ అక్బర్ (48)లను అదుపులోకి తీసుకున్నారు.

## 'ఉస్మానియా'లో కూలిన రెయిలింగ్



అఫ్జల్‌గంజ్: ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో మరోసారి రెయిలింగ్ కూలింది. ఈ ఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. ఔట్‌పేషంట్ బ్లాకు వెనుక వైపు ఉన్న ద్విచక్ర వాహనాల పార్కింగ్ స్థలంలో ఒక్కసారిగా భవనం పైఅంతస్తు రెయిలింగ్ కూలింది. దీంతో ఉద్యోగులు, రోగులు భయభ్రాంతులకు గురయ్యారు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో మూడు ద్విచక్ర వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి.


అమీర్‌పేటలో..


బంజారాహిల్స్‌లో..


దిల్‌సుఖ్‌నగర్‌లో..

## గి'రాఖీ'


మలక్‌పేటలో..

సోమవారం రాఖీపౌర్ణమి. తోడబుట్టినవారికి పండుగ. ఈ నేపథ్యంలో నగరంలో రాఖీల విక్రయాలు జోరందుకున్నాయి. ఎక్కడ చూసినా రాఖీ విక్రయ కేంద్రాలే. విభిన్న ఆకృతుల్లోని రాఖీలు ఆకట్టుకుంటున్నాయి. ముచ్చటగొలుపుతున్నాయి. గి'రాఖీ'కి కూడా పెరిగింది. రాఖీల కోసం మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆకట్టుకునే రాఖీలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు.


బంజారాహిల్స్‌లో..

## పాకిస్తాన్ వల్లే హిందువులపై దాడి: రాజాసింగ్



సుల్తాన్‌బజార్: పాకిస్థాన్ బంగ్లాదేశ్‌ను ఆక్రమించుకునేందుకు కుట్ర పన్నుతుందని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ లోధా సంచలన వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసనగా సంఘ్ పరివార్, బీజేపీ, ఇతర హిందూ సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం కోఠిలోని బాల గంగాధర్‌తిలక్ విగ్రహం నుంచి భారీ ర్యాలీ తీశారు. ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున వివిధ హిందూ సంస్థలకు చెందిన ప్రతినిధులు వందల సంఖ్యల్లో పాల్గొని బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హిందూవులపై దాడులకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ కోఠి నుండి సుల్తాన్‌బజార్ చౌరస్తా, రాంకోఠిల మీదుగా కాచిగూడ చౌరస్తాలోని వీర్ సావర్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ గతంలో బంగ్లాదేశ్‌పై పాకిస్థాన్ దాడి ప్రకటించినప్పుడు భారతదేశం మద్దతు పలికిందని గుర్తుచేశారు. పాకిస్థాన్ మతోన్మాదాలను రెచ్చగొడుతూ బంగ్లాదేశ్ ప్రభుత్వానిపై కాకుండా హిందువులపై దాడులకు ప్రేరేపిస్తోందన్నారు. ఈ విషయంపై ప్రధాని నరేంద్రమోదీ చర్యలు తీసుకోనున్నారని హెచ్చరించారు. బంగ్లాదేశ్‌ను భారత్ ఆక్రమించుకుంటుందని ఆయన అన్నారు. ఇప్పటికైనా హిందూవులపై దాడులు ఆపకపోతే జరిగే పరిణామాలకు పాకిస్థాన్ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాధవీలత, చీకోటి ప్రవీణ్, శ్యామ్, పాండు యాదవ్, గోవింద్‌రాఠి, సురేఖ, శశికళ, నావల్‌కుమార్ సాంక్లా, మనోజ్‌లతోపాటు వందలాది మంది హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## 23 నుంచి జ్యువెలరీ ఎగ్జిబిషన్



బంజారాహిల్స్: తాజ్‌కృష్ణా హోటల్‌లో ఈ నెల 23 నుంచి 25 వరకు జ్యువెలరీ వరల్డ్ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14లో ఆదివారం జరిగిన సన్నాహక కార్యక్రమంలో పలువురు మోడల్స్ తళుక్కుమన్నారు. జ్యువెలరీ వరల్డ్ ఎగ్జిబిషన్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈవెంట్ నిర్వాహకులు మాట్లాడుతూ ఆభరణాల నైపుణ్యానికి, విలాసానికి, నవీకరణకు అద్భుతమైన వేదికగా ఈ ఎగ్జిబిషన్ నిలవనున్నదన్నారు. ఈ నెల 23 నుంచి 25 వరకు ఉదయం 10 నుంచి రాత్రి 8 వరకు కొనసాగుతుందన్నారు. పేరెన్నికగన్న ఆభరణాల తయారీ సంస్థలు ఉత్పత్తులను ప్రదర్శించడం జరుగుతుందని, ఆభరణాల ప్రేమికులు, వధువులకు ఇదో మంచి వేదికగా చెప్పారు.

## ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

మియాపూర్: నిషేధిత గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని ఆదివారం మియాపూర్ పోలీసులు అరెస్టు చేసి, వారి వద్ద నుండి 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మయూరినగర్ కాలనీలో ఏ ఆర్కే టవర్స్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు మియాపూర్ పోలీసులు ఆదివారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. అక్కడ అనుమానాస్పదంగా తిరుగుతున్న విజయవాడకు చెందిన సంతోష్ (24), సూర్యాపేటకు చెందిన రాహుల్ అభిషేక్ (21)ను అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా వారి వద్ద గంజాయి లభించింది. వారిని పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుండి 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరు అరకు నుంచి గంజాయి తీసుకువచ్చి నగరంలో విక్రయిస్తున్నట్లు తెలిపారు. సంతోష్పై ఇదివరకే నగరంలో కేసు నమోదై ఉందని తెలిపారు. ఇద్దరినీ మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

## గొలుసు కోసం దాడి... సెల్‌ఫోన్‌తో పరారీ

వెంగళరావునగర్ : ఫోన్‌లో మాట్లాడుతున్న వ్యక్తిపై దారి దోపిడీ చేసేందుకు ఇరువురు యువకులు ప్రయత్నించిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఎల్లారెడ్డిగూడకు చెందిన బోయ ఆంజనేయులు కొబ్బరి కాయలతో హోల్‌సేల్ వ్యాపారం చేస్తుంటాడు. 18వ తేదీ తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతూ రహమత్‌నగర్ జానకమ్మతోట వద్ద ఫోన్ మాట్లాడటానికి ఆగాడు. ఈ సమయంలో గుర్తు తెలియని ఇరువురు యువకులు వెనుక నుంచి వచ్చి అతని మెడలోని బంగారు గొలుసును చోరీ చేయడానికి ప్రయత్నించగా ఆంజనేయులు అడ్డుకున్నాడు. వీరి పెనుగులాటలో బంగారు గొలుసు రోడ్డుమీద పడిపోవడంతో దానిని తీసుకుంటుండగా ఇరువురు యువకులు అతని ఫోన్‌ను లాక్కుని పారిపోయారు. తనపై దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివారం బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## స్పా ముసుగులో వ్యభిచారం

**పోలీసుల అదుపులో ముగ్గురు విటులు, నలుగురు యువతులు**

చందానగర్: చందానగర్‌లో స్పా ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న సెంటర్‌పై చందానగర్ పోలీసులు దాడి చేసి ముగ్గురు విటులు, నలుగురు యువతులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు... సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువుకు చెందిన ఎస్.హనుమంతరావు చందానగర్‌లోని సాఫ్టటచ్ వెల్నెస్ సెంటర్ నడుపుతున్నాడు. ఆ స్పా సెంటర్‌లో నలుగురు యువతులతో కస్టమర్లకు మసాజ్ చేయిస్తూ వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, చందానగర్ పోలీసులు స్పా సెంటర్‌పై దాడి చేశారు. పటాన్‌చెరువువాసి షేక్ ఇర్ఫాన్(23), బీహెచ్ఈఎల్‌కు చెందిన ఎంఎస్ఎస్‌కే చైతన్య(34), చందానగర్ కైలాస్‌నగర్‌వాసి కె.నవీన్ కుమార్ (50) నాలుగు గదులలో నలుగురు యువతులతో వ్యభిచారం చేస్తుండగా పట్టుకున్నారు. ఈ మేరకు విటులను, యువతులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.స్పాకు వచ్చేవారికి కావలసిన అవసరాలను తీర్చాలని, దానికి అదనపు డబ్బులు చెల్లిస్తామని నిర్వాహకులు ఒత్తిడి చేస్తున్నారని యువతులు పేర్కొన్నారు. పరారీలో ఉన్న హనుమంతరావును త్వరలో పట్టుకుంటామని సీఐ పాలవెల్లి తెలిపారు.

## అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు

**ఒకరికి గాయాలు**



ఖైరతాబాద్: అదుపు తప్పినబీఎండబ్ల్యూ కారు డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న ఒకరికి గాయాలయ్యాయి. ఖైరతాబాద్ ఎస్ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం ఉదయం హిమాయత్‌నగర్‌కు చెందిన జితేష్(24) బీఎండబ్ల్యూ కారులో తన స్నేహితురాలు కనిష్క(20), ఆమె సోదరుడు చిరావ్ శర్మ(14)తో కలిసి బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌కు బయల్దేరారు. కారు బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణ, తాజ్ దక్కన్ రోడ్డులో ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి కిందికి రాగానే సన్‌రూఫ్ ఓపెన్ చేసి నిలడిన చిరావ్ శర్మ కాలు తగిలి, డ్రైవింగ్ చేస్తున్న జితేష్ సీటు బెల్టు ఊడిపోయింది. జితేష్ సీటు బెల్టు పెట్టుకునేందుకు కిందికి వంగిన సమయంలో కారు అదుపు తప్పి డివైడర్ మధ్యలో ఉన్న సిమెంట్ దిమ్మె, విద్యుత్ పోల్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో చిరావ్ శర్మ ముఖానికి గాయాలయ్యాయి. కారులో ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో మిగతా ఇద్దరికి ఎలాంటి గాయాలు కాలేదు. ఘటనలో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## చాక్లెట్లు కొనుక్కొని ఇంటికి వెళ్తుండగా..

- చిన్నారిపై లైంగిక వేధింపులు
- నిందితుడు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి
- కేసు నమోదులో పోలీసుల తాత్సారం
- ఓ పోలీస్ అధికారి ఒత్తిడితో కేసు నమోదు

సైదాబాద్: షాపులో చాక్లెట్లు కొనుక్కొని ఇంటికి వెళుతున్న మైనర్ బాలికను ఓ కామాంధుడు ఇంట్లోకి పిలిచి లైంగిక దాడికి పాల్పడ్డాడు. వివరాలు... సైదాబాద్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఒక కాలనీలో నివసించే ఓ కుటుంబానికి చెందిన బాలిక(10) ఈ నెల 11న కిరాణషాపులో చాక్లెట్లు కొనుక్కొని ఇంటికి వెళుతోంది. బాలిక ఇంటికి సమీపంలో నివసించే ఓ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి(58) ఆమెను ఇంట్లోకి తీసుకెళ్లి లైంగికంగా వేధించాడు. దాంతో భయపడిన బాలిక తప్పించుకొని ఏడుస్తూ ఇంటికి చేరుకుంది. ఏం జరిగిందని తల్లి అడగటంతో విషయం బయట పడింది. నెల రోజుల క్రితం కూడా ఇంటి వద్ద తాను ఆడుకుంటుండగా అతడు ఇంట్లోకి పిలిచి అసభ్యంగా ప్రవర్తించాడని తల్లికి చెప్పింది. వెంటనే బాలిక తల్లి అతని ఇంటికి వెళ్లి నిలదీయగా ఎదురుదాడి చేశాడు. ఈ ఘటనపై అదే రోజు సైదాబాద్ పోలీసులను బాలిక తల్లి ఆశ్రయించగా నిందితుడితో రాజీ చేసుకోవాలని సూచించినట్లు తెలుస్తోంది. రెండురోజులపాటు పోలీసుస్టేషన్ చుట్టూ తిరిగినా కేసు నమోదు కాలేదు. బాధితురాలి తండ్రి ఒక పోలీస్ ఉన్నతాధికారి వద్ద వంటమనిషిగా పనిచేస్తున్నాడు. ఆయనకు విషయం చెప్పగా సైదాబాద్ పోలీసులకు ఫోన్ చేసినట్లు సమాచారం. దాంతో తప్పనిసరి పరిస్థితుల్లో పోలీసులు ఈ నెల 13న నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. అయితే నిందితుడి భార్య, కూతురు తమను తిట్టారని, ఎక్కడికి వెళ్లి ఫిర్యాదు చేసుకుంటారో చేసుకోండని బెదిరించారని బాధితురాలి తల్లి ఫిర్యాదులో పేర్కొంది.

## ప్రియురాలి కోసం సొంత సంస్థకే కన్నం

**నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు**

కాచిగూడ: ప్రియురాలి కోసం సొంత సంస్థకే కన్నం వేసిన ఉద్యోగిని ఆదివారం నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుల్తాన్‌బజార్ ఏసీపీ కె.శంకర్, ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ బషీర్‌బాగ్ చంద్రనగర్‌కు చెందిన మర్రి సాయి లక్ష్మణ్ (35) గత 8 ఏళ్లుగా బషీర్‌బాగ్‌లోని శ్రీ సిద్ధి వినాయక్ జువెలర్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో స్టాక్ ఇంచార్జిగా పనిచేస్తున్నాడు. గత రెండు నెలల క్రితం సాయి లక్ష్మణ్ డ్యూటీకి రాకుండా ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో షాపు యజమానికి అనుమానం వచ్చి ఆడిట్ నిర్వహించాడు. అందులో 28 తులాల బంగారం మిస్సింగ్ అయినట్లు గుర్తించాడు. దీంతో అనుమానం వచ్చిన యజమాని లక్షయ్ అగర్వాల్ నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని సాయి లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించారు. దీంతో తానే దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. 28 తులాలతో పాటు 8 తులాల డైమండ్ నెక్లెస్ దొంగిలించి మణప్పురం గోల్డ్‌లోన్‌లో తాకట్టు పెట్టినట్లు తెలిపారు. దొంగిలించిన బంగారాన్ని విక్రయించి తన ప్రియురాలితో దేవస్థానాలు, ఇతర ప్రదేశాలు తిరిగినట్లు ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి 3 తులాల బంగారంతో పాటు మణప్పురంలో తాకట్టు పెట్టిన డైమండ్ నెక్లెస్‌ను రికవరీ చేసినట్లు ఏసీపీ తెలిపారు. ఈ సందర్భంగా డీఐ డి.నాగార్జున, డీఎస్ఐ జి.వెంకటేష్, పోలీసు సిబ్బంది కె.అభిలాష్, సీహెచ్ అరుణ్‌కుమార్, ఎం.సురేష్, ఎస్.సంతోష్‌చారి, పి.విష్ణుమూర్తిలను ఏసీపీ అభినందించారు.

## 'తుంగభద్ర' గేటు రూపకర్తకు సన్మానం


మాతృశ్రీనగర్‌లోని కన్నయ్యనాయుడికి ఘనంగా స్వాగతం పలుకుతున్న కుటుంబ సభ్యులు

చందానగర్: తుంగభద్ర డ్యామ్ గేటు రూపకర్త కన్నయ్యనాయుడుకు ఆదివారం మియాపూర్ మాతృశ్రీనగర్‌లోని ఆయన నివాసంలో ఘన సన్మానం నిర్వహించారు. కర్ణాటకలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తుంగభద్ర డ్యామ్ 19వ గేటు కొట్టుకుపోవడంతో తాత్కాలిక గేటు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. డ్యామ్‌ల గేట్ల రూపకల్పనలో ఆయనకు 30 ఏళ్ళ అనుభవం ఉంది. 19వ గేటు కొట్టుకుపోగానే తుంగభద్ర బోర్డు ఆయనను సంప్రదించింది. దీంతో ఆయన తాత్కలిక స్టాప్ లాగ్ గేటు డిజైన్లు, డ్రాయింగ్స్ రూపొందించి అందించారు. వీటిని కేంద్ర జలసంఘం అత్యవసరంగా పరిశీలించి ఆమోదించింది. ఈ నేపథ్యంలో మాతృశ్రీనగర్‌లో ఆయనకు కాలనీవాసులు పూలవర్షంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దేశంలో ఉన్న పెద్ద పెద్ద డ్యామ్‌కు అత్యవసర రిపేర్లు, కొట్టుకుపోయిన గేట్లకు తాత్కాలిక మరమ్మతులు, గేట్లు ఏర్పాటు చేయడంలో కన్నయ్య దిట్ట అని పలువురు కొనియాడారు.


పూల వర్షంతో స్వాగతం పలుకుతున్న కాలనీవాసులు

# వైద్యసేవలు అందించడంలో కీలక పాత్ర పోషించాలి

మంత్రి దామోదర రాజనర్సింహ


క్లినిక్ ప్రారంభోత్సవంలో మంత్రి దామోదర రాజనరసింహ తదితరులు

బంజారాహిల్స్: ప్రజలకు వైద్యసేవలు అందించడంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు రెండూ కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఈ విషయంలో ప్రైవేటు రంగం మరింత బాధ్యాయుతాయుతంగా వైద్యసేవలు అందించాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఫిలింనగర్‌లో యుడెర్మ్ హెయిర్ అండ్ స్కిన్ క్లినిక్ రెండో శాఖను ఆదివారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఇటీవల కాలంలో చిన్న పిల్లల నుంచి పెద్ద వారి వరకు ప్రతి ఒక్కరికీ జుట్టురాలడం, ఇతర చర్మ సంబంధిత ఇబ్బందులు వస్తున్నాయని, వాటన్నింటికీ సమగ్రంగా వైద్య సేవలు అందించడానికి వీలుగా ఒకేచోట అన్ని రకాల వైద్యం చేసేందుకు ఈ ప్రాంతంలో యుడెర్మ్ హెయిర్ అండ్ స్కిన్ క్లినిక్‌ను ప్రారంభించడం ఎంతో సంతోషకరమన్నారు. డాక్టర్ సృకాంత్ లాంటి యువకులు ఈ రంగంలో అత్యాధునిక పద్ధతులు పాటిస్తూ ప్రజలకు తమవంతు సేవలు అందించాలని సూచించారు. ఈ దిశగా డాక్టర్ సృకాంత్, ఆయన బృందం మరింత ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం డాక్టర్ సృకాంత్ ముక్కా మాట్లాడుతూ ఇక్కడ అన్ని రకాల చర్మ, శరీర, జుట్టు సమస్యలకు సంబంధించిన వైద్యులు, మహిళా వైద్యులు, కాస్మోటాలజిస్టులు, డెర్మటాలజిస్టులు కూడా అందుబాటులో ఉంటారన్నారు. గతంలో 50–60 ఏళ్లు దాటిన తర్వాతే జుట్టు రాలడం, ఊడిపోవడం, బట్టతల ఏర్పడడం లాంటి సమస్యలు ఉండేవన్నారు. కానీ ఇప్పుడవి 18–20 ఏళ్ల వయస్సులో కూడా వస్తున్నాయన్నారు. ఇలాంటి వారికి హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ లాంటి చికిత్సలు చేసి వారిలో మళ్లీ ఆత్మవిశ్వాసం నింపడం లాంటివి చేస్తున్నామన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి

లిబర్టీ: తెలంగాణ ఆత్మగౌరవ పతాక సర్దార్ పాపన్నగౌడ్ అని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్రు కుమారస్వామి అన్నారు. వీరోచితంగా పోరాడిన సర్దార్ పాపన్నగౌడ్ చరిత్రలో నిలిచిపోయారని నేటి తరానికి ఆదర్శంగా నిలిచారని ఆయన గుర్తు చేశారు. పాపన్నగౌడ్ 374వ జయంతిని పురస్కరించుకొని దళ్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక సైన్యాన్ని ఏర్పాటు చేసి తన పోరాట పటిమతో శత్రుమూకలను గడగడలాడించారని స్పష్టం చేశారు. సర్దార్ పాపన్నగౌడ్ కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. అంతేకాకుండా పాపన్నగౌడ్ వీరోచిత పోరాటాన్ని జీవిత చరిత్రను పాఠ్యాంశంగా పెట్టి విద్యార్థులకు బోధించాలని ఆయన కోరారు.

## సెల్ టవర్‌లో మంటలు



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని వైష్ణవి బిల్డింగ్ పైన ఉన్న రిలయన్స్ జియో సెల్ టవర్ ఓడీసీ బాక్స్‌లో ఆదివారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో చుట్టుపక్కల ఉన్న పరికరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

# జరిమానాలు విధించినా.. జంకడం లేదు..!

7 నెలల్లో లక్షన్నర దాటిన కేసులు


హెల్మెట్ ధరించకుండా వాహనం నడుపుతున్న ద్విచక్రవాహనదారులకు జరిమానా విధిస్తున్న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు



- హెల్మెట్ ధరించకుండా పట్టుబడ్డ 1,71,535 మంది
- నిత్యం వాహన తనిఖీల్లో పట్టుబడుతున్న ద్విచక్రవాహనదారులు
- హెల్మెట్ ధరించకపోతే ప్రాణాలకే ప్రమాదం : ఏసీపీ హరిప్రసాద్

బంజారాహిల్స్: శిరస్త్రాణం ధరించకుండా వాహనాలు నడుపుతున్న ద్విచక్ర వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తూ జరిమానాలు విధిస్తున్నా తీరు మాత్రం మారడం లేదు. ప్రతిరోజూ ఆయా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసులు తనిఖీలు చేపడుతూ పెద్దఎత్తున వాహనదారులను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు. ఇందులో తరచూ పట్టుబడుతున్న వారిలో యువకులే 90 శాతం ఉంటుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది జనవరి 1 నుంచి జులై 31 వరకు ఏడు నెలల వ్యవధిలో వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో హెల్మెట్ లేకుండా బైక్‌లు నడుపుతూ 1,71,538 మంది పట్టుబడ్డారు. వీరందరికీ జరిమానాలు విధించారు. ఒక్కో పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తించిన ప్రాంతాల్లో పోలీసులు ఈ తనిఖీలు చేపడుతున్నారు. ప్రతిరోజూ హెల్మెట్ లేని వాహనదారులు 150 మందికి పైగానే ఒక్కో పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడుతుండడం గమనార్హం. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతూ ప్రతియేటా పట్టుబడుతున్న వారి సంఖ్య పెరగడమే కానీ, తగ్గుముఖం పట్టడం లేదు. ట్రాఫిక్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నా యువకులు ఏమాత్రం ఖాతరు చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్ని హెల్మెట్ ఉల్లంఘన కేసులు..

| ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ | ఉల్లంఘించిన వారి సంఖ్య |
|---|---|
| పంజగుట్ట | 37,554 |
| ఎస్ఆర్‌నగర్ | 36327 |
| జూబ్లీహిల్స్ | 41,396 |
| బంజారాహిల్స్ | 56,258 |

### ప్రతిరోజూ తనిఖీలు

"ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. లేకపోతే జరిమానాలు విధించడం జరుగుతుంది. మా పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రతిరోజూ ట్రాఫిక్ పోలీసులు ఆయా చోట్ల తనిఖీలు నిర్వహిస్తున్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. కొన్ని సందర్భాల్లో మృత్యువాత కూడా పడతారు. వాహనదారులు ఇంటి నుంచి గమ్యస్థానాలకు వెళ్లి తిరిగి ఇంటికి క్షేమంగా చేరుకోవాలంటే హెల్మెట్ ధరించడం తప్పనిసరి చేసుకోవాలి. హెల్మెట్ ధరించడం వల్ల ప్రయోజనాలు, ధరించకపోతే కలిగే నష్టాలు కూడా వివరిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

హరిప్రసాద్ కట్టా, ఏసీపీ, వెస్ట్‌జోన్ ట్రాఫిక్

**జరిమానాలు ఇలా..**

ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో హెల్మెట్ ధరించకుండా మొదటిసారి పట్టుబడితే రూ.100 జరిమానా విధిస్తారు. అదే నెలలో రెండోసారి కూడా పట్టుబడితే రూ.235, మూడో సారి పట్టుబడితే రూ. 600 జరిమానా విధిస్తారు. ఒకే నెలలో మూడు సార్లు పట్టుబడితే జరిమానాలు ఈ రకంగా విధిస్తున్నారు.

## గణేష్ ఉత్సవాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న తంగలపెల్లి లక్ష్మణ్.

రహమత్‌నగర్: గణేష్ ఉత్సవాలను పురస్కరించుకొని జీహెచ్ఎంసీ ప్రతి డివిజన్‌కు ప్రత్యేక నిధులు నిధులు విడుదల చేసి పనులు చేపట్టాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గ కన్వీనర్ తంగెపెల్లి లక్ష్మణ్ కోరారు. ఆదివారం భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమావేశం సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి అలే భాస్కర్ అధ్యక్షతన రహమత్‌నగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ఉత్సవాలు జరిగే తొమ్మిది రోజులు జీహెచ్ఎంసీ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసే విధంగా నగర మేయర్, కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకోకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కమిటీ మరోసారి సమావేశమై సంబంధిత అధికారులకు వినతి పత్రం సమర్పించడం జరుగుతుందని లక్ష్మణ్ తెలిపారు. ఈ సమావేశంలో జూబ్లీహిల్స్ కో కన్వీనర్ కృష్ణమోహన్, కత్తికృష్ణ, హర్షవర్ధన్, గడ్డం శ్రీధర్, రాజేష్, సుబ్బరాజు, రామకృష్ణ, విశాల్‌సింగ్, గణేష్, కిట్టు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

రహమత్‌నగర్ (బోరబండ): బోరబండ డివిజన్ మధురానగర్ బస్తీకి చెందిన బీఆర్ఎస్ నాయకులు జీహెచ్ఎంసీ మాజీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బాబా ఫసియుద్దీన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీ నాయకులు స్వచ్ఛందంగా చేరుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ అశోక్, డివిజన్ నాయకులు నరసింహ, కాసుల మహేష్‌గౌడ్, మధురానగర్ బస్తీ అధ్యక్షుడు చెట్టి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



# సుప్రీం తీర్పుకు వ్యతిరేకంగా 21న భారత్ బంద్


నినాదాలు చేస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

పంజగుట్ట: సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా ఈ నెల 21వ తేదీన భారత్ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ సర్వయ్య తెలిపారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమితి కో కన్వీనర్‌లు జి.చెన్నయ్య, సి.హెచ్.రాంచదర్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దేశవ్యాప్తంగా ఉన్న దళితులు, ఆదివాసీల మనోభావాలు, ఆత్మగౌరవం దెబ్బతీసేలా ఉందన్నారు. అన్ని వర్గాలవారి అభిప్రాయాలు తీసుకోకుండా రాజకీయ స్వార్థంతో ఇచ్చిన తీర్పుగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ తీర్పును పున:పరిశీలించి వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని, వర్గీకరణ చట్టబద్ధంగా చెయ్యాలని, అన్ని రాష్ట్రాల అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. సుప్రీం తీర్పుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉన్న ఆదివాసీలు, దళితులు, విద్యార్థి సంఘాలు, భారత్ బంద్‌లో పాల్గొని విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జి.వినోద్, శ్రీనివాస్, బాలకృష్ణ, వనిత, లింగస్వామి, వెంకటేశ్వర్, మోహన్, బలవంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

## బెల్టుషాపులపై దాడులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్‌నెం 45లోని అంబేడ్కర్ కాలనీ, సీబీఐ కాలనీ బస్తీల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ బస్తీల్లో ఇద్దరు వ్యక్తులు అక్రమంగా బెల్టుషాపులు ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అంబేడ్కర్ కాలనీబస్తీకి చెందిన కొమ్ము శేఖర్ వద్ద 113 మద్యం సీసాలు, సీబీఐ కాలనీలోని కర్రయ్య వద్ద 115 వివిధ రకాల మద్యం సీసాలను సీజ్ చేసినట్లు తెలిపారు. అదే విధంగా వీరిపై అక్రమంగా మద్యం విక్రయిస్తున్నందుకు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

# పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు పెంచాలి

లిబర్టీ: హైదరాబాద్ మహానగరాన్ని నిరంతరం పచ్చదనం, పారిశుద్ధ్యంతో ఉండేలా శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ. 24 వేల పెంచాలని మున్సిపల్ లేబర్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డి.ప్రీతం సింగ్ కోరారు. ఆదివారం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వారితో పాటు ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులకు సరైన వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ప్రస్తుతం ఇస్తున్న రూ. 18 వేలు సరిపోవడం లేదని, పీఎఫ్, ఈఎస్ఐ, ఇతర కట్టింగ్‌లుపోను కార్మికులకు వచ్చేది రూ. 12 వేల నుంచి రూ.13 వేలు మాత్రమే అన్నారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మున్సిపల్ శాఖను రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా చూస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి స్పందించి వేతనాలు పెంచాలని ప్రీతంసింగ్ కోరారు. ఈ విలేకరుల సమావేశంలో దిలీప్‌సింగ్, మధు తదితరులున్నారు.

## సీఎండికి అభినందనలు

వెంగళరావునగర్: తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ 1535 నాయకులు ఆదివారం ఆ శాఖ సీఎండీని మర్యాద పూర్వకంగా కలిశారు. టీజీఎస్పీడీసీఎల్‌కు చెందిన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని గతంలో అనేకమార్లు తమ యూనియన్ తరపున అధికారులకు వినతిపత్రాలను అందజేశామని తెలిపారు. కాగా ఇటీవల టీజీఎస్పీడీసీఎల్‌కు చెందిన దాదాపు మూడువేల మంది ఉద్యోగులకు సీఎండీ ముషారఫ్ ఫారూఖీ పదోన్నతులు కల్పించారని నేతలు పేర్కొన్నారు. తమ అభ్యర్థనను పరిగణలోనికి తీసుకుని ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిన సీఎండీకి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాను కప్పి అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా 1535 వ్యవస్థాపక అధ్యక్షులు వజీర్‌కు కూడా కృతజ్ఞతలు తెలిపారు. సీఎండీని కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రమోద్‌కుమార్, కె.శ్రీనివాస్, యూనియన్ నేతలు లింగం, సురేష్, సాయి, సోనీ, రాజు, వసంత తదితరులు ఉన్నారు.

## 29న గీతా ఫౌండేషన్ 18వ వార్షికోత్సవం

ఫౌండేషన్ చైర్మన్ బెలూర్ యోగీష్ ప్రభు వెల్లడి

కాచిగూడ: గీతా ఫౌండేషన్ 18వ వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 29వ తేదీన రవీంద్రభారతిలో నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ బైలూర్ యోగీష్ ప్రభు వెల్లడించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్దల్లో జ్ఞానం, పిల్లల్లో చైతన్యం తీసుకురావడమే గీతా ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. దీనిలో భాగంగా విష్ణు సహస్రనామ పారాయణం, భగవద్గీత శ్లోకాలపై విద్యార్థులకు పోటీలు, భజన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి జూపల్లి కృష్ణారావు, జె.డి.లక్ష్మీనారాయణ, అర్చక సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బనరస్ బాబా స్వామీజీ, బడేసాబ్, కంట మనోహర్ రెడ్డి, రామకృష్ణ చంద్రమౌళి, మనోహర్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ తల్లికి బోనాల సమర్పణ

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని బాబూనాయుడు నగర్ బస్తీలో కొలువుదీరిన శ్రీముత్యాలమ్మ తల్లి అమ్మవారి బోనాల వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే వందలాది మంది మహిళలు బోనాలు ఎత్తుకుని డప్పుల హోరు, శివసత్తుల పూనకాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి విచ్చేసి మొక్కులు సమర్పించారు. దీంతో ఆలయ పరిసరాల్లో జాతర వాతావరణం నెలకొంది. ఆలయ ఫౌండర్ చైర్‌పర్సన్ మంత్రి భాగ్యలక్ష్మీ దశరథరావు అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు.

## పీపుల్స్ ప్లాజా వద్ద నిరసన

ఖైరతాబాద్: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటన నేపథ్యంలో నిందితులను కఠినంగా శిక్షించాలని, మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడకుండా కఠినమైన చట్టాలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పీపుల్స్ ప్లాజా లవ్ హైదరాబాద్ వద్ద ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజ్ స్టూడెంట్స్, డాక్టర్లు పాల్గొన్నారు.

## పబ్‌ల్లో ఎక్సైజ్ పోలీసుల విస్తృత తనిఖీలు

బంజారాహిల్స్: ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో పబ్‌ల్లో తనిఖీలు నిర్వహించారు. రాత్రి 10 నుంచి 12 గంటల వరకు 36 డౌన్ టౌన్, ఫోర్గ్, క్వోరా, అమ్నేషియా, గ్రీస్ మంకీ, తబులారస, స్టోన్ వాటర్స్, ఫ్రోస్ట్, బేబీలోన్ తదితర 12 పబ్‌ల్లో ఈ తనిఖీలు జరిగాయి. ప్రధానంగా ఈ తనిఖీల్లో డ్రగ్స్ వాడకం, డ్రగ్స్ సంబంధిత నేరాలపై దృష్టిపెట్టారు. అనుమానితులపై స్పాట్ డ్రగ్ టెస్టింగ్ కిట్‌తో పరీక్షలు చేశారు. డ్రగ్ ఫ్రీ సిటీగా హైదరాబాద్‌ను మార్చేందుకు రెగ్యులర్‌గా ఈ తనిఖీలు కొనసాగుతాయని ఈ సందర్భంగా వారు తెలిపారు. పబ్ నిర్వాహకులు కస్టమర్లను క్షుణ్ణంగా తనిఖీ చేశాకే అనుమతించాలని, పబ్ సిబ్బంది ఎవరైనా డ్రగ్ సంబంధిత నేరాలకు పాల్పడితే ఆ పబ్ లైసెన్స్ రద్దు చేయబడుతుందని జూబ్లీహిల్స్ ఎక్సైజ్ సీఐ వాసుదేవరావు పబ్ యజమానులకు సూచించారు. నిరంతర నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. డ్రగ్స్ సంబంధిత నేరాలపై సమాచారం ఉండే వారు 8712659638 నెంబర్‌కు సమాచారం అందించి సహకరించాలని కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

## కెమెరాలు అద్దెకు తీసుకొని...

తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తిపై కేసు

వెంగళరావునగర్: కెమెరాలు అద్దెకు తీసుకుని తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం ... కళ్యాణ్‌నగర్‌కు చెందిన సి.హెచ్.రాజాఅన్వేష్ ఎల్లారెడ్డిగూడలో కెమెరాలను కిరాయికి తిప్పుతుంటాడు. గత నెల 28న కుషాయిగూడకు చెందిన నందగిరి నరేందర్, ఎస్.ఉమేష్‌లు ఎల్లారెడ్డిగూడలోని రాజా అన్వేష్ షాపునకు వచ్చి రూ.2.50 లక్షల విలువైన కెమెరాలు, లెన్స్‌లు, బ్యాటరీలు, చార్జర్లు తీసుకెళ్లారు. ఆ సమయంలో రోజుకుం రూ.1500 కిరాయి చెల్లిస్తానని చెప్పారు. తొలిరోజు అద్దె ఇచ్చిన ఇరువురు మూడు రోజులైనా కిరాయి పంపలేదు. నరేందర్‌ను అద్దె విషయంపై ఎన్నిసార్లు అడిగినా ఇవ్వలేదు. దీంతో బాధితుడు నరేందర్ ఆధార్‌కార్డును కెమెరా అసోసియేషన్ గ్రూప్‌లో పెట్టి విషయాన్ని తెలియజేశాడు. ఈ నెల 1న ఆనంద్ నుంచి నరేందర్ కెమెరాలు, లెన్స్ అద్దెకు తీసుకున్నాడు. 17వ తేదీన నరేందర్ మళ్లీ మోహముక్తార్ షాపునకు వెళ్లి కెమెరాలు అద్దెకు కావాలని అడిగాడు. దీంతో అప్పటికే వాట్సప్ గ్రూప్‌లో అతని ఆధార్‌కార్డు వివరాలను చూసిన ముక్తార్ వెంటనే రాజా అన్వేష్‌కు విషయాన్ని తెలిపి నరేందర్‌ను పట్టుకుని మధురానగర్ పీఎస్‌కు తీసుకువచ్చాడు. అనంతరం నిందితుడిపై రాజా అన్వేష్, ముక్తార్‌లు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కాచిగూడ సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను పున:ప్రారంభించాలి

పంజగుట్ట: మాజీ ప్రధాని పీ.వీ.నరసింహారావు చేతులమీదుగా ప్రారంభమై ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వంటి ఎంతోమంది గొప్పవారికి ఆశ్రయం ఇచ్చిన కాచిగూడ (నింబోలి అడ్డ) సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను పున:ప్రారంభించాలని హాస్టల్ పూర్వ విద్యార్థుల కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ ప్రతినిధులు బొమ్మెర రామ్మూర్తి, సంగమేశ్వర్, సునీల్‌లు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోనే ఎంతో చరిత్ర కలిగిన హాస్టల్ కాచిగూడ హాస్టల్ అని దీన్ని ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ కూడా సందర్శించడం విశేషమన్నారు. ఈ హాస్టల్‌లో ప్రస్తుత మంత్రులతో పాటు ఎంతో మంది ప్రముఖులు గడిపారని తెలిపారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా యూనివర్సిటీ తరువాత అంతటి కీలకపాత్ర పోషించిందన్నారు. అలాంటి హాస్టల్ 2019 కరోనా సాకుతో మూసివేయించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అయినా హాస్టల్‌ను తెరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బోయిన శ్రీనివాస్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



# పాపన్నగౌడ్‌కు ఘన నివాళి


రహమత్‌నగర్‌లో నివాళులు అర్పిస్తున్న సీఎన్ రెడ్డి


నివాళులు అర్పిస్తున్న బాబా ఫసియుద్దీన్

రహమత్‌నగర్ (బోరబండ): సర్దార్ సర్వాయి పాపన్న 374 జయంతి వేడుకలు రహమత్‌నగర్, బోరబండ డివిజన్‌లలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బోరబండ సైట్–2 సర్వాయి పాపన్న కమ్యూనిటీ హాల్ వద్ద గౌడ సంఘం నాయకులు లక్ష్మణ్‌గౌడ్, పోచయ్యగౌడ్‌ల నేతృత్వంలో జరిగిన వేడుకల్లో జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ పాల్గొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాసుల మహేష్‌గౌడ్, శంకర్‌గౌడ్, గణేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా రహమత్ నగర్‌లో ఏర్పాటు చేసిన వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పాల్గొన్ని సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎక్బాల్, షరీఫ్, మన్సూర్, రామకృష్ణ, లింగమూర్తి, రవిశంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## మార్కెట్లలో 'రాఖీల' సందడి


రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

బంజారాహిల్స్: రాఖీ పండుగ సందర్భంగా మార్కెట్లలో కొనుగోళ్ల సందడి నెలకొంది. సోమవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా తమ సోదరులకు రాఖీలు కట్టేందుకు వాటిని కొనుగోలు చేసేందుకు పెద్ద ఎత్తున మహిళలు రాఖీలు కొనుగోలు చేసేందుకు మార్కెట్లకు తరలివచ్చారు. విభిన్న రకాల రాఖీలతో పాటు బంగారు, వెండి రాఖీలు మార్కెట్లలో వ్యాపారులు అందుబాటులో ఉంచారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, శ్రీనగర్ కాలనీ, అమీర్‌పేట్ ప్రాంతాల్లో రాఖీల విక్రయాలకు వ్యాపారులు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు.

## గ్రీన్‌పార్కు హోటల్‌లో..
## నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం..

**సనత్‌నగర్:** రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. అమీర్‌పేట గ్రీన్‌పార్క్ హోటల్‌లో జరిగే ఈ వేడుకలకు రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మీడియా అకాడమీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ హనుమంతరావు, ముఖ్యమంత్రి కార్యాలయ సీపీఆర్వో అయోధ్యరెడ్డితో పాటు పలువురు అధికారులు పాల్గొననున్నారు. ఫొటోగ్రఫీ విభాగంలో విశేష సేవలు అందించిన పలువురు ఫొటోగ్రాఫర్లకు అవార్డులు అందజేసి సన్మానించనున్నారు.

## యువతులతో అసభ్య ప్రవర్తన
### పబ్ బయట మందుబాబుల వికృత చేష్టలు

**గచ్చిబౌలి:** పబ్ నుంచి బయటకు వస్తున్న యువతులను దుర్భాషలాడుతూ కొందరు మందుబాబులు అసభ్యంగా ప్రవర్తించారు. గచ్చిబౌలి పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు... సనస్‌సిటీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రశాంత్ కుమార్ తివారి తన స్నేహితురాలితో కలిసి గచ్చిబౌలిలోని ఎస్ఎల్ఎన్ టెర్మినస్‌లో గల క్రాస్‌బ్రీడ్ పబ్‌కు వెళ్లాడు. స్నేహితురాలు, మరో యువతితో కలిసి రాత్రి 1.30 గంటలకు పబ్ నుంచి బయటకు వచ్చాడు. ప్రధాన ద్వారం వద్ద అప్పటికే అక్కడ గుమికూడిన 15 మంది మందుబాబులు యువతులను దర్భాషలాడుతూ అసభ్యంగా ప్రవర్తించారు. ఇందేటని ప్రశ్నించిన ప్రశాంత్‌పై పడిగుద్దుల వర్షం కురిపించారు. స్నేహితురాలి ఐ ఫోన్, తన చేతికున్న బ్రాస్‌లెట్ లాక్కెళ్లారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్ఎల్ఎన్ టెర్మినస్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

## మెట్రోకు కేంద్రం
# నిధులు వచ్చేనా?...



### రెండో దశకు కేంద్రం నిధులపై ఆశలు
- త్వరలో డీపీఆర్ అందజేసే అవకాశం
- ఇప్పటికే పలుమార్లు ప్రధానిని కలిసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- పూణె, థానే, బెంగళూర్ నగరాల్లో మెట్రోకు కేంద్రం నిధులు

**సాక్షి, సిటీబ్యూరో:** మెట్రో రెండో దశ నిర్మాణానికి నిధుల సేకరణ ప్రధాన సవాల్‌గా మారింది. వివిధ మార్గాల్లో చేపట్టనున్న మెట్రో రెండోదశకు ఇప్పటి వరకు సుమారు రూ.24 వేల కోట్లకు పైగా నిధులు అవసరమని అంచనా. ముచ్చర్ల వరకు పొడిగిస్తే మరో రూ.10 వేల కోట్లకు పైగా వెచ్చించాల్సి ఉంటుంది. మరోవైపు మెట్రో మొదటి దశ ప్రాజెక్టును పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో నిర్మించడం వల్ల ప్రభుత్వానికి భారంగా మారలేదు. కానీ రెండో దశ ప్రాజెక్టును పూర్తిగా ప్రభుత్వమే నిర్మించాలని తలపెట్టింది. ఈ క్రమంలో రూ.వేల కోట్ల అంచనాలతో కూడిన ఈ ప్రాజెక్టుకు కేంద్రం సహకారం తప్పనిసరి. కేంద్రప్రభుత్వం నుంచి పెద్ద మొత్తంలో నిధులు లభిస్తే తప్ప ఈ ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టును చేపట్టడం సాధ్యం కాదు. తాజాగా మహారాష్ట్రలోని పూణె, థానే నగరాలకు, బెంగళూర్‌లో మూడోదశ మెట్రో విస్తరణకు నిధులను విడుదల చేసేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదించింది. కానీ హైదరాబాద్ మెట్రో రెండో దశపై మాత్రం కేంద్రం నుంచి ఇప్పటివరకు ఎలాంటి సానుకూలత వ్యక్తం కాలేదు. మెట్రో రెండోదశతో పాటు మూసీ ప్రక్షాళన, అభివృద్ధి ప్రాజెక్టు కోసం కేంద్రం నిధులను కోరుతూ పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రులు, ప్రధాన మంత్రిని సైతం సంప్రదించారు. కానీ ఇటీవల బడ్జెట్‌లో కేంద్రం మొండిచెయ్యే చూపించింది. మూసీ ప్రాజెక్టుకు ఒక్క రూపాయి కూడా విదిలించలేదు. మెట్రో రెండో దశపై హైదరాబాద్ మెట్రో రైల్ ఇప్పటికే డీపీఆర్ (డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్)ను సిద్ధం చేసింది.రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి లభించిన వెంటనే కేంద్రం ఆమోదానికి అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

### అప్పట్లో డీపీఆర్‌పై స్పందన కరువు...

బీహెచ్ఈఎల్ నుంచి లకిడికాపూల్ వరకు, నాగోల్ నుంచి ఎల్‌బీనగర్ వరకు మెట్రో నిర్మాణానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో డీపీఆర్‌ను రూపొందించి కేంద్రానికి అందజేసినప్పటికీ కేంద్రం నుంచి ఎలాంటి స్పందన లభించలేదు. నాగోల్-రాయదుర్గం తర్వాత ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే బీహెచ్ఈఎల్- లకిడికాపూల్ రూట్‌లో మెట్రో నిర్మాణానికి సుమారు రూ.9100 కోట్ల ఆర్థిక సహాయాన్ని ఆశిస్తున్నట్లు ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది.ఈ మేరకు మాజీమంత్రి కేటీఆర్ కేంద్ర మంత్రులను ప్రత్యక్షంగా కలిసి నిధుల అంశాన్ని ప్రస్తావించారు. అయినా ఎలాంటి సానుకూలత లభించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వమే రెండో దశ నిర్మాణానికి ప్రణాళికలను రూపొందించింది. బీహెచ్ఈఎల్-లకిడికాపూల్, నాగోల్-ఎల్‌బీనగర్, ఎంజీబీఎస్-ఫలక్‌నుమా రూట్‌లతో పాటు నగరం నలువైపులా మెట్రో విస్తరణకు కార్యాచరణ చేపట్టారు. హైదరాబాద్ మహానగర విస్తరణను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రెండు దశలుగా మెట్రో నిర్మాణం చేపట్టనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అలాగే ఎయిర్ పోర్టుమెట్రో నిర్మాణానికి రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్టు వరకు అలైన్‌మెంట్ ఎంపికతో పాటు, పెగ్‌మార్కింగ్ వంటి పనులు కూడా చేపట్టింది. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో పాత ప్రణాళికలను రద్దు చేసి కొత్తగా మెట్రో రెండోదశకు ప్రణాళికలను రూపొందించారు. నాగోల్ నుంచి, పాతబస్తీ నుంచి ఎయిర్‌పోర్టు వరకు మెట్రో విస్తరణకు చర్యలు చేపట్టారు. అలాగే ఎల్‌బీనగర్-హయత్‌నగర్, మియాపూర్-బీహెచ్ఈఎల్, రాయదుర్గం-అమెరికన్ కాన్సులేట్‌తో పాటు తాజాగా కోకాపేట్ వరకు మెట్రో పొడిగించాలని ప్రతిపాదించారు. ఎయిర్‌పోర్టు రూట్‌లోనే మైలార్‌దేవ్‌పల్లి నుంచి హైకోర్టు వరకు మరో లైన్ నిర్మించనున్నారు. మొదట 70 కిలోమీటర్లు భావించినప్పటికీ తరువాత 78.4 కిలోమీటర్లకు పెరిగింది. తాజాగా ఎయిర్‌పోర్టు నుంచి ముచ్చర్ల వరకు పొడిగించాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. దీంతో మొదట అంచనా వేసినట్లుగా రూ.24 వేల కోట్లు కాకుండా, రూ.35 వేల కోట్లకు పైగా పెరిగే అవకాశం ఉంది.

### నిధుల సేకరణ ఎలా...

మెట్రో రెండో దశ నిధుల సేకరణపైన ప్రభుత్వం వివిధ మార్గాలపైన దృష్టి సారించింది.కేంద్రం నుంచి కనీసం 50 శాతం నిధులు లభిస్తే మరో 35 శాతం నిధులను జైకా, ప్రపంచబ్యాంకు వంటి సంస్థల నుంచి రుణాల రూపంలో సేకరించనున్నట్లు అధికారులు తెలిపారు. మిగతా 15 శాతం నిధులను ప్రభుత్వం భరించనుంది. కేంద్రం అందజేసే నిధులపైనే ప్రభుత్వం భారీగా ఆశలు పెంచుకుంది. కానీ మూసీ ప్రాజెక్టుకు పైన ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా తీవ్ర నిరాశకు గురి చేయడంతో మెట్రో రెండో దశకు కేంద్రం నుంచి ఎలాంటి స్పందన లభించనుందనేది చర్చనీయాంశంగా మారింది.

## గవర్నర్‌కు సత్కారం



**హబ్సిగూడ:** ఉప్పల్‌లోని శిల్పారామంలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## పబ్‌లలో స్నిఫర్ డాగ్ హల్‌చల్..



**బంజారాహిల్స్:** జూబ్లీహిల్స్‌లోని పలు పబ్‌లలో శనివారం అర్ధరాత్రి జూబ్లీహిల్స్ లా అండ్ ఆర్డర్ పోలీసులు డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. డ్రగ్స్ ఆనవాళ్లపై స్నిపర్ డాగ్‌తో అణువణువూ గాలించారు. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-36లోని లుఫ్ట్, డౌన్‌టౌన్, ఫోర్జ్, లీవ్‌వాంటేజ్, స్టోన్ వాటర్ తదితర ఐదు పబ్‌ల్లో ఈ తనిఖీలు జరిగాయి. ప్రతి కస్టమర్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. కిచెన్, బార్‌రూమ్, డీజే తదితర ప్రాంతాల్లో సోదా చేశారు. ఇటీవలి కాలంలో డీజేల వద్ద కూడా డ్రగ్స్ దొరుకుతుండడంతో వారే లక్ష్యంగా ఈ సోదాలు కొనసాగాయి.

## సుచిత్రలో లలిత జ్యువెలర్స్ షోరూం ప్రారంభం



**కుత్బుల్లాపూర్:** నాణ్యమైన బంగారు, వెండి ఆభరణాలను ప్రజలకు అందుబాటు ధరల్లో అందించడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం ఆయన జీడిమెట్ల డివిజన్ సుచిత్రలో లలిత జ్యువెలర్స్ 56వ బ్రాంచ్‌ను మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లలిత జ్యువెలర్స్ యాజమాన్యం ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం లలిత జ్యూవెలర్స్ యాజమాన్యం కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వివేకానంద్‌ను ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో లలిత జ్యువెల్లర్స్ ఎండీ కిరణ్, సినీ నిర్మాత బండ్ల గణేష్, కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, లలిత జ్యువెల్లర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కళలపై మక్కువ పెంచుకోవాలి



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**మంత్రి జూపల్లి కృష్ణారావు**

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** విద్యార్థిని, విద్యార్థులు కలలపై మక్కువ పెంచుకుని కలలు, కళారూపాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని టూరిజం, సంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో దేశభక్తి గీతాలకు నృత్యనీరాజనం పేరిట సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ నేటి చదువులు చట్టబండలయ్యాయని, విద్యార్థులు క్రమ శిక్షణ, పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. మన సంస్కృతి కూడా పూర్తిగా చిన్నాభిన్నం అయ్యిందని, జీవన విధానం ధ్వంసమవుతోందని, అన్ని రంగాలు కలుషితం అవుతున్నాయని ఆదన వ్యక్తం చేశారు. సృష్టిలో మానవ జన్మ గొప్ప వరమని, దానిని సార్థకం చేసుకోవాలని సూచించారు. ఉన్న సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డ్రగ్ కల్చర్ అనేది స్కూల్స్‌కు కూడా పాకుతుందని యువత చెడు అలవాట్లకు లోను కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మనల్ని మనం ప్రశ్నించుకుంటేనే మన ఆలోచనలు, నిర్ణయాలు సక్రమంగా ఉంటాయన్నారు. పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోకపోతే చెడు జరిగే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం, కూచిపూడి నాట్యాలతో పాటు వివిధ సంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సంస్థ పక్షాన నాట్య గురువులను సత్కరించారు. తెలంగాణ బాలోత్సవం ఉపాధ్యక్షురాలు కె.సుజావతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షులు భూపతివెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి బుచ్చిరెడ్డి, ఎస్.వినయ్‌కుమార్, నాట్య గురువు మాడబూసి రమణ సిద్ధి, మమత, బ్రాహ్మణి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## కఠిన చట్టాలతోనే దాడులకు అడ్డుకట్ట

**కవాడిగూడ:** డాక్టర్లపై దాడులను అరికట్టేందుకు చట్టాలను కఠినతరం చేయాలని డాక్టర్లు శాంతకుమారి, సుభాకర్ అన్నారు. కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ ఆదివారం ఇందిరా పార్కు ధర్నా చౌక్‌లో ది అబ్‌స్ట్రిక్స్ గైనకాలజికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. నిందితులను రాజకీయాలకు అతీతంగా కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. దేశంలో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా పటిష్టమైన చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రుల్లో డాక్టర్లు విధులు నిర్వహించే చోట కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటు రక్షణ కల్పించాలన్నారు. చంద్ర మండలానికి వెళ్లామని చెప్పుకోవడం కాదని, సమాజంలో మహిళలకు రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఓ వైద్యురాలిపై మాత్రమే జరిగిన ఘటన కాదని, యావత్ మహిళా సమాజంపై జరిగిన దాడికిగా పేర్కొన్నారు. ఈ ఘటనపై రాజకీయ పలు స్వచ్ఛంద మహిళా సంఘాలు స్పందించకపోవడం విచారకరమన్నారు. ప్రతి మెడికల్ కాలేజీ ఆసుపత్రులలో ఉమెన్ సెల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ర్యాలీలో మహిళా డాక్టర్లు, జూనియర్ డాక్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సర్వాయి పాపన్నను ఆదర్శంగా తీసుకోవాలి



పాపన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎం.వీ రమణ, బాలరాజ్‌గౌడ్ తదితరులు

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** జమిందార్లు, జాగీరుదార్ల అరాచకాలను సహించలేక కల్లు గీసే కత్తిని పక్కనపెట్టి ఖడ్గం చేతబట్టి మొగలుల ఆధిపత్యాన్ని ఎదురించి గోల్కొండ కోటను జయించిన గొప్ప వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ .రమణ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సర్వాయి పాపన్న 374 జయంతి వేడుకలను టీపీఎస్‌కే, కల్లుగీత సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రమణ మాట్లాడుతూ బహుజనుల విముక్తి కోసం పాపన్న చేసిన పోరాటాలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఆయన చేసిన పోరాటాలను అగ్రకుల పెత్తందారులు వెలుగులోకి రాకుండా అడ్డుకున్నా బహుజనులు ఆయనకు నీరాజనం పడుతున్నారన్నారు. ట్యాంక్‌బండ్‌పై పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, జనగామ జిల్లాకు పాపన్న పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల కమిటీ చైర్మన్ బాలగొని బాలరాజ్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. పాపన్న స్ఫూర్తితో గౌడలు రాజకీయాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేజీకేఎస్ కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, టీపీఎస్‌కే కన్వీనర్ భూపతివెంకటేశ్వర్లు, కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి స్కైల్యాబ్‌బాబు, ఉడతల రవీందర్, కోట రమేష్, గుమ్మడిరాజు నరేష్, కృష్ణస్వామి పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు 'హైడ్రా' తరహా వ్యవస్థ అవసరం

**కాచిగూడ:** ఆక్రమణ జరిగితే కొద్దిపాటి నష్టమే జరుగుతుందని, కానీ పర్యావరణానికి హాని తలపెడితే వ్యవస్థకే తీవ్రనష్టం జరుగుతుందని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్‌పీహెచ్ రంగయ్య అన్నారు. పర్యావరణ పరిరక్షణకు హైడ్రా తరహా వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఆయన ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చెట్ల పరిరక్షణకు వాల్టా యాక్ట్, ప్లాస్టిక్ నియంత్రణకు మైక్రాన్ నియంత్రణ జీవోలు, పరిశుభ్రత కోసం మున్సిపాలిటీ విభాగం ఉన్నా ఆయా విభాగాల ఉదాసీనత పర్యావరణానికి పెను శాపంలా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేక పర్యావరణ సమస్యలు భయపెడుతున్నాయన్నారు. చెట్లను విచ్చలవిడిగా నరికినా పట్టించుకునే అధికారి లేరని, రసాయనాలు చెరువుల్లో, జలాశయాల్లో వదిలినా పట్టించుకునే అధికారి లేరని, రసాయనాలు చెరువుల్లో, జలాశయాల్లో వదిలినా గుర్తించే వ్యవస్థ లేకుండా పోయిందన్నారు. నెల రోజుల క్రితం ఏర్పాటైన హైడ్రా అనేక అద్భుతాలు చేస్తోందని, కమిషనర్ రంగనాథ్ చెరువుల పరిరక్షణకు చేస్తున్న కృషి సామాజిక భావ జాలికులను ఉత్తేజితులను చేసేలా ఉందన్నారు.

## ప్రతి ఫొటో వెనుక ఎంతో సమాచారం

- ప్రదర్శనలో 42 మంది ఫొటోగ్రాఫర్‌లు, 42 ఫొటో చిత్రాలు
- ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు నిర్వహణ



ఫొటోలను తిలకిస్తున్న టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎ.వాణీ ప్రసాద్ తదితరులు

### ఆర్ట్‌గ్యాలరీలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ ఎగ్జిబిషన్ ప్రారంభం

**మాదాపూర్:** ఫొటోగ్రాఫర్‌లు తీసిన చిత్రాలు అద్భుతంగా ఉన్నాయని తెలంగాణ టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీ ప్రసాద్ అన్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రపంచ ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్‌లు తీసే ప్రతి ఫొటో వెనుక ఎంతో సమాచారం దాగి ఉంటుందన్నారు. వారు తీసే ఫొటోలు దేశభవిష్యత్తును సైతం మారుస్తాయన్నారు. 42 మంది ఫొటోగ్రాఫర్‌లు తీసిన 42 చిత్రాలను ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శన ఈనెల 25 వరకు ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి, డైరెక్టర్ ఐపీఎస్ విశ్వేస్‌దర్ రెడ్డి, డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.







## కోల్‌కతా ఘటనలో నిందితులను ఉరి తీయాలి



మర్రిచెట్టు సర్కిల్‌లో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**మణికొండ:** సభ్య సమాజం తలదించుకునేలా కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం చేసి దారుణంగా హత్యకు పాల్పడిన వ్యక్తులను వెంటనే ఉరి తీయాలని మణికొండ వాసులు డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం మణికొండ మర్రిచెట్టు సర్కిల్‌లో బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. ధన్‌రాజ్, సీనియర్ నాయకుడు సీతారాం, లతాగౌడ్ మాట్లాడుతూ ఒక మహిళా డాక్టర్‌కే దేశంలో రక్షణలేకపోతే సామాన్య మహిళల పరిస్థితి ఏమిటన్నారు. మన రాష్ట్రంలోనూ మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. మహిళల జోలికి వెళ్లాలంటే భయపడేలా కఠిన శిక్షలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితులను ఉరి తీయాలన్నారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నవీన్‌కుమార్, నాయకులు లక్ష్మణ్‌రావు, దిలీప్‌కుమార్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఐఏఎస్ఈలో బీఈడీ, ఎంఈడీ గెస్ట్ లెక్చరర్స్ నోటిఫికేషన్

**సాక్షి, సిటీబ్యూరో:** ప్రభుత్వ ఉన్నత అధ్యయన సంస్థ (జీఐఏఎస్ఈ) మాసాబ్‌ట్యాంక్‌లో బీఈడీ, ఎంఈడీ కోర్సుల్లో బోధనకు గెస్ట్ లెక్చరర్స్‌ను ఆహ్వానిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. అర్హత కలిగిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలతో ఈ నెల 14 నుంచి 21వ తేదీ సాయంత్రం 4.30 గంటల వరకు గవర్నమెంట్ ఐఏఎస్ఈ డోర్ నెం:10-3-312, ఎస్‌ఎండీసీ, హైదరాబాద్‌లో అందజేయాలని సూచించింది. ఫిలాసఫీ లెక్చరర్ పోస్టుకు ఫిలాసఫీలో పీజీ, ఎంఈడీ, సైకాలజీ లెక్చరర్ పోస్టుకు సైకాలజీలో పీజీ, ఎంఈడీ, సోషియాలజీ లెక్చరర్‌కు సోషియాలజీలో పీజీ, ఎంఈడీ, రీసెర్చ్ మెథడాలజీ లెక్చరర్‌కు ఏదైనా ఫౌండేషన్ సబ్జెక్టులో లేదా మెథడాలజీలో పీజీ, ఏదైనా రీసెర్చ్ డిగ్రీ, ఎంఫిల్ లేదా పీహెచ్‌డీ/నెట్/స్లెట్‌లతో పాటు ఎంఈడీ అర్హత ఉండాలని పేర్కొంది. అలాగే స్టాటిస్టిక్స్ లెక్చరర్, ఇంగ్లిష్, ఐసీటీ/కంప్యూటర్ ఎడ్యుకేషన్‌లో లెక్చరర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ లెక్చరర్, విజువల్ ఆర్ట్స్, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్‌లో లెక్చరర్ పోస్టుల్లో ఖాళీలున్నట్లు వెల్లడించింది. పీజీ, ఎంఈడీలో కనీసం 55 శాతం అర్హత మార్కులు కలిగి ఉండాలంది. మరిన్ని వివరాలకు 9963119534 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించింది.

## అర్హులందరికీ విదేశీ విద్య స్టైఫండ్ ఇవ్వాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

**కాచిగూడ:** అర్హులందరికీ విదేశీ విద్య స్టై ఫండ్ ఇవ్వాలని, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణతో కలిసి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సమావేశమై విద్యార్థుల సమస్యలపై చర్చించారు. అనంతరం ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విదేశాలకు వెళ్లి ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులకు కోర్సుకు రూ. 20 లక్షల స్టైఫండ్ మంజూరు చేస్తున్నదన్నారు. అయితే బీసీ విద్యార్థుల్లో 300 మందికి మాత్రమే స్టైఫండ్ మంజూరు చేస్తున్నారని తెలిపారు. బీసీలకు ఇది ఏమాత్రం సరిపోవడం లేదని, ఇంకా 90 శాతం మంది విద్యార్థులు అర్హత ఉన్నా ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్లలేక పోతున్నారన్నారు. 2000 మంది బీసీ విద్యార్థులకు విదేశీ విద్య స్టైఫండ్ ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఒక శాతం జనాభాగల బ్రాహ్మణుల్లో 100 మందికి ఇస్తున్నారని, 52 శాతం ఉన్న బీసీల్లో కేవలం 300 మందికి మాత్రమే ఇవ్వడం దారుణమన్నారు. బీసీల న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా తనవంతు కృషి చేస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చినట్లు ఆర్.కృష్ణయ్య తెలిపారు.

## నూతన ఆవిష్కరణలతోనే బయో ఎకానమీ అభివృద్ధి

**రాయదుర్గం:** నూతన ఆవిష్కరణలతోనే దేశంలో బయో ఎకానమీ పెరుగుదల సాధ్యమని ఫెడరేషన్ ఆఫ్ ఏషియాన్ బయోటెక్ అసోసియేషన్స్(ఎఫ్ఏబీఏ) ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ పల్లు రెడ్డన్న అన్నారు. ఆదివారం ఎఫ్ఏబీఏ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో హెచ్‌సీయూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ సహకారంతో 'లైటింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ఇన్నోవేషన్' అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలతో ఉత్పత్తి ప్రారంభిస్తేనే వాటి విలువ పెరిగి ఆర్థికంగా ఎదిగేందుకు దోహదం చేస్తుందన్నారు. ప్రస్తుతం దేశంలోఔషధాలు, వ్యాక్సిన్, ఫార్మా, జనరిక్ మందుల ఉత్పత్తి జరుగుతుందన్నారు. అయితే నూతన ఆవిష్కరణలతో ఉత్పత్తులు జరిగితే ఎగుమతులు చేయడం ద్వారా ఆర్థికంగా ఎదగడమేకాకుండా భారత్ అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన చేరడానికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. జీవశాస్త్రంలో అధునాతనమైన రీతిలో అభివృద్ధి జరగాల్సిన అవసరం ఉందన్నారు. నేటి తరం యువత, విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో బీఐఆర్ఏసీ ప్రతినిధి డాక్టర్ జితేందర్ కుమార్, ఎస్పైర్ బయోనెస్ట్ ప్రతినిధులు ప్రొఫెసర్ యోగేశ్వరరావు, ప్రొఫెసర్ గోవర్ధన్ మెహతా, డాక్టర్ ఆనంద్‌కుమార్, డాక్టర్ ఆనంద్ గోవిందలూరి, ఏవిపిఎస్ చక్రవర్తి, ఫ్రాంక్‌పి టల్లూటో, తొల్లా ఉబైది ప్రసంగించారు. జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర స్థాయి పలు పరిశోధనా సంస్థలు, ఉన్నతవిద్యా, శిక్షణా కేంద్రాల ప్రతినిధులు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

### పలువురికి అవార్డుల ప్రదానం

ఈ సందర్భంగా పలువురికి అవార్డులను అందించారు. వివిధ కేటగిరీల్లో వారి ప్రతిభ ఆధారంగా డాక్టర్ రీమారావత్ డాక్టర్ వై సుబ్బారావు, సందీప్, ప్రగ్యాగుప్తా, సౌమ్యా స్వామినాథన్, డాక్టర్ రాహుల్ పుర్వార్‌లకు అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం పలువురు ప్రముఖులను సన్మానించారు.






మాట్లాడుతున్న ఎఫ్ఏబీఏ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ రెడ్డన్న

## 'ఎందుకు సోషలిస్టు విప్లవం' పుస్తకావిష్కరణ



**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** ప్రముఖ రచయిత షేక్ అబ్దుల్ ఖరీం రచించిన 'ఎందుకు సోషలిస్టు విప్లవం' పుస్తకాన్ని ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కమ్యూనిస్టు యూనిటీ సెంటర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు జంపన్న మాట్లాడుతూ అబ్దుల్ ఖరీం వివిధ సందర్భాల్లో సామాజిక మాధ్యమాల్లో రాసిన వ్యాసాలను పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమన్నారు. వామపక్ష విప్లవ రాజకీయాలకు కేంద్రంగా ఉన్న తెలుగు సమాజంలో ప్రస్తుతం మార్క్సిస్టు రాజకీయాలు క్షీణించాయన్నారు. కమ్యూనిస్టు ఉద్యమాలు బలోపేతం చేసినప్పుడే సామాన్యులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీయూసీ కార్యదర్శి బత్తిన శ్రీనివాస్‌రావు, వివిధ సంఘాల నేతలు కే.జీ.రామచంద్రారెడ్డి, మురహరి, డాక్టర్ వెంకటేశ్వర్లు, సాంబమూర్తి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 19, ఆగస్టు, 2024



## వికారాబాద్ అరణ్యం... విజయాల నైపుణ్యం...

ఐటీ నిపుణుడిగా ఉన్న గచ్చిబౌలి నివాసి హరి.కె.పాటిబండ బర్డర్‌గా మారి పక్షుల వేట ప్రారంభించారు. అయితే అది తుపాకితో కాదు కెమెరాతో..పక్షులతో ప్రేమలో ఆయన సాగించిన ఛాయాచిత్ర బంధం... వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీలో అత్యుత్తమ పురస్కారాన్ని అందించింది. అంతర్జాతీయ స్థాయిలో '35 అవార్డ్స్' అనే రష్యన్ గ్రూప్ ఏటా నిర్వహించే ఫొటోగ్రఫీ పోటీల్లో ఈయన తీసిన ఫొటో పురస్కారాన్ని అందుకుంది. దాదాపుగా 4.65 లక్షల ఫొటోగ్రాఫ్స్‌తో పోటీపడి ఆయన తీసిన ఫొటో ఈ ఘనత సాధించడం విశేషం. గత చలికాలం సీజన్‌లో వికారాబాద్‌లోని అనంతగిరి అడవుల పరిసరాల్లో ఆయన ఈ ఫొటో తీశారు. 'మాటిల్డ్ వుడ్ ఓల్ అనే ఓ రకం గుడ్లగూబను డ్రొంగో అనే పేరున్న కాకి తరహాలోని పక్షి వేటాడడం అనుకోకుండా నా కెమెరాలో చిక్కింది' అంటూ గుర్తు చేసుకున్నారు హరి. ఆ అనుకోని దృశ్యమే ఆయన్ను అనూహ్యమైన పురస్కారం వరించేలా చేసింది.


హరి.కె.పాటిబండ


సుచరితా సింగ్

## గడ్డకట్టించే చలిలో.. కట్టిపడేసిన దృశ్యం...

'హిమాచల్ ప్రదేశ్‌లోని పేరొందిన చంద్రాతల్ లేక్‌లోని చిత్రం ఇది. అత్యంత చల్లని వాతావరణంలో వణికే చేతులతో తీశాను. రోడ్లు బాగోకపోవడంతో సహా చాలా కష్టాలున్నా.. వాటన్నింటినీ ఆ అద్భుత అరుదైన దృశ్యం మరిపించింది' అంటూ గుర్తు చేసుకున్నారు సుచరితా సింగ్. వెస్ట్ మారేడ్‌పల్లిలో నివసించే ఈ గృహిణి భర్త నుంచి స్ఫూర్తి పొంది అభిరుచి మేరకు ఫొటోగ్రఫీని చేపట్టారు. అనుకోకుండా ఆమె తీసిన ఫొటో సోనీ కంపెనీ అవార్డుకు అర్హురాలిగా చేసింది. 'గత 10 సంవత్సరాల నుంచీ ఫొటోగ్రఫీలో ఉన్నా.. చాలా ప్రాంతాలు పర్యటించాను. నాకు మా ఆయనకు ఇది ఒక కామన్ హాబీ' అని చెబుతారు నగరంలో ఓ ప్రైవేట్ గేమింగ్ కంపెనీకి హెచ్ఆర్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సుచరితా సింగ్.



# క్లిక్ క్లిక్ హుర్రే..

### అవార్డులు కొల్లగొడుతున్న సిటీ ఫొటోగ్రాఫర్స్..

నగర ఫొటోగ్రఫీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు

అంతర్జాతీయ పురస్కారాలలోనూ ముందంజ



సిటీ ఛాయాచిత్ర విశేషాలకు నిలయం... అంతేకాదు అద్భుతమైన ఛాయాగ్రాహకులకు కూడా. వృత్తి రీత్యా ఫొటోగ్రఫీని చేపట్టినవారిని అలా ఉంచితే... నగరంలో విభిన్న రంగాల్లో స్థిరపడిన వారు.. హాబీగా కెమెరాలకు పనిచెబుతున్నవారు కూడా ఉన్నారు. వీరు ఫొటోగ్రఫీలో అద్భుతమైన టాలెంట్ చూపెట్టి అవార్డులు సైతం దక్కించుకోవడం విశేషం.. అలాంటివారిలో కొందరి గురించి...

- సాక్షి, సిటీబ్యూరో

**నేడు వరల్డ్ ఫొటోగ్రఫీ డే**




## ల్యాండ్ స్కేప్‌లో ఫుల్ స్కోప్..


జితేంద్ర

'అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న యోసెమిటి నేషనల్ పార్క్‌లో నేను తీసిన ఫొటోకి ఫొటోగ్రఫీ సొసైటీ ఆఫ్ ఇండియా ల్యాండ్ స్కేప్ కేటగిరీలో అవార్డు అందించారు' అని చెప్పారు నగరంలోని రాజ్‌భవన్ రోడ్‌లో నివసిస్తూ ఓ ప్రైవేట్ కంపెనీలో మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న జితేంద్ర. తన చిన్ననాటి ప్యాషన్ కోసం ఏడాదికి కనీసం 60 రోజులు ఫొటోగ్రఫీపై వెచ్చిస్తుంటానంటున్న ఆయన దశాబ్దంన్నర ఫొటోజర్నీలో మరికొన్ని అవార్డులు కూడా ఉన్నాయి. 'రిటైర్‌మెంట్ తర్వాత దీన్ని పూర్తి స్థాయి ప్రొఫెషన్‌గా మార్చుకుందాం అనుకుంటున్నా' అని చెబుతున్న జితేంద్ర.. ఉద్యోగ విరమణ తర్వాత మరిన్ని పురస్కారాలను సిటీకి అందిస్తారని ఆశించవచ్చు.




మసూద్ హుస్సేన్



## వైల్డ్‌లైఫ్‌లో... ఆస్కార్ లాంటి అవార్డ్ మనదే..

'ఒక హాబీగా 2009లో వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ స్టార్ట్ చేశాను. ఈ పదిహేనేళ్లలో నెలకు వారం చొప్పున దేశంలో వైల్డ్‌లైఫ్‌కు పేరొందిన ప్రాంతాలన్నీ చుట్టేశాను' అంటూ చెప్పారు గాంధీనగర్‌లో నివసించే బిజినెస్ మ్యాన్ మసూద్ హుస్సేన్. తన అరుదైన అభిరుచి కోసం ఆయన చేసిన కృషికి సంతృప్తితో పాటు సన్మానాలూ దక్కాయి. ముఖ్యంగా వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్లు ఆస్కార్‌తో సమానంగా భావించే నేచురల్ హిస్టరీ మ్యూజియం వారి వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్ పురస్కారం సైతం ఆయన నగరానికి తీసుకురాగలిగారు. తెలుగు రాష్ట్రాల్లో ఎవరికీ అందని ఈ పురస్కారంతో పాటు.. ఎస్ బ్యాంక్ అందించే నేచురల్ క్యాపిటల్ అవార్డ్–2022, టోక్యో ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫర్ అవార్డ్, యునైటెడ్ నేషన్స్ నుంచి బెస్ట్ బర్డ్ ఫొటోగ్రాఫర్ అవార్డ్.. ఇలా ఆయన వైల్డ్ లైఫ్ విభాగంలో 15 ఏళ్లుగా అవార్డులు అందుకుంటూనే ఉన్నారు. 'ఫొటోగ్రఫీ గొప్ప ఆర్ట్ మాత్రమే కాదు బెస్ట్ కెరీర్ కూడా' అంటున్న ఆయన పాఠశాలల్లో వర్క్‌షాప్స్ నిర్వహిస్తూ ఫొటోగ్రఫీని ప్రోత్సహిస్తున్నారు.





## సెప్టెంబర్ 9 నుంచి మహాలయ పక్ష మోక్ష స్థల యాత్ర



సాక్షి, సిటీబ్యూరో: భారతీయ రైల్వేల ఆధ్వర్యంలోని భారత్ గౌరవ్ స్కీమ్‌లో భాగంగా నడుపుతున్న ప్రైవేట్ ట్రైన్ సౌత్ స్టార్ రైల్‌తో కలిసి 'టూర్ టైమ్స్' తమ ఆధ్యాత్మిక యాత్ర షెడ్యూల్ ప్రకటించింది. ఈ విషయాన్ని నగరంలో ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. మహాలయ పక్ష మోక్ష స్థల యాత్ర పేరిట ఇది ప్రయాగ్, గయ, కాశి, అయోధ్య, మథుర, ఉజ్జయిని, ఓంకారేశ్వర్, సోమ్‌నాథ్, ద్వారక, బెట్ ద్వారక, నాగేశ్వర్, మాతృగయలను చుట్టేస్తూ 15 రోజులపాటు కొనసాగుతుందని పేర్కొన్నారు. మరచిపోలేని అనుభూతులు పంచే ఈ యాత్ర పితృపక్షాల సందర్భంగా పెద్దలకు పిండ ప్రదానం సమర్పించేందుకు గొప్ప అవకాశమని వివరించారు. వచ్చే నెల 14 నుంచి 28వ తేదీ వరకూ ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలోని సికింద్రాబాద్, కాజీపేట్‌లలో ఆగే ఈ ప్రత్యేక రైలులో సీసీటీవీతోపాటు ఆన్‌బోర్డ్ అనౌన్స్‌మెంట్, కోచ్ సెక్యూరిటీ, విందు వినోదాలు అన్నీ అందుబాటులో ఉంటాయన్నారు.



## డిజిటల్ యుగంలో టెక్ స్కిల్ తప్పనిసరి

సాక్షి, సిటీబ్యూరో: ఈ డిజిటల్ యుగంలో సాంకేతిక, సమాచార రంగంలో నైపుణ్యం యువతకు తప్పనిసరి అని టెక్ నిపుణులు అభిప్రాయపడ్డారు. విద్యార్హతతో సంబంధం లేకుండా ప్రతీ ఒక్కరూ టెక్నాలజీ స్కిల్స్ సంతరించుకోవాలన్నారు. పదోతరగతి విద్యార్హత కలిగిన యువత సైతం టెక్నాలజీ ఆధారిత కెరీర్‌లోకి ప్రవేశించేందుకు వీలుగా ఎల్‌టీఐ మైండ్ ట్రీ ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఐటీలో సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలు అందించారు. ఈ స్నాతకోత్సవంలో భాగంగా నగరంలో శిక్షణ పొందిన 80 మందికిపైగా విద్యార్థులను సన్మానించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ) ధార్వాడ్ ఎడ్యుకేషనల్ భాగస్వామిగా, ఎడ్యునెట్ ఫౌండేషన్ ఇంప్లిమెంటేషన్ పార్ట్‌నర్‌గా గత ఏడాది జనవరిలో ఈ కార్యక్రమం ప్రారంభించినట్టు నిర్వాహక సంస్థ ప్రతినిధులు తెలిపారు.

## అమెజాన్‌లో రక్షాబంధన్ స్టోర్

సాక్షి, సిటీబ్యూరో: రక్షాబంధన్ వేడుకల్ని పురస్కరించుకుని ఆన్‌లైన్ షాపింగ్ వేదిక అమెజాన్ డాట్ ఇన్ ప్రత్యేకంగా రక్షాబంధన్ స్టోర్‌ను అందిస్తోంది. తోబుట్టువులకు మరచిపోలేని అనుభూతులను బహుమతులుగా ఇవ్వాలని అనుకునేవారి కోసం వైవిధ్యభరిత ఎంపికలను అందిస్తున్నామని, ఫ్యాషన్, ఫుడ్, టెక్నాలజీ తదితర కేటగిరీల్లో డిజైనర్ రాఖీలు, లిండిట్, ఇన్‌స్టామ్యాక్స్, టైటాన్, నాయిస్ తదితర బ్రాండ్స్ ఉత్పత్తులు వందల సంఖ్యలో అందుబాటులో ఉన్నాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కలెక్షన్ ఈ నెల 20 వరకూ కొనసాగుతుందన్నారు.

**నేడు రాఖీ పండుగ..**

# మై డియర్ బ్రదర్.. లవ్ యూ సిస్టర్

మరో అమ్మగా ప్రేమను పంచే సోదరి

అనుభూతులు పంచుకున్న ప్రముఖులు



### ప్రతీ అడుగులో సోదర–సోదరీ అనుబంధం

అన్నాచెల్లెలు.. అక్కాతమ్ముడు.. ఒక కొమ్మకు పూసిన పువ్వులు.. ఒక గూటిలో వెలిగిన దివ్వెలు.. తోడబుట్టిన బంధం ఆత్మీయతల హరివిల్లు.. అనురాగాలు, అనుబంధాల పొదరిల్లు.. చిన్ననాటి చెలిమి.. పెరిగి పెద్దయ్యాక బలిమి.. అన్నా.. అంటే నేనున్నా.. అని ఆపదలో చెల్లికి అభయహస్తం.. అమ్మా–నాన్నల తరువాత అంతటి ఆత్మీయబంధం ఏదైనా ఉందంటే.. అది సోదర–సోదరీ బంధమని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కాసింత తెలివితేటలు వచ్చే వరకే తల్లిదండ్రులు.. ఆపైన అంతా అక్కాతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్లే. ఇంతటి జన్మజన్మల బంధాన్ని వేడుకలా చేసుకునే రక్షాబంధన్ కోసం ప్రతీ ఒక్కరూ ఎదురుచూస్తుంటారు. ఏడాదంతా ఎలా గడిచినా, రాఖీ పౌర్ణమి నాడు మాత్రం వారి ప్రేమనంతా పోగేసుకుని సంబరాలు జరుపుకుంటారు. ఇలా తమ జీవితంలో మధురమైన సోదర–సోదరీ బంధాల గురించి పలువురు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. రక్షాబంధన్ నేపథ్యంలో వారి అనుభవాలు, అనుభూతులు వారి మాటల్లోనే... - సాక్షి, సిటీబ్యూరో/శ్రీనగర్ కాలనీ

### సర్'ప్రైజ్' ఇచ్చాను..



నా తమ్ముడిది నాది తల్లీ కొడుకుల అనుబంధం. అమ్మానాన్న లేకపోవడంతో తమ్ముడు మహేష్‌చంద్రను కొడుకులానే చూసుకున్నాను. మహేష్ చిన్నోడైనా కష్టాలు చుట్టిముట్టిన సమయంలో ఆత్మస్థైర్యాన్ని నింపుతూ తోడునీడలా ఉన్నాడు. షూటింగ్స్ కానీ, ఇతర వ్యక్తిగత విషయాల్లోగానీ సపోర్ట్‌గా ఉన్నాడు. తనకు ఏడేళ్ల వయసు ఉన్నప్పుడు మా అమ్మ మరణించింది. నేను జాబ్ చేస్తుంటే.. అప్పటి వరకు అమ్మ బాగోగులు, ఇంటి పనులు అన్నీ తానే చూసుకునేవాడు. చివరకు అమ్మ మరణించినప్పుడు తన వయస్సు చిన్నదైనా అన్నీ తానై కార్యక్రమాలు నిర్వహించాడు. అలా ఒకరికొకరం ఆత్మీయతను పంచుకుంటూ పెరిగాం. ఏడాది క్రితం జాబ్‌లో చేరిన మహేష్... ఏడాదంతా తన జీతాన్ని దాచి, ఈసారి రాఖీకి బహుమతిగా గోల్డ్–ప్లాటినం బ్రాస్‌లెట్ చేయించాడు. ఇంకా ఆ సంతోషంలోనే ఉన్నాను. ఓసారి స్కూల్‌లో ఓ అవార్డుకు మహేష్ సెలెక్ట్ అయ్యాడు. నన్ను సర్‌ప్రైజ్ చేయాలనే ఉద్దేశంతో పేరెంట్స్ మీటింగ్ ఉందని పిలిచాడు. కానీ, అదే కార్యక్రమానికి నేను ముఖ్యఅతిథిగా వెళ్లి అవార్డు ప్రదానం చేసి నేనే తమ్ముడికి సర్‌ప్రైజ్ ఇచ్చాను. మా ఇద్దరికీ ఇది మరచిపోలేని జ్ఞాపకం. –రోజా భారతి, నటి

### టామ్ అండ్ జెర్రీ లాగే..

చెల్లి సోనీ, నేను ఒక దగ్గర ఉంటే.. టామ్ అండ్ జెర్రీల్లాగే పోట్లాడుకుంటాం. ఒకరినొకరం ఏడిపించుకుంటుంటాం. కానీ, మా మధ్యలో మూడో వ్యక్తి ఎవరైనా వస్తే వాళ్ల పని ఖతమే. ఏదో పండుగకో, పుట్టినరోజుకో గిఫ్టులు ఇచ్చుకోవడం మాకు అలవాటు లేదు. ఎప్పుడు తను ఏది అడిగినా కొనిస్తుంటా. ఎక్కడికైనా వెళ్లినప్పుడు ఏదైనా నచ్చితే తీసుకొచ్చి మా చెల్లికి ఇస్తుంటా. సోనీ కూడా నా కోసం ఏదో ఒకటి తెస్తూ ఉంటుంది. నా పని విషయంలో సోనీయే పెద్ద క్రిటిక్. ముందుగా సోనీ నా పాటలను విని ఓకే చేసిన తర్వాతే వేరే ఎవరికైనా వినిపిస్తా. ప్రతి విషయాన్ని ముందుగా సోనీతోనే పంచుకుంటుంటా. ప్రతి విషయంలో నాకు పిల్లర్‌గా సపోర్టు చేస్తుంటుంది. ఇక, ఇద్దరం కలిసి చాలా టూర్స్ వెళ్లాం. అది ఎవరికీ తెలియకుండా సీక్రెట్‌గా ప్లాన్ చేస్తాం. అన్నీ ఓకే అయి బయల్దేరే ముందే అమ్మ, నాన్నకు చెప్పేవాళ్లం. 8 ఏళ్ల కింద చెల్లి పుట్టినరోజున తన పేరును నా చేతిపై టాటూగా వేయించుకున్నా. అప్పుడు తను చాలా ఎమోషనల్ అయింది. తనపై నాకున్న ఇష్టాన్ని అంతకన్నా బాగా చెప్పలేను కదా! అది జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేని సందర్భం. పూజితతో నా పెళ్లి విషయంలో కూడా మొదటి నుంచీ సోనీయే సపోర్టుగా ఉంది. ఇప్పుడు పూజిత, సోనీ కలిసి నన్ను ఆడుకుంటున్నారు.


- సాకేత్, సింగర్

### రాఖీ పండుగ మా ఇంట్లో స్పెషల్



రాఖీ పండుగ మా ఇంట్లో చాలా స్పెషల్.. మా అన్నయ్య వంశీ కార్తీక్ అంటే నాకు చాలా ఇష్టం. చిన్నతనం నుంచి ఓ నాన్నలా నన్ను ప్రోత్సహించి, ముందుండి నడిపించాడు. డిజిటల్ మీడియా, సినీ ఇండస్ట్రీలోకి అమ్మాయిలు వెళ్లాలంటే ఆలోచిస్తారు. కానీ, నేను కచ్చితంగా మంచిస్థాయిలో ఉంటానని నమ్మి నాకు గాడ్‌ఫాదర్‌లా నిలబడ్డాడు. ఇద్దరం కెరీర్ పరంగా చాలా కష్టాలను ఎదుర్కొన్నాం. నేడు ఇద్దరం మంచిస్థానాల్లో ఉన్నాం. నాకు తండ్రిలా నడిపించిన మా అన్నయ్యకు, నాకు అన్నివిధాలుగా వెన్నుతట్టే అన్నయ్యలు వందేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని రాఖీ పండుగ శుభాకాంక్షలు. - హారిక, నటి

### అత్యద్భుత బంధం మాది..

అనితర సాధ్యమైన అద్భుత..ఆత్మీయ బంధం మాది. మధురమైన జ్ఞాపకాలతో, షరతులు లేని ప్రోత్సాహంతో ఎల్లప్పుడూ ఒకరికొకరు అండగా ఉంటాం. క్రీడలు, చదువులు ఇలా ఏ విషయంలోనైనా నా తమ్ముడు అగస్త్య నిరంతరం మద్దతుగా నిలిచాడు. నా కంటే చిన్నవాడైనప్పటికీ కీలక నిర్ణయాల్లో తమ్ముడి భాగస్వామ్యం ఉంటుంది. ముఖ్యంగా కఠినమైన శిక్షణ సమయాల్లో, సవాల్‌తో కూడిన టోర్నీల్లో పాల్గొనే సమయంలో ఆత్మస్థైర్యాన్ని నింపే కోచ్‌గా నాకు మార్గనిర్దేశం చేస్తూ, ప్రోత్సహిస్తాడు. మల్లె పూల కన్నా.. మంచు పొరల కన్నా, నెమిలి హొయల కన్నా, సెలయేటి లయల కన్నా.. మా బంధం అందమైనదని చెప్పగలను. పాకిస్తాన్‌లో బంగారు పతకాలు సాధించి దక్షిణాసియా ఛాంపియన్‌గా నిలవడం ఓ మధుర జ్ఞాపకం. ఈ ఫైనల్స్‌కు ముందు ఫోన్ కాల్‌లో నా సోదరుడు 'భారత్ మాతా కీ జై' అంటూ గోల్డ్ మెడల్ కోసం నన్ను ప్రోత్సహించిన శక్తివంతమైన మాటలు నాకింకా గుర్తున్నాయి. నేను కట్టిన రాఖీకి రిటర్న్ గిఫ్ట్‌గా తను ఇచ్చిన టేబుల్ టెన్నిస్ రాకెట్ నా ఫేవరెట్. నేషనల్ ఛాంపియన్‌షిప్ సమయంలో నాతో పాటే ఉండమని అడిగినప్పుడు.. అగస్త్య తన డిగ్రీ 2వ సంవత్సరం పరీక్షను వదిలి మరీ వచ్చాడు. - నైనా జైస్వాల్, ప్రముఖ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి



### భాయ్.. తమ్ముడు.. అన్నయ్య

ఈసారి మార్కెట్లో కాస్త వెరైటీ రాఖీలు దర్శనమిస్తున్నాయి. రాఖీల పైన భాయ్, తమ్ముడు, అన్నయ్య పేర్లు వచ్చేలా అందంగా తీర్చిదిద్దారు. కాస్త కొత్తగా.. విభిన్నంగా ఉండడంతో ఈ రాఖీలను కొనేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఇక ఫ్యాషన్ కూడా తోడవడంతో రాఖీలు కొత్తరూపాలను సంతరించుకుంటున్నాయి. సంస్కృతీ సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూనే మోడ్రన్‌గా ఉండే రాఖీలను ఎక్కువగా ఇష్టపడుతున్నారు.



## క్లుప్తంగా...

### రేపు కవిత బెయిల్ పిటిషన్ విచారణ

**విచారించనున్న జస్టిస్ బీఆర్ గవాయి ధర్మాసనం**



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం విచారించనుంది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు సవాల్ చేస్తూ ఈడీ, సీబీఐ కేసుల్లో బెయిల్ కోరుతూ కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బీఆర్‌గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించనుంది. ఈ నెల 12న ఈ పిటిషన్ విచారణకు వచ్చినపుడు దర్యాప్తు సంస్థల వాదనలు విన్న తర్వాతే నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం వెల్లడించిన సంగతి తెలిసిందే.

### దక్షిణ డిస్కంలో భారీగా పదోన్నతులు

**ఒకేరోజు 2263 మందికి పదోన్నతి**



సాక్షి, హైదరాబాద్: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) చరిత్రలో తొలిసారిగా ఒకే రోజు భారీ స్థాయిలో 2263 మంది ఉద్యోగులకు పదోన్నతి కల్పించారు. ఈ మేరకు సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఆదేశాలు జారీ చేశారు. ఇంజనీరింగ్ విభాగంలో 101, అకౌంట్స్ విభాగంలో 47, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ విభాగంలో 2099, పీ అండ్ జీ విభాగంలో 16 మందికి పదోన్నతులు లభించాయి. ఎస్ఈ నుంచి సీఈగా ఇద్దరు, డీఈ నుంచి ఎస్ఈగా 8 మంది, ఏడీఈ నుంచి డీఈగా 30, ఏఈ నుంచి ఏడీఈగా 58 మంది, జేఎల్ఎం నుంచి ఏఎల్ఎంకు 1650 మంది, అకౌంట్స్ విభాగంలో జీఎం నుంచి సీజీఎంగా ఇద్దరు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ నుంచి జీఎంగా ఇద్దరు పదోన్నతి పొందారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈ నెల 8న దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో సమీక్ష నిర్వహించినప్పుడు.. 2017 నుంచి పదోన్నతులు పెండింగ్‌లో ఉండటాన్ని కొందరు అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లడం తెలిసిందే. దీనికి మంత్రి స్పందిస్తూ వెంటనే పదోన్నతులు ఇవ్వాలని ఆదేశించారు. పదోన్నతులతో కింది స్థాయి పోస్టుల్లో ఏర్పడిన ఖాళీలను ప్రత్యక్ష నియామకాల ద్వారా భర్తీ చేయనున్నారు.

### కాంచీపురం వరమహాలక్ష్మి సిల్క్స్ కొత్త షోరూమ్ ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన పట్టు వస్త్రాల నిలయం కాంచీపురం వరమహాలక్ష్మి సిల్క్స్ సంస్థ హైదరాబాద్‌లో మరో కొత్త షోరూమ్‌ను ప్రారంభించింది. నగరంలోని జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36లో ఈ కొత్త షోరూమ్‌ను ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ప్రారంభించినట్లు ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సంప్రదాయ పట్టు వస్త్రాలను రూపొందించడంలో కాంచీపురం వరమహాలక్ష్మి సిల్క్స్‌ది అందెవేసిన చేయన్నారు. ఇక కొత్తగా ప్రారంభమైన ఈ షోరూమ్‌లో అన్నిరకాల కాంచీపురం పట్టు చీరలు, బెనారస్, ఉప్పాడ, ధర్మవరం పట్టు చీరలు వినియోగదారులకు సరసమైన ధరల్లో లభిస్తాయని సంస్థ యాజమాన్యం వెల్లడించింది.

### ఇద్దరిపై శునకాల దాడి



వెంకటేశ్ కాలిని తీవ్రంగా గాయపరిచిన కుక్క

ఇబ్రహీంపట్నం: వేర్వేరు ప్రాంతాల్లో కుక్కలు జరిపిన దాడిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మంచాల రోడ్డులో నివసించే వెంకటేశ్ (45) ఆదివారం ఉదయం పనిమీద బయటికి రాగా.. అకస్మాత్తుగా ఓ శునకం వెనుకనుంచి కాలిని గట్టిగా పట్టి కరిచింది. చేతి వేలిని సైతం కరవడంతో లోతుగా గాయమైంది. తీవ్ర గాయాలతో వెంకటేశ్ ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించుకున్నాడు. మంచాల మండలం ఆగా పల్లికి చెందిన శ్రీనివాస్ (57)పై ఆ గ్రామంలో కుక్కలు దాడి చేసి కరిచాయి. అతను కూడా ఇబ్రహీంపట్నం ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. ఇటీవల రాయపోల్ గ్రామంలో ఓ బాలుడు కుక్క కాటుతో చికిత్స పొందుతూ మృతి చెందడం తెలిసిందే.



చేతి వేలికి అయిన గాయం

# డీఎంకే బాటలో బీఆర్ఎస్!

**పార్టీ బలోపేతంపై నాయకత్వం దృష్టి ● డీఎంకే, బీఆర్ఎస్‌ల ప్రస్థానంలో పోలికలున్నాయనే భావన**

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ త్వరలో బీజేపీలో విలీనమవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అంటుంటే, బీజేపీలో కాదు.. కాంగ్రెస్‌లో కలిసిపోతుందంటూ బీజేపీకి చెందిన కేంద్ర మంత్రి బండి సంజయ్ అంటున్నారు. కొంతకాలంగా ఎవరికి వారు ఈ విధమైన ప్రచారం చేస్తున్నారు. అయితే జాతీయ పార్టీల్లో తమ పార్టీ విలీనంపై ఆయా పార్టీల నేతలు చేస్తున్న ప్రచారాన్ని ఎప్పటికప్పుడు ఖండిస్తున్న బీఆర్ఎస్.. మరోవైపు పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి సారించింది. ఇందుకోసం అనుసరించాల్సిన మార్గాలను అన్వేషిస్తోంది. ఆటుపోట్లను అధిగమిస్తూ దేశ రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ప్రాంతీయ పార్టీల పనితీరును నిశితంగా పరిశీలిస్తోంది. ముఖ్యంగా స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలో ప్రాంతీయ పార్టీగా అవతరించి నేటికీ దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తున్న ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే) నిర్మాణం, పనితీరుపై బీఆర్ఎస్ దృష్టి సారించింది.

#### డీఎంకేతో అనేక పోలికలు

తమిళనాడుకు చెందిన డీఎంకే తరహాలోనే తమది కూడా ఉద్యమ పార్టీ కావడంతో రెండు పార్టీల నడుమ అనేక సిద్ధాంతపరమైన పోలికలు ఉన్నట్లు బీఆర్ఎస్ భావిస్తోంది. తమిళ చరిత్ర, సంస్కృతి, ఆత్మగౌరవం తదితరాలను పార్టీ సిద్ధాంత భూమికగా కలిగి ఉన్న డీఎంకే రీతిలోనే తమ పార్టీ కూడా తెలంగాణ ఆత్మకు ప్రతీకగా నిలుస్తోందని పార్టీ నేతలు చెప్తున్నారు. డీఎంకే సుమారు 75 ఏళ్లుగా తమిళనాడు రాజకీయాలను శాసిస్తోంది. అదే రీతిలో బీఆర్ఎస్ కూడా సుమారు 24 ఏళ్లుగా తెలంగాణ రాజకీయాల్లో కీలక శక్తిగా మారింది. 234 అసెంబ్లీ స్థానాలున్న తమిళనాడులో పలుమార్లు ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చిన డీఎంకే..కొన్నిసార్లు అతితక్కువ స్థానాలకే పరిమితమైంది. 1991లో కేవలం 2 స్థానాలు, 1984, 2011లో కేవలం 25లోపు అసెంబ్లీ స్థానాల్లోనే గెలుపొందింది. బీఆర్ఎస్ కూడా రాష్ట్రంలో వరుసగా రెండు పర్యాయాలు అధికారంలోకి రాగా.. గత ఏడాది ఎన్నికల్లో మాత్రం ఓటమి పాలయ్యింది. దీంతో ఈ విషయంలోనూ డీఎంకేతో పోలిక ఉన్నట్లుగా బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు.



బీఆర్ఎస్‌ను మరో 50 ఏళ్ల పాటు తెలంగాణ రాజకీయాల్లో ప్రబల శక్తిగా నిలిపేలా బలోపేతం చేస్తామని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఇటీవల చెప్పారు. ఈ నేపథ్యంలో పార్టీ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నేతృత్వంలో ఆంజనేయ గౌడ్, తుంగ బాలు వంటి యువ నేతలు చెన్నైలోని డీఎంకే ప్రధాన కార్యాలయం 'అన్నా అరివాలయం'ను సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది. డీఎంకేలో సుదీర్ఘకాలంగా కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉన్న ఆర్ఎస్ భారతితో వారు భేటీ అయ్యారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, అనుబంధ విభాగాలైన యువజన, విద్యార్థి, మహిళా విభాగాల పనితీరు, సోషల్ మీడియా వింగ్ కార్యకలాపాలు తదితరాలను అడిగి తెలుసుకున్నారు. నాలుగు తరాలుగా పార్టీతో కేడర్ మమేకమైన తీరు, క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకలాపాలపై ఆరా తీశారు. తిరువళ్లువర్, పశ్చిమ చెన్నై జిల్లాల్లోనూ పర్యటించిన బాల్క సుమన్ బృందం తాము పరిశీలించిన అంశాలను పార్టీ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు.

#### డీఎంకే సంస్థాగత నిర్మాణం, కార్యకలాపాల పరిశీలన

ఉద్యమ పార్టీగా ప్రస్థానం ప్రారంభించి రెండు పర్యాయాలు అధికారంలో ఉన్నప్పటికీ ఇటీవలి ఎన్నికల్లో పరాజయం పాలైన నేపథ్యంలో.. సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన డీఎంకే ఆటుపోట్లను ఎలా అధిగమించిందనే అంశాన్ని అధ్యయనం చేయాలని బీఆర్ఎస్ భావిస్తోంది. కేటీఆర్ నేతృత్వంలోని పార్టీ సీనియర్ నేతల బృందం సెప్టెంబర్‌లో చెన్నైలో పర్యటించనుంది. క్షేత్ర స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు డీఎంకే సంస్థాగత నిర్మాణంతో పాటు ఇతర అంశాలను వారం రోజుల పాటు ఈ బృందం అధ్యయనం చేయనుంది. అలాగే దేశంలోని మరికొన్ని క్రియాశీల ప్రాంతీయ పార్టీల పనితీరును.. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, ఒడిశాలో బిజూ జనతాదళ్ (బీజేడీ) పనితీరును కేటీఆర్ బృందం ప్రత్యక్షంగా అధ్యయనం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

#### తృణమూల్, బీజేడీ పనితీరుపై కూడా..!

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు అవసరమైన కార్యాచరణపై పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు కసరత్తు చేస్తున్నారు. రాబోయే రోజుల్లో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సంస్థాగత నిర్మాణం, శిక్షణ తదితరాలను ముమ్మరం చేయాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ నాటికి డీఎంకేతో పాటు మరికొన్ని బలమైన ప్రధాన ప్రాంతీయ పార్టీల పనితీరుపై అధ్యయనం పూర్తి చేయాలని, అధ్యయనంలో తేలిన అంశాలను దృష్టిలో ఉంచుకుని పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేలా కార్యాచరణకు పదును పెట్టాలని బీఆర్ఎస్ నాయకత్వం భావిస్తోంది.

#### ఆ తర్వాతే సంస్థాగత నిర్మాణంపై దృష్టి



# పింఛన్లపై పిడుగు

**పేదల పింఛన్లు భారీగా తొలగించేందుకు చంద్రబాబు కొత్త ఎత్తు**

**ఎన్నో ఏళ్లుగా లబ్ధిదారులుగా ఉన్న వారికి నోటీసులు**

- గ్రామాల్లో మళ్లీ 2014-19 నాటి తరహా జన్మభూమి కమిటీల పెత్తనం
- ప్రత్యర్థి పార్టీ సానుభూతిపరుల పేర్లు తొలగించాలని కూటమి నేతల ఒత్తిళ్లు
- పింఛన్ల తగ్గింపే లక్ష్యం.. తప్పుడు ఫిర్యాదులు మొదలు.. అధికారుల నోటీసులు
- పేర్లు తొలగింపునకు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు వెసులుబాటు
- ఇందులో భాగంగా సాధ్యం కాని అడ్డగోలు నిబంధనలతో నోటీసుల జారీ
- దివ్యాంగ లబ్ధిదారులు 15 రోజుల్లోనే కొత్త సదరం సర్టిఫికెట్ ఇవ్వాలట
- మూడు నెలలకొకసారి సదరం స్లాట్లు విడుదలైతే ఇదెలా సాధ్యం?
- వృద్ధులు మూడు రోజుల్లో ఆధార్ అప్‌డేట్ హిస్టరీ ధ్రువీకరణ ఇవ్వాలట
- ఇంత తక్కువ వ్యవధిలో అధికారులతో సర్టిఫికెట్ ఎలా తెచ్చుకుంటారు?
- పక్కా కుట్ర, కుతంత్రాలతో పింఛన్ ఎగ్గొట్టేందుకే అలవిగాని నిబంధనలు
- కొత్తగా పింఛన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశమే లేదు



పింఛను లబ్ధిదారునికి పల్నాడు జిల్లా శావల్యాపురం ఎంపీడీవో జారీ చేసిన నోటీసు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

### 'ప్రశ్నపత్ర'మే వారి శుభలేఖ



పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం మార్టేరుకు చెందిన ఓ ఉపాధ్యాయురాలు తన పెళ్లి శుభలేఖను ప్రశ్నా పత్రంగా తయారు చేసి స్నేహితులకు పంపిణీ చేసి తన ప్రత్యేకతను చాటుకొంది. మార్టేరుకు చెందిన బంగారం వ్యాపారి నార్కెడమిల్లి సతీష్, రాణి దంపతుల కుమార్తె ప్రత్యూషకు ఈ నెల 23న మార్టేరులో వివాహం జరుగనుంది. ఈ క్రమంలో తన వివాహ పత్రిక వినూత్నంగా ఉండాలని భావించిన ప్రత్యూష స్నేహితులకు పంపిణీ చేసే శుభలేఖను ఎనిమిది ప్రశ్నలుగా విభజించింది. సింగిల్ ఆన్సర్ క్వశ్చన్, మల్టిపుల్ చాయిస్ క్వశ్చన్, ట్రూ, ఫాల్స్ ఆన్సర్ క్వశ్చన్‌గా శుభలేఖలోనే వరుడి పేరు, వధువు పేరు, కన్యాదానం చేసేవారి పేర్లు, పెళ్లి తేదీ, సమయం, పెళ్లి మండపం, విందు సమయం, అందరికీ ఆహ్వానం, బహుమతులు స్వీకరించరు అంటూ ప్రశ్న, జవాబుతో తీర్చిదిద్దిన శుభలేఖను పలువురు ఆసక్తిగా తిలకించి అభినందించారు.

–పెనుగొండ

### నేటి నుంచి ఈవీఎంల పరిశీలన

**అవకతవకలపై ఈసీకి బాలినేని ఫిర్యాదు**

ఒంగోలు అర్బన్: ఈవీఎంల్లో అవకతవకలపై ఈసీకి ఫిర్యాదు అందిన క్రమంలో 12 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలు పరిశీలించాలని ఈసీ ఉత్తర్వులు జారీ చేసింది. సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల్లో అవకతవకలపై ఒంగోలు మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఈసీకి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం నుంచి ఆరురోజుల పాటు రోజుకు రెండు పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలను పరిశీలించనున్నారు. డమ్మీ బ్యాలెట్‌ను ఏర్పాటు చేసి ఫిర్యాదీల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియను కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఒంగోలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, బెల్ కంపెనీ ఇంజనీర్ల సమక్షంలో నిర్వహిస్తారు. ఒంగోలు నియోజకవర్గంలోని 6, 26, 42, 59, 75, 76, 123, 184, 192, 199, 245, 256 పోలింగ్ కేంద్రాల ఈవీఎంలను పరిశీలించనున్నారు.

### శునకమే సోదరుడు!



దండేపల్లి: చనిపోయిన పెంపుడు కుక్కను అన్నగా భావిస్తూ.. ఏటా సమాధి వద్ద రాఖీలు కడుతూ అభిమానం చాటుకుంటున్నారు ఇద్ద రు అక్కా చెల్లెళ్లు. దండేపల్లి మండలం కన్నె పల్లి గ్రామానికి చెందిన మర్రిపెల్లి మల్లయ్య– కమల దంపతులకు 20 ఏళ్ల క్రితం పిల్లల్లేక పోవడంతో ఓ కుక్కను తెచ్చి రాము అని పేరు పెట్టి పెంచుకుంటున్నారు. దాన్ని పెంచుకున్న కొద్ది రోజులకు వారికి ఆడపిల్లలు రమ, రమ్య జన్మించారు. పిల్లలు పుట్టిన కొద్ది రోజులకు కుక్క చనిపోవడంతో తమ పొలం వద్ద సమాధి కట్టించారు. అయితే మల్లయ్య–కమల దంపతుల ఇద్దరు కూతుళ్లు ఆ కుక్కను అన్నయ్య లా భావిస్తారు. ఏటా రాఖీ పౌర్ణమి రోజున పొలం వద్ద ఉన్న కుక్క సమాధి వద్దకు వెళ్లి రాఖీలు కట్టి తమ అభిమానం చాటుకుంటున్నారు.

# ఇక ఊదండి బాకా..

- శ్రీసిటీలో నేడు 16 పరిశ్రమలకు సీఎం చంద్రబాబు మళ్లీ ప్రారంభోత్సవం
- ఎనిమిది పరిశ్రమలకు మళ్లీ భూమి పూజ
- వీటన్నింటిలో గత వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే ఉత్పత్తి ప్రారంభం
- పారిశ్రామికవేత్తలపై కూటమి ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి ఏర్పాట్లు
- పరిశ్రమలు క్యూ కట్టాయని చెప్పుకునేందుకు పాట్లు
- నేడు శ్రీసిటీలో సీఎం చంద్రబాబు పర్యటన



భూమిపూజ జాబితాలో ఉన్న శ్రీసిటీలోని బ్లూస్టార్ పరిశ్రమ

శ్రీసిటీ (వరదయ్యపాళెం): డప్పు కొట్టుకోవడంలో ఏపీ సీఎం చంద్రబాబు తర్వాతే ఎవరైనా అని మరోమారు స్పష్టమైంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన రెండు నెలలకే రాష్ట్రంలో పరిశ్రమలు క్యూ కడుతున్నాయని ఎల్లో మీడియా ద్వారా గ్లోబల్ ప్రచారం చేసుకునేందుకు వ్యూహం రూపొందించారు. శ్రీసిటీ యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి.. గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో ప్రారంభోత్సవాలు చేసిన పరిశ్రమలకే మళ్లీ ప్రారంభోత్సవాలు నిర్వహించేలా ఏర్పాటు చేశారు. అంతా సిద్ధమైపోయాక సీఎం పర్యటనను ఖరారు చేశారు. దీంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన పరిశ్రమలకు ప్రారంభోత్సవాలు, భూమిపూజలు, ఎంఓయూలు మరోమారు చంద్రబాబు చేతుల మీదుగా చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 16 పరిశ్రమలకు నేడు ప్రారంభోత్సవాలు గావిస్తున్నారు. ఎల్జీ పాలిమార్స్, నైడెక్, ఈప్యాక్ డ్యూరబుల్స్, న్యూయోలింక్ టెలి కమ్యూనికేషన్, ఓజీ ఇండియా ప్యాకేజింగ్, జెన్‌లెనిన్ ఇంటర్నేషనల్, బెల్ ఫ్లేవర్స్, జేజీఎల్ మెటల్ కన్వర్టర్స్, త్రినాథ్ ఇండస్ట్రీస్, ఎవర్ షైన్ మౌల్డర్స్, ఆటో డేటా, ఈఎస్ఎస్ కీ కాంపొనెంట్స్, అడ్వైర్ కేబుల్స్, బాంబై కోటెడ్ స్పెషల్ స్టీల్, శ్రీలక్ష్మీ ఆగ్రో ఫుడ్స్ పరిశ్రమలు గత ప్రభుత్వంలో ఏర్పాటై ఉత్పత్తి కూడా ప్రారంభించాయి. ఇప్పుడు వీటికే సీఎం చంద్రబాబు మరోమారు ప్రారంభోత్సవాలు చేయనున్నారు. రూ.1,570 కోట్ల పెట్టుబడులతో ఈ పరిశ్రమలు ఏర్పాటయ్యాయని ప్రచారం చేసుకోనున్నారు. మరో రూ.900 కోట్లతో ఇంకో ఎనిమిది పరిశ్రమలకు భూమి పూజ, ఐదు పరిశ్రమలతో ఎంవోయూ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందులో ప్రధానంగా బ్లూస్టార్ అనే పరిశ్రమ ఏడాది క్రితం ఉత్పత్తులను కూడా ప్రారంభించింది. వెర్మీరియన్ రిహాబ్, ఎన్‌జీసీ ట్రాన్స్‌మిషన్, ఆర్ఎస్‌బీ ట్రాన్స్‌మిషన్, సిద్ధార్థ లాజిస్టిక్స్, టిల్ హెల్త్‌కేర్, ఏజీపీ సిటీ గ్యాస్‌లు కూడా ఇప్పటికే శ్రీసిటీలో ఉత్పత్తులు కొనసాగిస్తున్న పరిశ్రమలు కావడం గమనార్హం. రన్నింగ్‌లో ఉన్న డైకిన్ పరిశ్రమ ఎంఓయూ జాబితాలో ఉండడం పట్ల కూడా స్థానికంగా సర్వత్రా చర్చ జరుగుతోంది. కాగా, సీఎం చంద్రబాబు శ్రీసిటీ పర్యటన వారం క్రితమే ఖరారైనా, గోప్యంగా ఉంచి.. ఏర్పాట్లు చేస్తున్నారు. ముందుగానే వెల్లడిస్తే పాత పరిశ్రమలకు కొత్త ప్రారంభోత్సవాలు చేపడుతున్న కనికట్టు కథ బయట పడుతుందని సమాచారం. సీఎం పర్యటనకు మీడియాను అనుమతించక పోవడం కొసమెరుపు.

#### సీఎం పర్యటన ఇలా..

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుపతి జిల్లా సత్యవేడులోని శ్రీసిటీని సోమవారం సందర్శించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి, అక్కడ నుంచి హెలికాప్టర్ ద్వారా 11.55 గంటలకు శ్రీసిటీకి చేరుకుంటారు. మధ్యాహ్నం 12.10 గంటలకు శ్రీసిటీలోని బిజినెస్ సెంటర్‌కు చేరుకుని అక్కడ 16 పరిశ్రమలకు ప్రారంభోత్సవాలు, మరో ఎనిమిది పరిశ్రమలకు భూమి పూజ, ఐదు పరిశ్రమలకు ఎంఓయూ కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం పరిశ్రమల సీఈఓలతో జరిగే సమావేశంలో పాల్గొని మధ్యాహ్నం 2.40 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి తిరుగు ప్రయాణం అవుతారు.



'మైల్స్ ఆఫ్ స్మైల్స్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. చిత్రంలో డాక్టర్ ఎంఎస్ గౌడ్, రమణాచారి తదితరులు

## ఇది ఓ సాధారణ దంత వైద్యుడి కల

**డాక్టర్ ఎంఎస్ గౌడ్ రచించిన 'మైల్స్ ఆఫ్ స్మైల్స్' పుస్తకాన్ని ఆవిష్కరించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ**

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ దంతవైద్యుడు డాక్టర్ ఎంఎస్ గౌడ్ రచించిన 'మైల్స్ ఆఫ్ స్మైల్స్' పుస్తకాన్ని ఆదివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, దంతవైద్యరంగంపై ఇది ఒక అద్భుతమైన పుస్తకం అని అభివర్ణించారు. పుస్తక రచయిత డాక్టర్ ఎంఎస్ గౌడ్ కృషిని ఆయన అభినందించారు. తెలంగాణలోనే కాకుండా దక్షిణ భారతదేశంలో ఆయన అత్యుత్తమ దంత వైద్యుడిగా గుర్తింపును పొందారని ప్రశంసించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత డాక్టర్ ఎంఎస్ గౌడ్ మాట్లాడుతూ, ఇది తన ఆత్మకథ కాదన్నారు. ఈ పుస్తకం ఒక సాధారణ దంత వైద్యుడి కల అని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో కాస్మెటిక్ డెంటిస్ట్రీని ప్రవేశపెట్టేందుకు తాను ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. ఈ రంగంలో తాను మొట్టమొదటి వైద్యుడినని చెప్పారు. దంత వైద్యం, దంత వైద్య వృత్తికి ప్రాచుర్యం కల్పించడంలో ఏళ్ల శ్రమ దాగి ఉందన్నారు. డెంటిస్ట్‌ను మెడికల్ డాక్టర్‌కు సమానంగా నిలబెట్టడంలో తన లక్ష్యం నెరవేరిందని ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. దంత సమస్యలకు నొప్పి లేకుండా చికిత్స చేస్తున్నట్లు చెప్పారు. డెంటల్ లేజర్, ఇంట్రా - ఓరల్ కెమెరా, కంప్యూటరైజ్డ్ డెంటల్ వీడియో ఇమేజింగ్ - ఎయిర్ అబ్రాషన్ తదితర హై-టెక్ పరికరాలతో రోగ నిర్ధారణ, చికిత్సను సులభంగా, వేగంగా చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

### కుటుంబ విలువలతోనే సురక్షిత భారత్

**గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ**



గవర్నర్‌కు రాఖీలు కడుతున్న మహిళలు

రామంతాపూర్ (హైదరాబాద్): ప్రపంచంలో ఏ దేశంలో లేనివిధంగా రక్షా బంధన్ వంటి సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగలతోనే భారత్ సురక్ష భారత్‌గా వెలుగుతోందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రశంసించారు. ఉప్పల్ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన రాఖీ పర్వదిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తనకు రాఖీలను కట్టిన మహిళలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో దేశ ప్రజలు ప్రేమ, సహనంతో జీవనం కొనసాగిస్తున్నా రన్నారు. కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయ భారతి, వనవాసి కల్యాణాశ్రమం ప్రశిక్షణకమిటీ సభ్యుడు కొరివి రామచంద్రయ్య, జాతీయ సాహిత్య పరిషత్ కార్యదర్శి సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.


### మహిళా వైద్యులకు రక్షణ కల్పించండి

- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారదకు జూడా విన్నపం
- అలారం ఫీచర్‌తో కూడిన ప్రత్యేక మొబైల్ యాప్‌ను తయారు చేయాలని విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన నేపథ్యంలో తెలంగాణలోనూ ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలలు, హాస్టళ్లలో మహిళా వైద్యులు, మెడికోలకు రక్షణ కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని జూనియర్ డాక్టర్ల సంఘం(జూడా) నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం టీ–జూడా ప్రతినిధి డాక్టర్ చంద్రిక నేతృత్వంలో గాంధీ, ఉస్మానియా, నిమ్స్ తదితర కళాశాలల మహిళా ప్రతినిధులతో కలసి తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఎన్.శారదకు వినతిపత్రం అందజేశారు. రెసిడెంట్ డాక్టర్లు, మెడికోలు ఎదుర్కొంటున్న సమస్యలపై విన్నవించారు. వైద్యుల పని ప్రదేశంలో వారి భద్రతాపరమైన సమస్యలపై ప్రధానంగా చర్చించారు. క్యాంపస్ అంతటా సీసీకెమెరాల పర్యవేక్షణ ఉండాలి. అలారం ఫీచర్‌తో కూడిన ప్రత్యేక మొబైల్ యాప్‌ని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ యాప్ స్థానిక పోలీస్ స్టేషన్లు లేదా కంట్రోల్ రూమ్‌లకు అనుసంధానం చేయాలన్నారు. పరిస్థితులను అంచనా వేయడానికి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌లు ఆకస్మిక తనిఖీలు చేయాలి. క్రమం తప్పకుండా భద్రతా తనిఖీలు జరగాలని కోరారు. ఇక తమ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. తమ డిమాండ్ల పట్ల చైర్‌పర్సన్ సానుకూలంగా స్పందించి, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారని జూడా నేతలు వెల్లడించారు.

### వృక్షాబంధన్



అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల ఆప్యాయతానురాగాలకు రాఖీ పండుగ ప్రతీతి. ఈ స్ఫూర్తిని ప్రకృతికి ఆపాదించి.. జాగ్రత్తగా కాపాడుకోవాలని పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీ అన్నపూర్ణ కాలనీకి చెందిన పలువురు మహిళలు నిరూపిస్తున్నారు. తెలంగాణ మహిళామిత్ర అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ ఆధ్వర్యంలో ఆదివారం వృక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొక్కల ఆకులు, కొమ్మలు, పూలు.. సేకరించి వివిధ ఆకృతుల్లో ఆకట్టుకునేలా రాఖీలు తయారుచేసి పరస్పరం కట్టుకున్నారు. వాటిని మొక్కలు, చెట్లకూ కట్టడం విశేషం. తమతోపాటు అవి ఎదగాలని, వాటిని కుటుంబ సభ్యుల్లా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మహిళా మిత్ర అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతినగర్ (రామగుండం)

# ఒకరికొకరు అండాదండా

సన్నిధి



**శ్రావణ పూర్ణిమ, వరలక్ష్మీ వ్రతం అంటే తెలియని వారు ఉండవచ్చునేమో కానీ, రాఖీపూర్ణిమ అంటే తెలియని వారుండరు. పేరు తెలిసినా ఆ సంప్రదాయ బద్ధంగా ఆనాడు ఏం చేయాలో... రాఖీ కట్టడంలోని అంతరార్థం ఏమిటో తెలిసినవారు అరుదనే చెప్పాలి. పూర్ణిమనాడు శ్రవణానక్షత్రం ఉన్న మాసానికి శ్రావణ మాసమని పేరు. శ్రావణమాసంలో రాత్రివేళ పూర్ణిమ తిథి ఉన్న రోజును రక్షికా పూర్ణిమ అన్నారు పెద్దలు. రక్షించగలిగిన పూర్ణిమ, రక్షణ కోరుకునే వారికోసం ఉద్దేశింపబడిన పూర్ణిమ అని అర్థం. ఈ పండుగ కాస్తా కాలక్రమంలో రాఖీపూర్ణిమగా పేరు మార్చుకుంది.**

శ్రావణ పూర్ణిమనాడు ఉదయమే స్నానం చేయాలి. ఎవరిని రక్షించదలిచామో– అంటే నేటి నుండి ఒక సంవత్సరం పాటు ఎవరికి అండగా ఉండదలిచామో ఆ వ్యక్తి ముంజేతికి మనం కట్టబోయే రక్షిక (రాఖీ)ని దైవం ముందుంచి పూజ చేయాలి. వరుడు కట్టబోయే మంగళ సూత్రానికి ఎలా మాంగల్యబల పూజ చేస్తారో, ఆ పూజాశక్తి దానిలో ప్రవేశించి ఆ సూత్రాన్ని కట్టించుకున్న ఆమెకీ, కట్టిన వ్యక్తికీ ఆపదల్లేకుండా చేస్తుందో అంతటి శక్తి ఉన్నది ఇక్కడ రక్షికకి. కాబట్టి దీనికీ పూజ చెయ్యాలి. అంటే పూజ ద్వారా పూజాశక్తిని దానిలోనికి ప్రవేశింప చెయ్యాలన్నమాట.

అలా పూజాశక్తితో కూడుకున్న ఈ రక్షికని ఒక సంవత్సర కాలంపాటు– మనం ఎవరిని రక్షించడానికి అండగా నిలువదలిచామో ఆ వ్యక్తి ముంజేతికి కడుతూ– 'ఆ రక్షిక మీద అక్షతలని వేయాలి. ఇలా కట్టడాన్ని అపరాహ్ణసమయంలో (అహ్నం అంటే పగలు. అపరం అంటే మధ్యాహ్నం 12 దాటాక. కాబట్టి అపరాహ్ణం అంటే 12 నుండి 3 గంటల మధ్య అని అర్థం) మాత్రమే చేయాలి. అయితే ఇది ఇప్పటి ఆచారం కాదు... ఎప్పటినుంచో వస్తున్న సంప్రదాయమే! రక్షాబంధనం కట్టడం పూర్తయింది కదా అని ఇక అంతటితో వదిలేయకూడదు. ఆ బంధానికి కట్టుబడి ఒకరికి ఒకరు అన్నింటా అండగా నిలవాలి.

మరో ముఖ్య విశేషమేమిటంటే ఇది కేవలం స్త్రీలు మాత్రమే కట్టాలనే నియమం లేదు. స్త్రీలకి స్త్రీలూ పురుషులకి పురుషులూ కూడా కట్టుకోవచ్చు, అలా అండగా నిలవాలనే పవిత్రోద్దేశ్యం ఉంటే. అంతే కాదు.. దేశ రక్షణలో పాల్గొనే సరిహద్దు భద్రతాదళాలకు ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వారి విజయాన్ని, శ్రేయస్సును కాంక్షిస్తూ ప్రతి సంవత్సరం శ్రావణ పున్నమిరోజు రక్షాబంధనం కడుతుండటం శుభపరిణామం.

స్థితి కారుడైన శ్రీహరి జన్మనక్షత్రం శ్రవణం నిండుగా ఉండే ఈ శ్రావణ పూర్ణిమనాడే నేను ఫలాని వారికి రక్షణ కోసం కడుతున్నాను. కాబట్టి ఆ శ్రీహరి అనుగ్రహం నా మీద ప్రసరించి నేనూ రక్షించే వాడిగానే ఉండాలని అర్థం చేసుకోవడానికే శ్రావణపూర్ణిమని ఈ పండుగ రోజుగా నిర్ణయించారని గమనించాలి. అంతేకాదు, అపరాహ్ణ సమయంలో రక్షికని కడుతున్న నా రక్షికాబంధానికి ఆ ప్రత్యక్ష కర్మసాక్షి సూర్యుడని తెల్పడానికే.

**యేన బద్ధో బలీరాజా దానవేంద్రో మహాబలః**
**తేన త్వామపి బధ్నామి రక్షే! మా చల మాచల!**

రాక్షసులకి రాజూ, మహాబలవంతుడూ అయిన బలి చక్రవర్తి ఏ రక్షాబంధన శక్తి కారణంగా శ్రీహరికి వశమైపోయాడో, దేవతలంతా తమ తమ తపశ్శక్తిని శ్రీహరికి బాసటగా ఉంచుతూ రక్షికని కట్టారో, ఆ రక్షికా శక్తి నాలో ప్రవేశించిన నేను కూడ ఈ మిత్రునికి లేదా మిత్రురాలికి ఈ రక్షికని ముడి వేస్తున్నాను. ఓ రక్షికా! రక్షణశక్తి నీనుండి తొలగకుండును గాక! అని పై శ్లోకానికి అర్థం. ఈ పండుగలోని హంగులు, ఆర్భాటాల మాట ఎలా ఉన్నా, తమకు రక్షణ ఇవ్వవలసిందిగా కోరుతూ... తమ సోదరులకు దుష్టశక్తుల పీడ లేకుండా, వాహన ప్రమాదాలు తదితర విపత్తుల బారినుంచి కాపాడి భగవంతుడు ఈ సంవత్సరమంతా రక్షగా నిలవాలని కాంక్షిస్తూ ఎంతో దూరాభారాలకు ఓర్చి పుట్టింటికి వచ్చి సోదరుల చేతికి రక్షా బంధనం కట్టడం, వారికి తీపి తినిపించడం, 'నీకు అండగా నేనున్నాను' అని అభయమిస్తూ సోదరులు వారి శక్తికొలది పసుపు కుంకుమలు, చీరసారెలతో సత్కరించడం ఇటీవల వెల్లివిరుస్తున్న ఒక సత్సంప్రదాయం. ఈ సంప్రదాయాన్ని ఒక పండుగలా జరుపుకోవడంతో మాత్రం సరిపెట్టకూడదు. అందులోని అంతస్సూత్రాన్ని అర్థం చేసుకుని, దానిని ఆచరణలో పెట్టాలి. అప్పుడే సమాజం బాగుంటుంది.

– డి.వి.ఆర్.



మంచి మాట

## సంతోషమే బలం

**మానవుడు ఆనంద స్వరూపుడు. ఆనందం కోసమే నిరంతరం ప్రయత్నం చేస్తూ ఉంటాడు. చిత్రంగా ఆ ప్రయత్నంలో దానినే విస్మరించటం, కోల్పోవటం జరుగుతుంది. ఆనందంగా ఉండటం సహజ స్థితి. అప్పుడే పుట్టిన పిల్లలు చూడండి. ఆనందంగా నవ్వుతూ ఉంటారు. ఆకలి వేసినప్పుడో ఇబ్బంది కలిగినప్పుడో మాత్రమే ఏడుస్తారు. అది వాళ్ళు తమ భావాలను ప్రకటించగల ఒకే ఒక భాష.**

ఆనందాన్ని క్రమక్రమంగా వయసుతోపాటు కోల్పోతున్నాడు మానవుడు. దానికి కారణం శోకం. అందుకే అర్జునుడు విషాదంలో కూరుకుపోయినప్పుడు శ్రీ కృష్ణుడు ''నీకు శోకించే అధికారం లేదు'' అని వరుసగా ఎన్నో శ్లోకాలలో నొక్కి వక్కాణించాడు. శోకం మనిషిని మానసికంగా క్రుంగదీస్తుంది. మనోబలం తగ్గటంతో శరీరం కూడా సరిగా సహకరించదు. అది అన్ని రుగ్మతలకి ఆహ్వానం.

''ఈడుపు కాళ్ళు ఏడుపు మొఖం'' అన్ని పనులకు ఆటంకం కలిగిస్తాయి. ఏడుపుగొట్టు ముఖం దరిదాపుల్లోకి ఏ శుభాలు రావు. ఎందుకంటే ఏడుపు మొహం రాగానే కాళ్ళు ఈడవటం జరుగుతుంది. ఇంక పనులు ఏమవుతాయి? విజయానికి మూలం ఉత్సాహం. శోకం ఉత్సాహాన్ని తరిమికొడుతుంది. ఇంకా ఏం చేస్తుందో తెలుసా?

''శోకో నాశయతే ధైర్యం
శోకో నాశయతే శ్రుతమ్
శోకో నాశయతే సర్వం
నాస్తి శోక సమో రిపుః''

ఎప్పుడూ జీవితంలో ఎవరినీ పల్లెత్తు మాట అనని కౌసల్య రాముడు వనవాసం చేయటానికే నిశ్చయించుకున్నాడు అని తిరిగి వచ్చిన సుమంత్రుడు చెప్పగానే శోకోపహతచేతస అయి దశరథుడితో నిష్ఠురంగా మాట్లాడుతుంది. దశరథుడు ఆమెను బ్రతిమాలుతుంటే తన తప్పు తెలుసుకుని ఈ మాటలు అంటుంది. తాను ఆ విధంగా కఠినంగా మాట్లాడటానికి శోకమే కారణం అని దానిని మించిన శత్రువు లోకంలో లేదు అంటుంది.

> ఎవరికైనా కష్టం వస్తే బ్రహ్మాండంగా ఓదారుస్తాం – కష్టాలు మనుషులకి కాక మాకులకి వస్తాయా? కలకాలం ఉండవు, మంచి కాలం ముందు ఉంది అని. తనదాకా వస్తే ధైర్యానికి మూలకారణమైన జ్ఞానం నశిస్తుంది. చదివిన చదువంతా నట్టేట్లో కలిసిపోతుంది. తెలివిపోయాక ఏమి ఉంటుంది? అందువల్ల శోకాన్ని మించిన శత్రువు లేదు అన్నది కౌసల్య. నిజమే కదా!

నొప్పి వేరు, బాధ వేరు, శోకం వేరు. నొప్పి భౌతిక మైనది. శరీర సంబంధం. బాధ మనస్సుకి సంబంధించినది. శోకం మనస్సు లోలోపలి పొరలలోకి చొచ్చుకొని పోయి జీవుణ్ణి వేదనకి గురి చేస్తుంది. తనకో తనవారికో కష్టం కలిగింది అనే భావన జోడించబడి ఉంటుంది. ఎప్పుడైతే నేను, నా అన్న భావన కలిగిందో మనస్సు నిర్మలంగా, నిష్పక్షపాతంగా ఆలోచించలేదు. ఎదుటివారి సమస్యలని తేలికగా పరిష్కరించగలవారు తమకి వచ్చిన చిన్న సమస్యని కూడా పరిష్కరించలేకపోవటానికి ఇదే కారణం. అది తమది కాదు ఎవరిదో అని ఆలోచించగానే తాము అందులో ఉండరు గనుక వెంటనే పరిష్కారం లభిస్తుంది. శోకంలో ముందుగా వచ్చేది 'నేను' అన్నది. దానితో ముందుగా ధైర్యం జారిపోతుంది.

అర్జునుడికి వచ్చింది కూడా శోకమే. ధైర్యం కోల్పోవటం వల్ల శరీరం వణకటం, చేతిలో ఉన్న గాండీవం జారిపోవటం వంటివి జరిగాయి. ఆ శోకాన్ని పోగొట్టి ధైర్యాన్ని, దానికి మూలమైన జ్ఞానాన్ని ఇచ్చే ముందు నీకు శోకించే అర్హత, అధికారం లేదు అని గట్టిగా చెప్పాడు. మరేం చేయాలి అంటే ''సమస్యలు వస్తే క్రుంగిపోక వాటితో యుద్ధం చేయాలి.'' అని ఆదేశించాడు. అది అర్జునుడికి మాత్రమే కాదు. భారతీయులు అందరూ. మనం అన్నివిధాల సమస్యలతోను పోరాడి విజయం సాధించాలి.

– డా. ఎన్. అనంత లక్ష్మి

## ఇది ఒక అమూల్యమైన సంపద..

గృహస్థాశ్రమ వైశిష్ట్యం



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

తాతలు, నాయనమ్మలు, అమ్మమ్మలు అద్భుతమైన మానవీయ సంబంధాలు. వారి సమక్షం ఒక విశ్వవిద్యాలయమే. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఒక పాఠశాల ఉంది. పాఠశాలల్లో పేరెంట్స్ డే జరపడం సర్వసాధారణమే.. కానీ అక్కడ గ్రాండ్ పేరెంట్స్ డే కూడా జరుపుతారు. అటువంటి పెద్దవాళ్ళు ఇంట్లో ఉంటే ఎంత గొప్ప విశేషమో తెలియ చేయడానికి వారిని ఎందుకు గౌరవించాలో బోధపరచడానికి వారీ ఉత్సవం నిర్వహిస్తారని తెలిసి చాలా సంతోషమేసింది. తాతలు, నానమ్మలు, అమ్మమ్మల దగ్గర పెరిగిన పిల్లల్లో ధైర్యం, సంస్కారం ఎక్కువగా ఉంటుందని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ తన ప్రసంగంలో తెలియచేసారు. అటువంటి పెద్దల సమక్షంలో పెరిగే పిల్లల మానసిక పరిణతి, సంస్కారబలం వృద్ధి చెందుతాయి. పెద్దల విలువని ఎంతని లెక్కగట్టగలం!!!

వారు లేరని బాధపడేవాళ్ళుంటారు చాలా మంది... అటువంటప్పుడు వారిని ఓల్డ్ ఫర్నీచర్ అని తప్పించడం ఎంత నీతిబాహ్యమైన చర్య? తండ్రి పెద్దవాడయిపోయాడు. కొడుకు భుజం మీద చెయ్యివేసుకుని వెళ్ళడం ఒక తీవి. తండ్రి చేతిని కొడుకు పట్టుకుని తీసుకెళ్ళి కూర్చోబెడితే అదొక తీవి. నా కొడుకును సహాయంగా తీసుకుని బయటకు వెళ్ళి రావడం నా అవసరం, నా ఆనందం. దాని ప్రయోజనం మరొకరికి ఎలా తెలుస్తుంది? కొడుకు ఎక్కడ ఉంటే అక్కడ ఉపశమనం. కోడలు ఎక్కడ ఉంటే అక్కడ ఒక ఊరట. మనసుకు గొప్పశాంతి. అది సంపద. అంత గొప్ప సంపదకు దూరంగా ఏకాకిగా బతకడమా!!! మనుమలతో కలసి బతకడం భగవంతుడిచ్చిన గొప్ప భాగ్యం. వారిలో తమను తాము చూసుకోవడం పెద్దలకు పెద్ద ఓదార్పు. ఈశ్వరుడిచ్చిన ఇంత గొప్ప సంపద నాకు ఎవరి వలన లభిస్తున్నది... కోడలు వలన. అంటే వివాహం అనేది ఈ సంపద సృష్టికి మూల కారణం అవుతున్నది. స్థిరచరాస్తులు ఎంత పోగేసుకున్నాం అన్నదానికంటే... కుటుంబంలో మనుషుల మధ్య మనసులు ఎంతగా కలిసాయన్నది ఈ ఆనందాలకన్నింటికీ హేతువవుతుంది. ఆరోగ్యకర సమిష్టి జీవనానికి దారివేస్తుంది.



జీవితాన్ని కూడా గాలికి వదిలేసి సంపాదనలో మునిగితేలేవాడికి సంసార సుఖం తెలియదు. సంపాదన అవసరమే, కానీ సంసార జీవితాన్ని కలిసికట్టుగా ఆస్వాదించకపోతే ఇక గృహస్థాశ్రమ వైభవం ఎక్కడుంది? దాని ఫలాలను నీవెక్కడ ఆస్వాదిస్తున్నావు? అంటే బతకడానికి సంపాదన... అంతే తప్ప సంపాదన కోసం బతకడం కాదు కదా! శ్రీమంతుల ఇంట అయినా పేదల ఇంటయినా... అరమరికలు లేకుండా ఉమ్మడిగా బతకడం వర్తమానంలో సంతోషాలకే కాదు, తరువాత తరాలకు కూడా సంతోషకారకాలను అందిస్తున్నాం. అందుకే కొడుకు, కోడలు, కుమార్తె, అల్లుడు, తల్లిదండ్రులు, అత్తమామలు, తాతలు, నానమ్మలు, అమ్మమ్మలు, మనుమలు.. ఇదంతా గొప్ప సంపద. ఈ సంపదకు మూలం వివాహ వ్యవస్థ. అందుకే గృహస్థాశ్రమ ప్రవేశం ఒక వైభవానికి నాంది.

# సినిమా



● విశ్వక్ సేన్

## రాకీ మాటలు మొదలు

మెకానిక్ రాకీగా టైటిల్ రోల్‌లో విశ్వక్ సేన్ నటించిన చిత్రం 'మెకానిక్ రాకీ'. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో రామ్ తాళ్లూరి నిర్మించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా విశ్వక్ సేన్ ఆదివారం తన రాకీ పాత్రకు డబ్బింగ్ మొదలుపెట్టారు. ''మంచి మాస్, కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉంటుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గేర్, ఫస్ట్ సాంగ్‌కి మంచి స్పందన లభించింది'' అని చిత్రబృందం పేర్కొంది. దీపావళి సందర్భంగా అక్టోబరు 31న ఈ చిత్రం విడుదల కానుంది. మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, కెమెరా: మనోజ్ కటసాని.

## పవర్‌ఫుల్ రోల్



● శివ రాజ్ కుమార్

శివన్నగా పాపులర్ అయిన కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్ కెరీర్‌లోని 131వ సినిమా పూజా కార్యక్రమాలతో ఆరంభమైంది. కన్నడ, తెలుగు భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రానికి కార్తీక్ అద్వైత్ దర్శకుడు. పద్మజ ఫిల్మ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సమర్పణలో ఈ చిత్రాన్ని ఎస్ఎన్ రెడ్డి, సుధీర్ .పి నిర్మిస్తున్నారు. ''శివ రాజ్ కుమార్ ఓ పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో కనిపించనున్న ఈ చిత్రంపై ఆయన అభిమానులకు భారీ అంచనాలు ఉంటాయి. ఆ అంచనాలు చేరుకునే విధంగా దర్శకుడు ఈ చిత్రాన్ని డిజైన్ చేశారు. ఇతర నటీనటుల వివరాలను త్వరలో తెలియజేస్తాం'' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సామ్ సీఎస్, కెమెరా: ఎ.జె. శెట్టి.

## సెలబ్రిటీ నీకన్నా ఎవడురా...

''పైసా లేకున్నా మాయా.. పనేం లేకున్నా నాలాంటోడ్ని బతుక్కేమీ పర్లేదు...'' అంటూ సాగుతుంది 'బాసే హే..' పాట. 'సుడిగాలి' సుధీర్ హీరోగా నటిస్తున్న 'జీ.ఓ.ఎ.టీ' (గోట్) సినిమాలోనిది ఈ పాట. 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్' అనేది ఉపశీర్షిక. ఈ చిత్రంలో దివ్యభారతి హీరోయిన్‌గా నటిస్తున్నారు. మొగుళ్ళ చంద్రశేఖర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం నుంచి 'బాసే హే నీలా ఉండే లక్కు మాకే లేదురా.. సెలబ్రిటీ నీకన్నా ఎవడురా' అనే పాట లిరికల్



● సుధీర్

వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. లియోన్ జేమ్స్ సంగీత సారథ్యంలో కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటను దీపక్ బ్లూ ఆలపించారు. జీతూ మాస్టర్ కొరియోగ్రాఫర్. ''హీరో క్యారెక్టరైజేషన్‌ని వివరించే ఇంట్రడక్షన్ సాంగ్ ఇది. టాకీ పార్టు దాదాపు పూర్తయింది. యాక్షన్ ఎపిసోడ్స్, రెండు పాటల షూట్ మాత్రమే బ్యాలెన్స్ ఉన్నాయి'' అని నిర్మాత చంద్రశేఖర్ చెప్పారు.

## ఆ పెద్దలు వేసిన బాటలో నడుస్తున్నాం

*– కొరియోగ్రాఫర్ జానీ*



● జానీ, శేఖర్

''ప్రభుదేవాగారు చేసిన 'వెన్నెలవే.. వెన్నెలవే' ('మెరుపు కలలు' సినిమాలోనిది) పాట నాకు చాలా ఇష్టం. ఈ పాటకు జాతీయ అవార్డు కూడా వచ్చింది. ఈ తరహా పాటను నేనూ చేయాలని కల కనేవాడిని. ఆ అవకాశం ధనుష్‌గారి 'తిరు చిత్రాంబలమ్'తో దక్కింది. అక్కడ (తమిళం) ఎంతోమంది కొరియోగ్రాఫర్స్ ఉన్నా ఈ పాటకు కొరియోగ్రఫీ చేసేందుకు ధనుష్‌గారు నన్నే పిలిపించారు'' అని జానీ మాస్టర్ అన్నారు. ఇటీవల 70వ జాతీయ సినీ అవార్డ్స్‌ను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ అవార్డ్స్‌లో కొరియోగ్రఫీ విభాగంలో 'తిరుచిత్రాంబలమ్' సినిమాలోని 'మేఘం కరుక్కద' పాటకుగాను జాతీయ అవార్డు గెల్చుకున్నారు జానీ మాస్టర్. ఈ సందర్భంగా ఆయనకు తెలుగు చిత్ర ప్రముఖుల సమక్షంలో సన్మానం జరిగింది. జానీ మాస్టర్ మాట్లాడుతూ– ''మేము ఇలాంటి విజయాలు సాధిస్తున్నామంటే అందుకు ముక్కురాజు మాస్టర్, డ్యాన్సర్స్ అసోసియేషన్ నాయకుల కృషే కారణం. ఎన్నో అవమానాలు ఎదుర్కొని మద్రాస్ నుంచి తెలుగు డ్యాన్సర్స్‌ను ఇక్కడికి తీసుకొచ్చి, అసోసియేషన్ స్థాపించి నిలబెట్టారు ముక్కురాజు మాస్టర్. ఆ పెద్దలు వేసిన బాటలో మేమంతా ముందుకెళ్తున్నాం'' అని తెలిపారు. ''నేను, గణేశ్, జానీ... ఒకేసారి కెరీర్ స్టార్ట్ చేశాం. ఇప్పుడు జానీ మాస్టర్‌కు జాతీయ అవార్డు రావడం చాలా సంతోషాన్నిచ్చింది'' అన్నారు శేఖర్ మాస్టర్.



● ఖుషీ కపూర్

## సర్జరీ చేయించుకున్నా!

ప్రముఖ దివంగత నటి శ్రీదేవి చిన్న కుమార్తె, నటి ఖుషీ కపూర్‌ను కొందరు నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. ఈ ప్రశంసలకు కారణం ఉంది. ఇంతకీ విషయం ఏంటంటే... చిన్నతనంలో తన అమ్మతో కలిసి ఖుషీ కపూర్ ఓ సినిమా వేడుకకు హాజరయ్యారు. అలాగే ఇటీవల తాను నటించిన 'ది ఆర్చీస్' ఫిల్మ్ ప్రీమియర్ ఈవెంట్‌కు ఖుషీ వెళ్లారు. ఈ రెండు వీడియోలను గమనించిన కొందరు నెటిజన్లు ఖుషీ కపూర్ ముఖంలో ఏదో మార్పు ఉందని సోషల్ మీడియాలో కామెంట్స్ చేయడం ప్రారంభించారు. వీటిని గమనించిన ఖుషీ కపూర్ తాను కాస్మొటిక్ సర్జరీ చేయించుకున్నానని, ముక్కు ఆకారం మారిందనీ సోషల్ మీడియాలో స్పందించారు. దీంతో ఖుషీ కపూర్ నిజాయితీని కొందరు నెటిజన్లు అభినందిస్తూ కామెంట్స్ చేస్తున్నారు. ''చాలామంది హీరోయిన్లు ఇలా సర్జరీలు చేయించుకుంటారు. కానీ బయటకు చెప్పరు... ఒప్పుకోరు. అయితే ఖుషీ ధైర్యంగా చెప్పింది. ఆమె నిజాయితీని మెచ్చుకోవాలి'' అని నెటిజన్లు పోస్ట్‌లు చేస్తున్నారు. ఇక ప్రస్తుతం తమిళ హిట్ ఫిల్మ్ 'లవ్ టుడే' హిందీ రీమేక్‌తో ఖుషీ కపూర్ బిజీగా ఉన్నారని, ఈ చిత్రంలో ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ హీరోగా నటిస్తున్నారని బాలీవుడ్ భోగట్టా.


## ప్రేమ అందరిది...



● హర్ష రోషన్, హారిక

హర్ష రోషన్, హారిక జంటగా భాస్కర్ రామ్ దర్శకత్వంలో రూపొందుతున్న ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం 'వాట్సప్ రోమియో'. 'వీడి ప్రేమ అందరిది' అనేది ఉపశీర్షిక. భిక్షమయ్య నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో భాస్కర్ రామ్ మాట్లాడుతూ– ''పిల్లలను వారి తల్లిదండ్రులు ప్రాపర్‌గా గైడ్ చేస్తే వారు అద్భుతాలు సృష్టిస్తారు అనేది ఈ చిత్రం ప్రధానాంశం. రాజమౌళి, ప్రశాంత్ నీల్ వంటి పెద్ద దర్శకుల సినిమాలు, కొన్ని బాలీవుడ్, హాలీవుడ్ చిత్రాలకూ టెక్నికల్ విభాగంలో పని చేశాను. తెలుగులో నా రెండో మూవీ 'వాట్సప్ రోమియో'. తొలి చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్‌లో ఉంది. మరాఠీలో నేను చేసిన 'దిల్.. దోస్తీ.. దునియా దారీ' సినిమా రిలీజ్‌కు సిద్ధం అవుతోంది'' అని అన్నారు. ''ఓ వినూత్న కథతో 'వాట్సప్ రోమియో'ని నిర్మిస్తున్నాం'' అని చెప్పారు భిక్షమయ్య.

## మోహన్‌లాల్‌కు అస్వస్థత



ప్రముఖ నటుడు మోహన్‌లాల్ అస్వస్థతకు గురయ్యారని, ప్రస్తుతం ఆయన కొచ్చిలోని ఓ హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్నారనే వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. శ్వాస సంబంధిత సమస్య, తీవ్రమైన జ్వరం, కండరాల నొప్పితో మోహన్‌లాల్ ఇబ్బందిపడుతున్నారని, దీంతో ఆయన ఐదు రోజులు విశ్రాంతి తీసుకోవాలని, అలాగే జనసందోహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోకి వెళ్లకూడదని మోహన్‌లాల్ పేరిట ఓ హెల్త్ బులెటిన్ వైరల్ అవుతోంది. ఆ హెల్త్ బులెటిన్‌లో 16వ తేదీ అని ఉంది. ప్రస్తుతం మోహన్‌లాల్ ఆరోగ్యం నిలకడగానే ఉందని, ఆయన అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్న వార్తలు కూడా మాలీవుడ్‌లో తెరపైకి వచ్చాయి. కాగా మోహన్‌లాల్ ఆరోగ్య పరిస్థితిపై పూర్తి స్థాయి అధికారిక సమాచారం అందాల్సి ఉంది.

## మన కుటుంబం



● సుమన్

సుమన్ లీడ్ రోల్‌లో రూపొందిన చిత్రం 'మన కుటుంబం'. మురళీ గౌడ్, అన్నపూర్ణ, కలకొండ నరసింహ ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు. ఆకుల రాఘవ దర్శకత్వంలో కలకొండ హేమలత నిర్మించిన ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. ''గ్రామీణ నేపథ్యంలో సాగే మంచి కుటుంబ కథా చిత్రంగా రూపొందించాం. భాను ప్రసాద్ మంచి పాటలు ఇచ్చారు. త్వరలో మా సినిమాని విడుదల చేయనున్నాం'' అని కలకొండ హేమలత తెలిపారు.

## అల్లు అర్జున్ మా అన్నయ్య అంటుంటా! – అంకిత్



రావు రమేశ్, ఇంద్రజ జంటగా నటించిన చిత్రం 'మారుతి నగర్ సుబ్రమణ్యం'. ఈ చిత్రంలో అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి మరో జోడీగా నటించారు. లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో సుకుమార్ భార్య తబిత సమర్పణలో బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో అంకిత్ కొయ్య మాట్లాడుతూ– ''నా కాలేజ్ టైమ్‌లో అల్లు అర్జున్‌గారితో ఓ కమర్షియల్ యాడ్‌లో నటించే చాన్స్ వచ్చింది. ఆడిషన్ చూసి ఆయనే నన్ను ఎంపిక చేశారు. ఇక 'మారుతి నగర్ సుబ్రమణ్యం' సినిమా విషయానికి వస్తే... ఈ సినిమాలో నా పాత్ర 'నేను ఈ ఇంట్లో పుట్టలేదు, అల్లు అరవింద్ కొడుకును. అల్లు అర్జున్ మా అన్నయ్య' అనుకునే టైపు. నా పాత్ర మంచి వినోదం పండిస్తుంది. అల్లు అరవింద్‌గారు 'మారుతి నగర్ సుబ్రమణ్యం' ట్రైలర్ చూశారు. అందులో నేను అరవింద్ కొడుకును అని చెబుతా కదా! 'ఏవయ్యా... నా కొడుకు అని చెప్పుకొని తిరుగుతున్నావట' అని సరదాగా ఆయన అన్నారు. ఇక రావు రమేశ్‌గారు సెట్స్‌లో బాగా ప్రోత్సహించారు'' అన్నారు.

## సస్పెన్స్.. థ్రిల్



● కృష్ణసాయి, మీనాక్షీ జైస్వాల్

కృష్ణసాయి, మీనాక్షీ జైస్వాల్ జంటగా నటించిన చిత్రం 'జ్యువెల్ థీఫ్'. శ్రీ విష్ణు గ్లోబల్ మీడియా బ్యానర్‌పై పీఎస్ నారాయణ దర్శకత్వంలో మల్లెల ప్రభాకర్ నిర్మించిన ఈ చిత్రంలో ప్రేమ, అజయ్, పృథ్వీరాజ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమా టీజర్‌ను పృథ్వీరాజ్ విడుదల చేసి, ''కృష్ణసాయి ఇంటర్నేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్' ద్వారా కృష్ణసాయి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. గతంలో ఆయన డ్రగ్స్ మీద అవగాహన వీడియోలు చేశారు. ఇక ఈ చిత్రంలో నేను మంచి పాత్ర చేశాను'' అన్నారు. ''మంచి సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ ఇది. మా చిత్రానికి ఎంఎం శ్రీలేఖ అందించిన మ్యూజిక్ ఓ హైలైట్'' అన్నారు కృష్ణసాయి. ''త్వరలో మా చిత్రాన్ని రిలీజ్ చేయనున్నాం'' అన్నారు మల్లెల ప్రభాకర్.



## డబ్ల్యూటీఏ టూర్‌లో సహజ అరంగేట్రం

మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) టూర్–250 స్థాయి టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి సహజ యామలపల్లి అరంగేట్రం చేసింది. అమెరికాలోని ఒహాయో రాష్ట్రంలో జరుగుతున్న క్లీవ్‌ల్యాండ్ డబ్ల్యూటీఏ-250 టోర్నీ క్వాలిఫయింగ్‌లో సహజ బరిలోకి దిగింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 305వ ర్యాంక్‌లో ఉన్న సహజ తొలి రౌండ్‌లో 2-6, 1-6తో ప్రపంచ 91వ ర్యాంకర్ జెస్సికా (స్పెయిన్) చేతిలో ఓడిపోయింది.



## రన్నరప్ శ్రీరామ్ బాలాజీ జోడీ

ఈ ఏడాది రెండో ఏటీపీ చాలెంజర్ టూర్ డబుల్స్ టైటిల్‌ను సాధించాలని ఆశించిన భారత అగ్రశ్రేణి టెన్నిస్ ప్లేయర్ శ్రీరామ్ బాలాజీకి నిరాశ ఎదురైంది. డొమినికన్ రిపబ్లిక్‌లో జరిగిన సాంటో డొమింగో ఓపెన్ టోర్నీలో శ్రీరామ్ బాలాజీ (భారత్)-ఫెర్నాండో రొంబోలి (బ్రెజిల్) ద్వయం రన్నరప్‌గా నిలిచింది. 2 గంటల 16 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో బాలాజీ-రొంబోలి జోడీ 7-6 (7/2), 4-6, 16-18తో హిడాల్గో-వరేలా (మెక్సికో) జంట చేతిలో ఓడిపోయింది. ఈ సీజన్‌లో బాలాజీ కాగ్లియారి ఓపెన్‌లో విజేతగా నిలిచి... పెరుగ్గా, బ్రాన్స్‌వీగ్ టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచాడు.



## స్వియాటెక్‌పై సబలెంకా పైచేయి

సిన్సినాటి: సిన్సినాటి ఓపెన్ డబ్ల్యూటీఏ ప్రీమియర్ టోర్నీ నుంచి మహిళల టెన్నిస్ నంబర్‌వన్, టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) నిష్క్రమించింది. ఆదివారం జరిగిన సింగిల్స్ తొలి సెమీఫైనల్లో ప్రపంచ మూడో ర్యాంకర్, మూడో సీడ్ సబలెంకా (బెలారస్) 6-3, 6-3తో స్వియాటెక్‌ను బోల్తా కొట్టించి ఈ టోర్నీలో తొలిసారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. స్వియాటెక్‌తో 12వ సారి తలపడిన సబలెంకా నాలుగోసారి విజయాన్ని అందుకుంది. గంటా 47 నిమిషాలపాటు జరిగిన సెమీఫైనల్లో సబలెంకా ఐదు ఏస్‌లు సంధించింది. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. ఈ సీజన్‌లో ఐదో టోర్నీలో ఫైనల్ చేరిన సబలెంకా తదుపరి ర్యాంకింగ్స్‌లో రెండో ర్యాంక్‌కు చేరుకుంటుంది. జెస్సికా పెగూలా (అమెరికా), పౌలా బదోసా (స్పెయిన్) మధ్య రెండో సెమీఫైనల్ విజేతతో ఫైనల్లో సబలెంకా తలపడతుంది.

## విండీస్‌తో భారత్ తొలి పోరు

దుబాయ్: వచ్చే ఏడాది జరగనున్న అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ తొలి పోరులో వెస్టిండీస్‌తో తలపడనుంది. 16 జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీ షెడ్యూల్‌ను ఆదివారం ఐసీసీ విడుదల చేసింది. జనవరి 18 నుంచి ఫిబ్రవరి 2 వరకు మలేసియా వేదికగా ఈ మెగా టోర్నీ జరగనుంది. జనవరి 19న వెస్టిండీస్‌తో తొలి మ్యాచ్ తర్వాత భారత జట్టు 21న మలేసియాతో, 23న శ్రీలంకతో ఆడుతుంది. 2023లో తొలిసారి మహిళల అండర్-19 ప్రపంచకప్ నిర్వహించగా... అందులో షఫాలీ వర్మ సారథ్యంలోని భారత జట్టు విజేతగా నిలిచింది. రెండో ఎడిషన్‌లో మొత్తం నాలుగు గ్రూప్‌లలో నాలుగేసి జట్లు పోటీపడనున్నాయి. గ్రూప్ 'ఎ'లో వెస్టిండీస్, శ్రీలంక, మలేసియాతో కలిసి భారత్ బరిలోకి దిగనుంది.

**గ్రూప్‌ల వివరాలు**

గ్రూప్ 'ఎ': భారత్, వెస్టిండీస్, శ్రీలంక, మలేసియా.
గ్రూప్ 'బి': ఇంగ్లండ్, పాకిస్తాన్, ఐర్లాండ్, అమెరికా.
గ్రూప్ 'సి': న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, ఆఫ్రికా క్వాలిఫయర్, సమోవా. గ్రూప్ 'డి': ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఆసియా క్వాలిఫయర్, స్కాట్లాండ్.

# ప్రియా మిశ్రా 5-2-14-5

- అదరగొట్టిన భారత 'ఎ' లెగ్ స్పిన్నర్
- చివరి వన్డేలో ఆస్ట్రేలియా 'ఎ'పై టీమిండియా 'ఎ' ఘనవిజయం



క్వీన్స్‌లాండ్: ఆస్ట్రేలియా పర్యటనలో భారత మహిళల 'ఎ' క్రికెట్ జట్టు తొలి విజయం నమోదు చేసుకుంది. ఆదివారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో భారత 'ఎ' జట్టు 171 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా మహిళల 'ఎ' జట్టును చిత్తు చేసింది. భారత జట్టు విజయంలో లెగ్ స్పిన్నర్ ప్రియా మిశ్రా ముఖ్యపాత్ర పోషించింది. ఆమె 5 ఓవర్లు వేసి 14 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టింది. ఇందులో రెండు మెయిడెన్లు ఉన్నాయి. ఇప్పటికే తొలి రెండు మ్యాచ్‌లు ఓడి సిరీస్ కోల్పోయిన భారత్... ఆఖరి మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత 'ఎ' జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. రాఘవి బిష్త్ (53; 7 ఫోర్లు), తేజల్ హసాబ్నిస్ (66 బంతుల్లో 50; 7 ఫోర్లు) అర్ధ శతకాలు సాధించారు. నాలుగో వికెట్‌కు 107 పరుగుల భాగస్వామ్యం జోడించారు. కెప్టెన్ మిన్ను మణి (56 బంతుల్లో 34), సంజన (40; 4 ఫోర్లు) రాణించారు. 244 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా 'ఎ'ను భారత లెగ్ స్పిన్నర్ ప్రియా మిశ్రా హడలెత్తించింది. ఢిల్లీకి చెందిన ప్రియా తన తొలి బంతికే వికెట్ పడగొట్టింది. ఆ తర్వాత కూడా తన జోరు కొనసాగించిన ప్రియా ఆస్ట్రేలియా బ్యాటర్లను వరుస విరామాల్లో పెవిలియన్‌కు పంపించింది. దాంతో ఆస్ట్రేలియా 'ఎ' జట్టు 22.1 ఓవర్లలోనే కేవలం 72 పరుగులకు ఆలౌటైంది. ఇప్పటికే టి20 సిరీస్‌ను 0-3తో కోల్పోయిన భారత 'ఎ' జట్టు వన్డే సిరీస్‌ను 1-2తో చేజార్చుకుంది. ఇరు జట్ల మధ్య గురువారం నుంచి ఏకైక అనధికారిక టెస్టు ప్రారంభం కానుంది.

# దక్షిణాఫ్రికాదే సిరీస్

రెండో టెస్టులో 40 పరుగుల తేడాతో ఓడిన వెస్టిండీస్




ప్రావిడెన్స్: బ్యాటర్ల కృషికి బౌలర్ల సహకారం తోడవడంతో... వెస్టిండీస్‌తో జరిగిన రెండో టెస్టులో దక్షిణాఫ్రికా 40 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఫలితంగా రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-0తో కైవసం చేసుకుంది. విండీస్‌పై సఫారీ జట్టుకు ఇది వరుసగా 10వ టెస్టు సిరీస్ విజయం కావడం విశేషం. 263 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ 66.2 ఓవర్లలో 222 పరుగులకు ఆలౌటైంది. గుడకేశ్ మోతీ (59 బంతుల్లో 45; 5 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్. కవెమ్ హాడ్జ్ (38 బంతుల్లో 29; 6 ఫోర్లు), జోషువా డ సిల్వా (51 బంతుల్లో 27; 1 ఫోర్), కెప్టెన్ క్రెయిగ్ బ్రాత్‌వైట్ (55 బంతుల్లో 25; 3 ఫోర్లు), వారికన్ (50 బంతుల్లో 25 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో కేశవ్ మహరాజ్, కగిసో రబాడ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 160 పరుగులు చేయగా.. వెస్టిండీస్ 144 చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 246 పరుగులతో మెరుగైన ప్రదర్శన చేసి విండీస్ ముందు మంచి లక్ష్యాన్ని నిర్దేశించింది. వియాన్ ముల్డర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'... కేశవ్ మహరాజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు దక్కాయి. ఇరు జట్ల మధ్య శనివారం నుంచి మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్ ప్రారంభం కానుంది.




# దీప్తి సిక్సర్... లండన్ విన్నర్

**మహిళల హండ్రెడ్ టోర్నీ ఫైనల్లో మెరిసిన భారత ఆల్‌రౌండర్**

- 'సిక్స్'తో లండన్ స్పిరిట్ జట్టును గెలిపించిన దీప్తి శర్మ

లండన్: 'హండ్రెడ్' మహిళల క్రికెట్ టోర్నీకి అద్భుత ముగింపు లభించింది. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో లండన్ స్పిరిట్ జట్టు తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు ఆధ్వర్యంలో 2021లో హండ్రెడ్ టోర్నీ (ఇన్నింగ్స్‌కు 100 బంతులు) మొదలైంది. విఖ్యాత లార్డ్స్ మైదానంలో ఆదివారం జరిగిన ఫైనల్లో హీతెర్ నైట్ సారథ్యంలోని లండన్ స్పిరిట్ జట్టు నాలుగు వికెట్ల తేడాతో టామీ బీమోంట్ నాయకత్వంలోని వెల్ష్ ఫైర్ జట్టును ఓడించింది. లండన్ స్పిరిట్ జట్టుకు టైటిల్ దక్కడంలో భారత క్రికెటర్ దీప్తి శర్మ (16 బంతుల్లో 16 నాటౌట్; 1 సిక్స్) కీలకపాత్ర పోషించింది. లండన్ జట్టు విజయానికి చివరి 5 బంతుల్లో 6 పరుగులు అవసరమయ్యాయి. వెల్ష్ ఫైర్ జట్టు బౌలర్, విండీస్ ఆల్‌రౌండర్ హేలీ మాథ్యూస్ చివరి ఐదు బంతులు వేయడానికి వచ్చింది. తొలి బంతికి దీప్తి... రెండో బంతికి చార్లీ డీన్ చెరో సింగిల్ తీశారు. దాంతో లండన్ విజయ సమీకరణం 3 బంతుల్లో 4 పరుగులుగా మారింది. ఈ దశలో హేలీ వేసిన మూడో బంతిని దీప్తి శర్మ సిక్సర్‌గా మలిచి లండన్ విజయాన్ని ఖరారు చేసింది. రెండు బంతులు మిగిలి ఉండగా లండన్ స్పిరిట్ చాంపియన్‌గా అవతరించింది. అంతకుముందు వెల్ష్ ఫైర్ జట్టు 100 బంతుల్లో 8 వికెట్లకు 115 పరుగులు సాధించింది. జెస్ జొనాసెన్ (41 బంతుల్లో 54; 8 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలువగా... టామీ బీమోంట్ (16 బంతుల్లో 21; 4 ఫోర్లు), హేలీ మాథ్యూస్ (26 బంతుల్లో 22; 3 ఫోర్లు) రాణించారు. లండన్ స్పిరిట్ బౌలర్లలో ఇవా గ్రే, సారా గ్లెన్ రెండు వికెట్ల చొప్పున తీయగా... దీప్తి శర్మ, తారా నోరిస్‌లకు ఒక్కో వికెట్ దక్కింది. అనంతరం లండన్ స్పిరిట్ జట్టు 98 బంతుల్లో 6 వికెట్లు కోల్పోయి 118 పరుగులు చేసి గెలిచింది. జార్జియా రెడ్మెన్ (32 బంతుల్లో 34; 3 ఫోర్లు), హీతెర్ నైట్ (18 బంతుల్లో 24; 2 ఫోర్లు), డానియెలా గిబ్సన్ (9 బంతుల్లో 22; 5 ఫోర్లు) దూకుడుగా ఆడారు. వెల్ష్ ఫైర్ జట్టు బౌలర్లలో షబ్నిమ్ మూడు వికెట్లు పడగొట్టింది. గత ఏడాది విజేతగా నిలిచిన సదరన్ బ్రేవ్ జట్టులో భారత జట్టు వైస్ కెప్టెన్, ఓపెనర్ స్మృతి మంధాన సభ్యురాలిగా ఉండటం విశేషం.



విన్నింగ్ షాట్ తర్వాత దీప్తి శర్మ సంబరం

---

# భవిత



కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

## విద్య, ఉద్యోగ సమాచారం

### ఆర్ఆర్‌సీ-నార్త్ రైల్వేలో 4,096 అప్రెంటిస్‌లు

న్యూఢిల్లీలోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)–నార్త్ రైల్వే పరిధిలోని డివిజన్/వర్క్‌షాప్/యూనిట్లలో యాక్ట్ అప్రెంటిస్‌ల శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 4,096.
» **ఆర్ఆర్‌సీ వర్క్‌షాప్‌లు:** క్లస్టర్ లక్నో, క్లస్టర్ అంబాలా, క్లస్టర్ మొరాదాబాద్, క్లస్టర్ ఢిల్లీ, క్లస్టర్ ఫిరోజ్‌పూర్.
» **ట్రేడులు:** మెకానికల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, కార్పెంటర్, ఎంఎంవీ, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్, వెల్డర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్, ట్రిమ్మర్, రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మెకానిక్, డేటా ఎంట్రీ ఆపరేటర్,హామర్ మ్యాన్, టర్నర్, క్రేన్ ఆపరేటర్, స్టెనోగ్రాఫర్ తదితరాలు.
» **అర్హత:** పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 16.09.2024 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

**ముఖ్య సమాచారం**

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 16.08.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.09.2024.
» **మెరిట్ జాబితా వెల్లడి:** నవంబర్ 2024.
» **వెబ్‌సైట్:** http://www.rrcnr.org

### డా.వైఎస్సార్ ఏఎఫ్ఏయూ, కడపలో బీఆర్క్ ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడపలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ.. 2024–25విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ/ ప్రైవేట్/మైనారిటీ/అన్ ఎయిడెడ్ విద్యా సంస్థల్లో బీఆర్క్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సుల వివరాలు:** బీఆర్క్(రెగ్యులర్)డిగ్రీ కోర్సు
» **అర్హత:** మ్యాథ్స్/ఫిజిక్స్/కెమిస్ట్రీ/బయాలజీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలి. నాటా–2024 పరీక్షలో వ్యాలిడ్ స్కోరు సాధించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** నాటా–2024 స్కోరు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.

**ముఖ్య సమాచారం**

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 12.08.2024.
» **ఆన్‌లైన్‌రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 19.08.2024.
» **సర్టిఫికెట్ వెరిఫికేషన్ తేది:** 13.08.2024 నుంచి 20.08.2024 వరకు
» **వెబ్ ఆప్షన్ తేదీలు:** 26.08.2024, 27.08.2024.
» **మొదట విడత ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి తేది:** 29.08.2024.
» **తరగతుల ప్రారంభం:** 02.09.2024.
» **వెబ్‌సైట్:** https://apsche.ap.gov.in/arch

### ఎయిమ్స్ బిలాస్‌పూర్‌లో 68 టెక్నీషియన్ పోస్టులు

బిలాస్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) ఆధ్వర్యంలో బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బీఈసీఐఎల్)లో ఒప్పంద ప్రాతిపదికన ల్యాబ్ టెక్నీషియన్, టెక్నీషియన్ (ఓటీ/పెర్ఫ్యూజన్ టెక్నాలజీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 68.
» **పోస్టుల వివరాలు:** ల్యాబ్ టెక్నీషియన్–36, టెక్నీషియన్(ఓటీ/పెర్ఫ్యూజన్ టెక్నాలజీ)–32.
» **అర్హత:** ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులవ్వాలి. పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో.. బీఎస్సీ(మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ/మెడికల్ ల్యాబొరేటరీ సైన్స్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.35,400.
» **వయసు:** 18 నుంచి 35 ఏళ్లు మించకూడదు.

**ముఖ్య సమాచారం**

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రాజెక్ట్ మేనేజర్ (హెచ్ఆర్), బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్), బీఈసీఐఎల్ భవన్, సీ–56/ఏ–17, సెక్టార్–62, నోయిడా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 19.08.2024.
» **వెబ్‌సైట్:** www.becil.com

### నల్సార్ యూనివర్శిటీలో 33 ఫ్యాకల్టీ పోస్టులు

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్శిటీ ఆఫ్ లాలో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 35.
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ ప్రొఫెసర్–18, అసోసియేట్ ప్రొఫెసర్–08, ప్రొఫెసర్–09.
» **విభాగాలు:** లా, మేనేజ్‌మెంట్, సోషియాలజీ, ఎకనామిక్స్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో డిగ్రీ, పీజీ, నెట్/సెట్/స్లెట్ లేదా పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

**ముఖ్య సమాచారం**

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.09.2024.
» **వెబ్‌సైట్:** www.nalsar.ac.in



ఇంజనీరింగ్ స్పెషల్

» ఏఐ, జెన్ ఏఐలకు పెరుగుతున్న ప్రాధాన్యం
» ఐఓటీ, సైబర్ సెక్యూరిటీ నైపుణ్యాలకూ డిమాండ్
» తాజా సాంకేతికతలు సొంతం చేసుకుంటేనే భవిత
» బీటెక్ తొలి ఏడాది నుంచే ఏఐపై దృష్టి పెట్టాల్సిన ఆవశ్యకత

# ఏఐ స్కిల్స్‌తో కెరీర్ షైనింగ్!

**జాతీయ స్థాయిలో.. బీటెక్ ప్రవేశాల ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంది! నిట్‌లు, ఐఐటీలతోపాటు రాష్ట్రాల స్థాయిలో ఇంజనీరింగ్ కళాశాలల్లో.. త్వరలోనే తరగతులు ప్రారంభంకానున్నాయి. నేటి ఏఐ యుగంలో బీటెక్‌లో చేరిన లక్ష్యం నెరవేరాలంటే.. అందుకు తగ్గ లేటెస్ట్ టెక్నాలజీని, స్కిల్స్‌ను అందిపుచ్చుకోవాల్సిన ఆవశ్యకత!! ఇందుకోసం బీటెక్ మొదటి సంవత్సరం నుంచే కృషి చేయాల్సిన పరిస్థితి! ఈ నేపథ్యంలో.. ఇంజనీరింగ్‌లో తాజా ట్రెండ్స్, సంస్థలు కోరుకుంటున్న స్కిల్స్, వాటిని అందిపుచ్చుకోవడానికి మార్గాలపై ప్రత్యేక కథనం..**

బీటెక్‌లో ప్రవేశం కోసం ఎన్నో ఎంట్రన్స్‌లు రాసి సీటు సొంతం చేసుకున్న విద్యార్థులు.. కాలేజ్‌లో అడుగు పెట్టాక క్లాస్ రూమ్ తరగతులకే పరిమితం కాకుండా నూతన టెక్నాలజీ ట్రెండ్స్‌పై అవగాహన పెంచుకోవాలి.నిరంతరం మార్కెట్ ట్రెండ్స్‌ను తెలుసుకుంటూ..తాజా సాంకేతికను అనుసరిస్తూ.. వాటిలో రాణించేందుకు కృషి చేయాలి. అప్పుడే జాబ్ మార్కెట్‌లో ముందంజలో నిలిచే అవకాశం ఉంటుంది. ఇంజనీరింగ్‌లో చేరిన లక్ష్యం నెరవేరుతుంది.

**మారుతున్న ధోరణి**

నేడు సంస్థల కార్యకలాపాలు, వాటి దృక్పథంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. నూతన సాంకేతికతలను కంపెనీలు వేగంగా అమలు చేస్తున్నాయి. ప్రభుత్వ విభాగాలు మొదలు కార్పొరేట్ సంస్థల వరకూ.. డిజిటలైజేషన్ ఆధారిత కార్యకలాపాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. వీటిలో నైపుణ్యాలు ఉన్న వారికే ఉద్యోగాలు ఇవ్వడానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. ముఖ్యంగా జెన్ ఏఐ, ఏఐ, డిజిటలైజేషన్, ఐఓటీ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, రెన్యువబుల్ ఎనర్జీ, ఆర్ అండ్ డీ విభాగాలపై కంపెనీలు ఎక్కువగా దృష్టి పెడుతున్నాయి. కాబట్టి వీటిని అందిపుచ్చుకునేలా విద్యార్థులు బీటెక్ మొదటి సంవత్సరం నుంచే కృషి చేయాలి.

**జెన్ ఏఐ**

ఇటీవల కాలంలో విస్తృతంగా వినిపిస్తున్న నూతన టెక్నాలజీ... జెన్ ఏఐ (జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్). టెక్స్ట్, ఇమేజెస్, వీడియో, ఆడియో, సాఫ్ట్‌వేర్ కోడ్‌లకు సంబంధించి క్లయింట్/యూజర్ అవసరాలకు అనుగుణంగా వాస్తవ కంటెంట్‌ను రూపొందించే టెక్నాలజీగా జెనరేటివ్ ఏఐను పేర్కొంటున్నారు. మనకు ఇప్పుడు బాగా వినిపిస్తున్న చాట్ జీపీటీ, గూగుల్ బార్డ్ వంటివి జెనరేటివ్ ఏఐ కోవలోకే వస్తాయి. వీటిని ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, హెల్త్‌కేర్, తయారీ, ఫిన్‌టెక్, మీడియా, అడ్వర్టయిజింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాల్లో విస్తృతంగా వినియోగిస్తున్నారు. 2026 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 100 మిలియన్‌ల మంది జెనరేటివ్ ఏఐను వాడతారని అంచనా. అందుకే ఇంజనీరింగ్ విద్యార్థులు జెన్ ఏఐ నైపుణ్యాల సాధనకు కృషి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్**

ఇప్పుడు అన్ని రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఆధారిత కార్యకలాపాలు విస్తృతం అవుతున్నాయి. ఈ కృత్రిమ మేధస్సుతో కార్యకలాపాలు సజావుగా సాగాలంటే.. సంబంధిత ప్రోగ్రామ్‌ల రూపకల్పనకు మానవ మేధస్సు చాలా అవసరం. ఫలితంగా రానున్న కాలంలో ఏఐ యువతకు బెస్ట్ కెరీర్ ఆప్షన్‌గా నిలవనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో రాణించేందుకు ప్రోగ్రామింగ్, కోడింగ్ నైపుణ్యాలు, మ్యాథమెటికల్ స్కిల్స్, అల్గారిథమ్ స్కిల్స్, లాజికల్ థింకింగ్, అనలిటికల్ స్కిల్స్ వంటి వాటిని మెరుగుపరచుకోవాలి.

**డేటా సైన్స్, డేటా అనలిటిక్స్**

కార్పొరేట్ రంగం మొదలు మాన్యుఫ్యాక్చరింగ్, సర్వీస్ సెక్టార్, బ్యాంకింగ్.. ఇలా అన్ని రంగాల్లోనూ కార్యకలాపాల నిర్వహణలో ప్రాధాన్యం సంతరించుకుంటున్న విభాగం.. డేటా సైన్స్, డేటా అనలిటిక్స్. సంస్థలు బిగ్ డేటాపై ఆధారపడి వినియోగదారులను పెంచుకోవాలని కోరుకుంటున్నాయి. డేటా సైన్స్, మెషీన్ లెర్నింగ్, అనలిటిక్స్ విభాగాల్లో నైపుణ్యాలను సొంతం చేసుకున్న వారికి జాబ్ మార్కెట్‌లో డేటా ఇంజనీర్స్, డేటా అనలిస్ట్ ఉద్యోగాల్లో డిమాండ్ నెలకొంది.

**ఐఓటీ**

బీటెక్ విద్యార్థులు దృష్టి సారించాల్సిన మరో సాంకేతిక.. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్. ఇంటర్నెట్ లేదా వైర్‌లెస్ సెన్సార్ల ఆధారంగా ఆయా కార్యకలాపాలను పూర్తి చేసే ఈ సాంకేతికతను ఇప్పుడు అన్ని రంగాల్లోనూ అమల్లోకి వస్తోంది. రిటైల్, హెల్త్‌కేర్, ఆటోమోటివ్స్, ఎలక్ట్రానిక్ అప్లయెన్సెస్, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లోని సంస్థలు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌కు విస్తృత ప్రాధాన్యం ఇస్తున్నాయి. తాజాగా ఇండస్ట్రియల్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ కూడా ప్రాధాన్యం సంతరించుకుంటోంది. సంస్థలో ఒక ఉత్పత్తిని రూపొందించే క్రమంలో అన్ని విభాగాలను అనుసంధానం చేయడమే దీని ప్రధాన ఉద్దేశం. ఇంజనీరింగ్ విద్యార్థులు కోడింగ్, ప్రోగ్రామింగ్, డేటా అనలిటిక్స్, అప్లికేషన్ డిజైన్, హార్డ్ వేర్ నెట్ వర్కింగ్, డాట్ నెట్, ఐపీ నెట్ వర్కింగ్ మొబైల్ డెవలప్‌మెంట్ వంటి అంశాలపై పట్టు సాధిస్తే చక్కటి కెరీర్ అవకాశాలు లభిస్తాయి.

**సైబర్ సెక్యూరిటీ**

ఈ–కామర్స్, బ్యాంకింగ్, ఫిన్‌టెక్.. ఇలా అన్ని రంగాల్లోనూ ఇంటర్నెట్ ఆధారిత ఆన్‌లైన్ కార్యకలాపాలు సాగుతున్న నేపథ్యంలో.. అవి సాఫీగా సాగేలా.. వాటికి ముప్పు వాటిల్లని రీతిలో.. చర్యలు తీసుకునే సైబర్ సెక్యూరిటీకి కంపెనీలు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయి. దీంతో థ్రెట్ డిటెక్షన్, ఎథికల్ హ్యాకింగ్, డేటా ప్రొటెక్షన్ వంటి నైపుణ్యాలు పెంచుకోవడం ద్వారా ఆకర్షణీయమైన కెరీర్ అవకాశాలు దక్కించుకోవచ్చు.

**రెన్యువబుల్ ఎనర్జీ**

జాతీయ స్థాయిలో పునరుత్పాదక శక్తి రంగంలో సుస్థిరత పెరిగేలా ప్రభుత్వ విధానాలు అమలు అవుతున్నాయి. రెన్యువబుల్ ఎనర్జీ, సోలార్ పవర్, ఎనర్జీ ఎఫిషియన్సీ విభాగాలు బీటెక్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నాయి. వీరు ఈ విభాగాల్లో నైపుణ్యాలు సొంతం చేసుకుంటే పునరుత్పాదక ఇంధన రంగంలో అద్భుత అవకాశాలు సొంతం చేసుకోవచ్చు.

**ఆర్ అండ్ డీ**

భారత్ రీసెర్చ్, డెవలప్‌మెంట్‌పై దృష్టిసారిస్తోంది. ఇది రానున్న రోజుల్లోనూ మరింత వేగం పుంజుకోనుంది. ప్రస్తుతం ఆర్ అండ్ డీపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు అనేక ప్రోత్సాహకాలు అందుబాటులో ఉన్నాయి. ఐఐటీ, ఎన్ఐటీ తదితర ప్రభుత్వ రంగ ఇన్‌స్టిట్యూట్స్, అదే విధంగా పరిశోధన లేబొరేటరీలు, కార్పొరేట్ రీసెర్చ్ ల్యాబ్స్ వంటివి రీసెర్చ్ కార్యకలాపాల నిర్వహణకు సుమున్నత వేదికలుగా నిలవనున్నాయి. బయో టెక్నాలజీ, నానో టెక్నాలజీ, ఏరోస్పేస్.. ఇలా విభిన్న విభాగాలో రీసెర్చ్ చేసేందుకు అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

**నైపుణ్య సాధనకు మార్గాలు**

ఇంజనీరింగ్, సాంకేతిక విభాగాల్లో ఏఐ, ఎంఎల్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఐఓటీ వంటి తాజా నైపుణ్యాలు కీలకంగా నిలుస్తున్నాయి. వీటిని పెంచుకునేందుకు ఎన్నో మార్గాలు అందుబాటులోకి వచ్చాయి. పలు ఇన్‌స్టిట్యూట్స్ బీటెక్ స్థాయిలోనే ఏఐ–ఎంఎల్ బ్రాంచ్‌తో ప్రత్యేక ప్రోగ్రామ్స్ ప్రవేశపెట్టగా.. మరికొన్ని ఇన్‌స్టిట్యూట్స్ ఎంటెక్ స్థాయిలో వీటిని అందిస్తున్నాయి. ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్స్‌లో కోర్సులతోపాటు ఇండస్ట్రీ 4.0 స్కిల్స్‌కు సంబంధించి ఐబీఎం, సిస్కో, మైక్రోసాఫ్ట్, వీఎం వేర్, ఇంటెల్ వంటి ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలు ఆటోమేషన్, ఐఓటీపై ఆన్‌లైన్ కోర్సులను అందిస్తున్నాయి. విద్యార్థులు వీటి ద్వారా నైపుణ్యాలు పెంచుకోవచ్చు.

**ఆన్‌లైన్ కోర్సులు**

అంతర్జాతీయంగా పలు ప్రముఖ యూనివర్సిటీలు ఆయా టెక్ స్కిల్స్‌కు సంబంధించి ఆన్‌లైన్ విధానంలో మూక్స్ పేరుతో కోర్సులను అందిస్తున్నాయి. ఇంజనీరింగ్ విద్యార్థులు మూక్స్ ద్వారా తమ సబ్జెక్టులతోపాటు లేటెస్ట్ టెక్నాలజీపైనా అవగాహన పెంచుకోవచ్చు. మన దేశంలోనూ ఎన్‌పీటీఈఎల్ ద్వారా ప్రముఖ ప్రొఫెసర్స్ బోధించే పాఠాలను ఆన్‌లైన్‌లో వినే అవకాశముంది. వీటిల్లో విద్యార్థులకు ఉపయోగపడే వర్చువల్ ల్యాబ్స్ సౌకర్యం సైతం లభిస్తుంది. ఫలితంగా విద్యార్థులు తాజా పరిశోధనలు, టెక్నాలజీ, పరిణామాలు, ప్రాక్టికల్ అంశాలపై అవగాహన పెంచుకోవచ్చు.

**నిరంతర అధ్యయనం**

సాంకేతిక రంగంలో వస్తున్న తాజా మార్పులకు అనుగుణంగా శిక్షణ, నైపుణ్యాలతోపాటు నిరంతరం అధ్యయనం, పరిశీలన కొనసాగించాలని నిపుణులు సూచిస్తున్నారు. సబ్జెక్ట్‌ను చదవడానికే పరిమితం కాకుండా.. వాస్తవ పరిస్థితుల్లో అన్వయం చేసుకునే దృక్పథం చాలా అవసరమని పేర్కొంటున్నారు.

అదే విధంగా.. ప్రాజెక్ట్ వర్క్, మినీ ప్రాజెక్ట్ వర్క్‌లు తాజా సాంకేతికతలకు సంబంధించినవిగా ఉండేలా చూసుకోవాలని ఇంజనీరింగ్ విద్యార్థులకు సూచిస్తున్నారు. తద్వారా లేటెస్ట్ టెక్నాలజీస్‌పై అకడమిక్ దశలో ప్రాక్టికల్ నైపుణ్యాలు సొంతమవుతాయి. అదే విధంగా కొత్త టెక్నాలజీకి సంబంధించి ఇండస్ట్రీ వర్గాలు తీసుకుంటున్న చర్యలు, వాటిని అమలు చేస్తున్న తీరుపై పరిశీలన, అవగాహన పెంచుకోవాలని, తద్వారా స్కిల్స్‌కు పదును పెట్టుకోవాలని సూచిస్తున్నారు.

**స్టాక్ మార్కెట్లు** (శుక్రవారం ముగింపు)

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▲ | 1,331 | 80,437 |
| నిఫ్టీ ▲ | 397 | 24,541 |


| విదేశీ సూచీలు | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 17,632 | ▲ | 37 |
| డోజోన్స్ | 40,660 | ▲ | 97 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 8,311 | ▼ | 36 |
| డాక్స్ | 18,322 | ▲ | 139 |
| కాంపైక్ | 2,879 | ▲ | 2 |
| నికాయ్ | 38,063 | ▲ | 1,336 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఒకటి | 83.54 | 84.56 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఒకటి | 106.90 | 109.48 |
| € | యూరో | ఒకటి | 91.10 | 93.49 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఒకటి | 55.82 | 57.07 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఒకటి | 54.71 | 56.65 |
| S$ | సింగపూర్ డాలర్ | ఒకటి | 61.35 | 66.06 |
| SAR | సౌదీ రియాల్ | [illegible] | 21.49 | 23.05 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | [illegible] | 21.97 | 23.75 |
| ¥ | చైనా యువాన్ | [illegible] | 10.84 | 12.67 |

# రియల్టీలో సిప్ చేద్దామా!




వాణిజ్య ప్రాపర్టీపై పెట్టుబడి పెట్టాలంటే సామాన్య ఇన్వెస్టర్లకు అయ్యే పనేనా..! ఎక్కడ చూసినా ధరలు గణనీయంగా పెరిగిపోయిన తరుణంలో.. కొనాలంటే పెద్ద మొత్తమే పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. అయితే, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ మాదిరే క్రమానుగత పెట్టుబడి (సిప్) విధానంలో వాణిజ్య ప్రాపర్టీలపై ఇన్వెస్ట్ చేయాలన్న ఆకాంక్షలకు ఆచరణ మార్గమే రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లు (రీట్‌లు). వీటిలో ఇన్వెస్ట్ చేయడం ఎలా? వచ్చే ప్రయోజనం ఎంత మేర? తదితర వివరాలను అందించే కథనమే ఇది.

– సాక్షి, బిజినెస్ డెస్క్

## రీట్ అంటే...?



రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లు (రీట్‌లు) పేరులో ఉన్నట్టుగానే.. వివిధ రకాల వాణిజ్య ప్రాపర్టీలపై పెట్టుబడులు పెడుతుంటాయి. మ్యూచువల్ ఫండ్స్ మాదిరే ఇన్వెస్టర్ల నుంచి పెట్టుబడులు సమీకరిస్తుంటాయి. వాటిని వాణిజ్య ప్రాపర్టీలపై ఇన్వెస్ట్ చేస్తాయి. ఆయా ప్రాపర్టీలను అద్దెకు, లీజుకు ఇస్తుంటాయి. వీటి ద్వారా వచ్చే ఆదాయాన్ని తిరిగి వాటాదారులకు క్రమం తప్పకుండా పంచుతుంటాయి. ఆఫీసులు, మాల్స్, ఇండస్ట్రియల్ పార్క్‌లు, వేర్‌హౌస్‌లు, హాస్పిటాలిటీ, హెల్త్‌కేర్ సెంటర్లు తదితర వసతులపై రీట్‌లు ఇన్వెస్ట్ చేస్తుంటాయి. అదే మ్యూచువల్ ఫండ్స్ అయితే బాండ్లు, గోల్డ్, స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. ఉదాహరణకు ఓ పది మంది స్నేహితుల బృందం ఉందనుకుందాం. తలో రూ.10 లక్షలు వేసుకుని రూ.కోటితో ఒక వాణిజ్య భవనాన్ని సమకూర్చుకున్నారు. దాన్ని ఓ కార్పొరేట్ సంస్థ కార్యాలయానికి లీజుకు ఇచ్చారు. లీజు రూపంలో వచ్చే మొత్తం నుంచి 90 శాతాన్ని పది మంది డివిడెండ్ కింద పంచుకుంటారు. రీట్‌లో ఇదే మాదిరి జరుగుతుంది. కాకపోతే రీట్‌ల నిర్వహణలో ఇలాంటి వాణిజ్య ఆస్తులు పెద్ద సంఖ్యలో ఉంటాయి. అమెరికా, జపాన్ తదితర దేశాల్లో రీట్‌లకు ఎంతో ఆదరణ ఉంది. కానీ మన దేశంలో వీటిపై అంత అవగాహన లేదు. అందుకే ఇవి పెద్దగా ప్రాచుర్యానికి నోచుకోలేదు. ప్రత్యామ్నాయ పెట్టుబడి సాధనాలుగా వీటికి తగినంత ప్రచారం కల్పించేందుకు సెబీ తన వంతు కృషి చేస్తోంది. స్టాక్స్, ఫండ్స్ మాదిరే రీట్‌లు కూడా సెబీ పర్యవేక్షణ కిందకే వస్తాయి. సెబీ నిబంధనల ప్రకారం రీట్‌లు 80% పెట్టుబడులను అద్దెను సమ కూర్చే ఆస్తులపైనే ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. మరో 20% మేర పెట్టుబడులను నిర్మాణంలోని ప్రాపర్టీలపై ఇన్వెస్ట్ చేయవచ్చు. అలాగే, వచ్చే అద్దె ఆదాయంలో నిర్వహణ వ్యయాలు, పన్నులు పోను మిగిలిన నికర మొత్తం నుంచి 90 శాతాన్ని ఇన్వెస్టర్లకు పంపిణీ చేయాలి.

## ప్రయోజనాలు...

### అద్దె ఆదాయం




రీట్‌లకు లీజు రూపంలో ఆదాయం వస్తుంటుంది. దీన్ని వాటాదారులకు డివిడెండ్ రూపంలో పంపిణీ చేస్తాయి. సాధారణంగా ప్రతి మూడేళ్లకోసారి 15 శాతం అద్దె పెంచాలన్న నిబంధనతో లీజు ఒప్పందాలు చేసుకుంటుంటాయి. దీంతో వాటాదారులకు వచ్చే డివిడెండ్ ఆదాయం కూడా కాలక్రమేణా పెరుగుతూ వెళుతుంది. కొత్త లీజు సమయంలో అప్పటికి పెరిగిన మార్కెట్ ధరల ప్రకారమే ఒప్పందాలు చేసుకుంటుంటాయి.

### వడ్డీ ఆదాయం



రీట్‌లు తమవద్ద నున్న మిగులు నిధులపై వడ్డీ రాబడిని పొందుతుంటాయి. లేదా ప్రాపర్టీ లీజుదారులకు రుణాలు సమకూర్చడం ద్వారా వాటిపై ఆదాయం పొందుతాయి. ఈ రూపంలోనూ వాటాదారులకు ఆదాయం లభిస్తుంది. మన దేశంలో రీట్‌లు ప్రధానంగా టైర్–1 పట్టణాల్లోని ప్రాపర్టీలపైనే ఎక్కువ పెట్టుబడులు పెట్టి ఉన్నాయి. కనుక వీటి ధరలు మరింత పెరిగేందుకు ఆస్కారం ఉంది.

### పనితీరు భిన్నం



స్టాక్స్, బాండ్లు తదితర సాధనాలకు భిన్నంగా రీట్ స్పందన ఉంటుంది. అంటే స్టాక్స్ లేదా బాండ్ల ధరలు పడిపోతే రీట్‌ల ధరలు కూడా పడిపోవాలనేమీ లేదు. ఆ సమయంలో ఇవి స్థిరంగా ఉండొచ్చు. లేదా లాభాలను ఇవ్వొచ్చు. ఒకవేళ రీట్‌ల ధరలు కూడా తగ్గినా.. ఇతర సాధనాల స్థాయిలో ఉండదు. ఈ విధంగా పెట్టుబడుల్లో కొంత భాగానికి రిస్క్ తగ్గుతుంది.

### పెట్టుబడి విలువ వృద్ధి



రీట్‌ల నిర్వహణలోని ప్రాపర్టీల విలువలు కొంత కాలానికి సహజంగా పెరుగుతుంటాయి. తమ నిర్వహణలోని ఆస్తుల విలువలను ఎప్పటికప్పుడు రీట్‌లు మదింపు చేసుకోవాలి. దీంతో పెరిగిన ప్రాపర్టీల విలువ రీట్ యూనిట్ విలువపై ప్రతిఫలిస్తుంది. అలాగే, ఆర్థికంగా లాభదాయకం లేని, లీజు పరంగా అంత డిమాండ్ లేని ప్రాపర్టీలను విక్రయించి, డిమాండ్ ఉన్న ప్రాంతాల్లోని ప్రాపర్టీలపై ఇవి ఇన్వెస్ట్ చేస్తుంటాయి. ఇది కూడా పెట్టుబడి విలువ వృద్ధికి, డివిడెండ్ వాటా పెంపునకు దారితీస్తుంది. అంతేకాదు, కొంత మేర రుణాలు తీసుకుని కొత్త ప్రాపర్టీలపై వెచ్చించేందుకు సైతం వీటికి వెసులుబాటు ఉంటుంది. కనుక కాలక్రమంలో, కంపెనీ నగదు ప్రవాహాలు, నికర విలువ పెరుగుతున్న కొద్దీ.. కొత్త ప్రాపర్టీలను అదనంగా సమకూర్చుకుంటాయి. ఆ విధంగానూ పెట్టుబడుల విలువ వృద్ధి చెందుతుంది. ఆదాయం పెరుగుతుంది.

### మెరుగైన లిక్విడిటీ

భౌతిక ప్రాపర్టీ కొనుగోలు చేస్తే విక్రయించడానికి చాలా సమయం తీసుకోవచ్చు. అదే రీట్‌లను పనిదినాల్లో ఏ రోజు అయినా విక్రయించుకుని, మరుసటి రోజే ఆ మొత్తాన్ని బ్యాంక్ ఖాతాలో పొందొచ్చు. ఇవి స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ అయి ఉంటాయి కనుక లిక్విడిటీ సమస్య ఉండదు.



**రూ.140 ఉన్నా పెట్టుబడికి వీలు**

- ఇందుకు వీలు కల్పించేవే రీట్‌లు
- వీటి నిర్వహణలో వాణిజ్య ప్రాపర్టీలు
- వచ్చే రాబడి వాటాదారులకు పంపిణీ
- స్థిరమైన ఆదాయానికి మార్గం
- పన్ను పరంగానూ అనుకూలమే

## లిస్టెడ్ రీట్‌లు...



బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రియల్ ఎస్టేట్ ట్రస్ట్, మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్, ఎంబసీ ఆఫీస్ పార్క్స్ రీట్, నెక్సస్ సెలక్ట్ ట్రస్ట్ రీట్‌లు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు లిస్ట్ అయి ఉన్నాయి. ఇవన్నీ కూడా త్రైమాసికానికి ఒకసారి డివిడెండ్‌ను పంపిణీ చేస్తున్నాయి.

## ఎలా ఇన్వెస్ట్ చేసుకోవచ్చు?



రీట్‌లో పెట్టుబడులకు ట్రేడింగ్, డీమ్యాట్ ఖాతాలు తప్పనిసరిగా ఉండాలి. స్టాక్స్‌ను కొనుగోలు చేసినట్టుగానే రీట్ యూనిట్‌లను కొనుగోలు చేసుకోవచ్చు. ఇవి డీమ్యాట్ ఖాతాలో జమ అవుతాయి.

## పన్ను బాధ్యత...

రీట్ పెట్టుబడులపై డివిడెండ్ రూపంలో వచ్చే ఆదాయంపై పన్ను కొంత భిన్నంగా ఉంది. బ్రూక్‌ఫీల్డ్, ఎంబసీ ఆఫీస్ పార్క్స్, మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్‌లు రాయితీతో కూడిన పన్ను రేటును ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 115బీఏఏ కింద ఎంపిక చేసుకోలేదు. ఇవన్నీ స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ)పైనే ఇన్వెస్ట్ చేశాయి. కనుక ఇవి పంపిణీ చేసే డివిడెండ్‌పై పన్ను లేదు. ఒకవేళ ఎస్‌పీవీలు రాయితీ రేటును ఎంపిక చేసుకుంటే, అప్పుడు అవి పంపిణీ చేసే డివిడెండ్ పన్ను పరిధిలోకి వస్తుంది. ఇన్వెస్టర్ తనకు వర్తించే శ్లాబు ప్రకారం దీనిపై పన్ను చెల్లించాల్సి ఉంటుంది. డివిడెండ్‌పై పన్ను వర్తించేట్టు అయితే, రీట్‌లు 10 శాతం టీడీఎస్ కింద తగ్గించి ఆదాయపన్ను శాఖకు జమ చేస్తాయి. ఇన్వెస్టర్లు తమ వార్షిక పన్ను రిటర్నుల్లో దీన్ని సర్దుబాటు చేసుకోవచ్చు. సొంత ప్రాపర్టీలపై రీట్‌లకు వచ్చే ఆదాయం నుంచి వాటాదారులకు డివిడెండ్ పంపిణీ చేసినా, ఎస్‌పీవీలకు ఇచ్చిన రుణాలపై రీట్‌లకు వచ్చే ఆదాయాన్ని వాటాదారులకు పంపిణీ చేసిన సందర్భాల్లోనూ.. ఇన్వెస్టర్ వ్యక్తిగత ఆదాయానికే కలుస్తుంది.

ఇక రీట్‌లలోని పెట్టుబడులకు స్టాక్స్, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ మాదిరే పన్ను నిబంధనలు వర్తిస్తాయి. విక్రయించినప్పుడు వచ్చే లాభంపై మూలధన లాభాల పన్ను చెల్లించాలి. ఏడాదిలోపు విక్రయించగా వచ్చిన లాభంపై 20 శాతం పన్ను, ఏడాది ముగిసిన తర్వాత విక్రయించినప్పుడు వచ్చిన లాభం మొదటి రూ. లక్ష తర్వాత మొత్తంపై 12.5 శాతం చెల్లించాలి.

## ఇవి గమనించాలి..




- రీట్‌లు స్వల్పకాలానికి కాకుండా దీర్ఘకాలం కోసమే (ఐదేళ్లు అంతకుమించిన కాలం) పరిశీలించడం సూచనీయం. అప్పుడు మూలధన పెట్టుబడి వృద్ధి సాధ్యపడుతుంది. రియల్ ఎస్టేట్ మార్కెట్ సైక్లికల్‌గా ఉంటుంది. స్వల్పకాలంలో రీట్‌ల ధరలు స్టాక్స్ మాదిరే ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా కొంత మేర హెచ్చుతగ్గులకు గురికావచ్చు.
- మనదేశంలో ఇప్పటి వరకు కేవలం నాలుగు రీట్‌లే లిస్ట్ అయి ఉన్నాయి. ఇందులో నెక్సస్ సెలక్ట్ ట్రస్ట్ మాత్రం రిటైల్ మాల్స్ ఆస్తులపైనే అధిక శాతం ఇన్వెస్ట్ చేసింది. మిగిలిన రీట్‌లు ఆఫీస్ ప్రాపర్టీలపై ఇన్వెస్ట్ చేసేవి. పనితీరు పోల్చి చూసేందుకు పరిమిత అవకాశాలే ఉన్నాయి.
- ఇన్వెస్ట్ చేసే ముందు ఆయా రీట్‌ల పరిధిలోని ప్రాపర్టీలలో ఆక్యుపెన్సీ రేషియో (భర్తీ రేటు) చూడాలి. లీజుకు తీసుకున్న కంపెనీలు అన్నీ ఒకే రంగంలో కాకుండా భిన్న రంగాలకు చెందినవి అయితే రిస్క్ వైవిధ్యం అవుతుంది. రీట్‌ల నిర్వహణలోని ప్రాపర్టీల నాణ్యత, డిమాండ్ చూడాలి.
- ఆర్థిక సంక్షోభ సమయాల్లో, కరోనా వంటి విపత్తుల సమయాల్లో ఆఫీస్ లీజింగ్ మార్కెట్‌పై ప్రభావం పడొచ్చు. అలాంటి సందర్భాల్లో డివిడెండ్ పంపిణీ, మూలధన పెట్టుబడి విలువ ప్రభావితం కావచ్చు.
- మన దగ్గర స్టాక్స్‌తో పోలిస్తే రీట్‌లకు ప్రాచుర్యం తక్కువ. కనుక స్టాక్ ఎక్స్ఛేంజీల్లో వీటి లిక్విడిటీ (ట్రేడింగ్ వ్యాల్యూమ్) తక్కువగా ఉంటుంది.
- తమకు స్థిరమైన ఆదాయం కావాలని కోరుకునే వారు రీట్‌లలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. అది కూడా తమ మొత్తం పెట్టుబడుల్లో 10 శాతం వరకు కేటాయించుకోవచ్చన్నది నిపుణుల సూచన.

## రాబడులు...

వాణిజ్య రియల్ ఎస్టేట్‌పై వార్షిక రాబడులు 8–10 శాతం మధ్య ఉంటాయి. గ్రేడ్–ఏ ఆఫీస్ స్పేస్‌పై రాబడులు ఒక్కోసారి 15 శాతం స్థాయిలో ఉంటాయి. కానీ, మన దేశంలో రీట్‌లపై ప్రస్తుత రాబడులు 10 శాతం లోపే ఉన్నాయి. మన ఆర్థిక వ్యవస్థ రానున్న రోజుల్లో మరింత విలువను సంతరించుకుంటుందని నిపుణుల అంచనా. దీనికి తోడు ఈ మార్కెట్ పరిణతి చెందిన కొద్దీ రీట్‌లపై వార్షిక రాబడులు 10 శాతం, అంతకంటే ఎగువ స్థాయికి చేరుకుంటాయని నిపుణుల అంచనా. 2022–2024 మధ్య రీట్‌ల నుంచి డివిడెండ్ రాబడి 6–9 శాతం మధ్య ఉన్నట్టు, పెట్టుబడి విలువలో 12–18 శాతం మేర వృద్ధి ఉన్నట్టు ఐసీఐసీఐ సెక్యూరిటీస్ నివేదిక చెబుతోంది.

**రీట్‌ల ప్రస్తుత ధర**

| రీట్ పేరు | (16-8-24 నాటికి) |
|---|---|
| నెక్సస్ సెలక్ట్‌ట్రస్ట్ | రూ.138 |
| బ్రూక్‌ఫీల్డ్ ఇండియా.. | రూ.268 |
| మైండ్‌స్పేస్ బిజినెస్ | రూ.340 |
| ఎంబసీ ఆఫీస్ పార్క్స్ | రూ.386 |



## ప్రెస్టీజ్ ఎస్టేట్స్ — బ్రోకరేజ్: యస్ సెక్యూరిటీస్ — కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,812 టార్గెట్: రూ. 3,021

**ఎందుకంటే:** మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం(2023–24)లో రియల్టీ రంగ దిగ్గజం ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్ రూ. 21,000 కోట్ల విలువైన ప్రీబుకింగ్స్ (అమ్మకాలు) సాధించింది. ఈ బాటలో ప్రస్తుత ఏడాది (2024–25)లోనూ రూ. 26,000–27,000 కోట్ల విలువైన ముందస్తు అమ్మకాలను అంచనా వేస్తోంది. ఇందుకు రూ. 60,000 కోట్ల విలువైన జీడీవీతో విడుదల చేయనున్న ప్రాజెక్టులు సహకరించగలవని భావిస్తోంది. ఇవికాకుండా రూ. 12,000 కోట్ల విలువైన ప్రస్తుత ఇన్వెంటరీ సైతం తోడ్పాటునివ్వగలదని పేర్కొంటోంది. రెసిడెన్షియల్ బిజినెస్ విలువను రూ. 27,300 కోట్లుగా మదింపు చేశాం. రానున్న 2–3ఏళ్లలో కంపెనీ సైతం రూ. 5,000 కోట్ల యాన్యుటీ సాధించేందుకు ప్రణాళికలు వేసింది. 11.7 శాతం సగటు పెట్టుబడి వ్యయాలు (డబ్ల్యూఏసీసీ)తో ఈ విలువను మొత్తంగా రూ. 41,000 కోట్లుగా అంచనా వేశాం. కార్యాలయాలకు 8 శాతం క్యాప్(సీఏపీ) రేటు, రిటైల్‌కు 6.5 శాతం రేటు చొప్పున మదింపు చేశాం. ఆతిథ్య రంగ విభాగాన్ని



లిస్ట్ చేసే యోచనలో కంపెనీ ఉంది. 2027 ఈవీ/ఈబీఐటీడీఏ 25 రెట్లు ప్రకారం ఈ విభాగం విలువను రూ. 14,600 కోట్లుగా అంచనా వేశాం. రెసిడెన్షియల్ విభాగంతోపాటు.. యాన్యుటీ పురోగతిలో భారీ వృద్ధి అవకాశాలు, ఆతిథ్య విభాగ లిస్టింగ్ నేపథ్యంలో ప్రత్యర్థి కంపెనీలతో పోలిస్తే ప్రెస్టేజ్ ఎస్టేట్స్ బాగా ముందుంటుంది. పటిష్ట రుణ నిర్వహణ, నియంత్రణలోనే ఉన్న 0.36 రెట్లు నికర రుణ నిష్పత్తి సానుకూల అంశాలుగా చెప్పవచ్చు. రెండేళ్ల కాలానికి వృద్ధి ఆధారిత కంపెనీగా ప్రెస్టేజ్ ఎస్టేట్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు.

## యాక్సిస్ బ్యాంక్ — బ్రోకరేజ్: షేర్‌ఖాన్ — కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,167 టార్గెట్: రూ. 1,470

**ఎందుకంటే:** ఫ్రాంచైజీలో నిర్మాణాత్మక ఇంప్రూవ్‌మెంట్ కారణంగా ఏర్పడిన అప్‌సైకిల్ దశతో ప్రయివేట్ రంగ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ మరింత జోరందుకోనుంది. ఫలితాల్లో వృద్ధి కొనసాగడం, నిలకడైన నికర వడ్డీ మార్జిన్లు, సీఈటీ–1 గ్యాప్ (ఆస్తులతో బ్యాంక్ మూలధన నిష్పత్తి) క్రమంగా తగ్గుతుండటం వంటి అంశాలు బ్యాంక్‌కు బలిమినివ్వనున్నాయి. దీంతో బ్యాంక్ షేరుకి బూస్ట్ లభించే వీలుంది. వివిధ దశలలో అధిక స్థాయి రిస్క్ సర్దుబాటు రిటర్నులు సాధిస్తుండటం, ఇదే సమయంలో రిస్క్ వెయిటెడ్ అసెట్స్ తక్కువ వృద్ధి నమోదు చేస్తుండటం సానుకూల అంశాలుగా పేర్కొనవచ్చు. డిపాజిట్లను ప్రోదిచేసుకోవడంలో నిలకడైన వృద్ధి, గత రెండేళ్లలో డిపాజిట్ల ఔట్‌ఫ్లోస్ 5 శాతానికి తగ్గడం, ఎల్‌సీఆర్‌లో 23.9 శాతానికి కట్టడి చేయడం ప్రధాన అంశాలు కాగా.. నికర వడ్డీ మార్జిన్ల క్షీణత దశ ముగిసిపోయినట్లుగా భావించవచ్చు. ఆస్తుల నాణ్యతలో నిలకడ కొనసాగుతుండటంతో రుణ వ్యయాలు తగ్గనున్నాయి. దీర్ఘకాలిక



సగటుకంటే తక్కువకు చేరడంతో లాభదాయకత, రిటర్న్ రేషియోలు మెరుగుపడనున్నాయి. దీంతో భవిష్యత్ అవసరాలపై బ్యాంక్ ఇన్వెస్ట్ చేసేందుకు వీలు చిక్కనుంది. వాతావరణం సానుకూలించినంత కాలం పెట్టుబడుల కొనసాగింపునకు అవకాశముంది. రుణ వృద్ధి మందగించే వీలున్నప్పటికీ డిపాజిట్ల పురోగతితో ముడివేయనుంది. మధ్య, దీర్ఘకాలాలకు బ్యాంకింగ్ పరిశ్రమను మించి 3–4 శాతం అధిక వృద్ధిని సాధించగలమని యాక్సిస్ విశ్వసిస్తోంది. సమీప కాలంలో బిజినెస్ అవసరాలకు అనుగుణంగా ఈక్విటీ మూలధన సమీకరణ ప్రణాళికలు అమలు చేయనున్నట్లు బ్యాంక్ పేర్కొంది.

**గమనిక:** ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

# టర్మ్ ఇన్సూరెన్స్ ఎప్పటి వరకు?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్




**నా ఆదాయం 30 శాతం పన్ను శ్లాబు పరిధిలోకి వస్తుంది. కనుక నా పేరు మీద బదులు పన్ను ఆదా కోసం అమ్మ పేరు మీద సిప్ మొదలు పెట్టడం సరైనదేనా?**

– నిఖిల్ సైని

మీరు అనుకున్న విధంగా చేయొచ్చు. మీ అమ్మకు ఎలాంటి పన్ను వర్తించే ఆదాయం లేకపోయినా లేదా తక్కువ పన్ను శ్లాబు రేటు పరిధిలో ఉన్నా కానీ, ఆమె పేరు మీద ఇన్వెస్ట్ చేయడం తెలివైన నిర్ణయం అవుతుంది. మీ పన్ను భారం తగ్గుతుంది. కాకపోతే ఈ విధానంలో కొన్ని రిస్కులు ఉన్నాయి. మీ అమ్మ పేరు మీద చేసిన పెట్టుబడులపై రాబడులను పన్ను అధికారులు గుర్తించిన సందర్భంలో దానిని మీ ఆదాయం కిందే పరిగణిస్తారు. ఆ ప్రకారం పన్ను వసూలు చేస్తారు. అమ్మ పేరిట చేసిన పెట్టుబడిని మీకు తిరిగి ఇచ్చినా సరే పన్ను అధికారుల కళ్లు కప్పలేరు. మీ తరఫున మీ తల్లిదండ్రుల్లో ఎవరు ఇన్వెస్ట్ చేసినా న్యాయపరమైన అంశాలను కూడా ఎదుర్కోవాల్సి రావచ్చు. ఎందుకంటే చట్టపరంగా చూస్తే ఆ పెట్టుబడులు వారికే చెందుతాయి. ఒకవేళ ఇలా తల్లి లేదా తండ్రి పేరు మీద మీరు ఇన్వెస్ట్ చేసిన తర్వాత.. వారు మరణించినట్టయితే వారి పేరు మీదున్న పెట్టుబడుల్లో వాటాను మీ తోడబుట్టిన వారు కూడా క్లెయిమ్ చేసుకోవచ్చు. నామినీగా మీ పేరున్నా సరే.. వారసత్వ చట్టాలు తోబుట్టువులు అందరినీ సమానంగా పరిగణిస్తాయి.

**నేను టర్మ్ ఇన్సూరెన్స్ తీసుకోవాలని అనుకుంటున్నాను. ఏ వయసు వరకు తీసుకోవడం సరైనది? నా భార్య గృహిణి. ఆమె నాపైనే ఆధారపడి ఉంది. కనుక టర్మ్ ప్లాన్‌ను 85 ఏళ్ల వరకు తీసుకోవాలా లేక 60 ఏళ్ల వరకు తీసుకుంటే సరిపోతుందా?**

– తేజాస్ శాస్త్రి

కనీసం 60 ఏళ్ల వయసు వచ్చే వరకు టర్మ్ ప్లాన్ (జీవిత బీమా) తీసుకోవాలి. సాధారణంగా రిటైర్మెంట్ వయసు ఇదే. ఆ వయసు వచ్చే నాటికి తదనంతర జీవిత అవసరాలకు సరిపడా నిధి సమకూర్చుకునేట్టు అయితే.. 60 ఏళ్ల తర్వాత టర్మ్ ఇన్సూరెన్స్ అవసరం లేదు. మీ పెట్టుబడులకు నామినీగా మీ జీవిత భాగస్వామి పేరు నమోదు చేయడం మర్చిపోవద్దు. ఇందుకు వీలునామా రాయడం మంచిది. దీనివల్ల 60 ఏళ్లు వచ్చిన తర్వాత దురదృష్ట వశాత్తూ మీరు మరణించిన సందర్భంలో ఆస్తులు జీవిత భాగస్వామికి సాఫీగా బదిలీ అయ్యేందుకు వీలునామా వీలు కల్పిస్తుంది. ఒకవేళ 60 ఏళ్లలోపు మరణించినట్టయితే మీపై ఆధారపడిన వారిని జీవిత బీమా పరిహారం ఆర్థికంగా ఆదుకుంటుంది. అలాగే, 85 ఏళ్లు, అంతకుమించిన వయసుకు కూడా టర్మ్ ప్లాన్ తీసుకోవచ్చు. ఇలా దీర్ఘకాలం పాటు ఎంపిక చేసుకుంటే, రిటైర్మెంట్ తర్వాత కూడా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.




# భారత్‌లో ఫాక్స్‌కాన్ బ్యాటరీ స్టోరేజ్ ప్లాంట్

- వచ్చే ఏడాదిలో మరిన్ని పెట్టుబడులు
- సంస్థ చైర్మన్ యాంగ్‌లీ ప్రకటన

**శ్రీపెరంబదూర్:** భారత్‌లో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్టు తైవాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్‌లీ ప్రకటించారు. ఎలక్ట్రిక్ వాహన విభాగంపై దృష్టితో బ్యాటరీ తయారీ వ్యాపార విస్తరణపై ఫాక్స్‌కాన్ దృష్టి సారించింది. ఈ సంస్థ ఈ–బస్‌ల కోసం తైవాన్‌లో ఇలాంటి ప్లాంట్ ఒకదాన్ని ఇప్పటికే ఏర్పాటు చేయగా, ఈ ఏడాదే ఉత్పత్తి మొదలు కానుంది. ''3ప్లస్3 భవిష్యత్ పరిశ్రమ ఏర్పాటుకు వేచి చూస్తున్నాం. తమిళనాడులో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్) ఏర్పాటు విషయం




లో సహకారం ఎలా అన్నదానిపై పరిశ్రమల మంత్రితో చర్చిస్తున్నా'' అని యాంగ్‌లీ తెలిపారు. సోలార్, విండ్ టర్బయిన్ల ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను నిల్వ చేసేందుకు బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థలు వీలు కల్పిస్తాయి. మన దేశం పెద్ద ఎత్తున పునరుత్పాదక ఇంధన వనరులకు ప్రాధాన్యం ఇస్తుండడం తెలిసిందే. దీంతో ఈ విభాగంలో అవకాశాలను సొంతం చేసుకునేందుకు ఫాక్స్‌కాన్ ఆసక్తిగా ఉన్నట్టు యాంగ్‌లీ మాటలను బట్టి తెలుస్తోంది. భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ దిశగా ఫాక్స్‌కాన్ ప్రణాళికలు అమలు చేస్తోంది. త్వరలోనే ఈవీల తయారీ మొదలవుతుందని యాంగ్‌లీ తెలిపారు. భారత్‌లో ఇప్పటివరకు తాము 1.4 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేశామని, వ్యాపారం 10 బిలియన్ డాలర్లకు వృద్ధి చెందినట్లు చెప్పారు. రానున్న ఏడాది కాలంలో మరిన్ని పెట్టుబడులు పెడతామని ప్రకటించారు. ప్రస్తుత భారత పర్యటనలో భాగంగా పలు రాష్ట్రాల సీఎంలతో యాంగ్‌లీ సమావేశం కావడం గమనార్హం. ఎన్నో రాష్ట్రాలను సందర్శించిన తర్వాత భారత్ వృద్ధి పథకంలో ఉందని అర్థమవుతోందంటూ.. ఈ ప్రయాణంలో ఫాక్స్‌కాన్ సైతం భాగస్వామి కావాలనుకుంటున్నట్టు యాంగ్‌లీ చెప్పారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
మార్కెట్.. ప్రపంచ పరిణామాలే దిక్సూచి
ఐదేళ్లలో బీపీసీఎల్ భారీ పెట్టుబడులు

**కోడిగుడ్లు** (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 19-8-2024 | |
|---|---|
| విశాఖ | 505–00 |
| చిత్తూరు | 508–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 501–00 |
| విజయవాడ | 496–00 |
| రిటైల్ ధర (డజను) | 66.00 |
| హైదరాబాద్ | 450–00 |
| వరంగల్ | 452–00 |
| రిటైల్ ధర | 5.10 |



# ఈరోజు ఎన్ని లీటర్లు వాన పడింది??

**ఏంటీ** ఏదో తేడాగా ఉంది అని అనిపిస్తోందా.. అవును మరి.. ఎప్పుడూ ఇన్ని మిల్లీ మీటర్లు లేదా ఇన్ని సెంటీమీటర్లలో వర్షం పడింది అని మాత్రమే మనం వింటుంటాం కదా.. అయితే.. కచ్చితంగా ఎంత పడిందన్న విషయం ఎలా తెలుస్తుంది? సింపుల్‌గా చెప్పాలంటే.. వర్షం పడినప్పుడు ఒక చదరపు మీటర్ స్థలంలో ఒక లీటర్ నీళ్లు నిలిస్తే.. ఒక మిల్లీమీటర్ వాన పడినట్లు.. అదే పది లీటర్ల నీళ్లు నిలిస్తే.. ఒక సెంటీమీటర్ అన్నమాట. అసలు వానను శాస్త్రవేత్తలు ఎలా లెక్కిస్తారో తెలుసా?

సాధారణంగా వాన నీటి లెక్కలను తేల్చేందుకు ప్రత్యేకంగా పరికరాలు ఉంటాయి. వాటిని ఆరుబయట ప్రదేశాల్లో నిటారుగా ఉండేలా అమర్చుతారు. వాటిపై మిల్లీమీటర్లు, సెంటీమీటర్ల లెక్కలు ఉంటాయి. వర్షం పడినప్పుడు అందులో చేరే నీటి స్థాయిని చూసి.. ఎంత వాన పడిందో చెప్తారు. కానీ వానకు మామూలు లెక్క ఏమిటంటే.. సమతలంగా ఉన్న ఒక చదరపు

### ప్రత్యేక పరికరాలతో..

మీటర్ స్థలంలో ఒక లీటర్ నీళ్లు నిలిస్తే.. ఒక మిల్లీమీటర్ వాన అన్నమాట. ఈ లెక్కకు కొన్ని రూల్స్ ఉన్నాయి. కాంక్రీట్, ప్లాస్టిక్, ఏదైనా లోహంతో చేసినది అయినా సరే.. కచ్చితంగా చదరపు మీటర్ విస్తీర్ణం ఉండాలి. ఎక్కువ తక్కువలు, వంపు లేకుండా కచ్చితంగా సమతలంగా ఉండాలి. చుట్టూ ఖాళీ ప్రదేశం ఉండాలి. వాన నీరు పడేందుకు ఎలాంటి అడ్డంకీ ఉండకూడదు.



### కురిసిన సమయాన్ని బట్టి తీవ్రత..

ఎన్ని సెంటీమీటర్లు వాన అన్నది మాత్రమేకాకుండా ఎంత సమయంలో కురిసింది అన్నదాన్ని బట్టి.. వర్షం తీవ్రతను అంచనా వేస్తారు. ఉదాహరణకు ఒక రోజంతా అంటే 24 గంటల్లో ఆరు సెంటీమీటర్ల వానపడితే.. అది మోస్తరు వర్షం కిందే లెక్క. అదే ఒకట్రెండు గంటల్లోనే ఆరు సెంటీమీటర్లు పడితే కుంభవృష్టి కురిసినట్టే. ఇలా జరిగితే నీరంతా ఒక్కసారిగా చేరి వరదలు వస్తాయి. ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఎక్కువగా ఉంటుంది.



సాక్షి సెంట్రల్ డెస్క్

## బడిలో పాఠం.. గుడిలో స్నానం



ఆ గురుకులంలో సుమారు 400 మంది విద్యార్థులకు పది గదులు మాత్రమే ఉన్నాయి. దీంతో వారు ఇరుకు గదుల్లోనే నరకయాతన పడుతున్నారు. నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లిలోని బీసీ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థుల దుస్థితి ఇది. విద్యార్థుల చదువు, వసతి, వంట తదితర అవసరాల కోసం 35 గదులు అవసరం. కానీ గురుకుల భవనంలోని పది గదుల్లోనే వారు సర్దుకుంటున్నారు. డ్రయినేజీ వ్యవస్థ అధ్వానమై.. మురికి నీరు నిలిచిపోతుండడంతో బాత్‌రూంలలో స్నానాలు చేసే పరిస్థితి లేదు. దీంతో సమీపంలోని గుడికి వెళ్లి, అక్కడ భక్తుల కోసం నిర్మించిన నీటితొట్టి వద్ద స్నానాలు చేస్తున్నారు. సమస్య పరిష్కరించకపోతే విద్యార్థులకు టీసీ ఇవ్వాలని, వేరే చోట చదివించుకుంటామని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

డొంకేశ్వర్(ఆర్మూర్)

## ఊరికి కీడొచ్చిందని..



ఊరికి కీడొచ్చిందని నల్లగొండ జిల్లా మంగళపల్లి వాసులు ఆదివారం ఇళ్లముందు కల్లాపి చల్లకుండానే వనభోజనాలకు వెళ్లారు. గ్రామంలో గత నెలలో విషజ్వరాలు ప్రబలి పలువురు అస్వస్థతకు గురవడం తెలిసిందే. దీంతో ఊరికి కీడొచ్చిందని.. గ్రామస్తులంతా వనభోజనాలకు వెళ్లాలని స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో కోరారు. ఈ మేరకు 70శాతం మంది గ్రామస్తులు ఇళ్ల ముందు ఊడవకుండా, కల్లాపి చల్లకుండా తమ వ్యవసాయ బావులు, తోటల్లోకి వన భోజనాలకు వెళ్లారు. అక్కడే వండుకుతిని.. సాయంత్రానికి ఇంటి బాట పట్టారు.

నకిరేకల్

## ఆదివాసీల కష్టాలను చూసి చలించి..



ఆదివాసీలు పడుతున్న కష్టాలను చూసిన ఒక ప్రధానోపాధ్యాయుడు సొంత ఖర్చులతో రహదారి నిర్మించి ఔదార్యం చాటుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో నిర్మించిన ఈ రహదారిపై స్థానికులు తెలిపిన వివరాలివి. బూరుగుపాడు గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేదు. గ్రామానికి చెందిన నిండు గర్భిణి రవ్వా ఉంగిని ఆస్పత్రికి తరలించేందుకు స్థానికులు 108కు సమాచారం అందించారు. కానీ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేనందున రాలేమని, జెట్టీ కట్టి తీసుకురావాలని 108 సిబ్బంది సూచించారు. దీంతో మోకాలిలోతు బురదలో 1.5 కిలోమీటర్ల దూరం జెట్టీలో మోసుకొస్తుండటం చూసిన స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సవలం వీరస్వామి చలించిపోయారు. గ్రామస్తులందరినీ సమావేశపరిచి.. అంతా తనకు సహకరిస్తే రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. వారు శ్రమదానానికి ముందుకు రాగా, జేసీబీలు, ట్రాక్టర్లు, ఇతర ఖర్చులకు వీరస్వామి సొంత డబ్బు సుమారు రూ.70 వేలు వెచ్చించి రోడ్డు నిర్మించారు. ప్రధానోపాధ్యాయుడు చేసిన ఉపకారాన్ని ఎన్నటికీ మరిచిపోలేమని గ్రామస్తులు అభినందిస్తున్నారు.

చర్ల



## నిండు 'పున్నమి' కాంతుల్లో యాదాద్రీశుడు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయం నిండు చంద్రుడి వెలుగుల్లో ఆదివారం కనువిందు చేసింది. పౌర్ణమికి ఒకరోజు ముందే.. నిండు చంద్రుడు దర్శనమిచ్చాడు. యాదాద్రి క్షేత్రం వెండి కాంతుల్లో వెలిగిపోయింది.

- యాదగిరిగుట్ట

| గంజాయి పంట గుర్తింపునకు ఉపగ్రహ చిత్రాలు | ఎన్సీబీ రూట్‌లో ఏఎన్‌బీ | 'నిషా ముక్త్ తెలంగాణ' కోసం వ్యూహాత్మక అడుగులు | ఎడ్రిన్ సంస్థ నుంచి సమాచారం | మ్యాప్ డ్రగ్ యాప్‌నూ యాక్సెస్ చేసుకునే అవకాశం | నలుగురు సిబ్బందికి శిక్షణ ఇప్పించిన సందీప్ శాండిల్య |
|---|---|---|---|---|---|

# గంజాయిపై శాటిలైట్!



సాక్షి, హైదరాబాద్

'నిషా ముక్త్ తెలంగాణ'లక్ష్యంగా పని చేస్తున్న తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ ఏఎన్‌బీ) వ్యూహాత్మకంగా ముందుకెళ్తోంది. గంజాయితోపాటు డ్రగ్స్‌కు చెక్ చెప్పడానికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం అధీనంలోని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ) తరహాలో ఎడ్రిన్ మ్యాప్స్, మ్యాప్ డ్రగ్ యాప్ టెక్నాలజీని వాడుతోంది. వీటికి సంబంధించి టీజీ ఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య ట్రైనింగ్ ఫర్ ట్రైనర్స్ విధానంలో నలుగురు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇప్పించారు.

తెలంగాణతో పాటు ఉత్తరాదిలోని అనేక ప్రాంతాలకు సరఫరా అవుతున్న గంజాయిలో అత్యధిక శాతం ఆంధ్ర-ఒడిశా సరిహద్దులతో (ఏఓబీ) పాటు విశాఖ ఏజెన్సీ నుంచే వస్తోంది. అక్కడి వ్యాపారులు వ్యవస్థీకృతంగా ఈ దందా చేస్తూ రైతులను ప్రలోభాలకు గురి చేసి గంజాయి పంట పండించేలా ప్రోత్సహిస్తున్నారు. ఏజెన్సీలోని

### మండలాలు తెలిసినా ప్రాంతాలపై అస్పష్టత

ఏఏ మండలాల్లో గంజాయి సాగు జరుగుతోందో పోలీసులకు తెలుసు.. కానీ ఏ ప్రాంతంలో ఉందో కచ్చితంగా తెలుసుకోవడం సాధ్యం కావట్లేదు. ఏజెన్సీతోపాటు ఏఓబీలో సైతం మావోయిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉండటంతో గంజాయి పంటను గుర్తించేందుకు కూంబింగ్ తరహా ఆపరేషన్స్ చేపట్టడానికి పోలీసులు సాహసం చేయలేకపోతున్నారు. ఇదే అదనుగా ఈ పంట పండించే వాళ్లు నానాటికీ విస్తరిస్తున్నారు.

### ఉపగ్రహ ఛాయా చిత్రాలతో స్పష్టత

కొన్నేళ్లుగా గంజాయిపై రాష్ట్ర పోలీసు విభాగాలతోపాటు ఎన్సీబీ సైతం దృష్టి పెట్టింది. తక్కువ ధరకు తేలిగ్గా లభిస్తూ వేగంగా విస్తరిస్తున్న ఈ మాదకద్రవ్యం పండించడం, విక్రయించడం, రవాణా, వినియోగం తదితరాలు లేకుండా చేయడానికి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసింది. అందులో గంజాయి పంటను గుర్తించేందుకు శాటిలైట్ సాంకేతికత వాడకం ప్రధానమైంది. దీనికోసం ఎన్సీబీ అధికారులు కొన్నాళ్లుగా హైదరాబాద్‌లోని బాలానగర్ ప్రాంతంలో ఉన్న అడ్వాన్స్ డేటా ప్రాసెసింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎడ్రిన్) సహాయం తీసుకుంటున్నారు. ఎడ్రిన్‌తో చేసుకున్న ఒప్పందం ప్రకారం... గంజాయి పండించే ప్రాంతాలకు సంబంధించిన ఉపగ్రహ ఛాయా చిత్రాలను ఎన్సీబీకి ఇస్తుంది. వీటిని విశ్లేషించే అధికారులు ఆయా ప్రాంతాలకు చెందిన పోలీసు, పరిపాలన విభాగాలతో కలిసి కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. టీజీ ఏఎన్‌బీ కూడా ఇదే మాదిరిగా చేయడంతోపాటు ఆ ప్రాంతాలకు సంబంధించిన రూట్లలో ప్రత్యేక సీసీ కెమెరాలు, చెక్ పోస్టులు ఏర్పాటు చేయనుంది.

### మ్యాప్ డ్రగ్‌తో మరింత సమన్వయం

మాదకద్రవ్యాలను ఓ ప్రాంతంలో తయారు చేయడం, పంపడం జరిగితే... అవి ఒక ప్రాంతం మీదుగా ఇంకోచోటుకు చేరి అక్కడ వినియోగం అవుతుంటాయి. ఏజెన్సీలో గంజాయి, హష్ ఆయిల్, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌ల్లో నల్లమందు, మరికొన్ని చోట్ల ఎఫిడ్రిన్... ఇలా తయారై దేశవ్యాప్తంగా సరఫరా అవుతున్నాయి. కొకైన్, ఎండీఎంఏ, ఎల్‌ఎస్డీ వంటి సింథటిక్ డ్రగ్స్ విదేశాల నుంచి అక్రమ రవాణా అయి, గోవా, బెంగళూరు, ముంబై నుంచి ఇతర ప్రాంతాలకు చేరుతున్నాయి. ఈ నేపథ్యంలోనే గంజాయితోపాటు ఇతర డ్రగ్స్ కట్టడికి సమన్వయం చాలా కీలకం. ఏఏ ప్రాంతాల్లో ఏ డ్రగ్స్ ఉంటున్నాయి? ఎవరు కీలకంగా వ్యవహరిస్తున్నారు? ఏ మార్గాల్లో రవాణా అవుతున్నాయి? అనే విషయాలను తెలుసుకుంటేనే సమన్వయం సాధ్యం. దీనికోసం మ్యాప్ డ్రగ్ పేరుతో ఎన్సీబీ ప్రత్యేక యాప్ రూపొందించింది. ఈ యాప్‌ను అధికారికంగా వినియోగించుకోవడానికి టీజీ ఏఎన్‌బీకి అనుమతి ఇచ్చింది. దీని వినియోగంపై అధికారులకు శిక్షణ సైతం పూర్తయింది.

## పబ్‌లు, బార్లపై ఆకస్మిక దాడులు

- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రత్యేక బృందాల సోదాలు
- డ్రగ్స్ వాడకంపై 12ప్యానెల్ డ్రగ్స్ డిటెక్షన్ కిట్స్‌తో పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: మత్తుపదార్థాల వినియోగాన్ని నిరోధించడంలో భాగంగా ఎక్సైజ్‌శాఖ అధికారులు హైదరాబాద్ నగరంలోని ప్రముఖ పబ్‌లు, బార్లలలో ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రత్యేక బృందాలు 25 చోట్ల దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. హైదరాబాద్‌లో 12, రంగారెడ్డిలో 13 బార్లు, పబ్‌లపై 25 బృందాలతో శనివారం రాత్రి 10 గంటల నుంచి రాత్రి ఒంటిగంట వరకు తనిఖీలు నిర్వహించారు. సోదాల్లో భాగంగా పబ్‌లు, బార్లలోను డ్రగ్స్ వినియోగంపై 12 ప్యానెల్ డ్రగ్స్ డిటెక్షన్ కిట్స్‌తో మొత్తం 17 మందిపై పరీక్షలు నిర్వహించారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు జాయింట్ కమిషనర్ ఖురేషి, అసిస్టెంట్ కమిషనర్లు ఆర్.కిషన్, అనిల్‌కుమార్‌రెడ్డి, అదనపు ఎస్పీ భాస్కర్ పర్యవేక్షణలో ప్రత్యేక ఈ దాడులు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో డీఎస్పీలు తులా శ్రీనివాసరావు, తిరుపతి యాదవ్, రంగారెడ్డి హైదరాబాద్ ఏఈ ఎస్ జీవన్ కిరణ్ తోపాటు అన్ని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల సీఐలు, సిబ్బంది పాల్గొన్నట్లు వెల్లడించారు.

## క్లిక్ చేయొద్దు.. బ్లాక్ చేయండి

- వాట్సాప్‌లో అనుమానాస్పద మెసేజ్‌లకు స్పందించవద్దు.. హెచ్చరించిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు



సాక్షి, హైదరాబాద్: స్మార్ట్‌ఫోన్ వాడే ప్రతి వినియోగదారుడు తప్పక వాడే మొబైల్ యాప్ వాట్సాప్. ఇప్పుడు ఈ యాప్‌ను వేదికగా చేసుకుని సైబర్‌నేరగాళ్లు మోసాలకు తెరతీస్తున్నారు. షేర్ మార్కెట్‌లో పెట్టుబడులతో అధిక లాభాలు వస్తాయని ఊదరగొడుతూ వాట్సాప్‌లకు కొన్ని సందేశాలు పంపుతున్నారు. అందులోని లింక్‌పై క్లిక్ చేసి, తాము చెప్పిన యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచిస్తున్నారు. తాజాగా ఇదే తరహాలో చిక్కడపల్లికి చెందిన ఓ వ్యక్తిని రూ.5.4 కోట్లు మోసగించిన ఘటన తెలిసిందే. ఈ కేసులో ఇద్దరు కీలక నిందితులను సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఇటీవలే అరెస్టు చేశారు. అయితే, పెట్టుబడుల పేరిట వాట్సాప్‌లో వచ్చే సందేశాలు నమ్మవద్దని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు సూచిస్తున్నారు. షేర్‌మార్కెట్ పెట్టుబడులతోపాటు ఇతర యాప్‌లకు సంబంధించి వచ్చే లింక్‌లపైనా క్లిక్ చేయవద్దని చెబుతున్నారు. అనుమానాస్పద మెసేజ్‌లు వాట్సాప్‌కు వస్తే వెంటనే ఆ నంబర్లను బ్లాక్ చేయాలని తెలిపారు. సైబర్‌నేరగాళ్ల నుంచి తరచూ ఈ తరహా మెసేజ్‌లు వస్తుంటే వెంటనే సైబర్ సెక్యూరిటీ బ్యూరో దృష్టికి ఆ నంబర్లు తీసుకురావాలని వారు పేర్కొన్నారు. ఇలా చేయడం వల్ల ఆ నంబర్లను బ్లాక్ చేసే అవకాశం ఉంటుందని, సైబర్ నేరగాళ్ల చేతిలో మరికొందరు మోసపోకుండా కాపాడవచ్చని వారు వెల్లడించారు.

## అందరూ ఉన్నా ఈ అమ్మ అనాథ



వృద్ధురాలికి సపర్యలు చేస్తున్న ఆలయ సిబ్బంది

**వేములవాడ:** వృద్ధాప్యంలో తల్లిని కంటికి రెప్పలా చూసుకోవలసిన పిల్లలు నడిరోడ్డున వదిలేసి వెళ్లారు. రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ బద్దిపోచమ్మ వీధికి చెందిన వొడ్డేటి లక్ష్మి అనే వృద్ధురాలికి ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె సంతానం. ఇద్దరు కొడుకుల్లో ఒకరు స్థానికంగా పెయింటర్. మరో కొడుకు ఉపాధి కోసం దుబాయి వెళ్లాడు. వృద్ధురాలి భర్త గతంలోనే మరణించాడు. తల్లిని సాదుకునే విషయంలో ఇద్దరు కొడుకుల మధ్య గతంలోనే గొడవలు పడ్డట్లు కాలనీవాసులు తెలిపారు. ఈనేపథ్యంలోనే మాట్లాడలేని స్థితిలో ఉన్న వృద్ధురాలు లక్ష్మిని ఆదివారం రాజన్న గుడి ఆవరణలోని రాజేశ్వరపురం చెక్‌పోస్టు వద్ద వదిలి వెళ్లారు. అచేతన స్థితిలో ఉన్న వృద్ధురాలిని ఆలయ సిబ్బంది గుడి ఓపెన్‌స్లాబ్‌లోకి తరలించారు. స్థానికుల సహాయంతో కొడుకు, కూతురు ఫోన్ నంబర్లు తెలుసుకొని ఫోన్ చేసినా వారు స్పందించలేదు.

## అమ్మ అంత్యక్రియల కోసం చిన్నారి భిక్షాటన



ఆర్థికసాయం కోసం ఇంటి ముందు కూర్చున్న కూతురు దుర్గ

**తానూరు:** భర్త మరణంతో మద్యానికి బానిసైన ఓ మహిళ.. కుటుంబ పోషణను, ఒక్కగానొక్క కూతురును గాలికి వదిలేసింది. చివరకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో పన్నెండేళ్ల కూతురు ఒంటరైంది. తల్లికి అంత్యక్రియలు నిర్వహించేందుకు చిల్లిగవ్వ కూడా లేకపోవడంతో కూతురు భిక్షాటన చేయడం కంటతడి పెట్టించింది. ఈ ఘటన నిర్మల్ జిల్లా తానూర్ మండలం బెల్‌తరోడా గ్రామంలో జరిగింది. ఏఎస్సై భానుప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం ...గ్రామానికి చెందిన మిరా గంగమణి (36) భర్త నరేశ్ పదేళ్ల క్రితం మరణించాడు. దీంతో గంగమణి కూతురుతో కలిసి ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటోంది. కూలి పనులు చేసుకుంటున్న ఆమె మద్యానికి బానిసైంది. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఐదో తరగతి చదువుతున్న కూతురు దుర్గ ఒంటరైంది. తల్లి ఆత్మహత్య విషయం తెలుసుకున్న దుర్గ ఏం చేయాలో తెలియక మౌనంగా రోదిస్తూ ఉండిపోయింది. అంత్యక్రియలకు సాయం చేయాలని ఇంటి ముందు యాచిస్తూ కూర్చుంది. గ్రామంలోని యువకులు ఈ దృశ్యాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో పలువురు దాతలు ఆర్థికసాయం అందించారు. ఆ డబ్బులతో అంత్యక్రియలు నిర్వహించారు. దుర్గ నిస్సహాయ స్థితిని తెలుసుకున్న కలెక్టర్ అభిలాష అభినవ్ స్పందించారు. అధికారులను గ్రామానికి పంపించి వీడియో కాల్ ద్వారా దుర్గతో మాట్లాడారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## నేడు తిరుమలలో శ్రావణ పౌర్ణమి గరుడసేవ

**తిరుమల:** తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారం శ్రావణ పౌర్ణమి గరుడసేవ జరగనుంది. ప్రతినెలా పౌర్ణమి సందర్భంగా తిరుమలలో గరుడసేవ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రాత్రి 7 నుంచి 9 గంటల నడుమ సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు సువర్ణ కాంతులీనుతున్న గరుడునిపై తిరుమాడ వీధులలో భక్తులకు దర్శనమిస్తారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. 